
గురువారం 20-6-2024

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 6.50
సంపుటి: 16 సంచిక: 277



'గ్రామాల్లో సంపద పెరగాలి. పెరిగిన సంపద గ్రామీణ ప్రజలకే చెందాలి'


దక్షిణాఫ్రికా విజయం
టి20 ప్రపంచ కప్‌లో 18 పరుగుల తేడాతో అమెరికాపై గెలుపు - 12లో


లాభాల స్వీకరణ
నాలుగో రోజూ సెన్సెక్స్ రికార్డులు.. 23,550 స్థాయి దిగువకు నిఫ్టీ - 13లో

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL


రూ.100 కోట్లు డిమాండ్
మద్యం స్కామ్‌లో ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ సౌత్ గ్రూప్ నుంచి 100 కోట్లు డిమాండ్ చేశారని రౌస్ అవెన్యూ కోర్టుకు ఈడీ తెలిపింది.
వివరాలు 6లో ▸


వైజ్ఞానిక కేంద్రంగా భారత్
ప్రపంచంలోనే అతిముఖ్యమైన వైజ్ఞానిక కేంద్రంగా భారత్ ఎదగాలని తాను కోరుకుంటున్నట్లు ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు.
వివరాలు 6లో ▸


కల్తీ సారాకు 18 మంది బలి
తమిళనాడులోని కళ్లకురిచ్చి జిల్లా కరుమాపురం గ్రామంలో కల్తీ సారా తాగి 18 మంది మరణించారు.
వివరాలు 6లో ▸



యూజీసీ-నెట్ రద్దు
అవకతవకలు జరిగి ఉండొచ్చన్న అనుమానాలతో మంగళవారం నిర్వహించిన యూజీసీ-నెట్ పరీక్షను కేంద్ర విద్యా శాఖ రద్దు చేసింది.
వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

వ్యవసాయంలో స్థిరత్వాన్ని సాధించాలి



వ్యవసాయంలో స్థిరత్వాన్ని సాధించడం కోసం వినూత్న విధానాలను రూపొందించేందుకు విద్యార్థులు కృషి చేయాలని గవర్నర్ అబ్దుల్ నజీర్ సూచించారు. బాపట్లలో ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ వర్సిటీ స్నాతకోత్సవ సభలో పాల్గొన్నారు.
వివరాలు 14లో ▸

నా కొ..ల్లారా.. నరుకుతా



టీడీపీ అధికారంలోకి రావడంతో తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నేత జేసీ ప్రభాకర రెడ్డి అధికారులపై విరుచుకుపడ్డారు. 'నా కొ..ల్లారా.. ఒక్కొక్కరినీ నరుకుతా' అంటూ బండబూతులతో చెలరేగిపోయారు. 10 రోజుల్లో తన లారీలు, బస్సులు రిపేర్ చేయించి ఇవ్వాలని వార్నింగ్ ఇచ్చారు.
వివరాలు 2లో ▸

ఆదాయార్జనలో వాల్తేరు డివిజన్ టాప్




ఆదాయార్జనలో వాల్తేరు డివిజన్ దూకుడు కొనసాగిస్తోంది. ఈస్ట్‌కోస్ట్ జోన్‌లో అత్యధిక ఆదాయం తీసుకొస్తున్న డివిజన్‌గా విశాఖ నిలవగా.. అత్యధిక ఆదాయం ఆర్జిస్తున్న రైలుగా విశాఖ నుంచి బయలుదేరుతున్న ఏపీ ఎక్స్‌ప్రెస్ నిలిచింది.
వివరాలు 5లో ▸

ఆ కుంభకోణాలు బయటపెడితే 'బొండా' జైలుకే



విజయవాడ సెంట్రల్ టీడీపీ ఎమ్మెల్యే బొండా ఉమా 2014లో రెండు భారీ కుంభకోణాలకు పాల్పడ్డారని, వాటిని బయటపెడితే ఆయన జైలుకు వెళ్లడం ఖాయమని వైఎస్సార్‌సీపీ దళిత నేత, మాజీ కార్పొరేటర్ నందెపు జగదీష్ చెప్పారు.
వివరాలు 5లో ▸

ఇదండీ వరస



ముందు ఆ బిళ్ల తీసి ముఖం చూపించి ఏం కావాలో చెప్పవయ్యా!


2019 మే 29 నాటికి పునాది స్థాయి కూడా దాటని పోలవరం స్పిల్ వే


వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో పోలవరం ప్రాజెక్టు ఏరియల్ వ్యూ

జీవనాడిపై దాడి!

పోలవరం ఉసురు తీసిందెవరు? ప్రాణం పోసిందెవరు?

చంద్రబాబు కమీషన్ల దాహం, అస్తవ్యస్థ పనుల పాప ఫలితం కాదా?

- ప్రాజెక్టు నిర్మాణ ప్రణాళికను తుంగలో తొక్కిన బాబు
- వరద మళ్లించేలా స్పిల్‌వే, కాఫర్ డ్యామ్‌లను కట్టకుండా డయాఫ్రమ్‌వాల్ పూర్తి
- భారీ వరదలతో దెబ్బతిన్న డయాఫ్రమ్‌వాల్.. ఈసీఆర్‌ఎఫ్ నిర్మాణ ప్రాంతంలో అగాధాలు
- సంక్లిష్టంగా మారిన పోలవరాన్ని గాడిలో పెట్టిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- వరదలు, కరోనా ప్రతికూల పరిస్థితుల్లోనూ స్పిల్‌వే, స్పిల్ చానల్, ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లు పూర్తి
- 2021 జూన్ 11నే వరద మళ్లింపు
- కాఫర్ డ్యామ్‌ల మధ్య అగాధాలు పూడ్చి యథాస్థితికి.. డయాఫ్రమ్‌వాల్ భవితవ్యాన్ని సీడబ్ల్యూసీ తేల్చితే 18 నెలల్లోగా ప్రాజెక్టు పూర్తికి ప్రణాళిక
- టీడీపీ హయాంలో తట్టెడు మట్టైనా ఎత్తని జలవిద్యుత్కేంద్రం పనులను కొలిక్కి తెచ్చిన జగన్ సర్కార్
- కుడి, ఎడమ కాలువల అనుసంధానాలు పూర్తి.. ఎడమ కాలువలో సంక్లిష్టమైన పనులూ పూర్తి

10లో

వరికి మరో రూ. 117



కేంద్రమంత్రివర్గం కీలక నిర్ణయం

సాధారణ రకానికి క్వింటాల్‌కు రూ.2,300

'ఎ' గ్రేడ్ రకానికి రూ.2,320.. పత్తికి మరో రూ.501 పెంపు

2024-25 ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్‌లో 14 పంటలకు కనీస మద్దతు ధర పెంపు

న్యూఢిల్లీ


అశ్వినీ వైష్ణవ్

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర కేబినెట్ బుధవారం కీలక నిర్ణయాలు తీసుకుంది. వరి ధాన్యానికి కనీస మద్దతు ధర(ఎంఎస్పీ)ను 5.35 శాతం పెంచింది. అంటే క్వింటాల్‌కు రూ.117 చొప్పున పెరుగనుంది. 2024-25 ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్‌లో క్వింటాల్ వరి ధాన్యాన్ని రూ.2,300కు కొనుగోలు చేయనున్నారు. ప్రస్తుతం దేశంలో సరిపడా బియ్యం నిల్వలు ఉన్నప్పటికీ ధాన్యానికి మద్దతు ధర పెంచడం గమనార్హం. త్వరలో జరగనున్న హరియాణా, మహారాష్ట్ర, జార్ఖండ్, ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని కేంద్ర ప్రభుత్వం ఎంఎస్పీ పెంచినట్లు తెలుస్తోంది. మంత్రివర్గం నిర్ణయాలను కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు వివరించారు. వ్యవసాయ వ్యయాలు, ధరల కమిషన్ (సీఏసీపీ) సిఫార్సుల మేరకు 14 ఖరీఫ్ పంటలకు కనీస మద్దతు ధర పెంపునకు కేబినెట్ ఆమోద ముద్ర వేసినట్లు తెలిపారు. పెంచిన మొత్తంతో సాధారణ రకం ధాన్యానికి క్వింటాల్‌కు రూ.2,300, 'ఎ' గ్రేడ్ ధాన్యానికి క్వింటాల్‌కు రూ.2,320 చొప్పున ఎంఎస్పీ లభిస్తుందని చెప్పారు. కనీస మద్దతు ధర అనేది ఉత్పత్తి వ్యయం కంటే కనీసం 1.5 రెట్లు అధికంగా

మిగతా 2వ పేజీలో ▶

భారీగా ఐఏఎస్‌ల బదిలీ

ముఖ్యమంత్రి కార్యదర్శిగా ప్రద్యుమ్న

- సీఆర్‌డీఏ కమిషనర్‌గా కాటమనేని భాస్కర్
- శ్రీలక్ష్మి, రజత్ భార్గవ, ప్రవీణ్ ప్రకాశ్ జీఏడీకి అటాచ్
- మురళీధర్‌రెడ్డి కూడా..
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం


ప్రద్యుమ్న


కాటమనేని భాస్కర్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో భారీగా ఐఏఎస్ అధికారులను రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేసింది. పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీలక్ష్మి, ఎక్సైజ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్ భార్గవ, విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్, ఏపీ మెడికల్ సర్వీసెస్ వీసీ-ఎండీ డి.మురళీధర్‌రెడ్డిలను తదుపరి పోస్టింగ్ కోసం సాధారణ పరిపాలన శాఖ (జీఏడీ)కు రిపోర్టు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ముఖ్యమంత్రి కార్యదర్శిగా ప్రద్యుమ్నను నియమించారు. జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా సాయిప్రసాద్, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి ముఖ్య కార్యదర్శిగా శశిభూషణ్ కుమార్, రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ (సీఆర్‌డీఏ) కమిషనర్‌గా కాటమనేని భాస్కర్ నియమితులయ్యారు. తిరుపతి జిల్లా కలెక్టర్

మిగతా 2వ పేజీలో ▶



ఏపీ డీజీపీగా ద్వారకా తిరుమలరావు

సాక్షి, అమరావతి: ఏపీ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ)గా సీహెచ్ ద్వారకా తిరుమలరావును రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు సీఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్ బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. 1989 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన తిరుమలరావు ప్రస్తుతం ఏపీఎస్ఆర్టీసీ ఎండీగా ఉన్నారు. ఆయనకు రాష్ట్ర డీజీపీగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

పోలింగ్ అనంతర దాడులపై పూర్తి వివరాలివ్వండి

రాష్ట్ర ప్రభుత్వం, డీజీపీలకు హైకోర్టు మరోసారి ఆదేశం

తదుపరి విచారణ నాలుగు వారాలకు వాయిదా

- వివరాలు 2లో




తెలంగాణ

మూసివేత దిశగా రామగుండం బీ- థర్మల్ విద్యుత్ కేంద్రం?

నిలిచిన విద్యుత్ ఉత్పత్తి... పునరుద్ధరణకు అనాసక్తి

- డిప్యుటేషన్ పేరిట 48 మంది ఇంజనీర్ల బదిలీ
- ఒకవైపు నిర్వహణ భారం.. మరోవైపు ముగిసిన కేంద్రం జీవితకాలం


కాలం చెల్లిన బీ-థర్మల్ విద్యుత్ కేంద్రం

రామగుండం: నిర్వహణ భారం..జీవితకాలం ముగియడంతో పెద్దపల్లి జిల్లా రామగుండంలోని 62.5 మెగావాట్ల బీ-థర్మల్ విద్యుత్ కేంద్రం మూసివేసేందుకు రంగం సిద్ధం చేసినట్టు తెలిసింది. వారంరోజులు క్రితం 38 మంది ఇంజనీర్లు, ఐదుగురు సబ్ ఇంజనీర్లు, ఒకరు సీనియర్ కెమిస్ట్, నలుగురు కెమిస్ట్‌లను యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (వైటీపీఎస్)కు డిప్యుటేషన్ పేరిట బదిలీ చేశారు. దీంతో మూసివేత తప్పదనే ప్రచారం జరుగుతోంది.

యూనిట్ ట్రిప్ అయినా...

ఈ నెల 4వ తేదీన యూనిట్‌లోని మిల్స్ విభాగంలో సాంకేతిక సమస్యతో తలెత్తింది. దీంతో యూనిట్ ట్రిప్ అయ్యి విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయింది. విద్యుత్ సౌధ నుంచి అనుమతులు రాకపోవడంతో పునరుద్ధరణ చేపట్టలేదు. పదిరోజులుగా ఖాళీగా ఉంటున్న ఇంజనీర్లు, ఉద్యోగులను యాదాద్రి, భద్రాద్రి, కేటీపీఎస్ తదితర జెన్‌కో విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలకు బదిలీ చేయాలని నిర్ణయించినట్టు తెలిసింది.

1965లో ప్లాంట్ ప్రారంభం

- అప్పటి ఉమ్మడి ఏపీ సీఎం కాసు బ్రహ్మానందరెడ్డి 1965 జూలై 19న రామగుండంలో 62.5 మెగావాట్ల సామర్థ్యంగల థర్మల్ విద్యుత్ ప్లాంట్ ప్రారంభించారు. కరెంట్ ఉత్పత్తితోపాటు పీఎల్‌ఎఫ్ (ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్) సాధిస్తూ రికార్డులు నమోదు చేసింది. అయితే విద్యుత్ కేంద్రం స్థాపించి ఆరు దశాబ్దాలు కావడంతో నిర్వహణ భారంగా మారింది.
- బాయిలర్, టర్బయిన్, మిల్స్, ట్రాన్స్‌ఫార్మర్ తదితర విభాగాల్లో ఏడాదిగా తరచూ సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. దీంతో తరచూ విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోతోంది.
- ఈ జనవరి నుంచి సమస్య మరింత జటిలమైంది. కాలం చెల్లిన విద్యుత్ కేంద్రం కావడంతో విడిభాగాల లభ్యత లేదు. పాతవాటితోనే సర్దుబాటు చేసి విద్యుత్ కేంద్రాన్ని ఉత్పత్తి దశలోకి తీసుకొస్తున్నారు.
- సాంకేతిక సమస్యలతో మళ్లీమళ్లీ ట్రిప్పవుతూనే ఉంది. దీంతో విద్యుత్ ఉత్పత్తి పునరుద్ధరణకు రూ.25 లక్షలకుపైగా వ్యయం అవుతోంది. ఆదాయం కన్నా వ్యయమే అధికంగా ఉండడంతో మూసివేతే పరిష్కారమని భావిస్తున్నట్టు సమాచారం.
- వాస్తవానికి థర్మల్ విద్యుత్ కేంద్రాల జీవితకాలం 25 ఏళ్లే. రామగుండం థర్మల్ పవర్ స్టేషన్ జీవితకాలం ఎప్పుడో ముగిసిపోయింది.

కొత్త ప్లాంటు ఏర్పాటు తప్పనిసరి

రామగుండం బీ-థర్మల్ విద్యుత్ కేంద్రం సమీపంలోనే 800 మెగావాట్ల సామర్థ్యం గల కొత్త విద్యుత్ కేంద్రం స్థాపిస్తాం. అప్పటివరకు పాత విద్యుత్ కేంద్రాన్ని కొనసాగించాలని ఎనర్జీ సెక్రటరీ రిజ్వీ, డైరెక్టర్లను కలిసి విన్నవించా. అత్యధిక సంఖ్యలో ఇంజనీర్లు ఉండడంతో కొందరిని యాదాద్రి, భద్రాద్రి విద్యుత్ కేంద్రాలకు డిప్యుటేషన్‌పై బదిలీ చేస్తున్నారు.

- మక్కాన్‌సింగ్ ఠాకూర్, రామగుండం, ఎమ్మెల్యే

సచివాలయంలో పెండ్యాల ప్రత్యక్షం

మళ్లీ తెరపైకి చంద్రబాబు మాజీ పీఎస్

స్కిల్ స్కామ్‌లో కీలక పాత్రధారి.. నిధుల తరలింపులో సూత్రధారి

సీఐడీ నోటీసులతో అమెరికాకు పరారీ

ప్రణాళిక శాఖ మెమో బేఖాతరు.. సస్పెండ్ చేసిన ప్రభుత్వం

చంద్రబాబు సీఎం కాగానే అజ్ఞాతవాసానికి ముగింపు

తనపై సస్పెన్షన్ ఎత్తివేయాలని వినతిపత్రం సమర్పణ

సాక్షి, అమరావతి: గతంలో టీడీపీ ప్రభుత్వంలో 'స్కిల్' కుంభకోణంలో కీలక పాత్ర పోషించి, సీఐడీ నోటీసులివ్వడంతో విదేశాలకు పరారైన పెండ్యాల శ్రీనివాస్ మళ్లీ తెరపైకి వచ్చారు. వందల కోట్ల నిధులను దారి మళ్లించిన ఈ 'స్కిల్' కుంభకోణం అప్పట్లో సంచలనం సృష్టించింది. ఈ నిధుల తరలింపులో పెండ్యాల శ్రీనివాస్ కీలక సూత్రధారి అని సీఐడీ తేల్చింది. దీంతో ఆయన

మిగతా 2వ పేజీలో ▶



బాధ్యతలు స్వీకరిస్తున్న పవన్‌కళ్యాణ్



ఉద్యాన పంటల సాగు ఉపాధి పథకంతో అనుసంధానం

- గిరిజన గ్రామాల్లో పంచాయతీ భవనాల నిర్మాణం
- రెండు ఫైళ్లపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సంతకం
- విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో బాధ్యతల స్వీకరణ

3లో

క్లుప్తంగా...

రేపు అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం

- గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసిన గవర్నర్ అబ్దుల్ నజీర్

సాక్షి, అమరావతి: కొత్తగా ఎన్నికైన శాసనసభ సభ్యులతో ప్రమాణం చేయించేందుకు ఈ నెల 21 నుంచి అసెంబ్లీ సమావేశాలు నిర్వహించబోతున్నారు. శుక్రవారం ఉదయం 9.46 గంటలకు సమావేశాలు ప్రారంభం అవుతాయని రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ బుధవారం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేశారు.

24న రాష్ట్ర మంత్రివర్గ సమావేశం

సాక్షి, అమరావతి: టీడీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలిసారిగా ఈ నెల 24న రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరగనుంది. వెలగపూడి సచివాలయంలో ఆ రోజు ఉదయం 10 గంటలకు సమావేశం జరుగుతుందని సీఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్ అన్ని శాఖలకు సమాచారమిచ్చారు. 21వ తేదీకల్లా ఆయా శాఖలు అవసరమైన ప్రతిపాదనల్ని సాధారణ పరిపాలన శాఖకు సమర్పించాలని ఆదేశించారు.

ప్రొటెం స్పీకర్‌గా బుచ్చయ్య చౌదరి

సాక్షి, అమరావతి: టీడీపీ సీనియర్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి ప్రొటెం స్పీకర్‌గా వ్యవహరించనున్నారు. ఈ బాధ్యతలు నిర్వహించాలని శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ బుధవారం ఆయనకు ఫోన్ చేసి కోరారు. ఇందుకు అంగీకరించిన బుచ్చయ్య గురువారం గవర్నర్ సమక్షంలో ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఆ తర్వాత ఈ నెల 21, 22 తేదీల్లో జరగనున్న అసెంబ్లీ సమావేశాల్లో కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలతో ఆయన ప్రమాణం చేయించనున్నారు. అనంతరం స్పీకర్ ఎన్నిక జరగనుంది. బుచ్చయ్య 7 సార్లు ఎమ్మెల్యేగా గెలిచి సీనియర్ ఎమ్మెల్యేగా ఉన్నారు. ప్రస్తుత శాసనసభలో సీఎం చంద్రబాబు అత్యంత సీనియర్ శాసనసభ్యుడిగా ఉన్నారు. ఆయన 9 సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత సీనియర్ ఎమ్మెల్యేలుగా బుచ్చయ్య చౌదరి, అయ్యన్న పాత్రుడు, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తదితరులున్నారు. అయ్యన్నను స్పీకర్‌గా నియమించాలని నిర్ణయించిన టీడీపీ ప్రభుత్వం ప్రొటెం స్పీకర్‌గా బుచ్చయ్యకు అవకాశం కల్పించింది.

ఏఎన్‌యూలో అమరావతి రైతుల ధర్నా

- వీసీ రాజీనామా చేయాలంటూ డిమాండ్



రాజీనామా చేయాలని వీసీని డిమాండ్ చేస్తున్న అమరావతి రైతులు

ఏఎన్‌యూ: వైస్ చాన్సలర్ రాజశేఖర్ వెంటనే రాజీనామా చేయాలంటూ అమరావతి రైతులు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ(ఏఎన్‌యూ)లో బుధవారం ధర్నా చేశారు. వీసీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో వీసీ రాజశేఖర్ ధర్నా చేస్తున్న రైతుల వద్దకు వచ్చారు. అమరావతి రైతులు మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో యూనివర్సిటీలో మూడు రాజధానులపై సదస్సు నిర్వహించి.. విద్యా వ్యవస్థను అవమానించారంటూ వీసీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వీసీ రాజశేఖర్ స్పందిస్తూ.. గతంలో ప్రభుత్వ సూచన మేరకే సదస్సు నిర్వహించామని చెప్పారు. కావాలంటే మీరు కూడా లేఖ ఇస్తే అమరావతి రాజధాని కావాలంటూ సదస్సు నిర్వహిస్తామని బదులిచ్చారు. రైతులు స్పందిస్తూ.. అమరావతికి మద్దతుగా సదస్సు నిర్వహించాలంటూ అడగాల్సిన అవసరం తమకు లేదన్నారు. వెంటనే రాజీనామా చేయాలని రైతులు వీసీని డిమాండ్ చేశారు. అనంతరం వీసీ కార్యాలయంలోకి వెళ్లే ప్రయత్నం చేయగా.. పోలీసులు అడ్డుకొని అమరావతి రైతులను అక్కడి నుంచి పంపించేశారు.

చెత్త వేయొద్దన్నందుకు టీడీపీ వర్గీయుల దాడి

- తండ్రీ, కొడుకులకు తీవ్ర గాయాలు




గాయపడిన కృష్ణమూర్తి, పురుషోత్తం

పలమనేరు(చిత్తూరు జిల్లా): తమ ఇంటి ముందు చెత్త వేయొద్దన్నందుకు ఆగ్రహించిన టీడీపీ వర్గీయులు ఇంటి యజమానులపై నకుల్ డస్టర్‌తో దాడిచేసి తీవ్రంగా గాయపరిచిన ఘటన బుధవారం పలమనేరు మండలంలో చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ముడివారిపల్లికి చెందిన కృష్ణమూర్తి, వరదరాజులు కుటుంబాలు పక్కపక్కనే ఉంటున్నాయి. వీరికి తరచూ చెత్త విషయంగా వాగ్వాదాలు జరిగేవి. ఈ నేపథ్యంలో కృష్ణమూర్తి ఇంటిముందు వరదరాజులు కుటుంబీకులు చెత్త వేయడంతో వారు ప్రశ్నించారు. దీనిపై మండిపడిన వరదరాజులు కుమారుడు ఇంట్లో దాచిన నకుల్ డస్టర్‌ను చేతికి తొడుక్కుని కృష్ణమూర్తి(47) ఆయన కుమారుడు పురుషోత్తం (18)పై దాడిచేసి గాయపరిచాడు. వీరిని స్థానికులు పలమనేరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

జగన్‌ను కలిసిన ముఖ్య నాయకులు, పోటీ చేసిన అభ్యర్థులు



సాక్షి,అమరావతి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌ను తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో బుధవారం ముఖ్య నాయకులు, ఇటీవల ఎన్నికల్లో పోటీచేసిన అభ్యర్థులు కలిశారు. వైఎస్ జగన్‌ను కలిసిన వారిలో మాజీ మంత్రులు విడదల రజని, రోజా, మాజీ ఎమ్మెల్యేలు రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, కన్నబాబుతో పాటు పలువురు ముఖ్య నాయకులు ఉన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ విస్తృత సమావేశం

- ఎమ్మెల్యేలు, పోటీ చేసిన అభ్యర్థులకు వైఎస్ జగన్ దిశానిర్దేశం

సాక్షి, అమరావతి : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం ఈనెల 20న గురువారం తాడేపల్లిలో నిర్వహించనున్నారు. ఇటీవల ఎన్నికల్లో గెలుపొందిన ఎమ్మెల్యేలు, పోటీ చేసిన అభ్యర్థులు ఈ సమావేశానికి హాజరు కానున్నారు. పార్లమెంట్ నియోజకవర్గాల్లో పోటీ చేసిన అభ్యర్థులు (ఎంపీలు మినహా) ఈ సమావేశానికి హాజరవుతారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వీరికి దిశానిర్దేశం చేయనున్నారు. ఉదయం 10.30 గంటలకు తాడేపల్లిలోని వైఎస్ జగన్ క్యాంపు కార్యాలయంలో సమావేశం ప్రారంభం అవుతుంది.

సచివాలయంలో.. పెండ్యాల ప్రత్యక్షం

▶ మొదటి పేజీ తరువాయి

అమెరికాకు వెళ్లిపోయారు. ప్రణాళిక శాఖలో అసిస్టెంట్ సెక్రటరీగా ఉన్న ఆయన వెంటనే విధులకు హాజరుకావాలని జారీ చేసిన మెమోను కూడా బేఖాతరు చేయడంతో ఉన్నతాధికారులు ఆయన్ని సస్పెండ్ చేశారు. ఇప్పుడు చంద్రబాబు మళ్లీ సీఎంగా బాధ్యతలు స్వీకరించడంతో శ్రీనివాస్ అమెరికాలో అజ్ఞాతవాసాన్ని ముగించుకుని సచివాలయంలో ప్రత్యక్షమయ్యారు. తనపై సస్పెన్షన్ ఎత్తివేసి, పోస్టింగ్ ఇవ్వాలని అధికారులను కోరారు.

నల్లమూటలు బాబు బంగ్లాకు చేర్చింది పెండ్యాలే

2014–19 మధ్య కాలంలో అప్పటి చంద్రబాబు ప్రభుత్వంలో పలు కుంభకోణాల్లో పెండ్యాల శ్రీనివాస్ కీలక పాత్రధారిగా వ్యవహరించారు. అప్పట్లో సీఎం చంద్రబాబుకు పీఎస్‌గా వ్యవహరించిన ఆయనకు కేంద్ర ఆదాయ పన్ను శాఖ నోటీసులు జారీ చేయడంతో డొంకంతా కదిలింది. అమరావతిలో రూ.3 వేల కోట్లతో తాత్కాలిక సచివాలయాల నిర్మాణ కాంట్రాక్టుల కుంభకోణంతోపాటు ఇతర అక్రమాల్లో ఆయన పాత్రధారిగా ఉన్నట్టు వెలుగులోకి వచ్చింది. కాగా కేంద్ర జీఎస్టీ విభాగం సమాచారంతో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్



(ఏపీఎస్ఎస్‌డీసీ)లో చంద్రబాబు అవినీతి బాగోతం బయటపడింది. దీనిపై సీఐడీ దర్యాప్తు చేయడంతో మొత్తం అవినీతి దందా బట్టబయలైంది. నిబంధనలకు విరుద్ధంగా ఏపీఎస్ఎస్‌డీసీ నిధులను షెల్ కంపెనీల ద్వారా తరలించినట్టు వెల్లడైంది. ఆ నిధులను పెండ్యాల శ్రీనివాస్‌తోపాటు షెల్ కంపెనీల ప్రతినిధి మనోజ్ పార్థసాని హైదరాబాద్‌లోని చంద్రబాబు నివాసానికి చేర్చినట్టు సీఐడీ ఆధారాలు సేకరించింది. కీలక ఆధారాలు లభించడంతో సీఐడీ అధికారులు పెండ్యాల శ్రీనివాస్, మనోజ్ పార్థసానిలకు గత ఏడాది సెప్టెంబరు 5న నోటీసులు జారీ చేశారు. వారిని ఈ కేసులో సాక్షులుగా పేర్కొంటూ గత ఏడాది సెప్టెంబరు 14న విచారణకు హాజరుకావాలని నోటీసుల్లో పేర్కొన్నారు. పెండ్యాల శ్రీనివాస్‌కు ఉన్న రెండు ఈ మెయిల్ ఐడీలకు మెయిల్‌చేయడంతోపాటు హైదరాబాద్‌లోని ఆయన చిరునామాకు స్పీడ్‌పోస్ట్ ద్వారా నోటీసులు పంపారు. నోటీసులు అందినట్లు ఆయన కుమార్తె సీఐడీ అధికారులకు తెలిపారు. నోటీసులు జారీ కాగానే పెండ్యాల శ్రీనివాస్ ఉన్నతాధికారుల అనుమతి లేకుండానే అమెరికాకు పరారయ్యారు. తనకు హఠాత్తుగా ఆరోగ్యం దెబ్బతినడంతో అమెరికా వెళ్తున్నట్టు ఆయన ప్రణాళిక శాఖకు ఓ మెయిల్ ద్వారా తెలిపి వెళ్లిపోయారు.

మెమో జారీ చేసినా బేఖాతరు.. సస్పెన్షన్

పెండ్యాల శ్రీనివాస్ అనుమతి లేకుండానే విదేశాలకు వెళ్లిపోవడాన్ని ప్రణాళిక శాఖ తీవ్రంగా పరిగణించింది. ఆయన సెలవు దరఖాస్తును తిరస్కరించి, మెమో జారీచేసింది. అధికారులు హైదరాబాద్‌లోని పెండ్యాల శ్రీనివాసరావు నివాసానికి వెళ్లి ఆయన తండ్రికి మెమో కాపీని అందించారు. మెమో అందుకున్నప్పటి నుంచి వారం రోజుల్లో ఆఫీసుకు వచ్చి సంజాయిషీ ఇవ్వాలని పెండ్యాల శ్రీనివాసరావును ప్రణాళిక శాఖ ఆదేశించింది. ఆ మెమోను ఆయన ఏమాత్రం పట్టించుకోలేదు. దాంతో ప్రభుత్వ సర్వీసు నిబంధనలను అనుసరించి పెండ్యాల శ్రీనివాస్‌ను ప్రభుత్వం గత ఏడాది సెప్టెంబరు 30న సస్పెండ్ చేసింది.

బాబు రాగానే మళ్లీ ప్రత్యక్షం

చంద్రబాబు మళ్లీ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించగానే పెండ్యాల శ్రీనివాస్ రాష్ట్రానికి తిరిగి వచ్చారు. బుధవారం నేరుగా సచివాలయానికి వచ్చి తనపై విధించిన సస్పెన్షన్‌ను తొలగించి, పోస్టింగ్ ఇవ్వాలని ప్రణాళిక శాఖ అధికారులను విజ్ఞప్తి చేశారు. ఇదంతా చంద్రబాబు స్క్రిప్ట్ ప్రకారమే సాగుతోందన్నది సుస్పష్టమవుతోంది. ఎందుకంటే స్కిల్ కుంభకోణం కేసులోనే చంద్రబాబు అరెస్ట్ అయి 52 రోజులు రాజమహేంద్రవరం సెంట్రల్‌జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. ఆ కుంభకోణంలో కీలక పాత్రధారిగా ఉన్న పెండ్యాల శ్రీనివాస్‌ను సీఐడీ సాక్షిగా పేర్కొంది. దాంతో ఆ కేసు దర్యాప్తును పూర్తిగా పక్కదారి పట్టించేందుకు పెండ్యాల శ్రీనివాస్‌ను కూడా ఒక సాధనంగా వాడుకోవాలన్నది చంద్రబాబు ఉద్దేశంగా స్పష్టమవుతోంది. స్కిల్ కుంభకోణం కేసును నీరుగార్చే దిశగా చంద్రబాబు పావులు కదుపుతున్నారని, అందులో భాగంగానే పెండ్యాల శ్రీనివాస్ తిరిగి వచ్చారని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. ఈ నేపథ్యంలో ముమ్ముందు పరిణామాలు ఎలా ఉంటాయన్నది చూడాల్సిందే.

భారీగా ఐఏఎస్‌ల బదిలీ

▶ మొదటి పేజీ తరువాయి



ప్రవీణ్ కుమార్‌ను బదిలీ చేసి గనులు, భూగర్భ వనరుల శాఖ కమిషనర్, డైరెక్టర్‌గా నియమించారు. తిరుపతి జాయింట్ కలెక్టర్‌కు ఆ జిల్లా కలెక్టర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న అనిల్‌కుమార్ సింఘాల్‌ను పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా నియమించారు. వ్యవసాయ శాఖ ప్రత్యేక సీఎస్‌గా బి.రాజశేఖర్‌కు బాధ్యతలు అప్పగించారు.

ఐఏఎస్‌ల బదిలీలు ఇలా..

పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
జి.సాయిప్రసాద్	చీఫ్ కమిషనర్, సీసీఎల్ఏ	ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, జలవనరుల శాఖ
బుడితి రాజశేఖర్	వెయిటింగ్	ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, వ్యవసాయం, మార్కెటింగ్
అనిల్‌కుమార్ సింఘాల్	ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, గవర్నర్	ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ
గోపాలకృష్ణ ద్వివేది	ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, వ్యవసాయం	ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, కార్మిక శాఖ
సిద్ధార్థ జైన్	కమిషనర్, సర్వే, ల్యాండ్ రికార్డ్స్	కమిషనర్, పౌరసరఫరాల శాఖ
సౌరభ్ గౌర్	కమిషనర్, ఇంటర్మీడియెట్ విద్య	కార్యదర్శి, ఉన్నత విద్య, ముఖ్య కార్యదర్శి స్కిల్ డెవలప్‌మెంట్
కోన శశిధర్	కార్యదర్శి ఐటీ అండ్ సీ	కార్యదర్శి, పాఠశాల విద్య, ఐటీ అదనపు బాధ్యతలు
ఎ.బాబు	కార్యదర్శి, సహకారం, మార్కెటింగ్	కార్యదర్శి, ఉద్యానవనం, ఆక్వాకల్చర్
కాటమనేని భాస్కర్	కమిషనర్, పాఠశాల మౌలిక వసతులు	కమిషనర్, ఏపీ సీఆర్‌డీఏ
పీఎస్ ప్రద్యుమ్న	కార్యదర్శి, రవాణా, రోడ్లు, భవనాలు	ముఖ్యమంత్రి కార్యదర్శి
ఎం.జానకి	వెయిటింగ్	కార్యదర్శి, ఆర్థిక శాఖ (వ్యయం)
ఎంఎం నాయక్	కమిషనర్, చేనేత, జౌళి	కార్యదర్శి, పశుసంవర్ధక శాఖ
ప్రవీణ్ కుమార్	కలెక్టర్, తిరుపతి జిల్లా	కమిషనర్, డైరెక్టర్ గనులు, భూగర్భ వనరులు
వాడ్రేవు వినయ్‌చంద్	వెయిటింగ్	కార్యదర్శి, ఆర్థిక శాఖ
డి.మురళీధర్‌రెడ్డి	వీసీ–ఎండీ, ఏపీ మెడికల్ సర్వీసెస్	తదుపరి పోస్టింగ్‌కు జీఏడీకి అటాచ్
శ్రీలక్ష్మి	ప్రత్యేక సీఎస్, పురపాలక, పట్టణాభివృద్ధి	తదుపరి పోస్టింగ్‌కు జీఏడీకి అటాచ్
రజత్ భార్గవ	ప్రత్యేక సీఎస్, ఎక్సైజ్ శాఖ	తదుపరి పోస్టింగ్‌కు జీఏడీకి అటాచ్
ప్రవీణ్ ప్రకాశ్	ముఖ్య కార్యదర్శి, విద్యాశాఖ	తదుపరి పోస్టింగ్‌కు జీఏడీకి అటాచ్

నా కొ..ల్లారా.. నరుకుతా..

రవాణా శాఖ అధికారులపై బూతులతో చెలరేగిన జేసీ ప్రభాకరరెడ్డి



అనంతపురం క్రైం: తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడంతో తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నేత జేసీ ప్రభాకరరెడ్డి అధికారులపై విరుచుకుపడ్డారు. 'నా కొ..ల్లారా.. ఒక్కొక్కరినీ నరుకుతా' అంటూ బుధవారం అనంతపురంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలోనే బండ బూతులతో చెలరేగిపోయారు. రవాణా శాఖ అధికారులపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేయడంతో పాటు తాడిపత్రి మునిసిపల్ అధికారులకు, పోలీసులకు, వైఎస్సార్‌సీపీ నేతలకు బహిరంగంగానే వార్నింగ్ ఇచ్చారు. ప్రధానంగా గతంలో రవాణా శాఖ కమిషనర్‌గా చేసిన ఐపీఎస్ అధికారి సీతారామాంజనేయులుతో పాటు అసిస్టెంట్ కమిషనర్ ప్రసాదరావు, డీటీసీ శివరాంప్రసాద్, మహిళా అధికారిణి అత్తికానాజ్‌లను దుర్భాషలాడారు. 'మీరెక్కడ దాక్కున్నా వదలను. గత ప్రభుత్వ హయాంలో నా బస్సులు, లారీలను అన్యాయంగా సీజ్ చేశారు. మమ్మల్ని దొంగలుగా చిత్రీకరించారు. నన్ను, నా కొడుకును జైలుకు పంపారు. నిబంధనల మేరకే మేము బీఎస్–4 వాహనాలు కొన్నాం. బీఎస్–4 వాహనాలు అమ్మిన వాళ్లదే తప్పు అని సుప్రీం కోర్టు చెప్పింది. పంజాబ్, తమిళనాడు, మధ్యప్రదేశ్ రాష్ట్రాలలో అమ్మిన వాహనాలను సరెండర్ చేశారు. అక్కడ రిజిస్ట్రేషన్ చేసిన అధికారుల ఉద్యోగాలు పోయాయి. ఏపీలో మాత్రం వాహనాలు కొన్న మాపై కేసులు పెట్టారు. జైళ్లకు కూడా పంపారు. అందరిపై ప్రతీకారం తీర్చుకుంటా. సీజ్ చేసిన మా బస్సులు, లారీలన్నీ తుప్పు పట్టిపోయాయి. వాటిని మీరే (అధికారులే) రిపేరు చేయించి తిరిగి రోడ్డుపైకి తేవాలి. ఇందుకు పది రోజులు గడువిస్తున్నా. లేదంటే భార్య, పిల్లలతో కలసి డీటీసీ, ఎస్పీ కార్యాలయాల ముందు నిరాహార దీక్ష చేస్తా. తాడిపత్రి మునిసిపల్ ఆఫీసులో కూడా చాలా ఇబ్బంది పెట్టారు. రేయ్.. కమిషనర్లూ మిమ్మల్ని వదలను. 'నా కొ..ల్లారా నరికేస్తా. ఏమవుతుంది మీతో' అంటూ ఆగ్రహంతో ఊగిపోయారు. అధికారులను దుర్భాషలాడారు. 'నా ఫ్యామిలీకి 620 ఏళ్ల చరిత్ర ఉంది. నా గడ్డం ఎందుకు వదిలానను కుంటున్నారు? చంద్రబాబు సీఎం కావాలని వదల్లేదు. ఒక్కో వెంట్రుకకు ఒక్కో కథ ఉంది. అత్తికా నాజ్ ఆడదంట.. ఏమ్మా అన్నా వినలేదు. ఇంట్లో తను ఎలా ఉంటుందో తెలుసా?' అంటూ రాయలేని భాషలో దూషించారు. వైఎస్సార్‌సీపీ నేతలు కొడాలి నాని, వల్లభనేని వంశీ, పేర్ని నానీలను కూడా దూషించారు. బస్సులు, లారీల వ్యవహారం పూర్తిగా తన వ్యక్తిగత సమస్య అని, చంద్రబాబుకు, ఈ ప్రభుత్వానికి సంబంధం లేదని అన్నారు. తాను సొంతంగానే పరిష్కరించుకుంటానన్నారు. అవసరమైతే పార్టీకి కూడా రాజీనామా చేస్తానని చెప్పారు. తాను ఊ అంటే చాలు తనకున్న జనం మరెవరికీ లేరని అన్నారు.

వరికి మరో రూ.117

▶ మొదటి పేజీ తరువాయి

ఉండాలని 2018 కేంద్ర బడ్జెట్‌లో తీసుకున్న విధానపరమైన నిర్ణయాన్ని ప్రభుత్వం ఆమోదించినట్లు చెప్పారు. ఇదే సూత్రాన్ని ఇప్పుడు అమలు చేసినట్లు పేర్కొన్నారు. పంటల ఉత్పత్తి వ్యయాన్ని సీఏసీపీ శాస్త్రీయంగా మదింపు చేసిందన్నారు.

కేంద్ర కేబినెట్ నిర్ణయాలు

- మహారాష్ట్రలోని వధవాన్‌లో రూ.76,200 కోట్లతో గ్రీన్‌ఫీల్డ్ డీప్ డ్రాఫ్ట్ మేజర్ పోర్టు అభివృద్ధి. ఈ ఓడరేవును ప్రపంచంలోని టాప్–10 ఓడరేవుల్లో ఒకటిగా అభివృద్ధి చేస్తారు. ఈ ప్రాజెక్టుతో ప్రత్యక్షంగా, పరోక్షంగా 12 లక్షల మందికి ఉపాధి లభిస్తుందని అంచనా. ఈ పోర్టులో 9 కంటైనర్ టెర్మినళ్లు ఉంటాయి. ఒక్కో టెర్మినల్ పొడవు వెయ్యి మీటర్లు.
- రూ.2,869.65 కోట్లతో వారణాసిలోని లాల్‌బహదూర్ శాస్త్రి ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు విస్తరణ. ఇందులో భాగంగా కొత్త టెర్మినల్ బిల్డింగ్ నిర్మిస్తారు. ఆప్రాన్, రన్‌వేను మరింత విస్తరిస్తారు.
- సముద్ర తీరంలో పవన విద్యుత్ ప్రాజెక్టులకు రూ.7,453 కోట్ల వయబిలిటీ గ్యాప్ ఫండింగ్(వీజీఎఫ్). 500 మెగావాట్ల చొప్పున గుజరాత్‌లో ఒకటి, తమిళనాడులో ఒకటి పవన విద్యుత్ ప్రాజెక్టుల అమలు.
- 2024–25 నుంచి 2028–29 దాకా రూ.2,254.43 కోట్లతో జాతీయ ఫోరెన్సిక్ మౌలిక సదుపాయాల అభివృద్ధి పథకం(ఎన్ఎఫ్ఐఈఎస్) అమలు. ఇందులో భాగంగా ఫోరెన్సిక్ మౌలిక సదుపాయాల అభివృద్ధి. నూతన క్యాంపస్‌లు, సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌ల నిర్మాణం. నేషనల్ ఫోరెన్సిక్ సైన్సెస్ యూనివర్సిటీ(ఎన్ఎఫ్ఎస్‌యూ) ఏర్పాటు.

ఏ పంటకు ఎంతంటే (క్వింటాల్‌కు రూ.లలో)...

పంట	కనీస మద్దతు ధర		పెంపు
	2024-25	2023-24	
వరి ధాన్యం(సాధారణ)	2,300	2,183	117
వరి ధాన్యం('ఎ' గ్రేడ్)	2,320	2,203	117
జొన్నలు(హైబ్రిడ్)	3,371	3,180	191
జొన్నలు(మాల్దండి)	3,421	3,225	196
సజ్జలు	2,625	2,500	125
రాగులు	4,290	3,846	444
మొక్కజొన్న	2,225	2,090	135
కందులు	7,550	7,000	550
పెసలు	8,682	8,558	124
మినుములు	7,400	6,950	450
వేరుశనగ	6,783	6,377	406
పొద్దుతిరుగుడు	7,280	6,760	520
సోయాబీన్(ఎల్లో)	4,892	4,600	292
నువ్వులు	9,267	8,635	632
నైగర్ సీడ్	8,717	7,734	983
పత్తి(మధ్యస్థ పింజ)	7,121	6,620	501
పత్తి(పొడవు పింజ)	7,521	7,020	501

ఇళ్ల స్థలాలు ధ్వంసం చేసి.. టీడీపీ జెండాలు పాతి..

చాట్రాయి: ప్రతి పేదవాడికి గూడు కల్పించాలనే సంకల్పంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కేటాయించిన ఇళ్లస్థలాలపై టీడీపీ నేతల కళ్లుబడ్డాయి. ఎక్కడికక్కడ ఇళ్ల స్థలాలను విచక్షణారహితంగా ధ్వంసం చేస్తున్నారు. ఏలూరు జిల్లా చాట్రాయి మండలం పోలవరం గ్రామంలో సుమారు 3 ఎకరాల భూమిని ప్రభుత్వం కొనుగోలు చేసింది. ఈ భూమిలో 234 మందికి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పట్టాలు ఇచ్చి రిజిస్ట్రేషన్ చేయించి పేదలకు పంపిణీ చేశారు. దీంతో ఈ స్థలాల్లో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. ఈ నేపథ్యంలో టీడీపీ నాయకులు బుధవారం ఇళ్ల స్థలాలను ట్రాక్టర్‌తో దున్ని ధ్వంసం చేసి.. టీడీపీ జెండాలు పాతారు. రెవెన్యూ సిబ్బంది వెళ్లి ప్రభుత్వం పేదలకు ఇచ్చిన భూమిని ధ్వంసం చేయడం నేరమని చెప్పినా పట్టించుకోలేదు. దీనిపై గ్రామ రెవెన్యూ కార్యదర్శి తేజ ఫిర్యాదు మేరకు నూజివీడు ఆర్డీఓకు నివేదిక పంపినట్లు ఇన్‌చార్జి తహసీల్దార్ పులకేశ్వరావు తెలిపారు.

చిత్తూరులో వైఎస్సార్‌సీపీ నేతలపై టీడీపీ దాడులు



రాజుపై దాడి చేస్తున్న టీడీపీ కార్యకర్తలు

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో టీడీపీ కార్యకర్తలు రెచ్చిపోతున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, సానుభూతిపరులే లక్ష్యంగా దాడులకు దిగుతున్నారు. మంగళవారం రాత్రి కార్పొరేషన్ కో–ఆప్షన్ సభ్యుడు అనూ ఇంటిపై మొహాలకు ఖర్చీఫ్‌లు కట్టుకుని రాళ్ల దాడికి దిగిన విషయం తెలిసిందే. ఇదేరోజు అర్ధరాత్రి చిత్తూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (చుడా) మాజీ చైర్మన్ పురుషోత్తంరెడ్డి ఇంటిపైకి టీడీపీ కార్యకర్తలు వెళ్లారు. ఆయన ఇంట్లో లేకపోవడంతో బయట పార్కింగ్ చేసి ఉన్న స్కార్పియో కారును ధ్వంసం చేసి పారిపోయారు. గంగాధరనెల్లూరు నియోజకవర్గంలోని ఎస్ఆర్.పురం మండలానికి చెందిన తులసీరామ్ (రాజు) అనే వ్యక్తిని చిత్తూరుకు చెందిన టీడీపీ నేతలు కిడ్నాప్ చేశారు. రాజుకు చెందిన ఓ లారీను సైతం చోరీ చేశారు. రాజును కిడ్నాప్ చేసి, మురకంబట్టులోని ఓ నిర్మానుష ప్రదేశానికి తీసుకెళ్లిన టీడీపీ నేతలు కర్రలు, పైపులతో తీవ్రంగా కొట్టారు. బాధితుడిని మోకాళ్లపై కూర్చోబెట్టి దాదాపు 30 మంది వరకు టీడీపీ కార్యకర్తలు దాడికి పాల్పడగా.. కొందరు వీడియోలు తీసి సోషల్ మీడియాలో పోస్టు చేశారు. తీవ్రంగా గాయపడ్డ రాజును స్థానికులు చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. దీనిపై పోలీసులు కేసు నమోదుచేసి, చోరీకి గురైన లారీని స్వాధీనం చేసుకున్నారు.

వైఎస్సార్‌సీపీ ఓటమిని తట్టుకోలేక వ్యక్తి మృతి




యరపగాని పెద భూషయ్య (ఫైల్)

పిడుగురాళ్ల రూరల్: వైఎస్సార్‌సీపీ ఓటమిని తట్టుకోలేక ఓ వృద్ధుడు మృతి చెందాడు. పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మండలం కరాలపాడు గ్రామానికి చెందిన యరగాని పెద భూషయ్య వైఎస్సార్‌సీపీకి వీర విధేయుడు. ఈ నెల 4న సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే భూషయ్య మనో వేదనతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. దీంతో ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. వీరి కుటుంబాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు పరామర్శించారు.

పోలింగ్ అనంతర దాడులపై పూర్తి వివరాలివ్వండి

- రాష్ట్ర ప్రభుత్వం, డీజీపీలకు హైకోర్టు మరోసారి ఆదేశం
- తదుపరి విచారణ నాలుగు వారాలకు వాయిదా



సాక్షి, అమరావతి: సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే రాష్ట్రంలో కొన్ని వర్గాల ప్రజలే లక్ష్యంగా జరుగుతున్న లక్షిత దాడులకు సంబంధించిన పూర్తి వివరాలను తమ ముందుంచాలని హైకోర్టు బుధవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని, డీజీపీని మరోసారి ఆదేశించింది. తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు ధర్మాసనం ఉత్తర్వులిచ్చింది. సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెల్లడయ్యాక నిర్దిష్టంగా ఓ రాజకీయ పార్టీకి చెందిన వారిని లక్ష్యంగా చేసుకుంటూ రాష్ట్రంలో హింసకు పాల్పడుతున్న వారిపై పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని, హింసను అణిచివేసి, బాధితులను రక్షించేందుకు అవసరమైన చర్యలను సత్వరమే చేపట్టేలా కేంద్ర హోంశాఖను, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని, డీజీపీని ఆదేశించాలని కోరుతూ రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత వైవీ సుబ్బారెడ్డి హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యంపై బుధవారం సీజే నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరిపింది. ఈ సందర్భంగా పిటిషనర్ తరఫు న్యాయవాది కొవ్వూరి వెంకట్రామిరెడ్డి వాదనలు వినిపిస్తూ, ఓ రాజకీయ పార్టీకి సంబంధించిన వారిపై మరో రాజకీయ పార్టీకి చెందిన వారు విచక్షణా రహితంగా దాడులకు పాల్పడుతున్నారని తెలిపారు. ఆస్తులనూ ధ్వంసం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇంత జరుగుతున్నా పోలీసులు చోద్యం చూస్తున్నారని వివరించారు. ఫిర్యాదులు చేసినా పోలీసులు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయడం లేదన్నారు. ధర్మాసనం స్పందిస్తూ.. ఫిర్యాదులు ఇచ్చినప్పుడు ఏం చేయాలన్న దానిపై నిర్దిష్ట విధానం ఉందిగా అని ప్రశ్నించింది. అయినా కూడా కేసులు నమోదు చేయడం లేదన్నారు. దాడులపై రాష్ట్రపతి, గవర్నర్, డీజీపీలకు వైఎస్సార్‌సీపీ ఎంపీ ఫిర్యాదు చేశారని, అయినా కూడా ఎలాంటి ప్రయోజనం లేదని తెలిపారు. హింస, దాడులపై ఏం చర్యలు తీసుకున్నారో తెలియచేస్తూ స్టేటస్ రిపోర్ట్ సమర్పించేలా ఆదేశాలివ్వాలని ఆయన ధర్మాసనాన్ని కోరారు. వాదనలు విన్న ధర్మాసనం తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. పూర్తి వివరాలు సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, డీజీపీని ఆదేశించింది.

క్లుప్తంగా...

నేడు అమరావతిలో సీఎం పర్యటన

సాక్షి, అమరావతి: రాజధాని అమరావతి ప్రాంతంలో సీఎం చంద్రబాబు పర్యటించనున్నారు. సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత రెండో పర్యటన రాజధానిలో చేసి అక్కడి నిర్మాణాల స్థితిగతులను పరిశీలించనున్నట్లు అధికారులు తెలిపారు. గురువారం ఉదయం 11 గంటలకు ఆయన ఉండవల్లిలోని తన నివాసం నుంచి అమరావతి పర్యటనకు బయలుదేరనున్నారు. ప్రజావేదిక ప్రాంతం, ఉద్దండరాయునిపాలెంలో ప్రధాని మోదీ చేతుల మీదుగా రాజధానికి శంకుస్థాపన చేసిన ప్రాంతాన్ని సందర్శిస్తారు. సీడ్ యాక్సిస్ రోడ్, ఆలిండియా సర్వీసెస్ అధికారులు, మంత్రులు, న్యాయమూర్తుల గృహ సముదాయాలు, ఇతర నిర్మాణాలను పరిశీలించనున్నారు. పర్యటన అనంతరం చంద్రబాబు మీడియాతో మాట్లాడుతారని మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ తెలిపారు.

శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యం: మంత్రి అనిత



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణకు అత్యధిక ప్రాధాన్యమిస్తామని హోం మంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు. వెలగపూడి సచివాలయంలోని రెండో బ్లాక్‌లోని తన చాంబర్‌లో ఆమె హోం మంత్రిగా బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో దిశ పోలీస్ స్టేషన్లను మహిళా పోలీస్ స్టేషన్లుగా మారుస్తామన్నారు. పోలీస్ స్టేషన్లలో సదుపాయాలు మెరుగుపరుస్తామన్నారు. గంజాయి, డ్రగ్స్ స్మగ్లింగ్‌ను అరికట్టేందుకు ప్రత్యేకంగా టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేస్తామని చెప్పారు. సోషల్ మీడియా ద్వారా వేధింపులకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఆమెకు డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా, హోమ్ శాఖ ముఖ్య కార్యదర్శి విజయ్ కుమార్, ఇంటెలిజెన్స్ అదనపు డీజీ కుమార్ విశ్వజిత్, అదనపు డీజీ శంకభాత్ర బాగ్చీ శుభాకాంక్షలు తెలిపారు.

యుద్ధప్రాతిపదికన విద్యుత్ పునరుద్ధరణ
మంత్రి గొట్టిపాటి రవికుమార్



సాక్షి, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ పనులు చేపట్టాలని రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా కురిసిన వర్షాలు, ఈదురుగాలుల వల్ల పలు ప్రాంతాల్లో కూలిన కరెంట్ స్తంభాలు, తెగిన వైర్లు, దెబ్బతిన్న ఫీడర్ల పునరుద్ధరణకు తీసుకుంటున్న చర్యలపై రాష్ట్ర సచివాలయం నుంచి టెలీకాన్ఫరెన్స్ ద్వారా డిస్కంల సీఎండీలతో ఆయన బుధవారం సమీక్షించారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలని, రానున్న 48 గంటల పాటు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

నేడు బీజేపీ ఎంపీ, ఎమ్మెల్యేలకు అభినందన సభ

సాక్షి, అమరావతి: మొన్నటి ఎన్నికల్లో బీజేపీ తరుపున గెలిచిన ఎంపీ, ఎమ్మెల్యేలకు రాష్ట్ర పార్టీ విజయవాడ వెన్యూ కన్వెన్షన్ సెంటర్‌లో అభినందన కార్యక్రమం నిర్వహించనుంది. కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ సహా ముగ్గురు ఎంపీలు, 8 మంది ఎమ్మెల్యే లు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని రాష్ట్ర పార్టీ కార్యాలయం తెలిపింది.

ఆగని శిలాఫలకాల ధ్వంసం

రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ శ్రేణుల విధ్వంసం.. సచివాలయాలు, సీసీ రోడ్లు, ఆర్బీకేలే లక్ష్యంగా దాడులు



ప్రకాశం జిల్లా జి.అగ్రహారంలో వైఎస్సార్‌సీపీ జెండా దిమ్మెను ధ్వంసం చేసిన దృశ్యం



అనకాపల్లి జిల్లా తుమ్మపాలలో ధ్వంసం చేసిన శిలాఫలకం



కర్నూలు జిల్లా హోసూరులో విరిగిన వైఎస్సార్ విగ్రహం చేయి భాగం

సాక్షి, నెట్‌వర్క్: టీడీపీ అధికారంలోకి వచ్చి 15 రోజులు గడిచినా ఆ పార్టీ నేతలు తమ విధ్వంసాలను ఆపడం లేదు. అధికారం అండగా విచ్చలవిడిగా, యథేచ్ఛగా చెలరేగిపోతున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో వివిధ అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాలను ధ్వంసం చేస్తూనే ఉన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో రైతు భరోసా కేంద్రాలు, సచివాలయాలు, సీసీ రోడ్ల శిలాఫలకాలను టీడీపీ కార్యకర్తలు బుధవారం పగులకొట్టారు. అలాగే దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ విగ్రహాలను, వైఎస్సార్‌సీపీ జెండా దిమ్మెలను ధ్వంసం చేశారు. అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు పేరుతో ఉన్న శిలాఫలకాన్ని పగులకొట్టారు. విషయం తెలుసుకున్న వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి తుమ్మల సురేశ్, మాజీ జెడ్పీటీసీ రాజేశ్వరి సీఐ బాబుకు ఫిర్యాదు చేశారు. పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు మండలం జగన్నాథపురంలో ఆర్బీకేలు, సచివాలయాలకు అతికించిన వైఎస్ జగన్ చిత్రాన్ని, నవరత్నాల వివరాలతో కూడిన శిలాఫలకాలను టీడీపీ శ్రేణులు ధ్వంసం చేశాయి. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట విజయలక్ష్మీనగర్‌లో సీసీ రోడ్డుకు సంబంధించి ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ధ్వంసం చేశారు. వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి, మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యుడు రెడ్డి రాధాకృష్ణ, తదితరులు ఈ దుశ్చర్యపై మండిపడ్డారు. అనకాపల్లి జిల్లా తుమ్మపాలలో శ్రీ వేణుగోపాలస్వామి ఆలయం వద్ద శిలాఫలకాన్ని ధ్వంసం చేశారు. శిలాఫలకంపై ఉన్న మాజీ సీఎం వైఎస్ జగన్, మాజీ మంత్రి అమర్‌నాథ్ చిత్రాలను చెరిపివేశారు. శిలాఫలకం ధ్వంసంపై సర్పంచ్ తట్టా పెంటయ్య నాయుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కర్నూలు జిల్లా పత్తికొండ మండలం హోసూరులో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం చేతిని విరగకొట్టారు. చుట్టుపక్కల సీసీ కెమెరాల్లో రికార్డు కాకుండా వాటిని తొలగించారు. వైఎస్సార్‌సీపీ నేతల ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ గోపాల్ సిబ్బందితో గ్రామానికి చేరుకుని వివరాలు సేకరించారు. ప్రకాశం జిల్లా మర్రిపూడి మండలం జి.అగ్రహారంలో ఒంగోలు–కర్నూలు రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన వైఎస్సార్‌సీపీ జెండా దిమ్మెను టీడీపీ కార్యకర్తలు పాలడుగు రమేశ్, తానికొండ బాలకోటయ్య జేసీబీతో ధ్వంసం చేశారు. అలాగే జెండా దిమ్మె పక్కన కొమ్ముల కోటమ్మ రేకుల షెడ్డును కూడా కూల్చారు.

టీడీపీలో రచ్చకెక్కిన విభేదాలు

మాజీ ఎమ్మెల్సీ, మాజీ ఎమ్మెల్యేలను సాగనంపేందుకు యత్నాలు



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

సాక్షి, పార్వతీపురం మన్యం: పార్వతీపురం మన్యం జిల్లాలోని పార్వతీపురం నియోజకవర్గ టీడీపీలోని విభేదాలు రచ్చకెక్కాయి. ఇదే పార్టీకి చెందిన సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్, నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులును పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని మూడు మండలాలు, మున్సిపాలిటీకి చెందిన నేతలంతా తీర్మానం చేశారు. తీర్మానాన్ని పార్టీ అధిష్టానానికి పంపుతున్నట్లు బుధవారం మీడియాకు వెల్లడించారు. వీరి వెనుక నియోజకవర్గానికి చెందిన కీలక నేత ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. గత ఎన్నికలకు ముందు టీడీపీ పార్వతీపురం నియోజకవర్గ ఇన్‌చార్జిగా బోనెల విజయచంద్రను పార్టీ అధిష్టానం నియమించింది. అప్పటి నుంచి నియోజకవర్గంలో పార్టీ రెండు ముక్కలుగా చీలిపోయింది. మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు, మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్‌లను విజయచంద్ర కలుపుకొని వెళ్లకుండా పూర్తిగా పక్కన పెట్టేశారని, సీనియర్లన్న గౌరవం లేకుండా వ్యవహరించేవారన్న విమర్శలు అప్పట్లో బలంగా వినిపించాయి. టీడీపీలో ఉంటూ సొంత పార్టీ అభ్యర్థికి వ్యతిరేకంగా పని చేశారన్నది మరో ఆరోపణ. ఎన్నికలకు ముందు ఏ కార్యక్రమం చేపట్టినా ద్వారపురెడ్డి, బొబ్బిలి చిరంజీవులును బోనెల విజయచంద్ర ఆహ్వానించకుండా నిర్లక్ష్యం చేశారని జగదీష్ వర్గం చెబుతోంది. ఎన్నికల్లో పార్వతీపురం నియోజకవర్గ కూటమి అభ్యర్థిగా బరిలో దిగిన విజయచంద్ర విజయం సాధించారు. ఆ తర్వాత పార్వతీపురంలో జరిగిన విజయోత్సవ సభలో ఆ సీనియర్ నేతలిద్దరూ హాజరు కాకపోవడం.. అదే వేదికపై పార్టీలో ఉంటూ ద్రోహం చేసిన వారిని ఉపేక్షించమని ఎమ్మెల్యే పరోక్షంగా హెచ్చరించడం చర్చనీయాంశంగా మారింది.

అక్కడ భేటీ.. ఇక్కడ సస్పెండ్‌కు తీర్మానం

సీఎంగా బాధ్యతలు స్వీకరించిన చంద్రబాబును మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్ ఇటీవల మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఇప్పుడు ఇదే నియోజకవర్గ టీడీపీ నేతలకు కంటగింపుగా మారింది. పార్టీకి అన్యాయం చేసి.. మరలా ఏ ముఖం పెట్టుకుని అధినేతను కలిసి వస్తారని వారు ప్రశ్నిస్తున్నారు. పార్వతీపురం పట్టణంలో మూడు మండలాలు, మున్సిపాలిటీకి చెందిన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు హడావుడిగా మీడియా సమావేశం నిర్వహించారు. ద్వారపురెడ్డితో పాటు.. మాజీ ఎమ్మెల్యే చిరంజీవులును పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని తామంతా తీర్మానం చేసి పార్టీ అధిష్టానానికి పంపిస్తున్నట్లు వెల్లడించారు. సీతానగరం, బలిజిపేట, పార్వతీపురంలలో వారి అనుచరగణం కూడా పార్టీకి వ్యతిరేకంగా పని చేసిందని.. అందరినీ అధిష్టానం బహిష్కరించాలని డిమాండ్ చేశారు.

గత ప్రభుత్వంలో 11,782 లేఅవుట్లలో
పేదల ఇళ్ల నిర్మాణం

- 6.8 లక్షల సాధారణ ఇళ్ల నిర్మాణం పూర్తి చేశారు
- 1.05 లక్షల టిడ్కో ఇళ్లు లబ్ధిదారులకు అందజేశారు
- గత ప్రభుత్వ ఇళ్ల నిర్మాణ పథకాన్ని కొనసాగిస్తాం
- గృహ నిర్మాణ శాఖ మంత్రి పార్థసారథి



సాక్షి, అమరావతి: గత ప్రభుత్వం రాష్ట్రంలో 11,782 లేఅవుట్లలో పేదల ఇళ్ల నిర్మాణం చేపట్టిందని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి చెప్పారు. ఐదేళ్లలో 6.8 లక్షల సాధారణ ఇళ్ల నిర్మాణం పూర్తి చేశారని, 1.05 లక్షల టిడ్కో ఇళ్లను మౌలిక సదుపాయాలతో పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేసినట్టు వివరించారు. బుధవారం రాష్ట్ర సచివాలయంలో మంత్రి పార్థసారథి విలేకరులతో మాట్లాడుతూ.. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సీఆర్‌డీఏ పరిధిలో పేదలకు పంపిణీ చేసిన ఇళ్ల స్థలాల అంశం కోర్టులో ఉందన్నారు. వైఎస్సార్, జగనన్న కాలనీల పేరు మార్పుపై ఆలోచించి నిర్ణయం తీసుకుంటామన్నారు. ఇళ్ల నిర్మాణ పథకాన్ని కొనసాగిస్తామన్నారు. పేదలకు ఇళ్ల స్థలాలకు సేకరించిన భూములను 2013 భూసేకరణ చట్టం ప్రకారం సేకరించారో లేదో విచారణ జరుపుతామని, నిబంధనలు అతిక్రమించినట్టు తేలితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని చెప్పారు. రాష్ట్రంలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చే ప్రక్రియను వేగవంతం చేసి సకాలంలో అందించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

లేదంటూనే.. అవునంటూ

అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిందేమీ లేదంటూనే 11,782 లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణం చేపట్టిందని మంత్రి ఒప్పుకున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకం కింద 31 లక్షలకుపైగా లబ్ధిదారులకు స్థలాలను అందించిన విషయం తెలిసిందే.

ఎమ్మెల్యే ఆదేశాలతో పాఠశాల ప్రహరీ తొలగింపు

అనపర్తి ఎమ్మెల్యే తీరుపై జనం మండిపాటు



ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో నిర్మించిన ప్రహరీని పొక్లెయిన్‌తో కూల్చివేస్తున్న దృశ్యం

కాకినాడ: ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆదేశాలతో ప్రభుత్వ పాఠశాల ప్రహరీ గోడను కూల్చివేసిన ఘటన మంగళవారం రాత్రి అనపర్తిలో చోటుచేసుకుంది. ఈ వ్యవహారం అనపర్తి నియోజకవర్గంలో కలకలం రేపింది. అనపర్తిలో దశాబ్దాల చరిత్ర కలిగినరామారెడ్డి జెడ్పీ హైస్కూల్‌కు ప్రహరీ లేకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. చీకటిపడితే మందుబాబులు అక్కడ తిష్టవేసి మద్యం సేవిస్తూ భయానక వాతావరణాన్ని సృష్టించేవారు. పాఠశాల క్రీడా మైదానం నుంచి ఆంజనేయనగర్ ప్రాంతవాసులకు రహదారిగా ఉన్న ఈ ప్రాంతంలో నెలకొన్న సమస్యపై సుదీర్ఘకాలంగా ఏ ఒక్కరూ దృష్టి పెట్టలేదు. 2019లో ఎమ్మెల్యేగా ఎన్నికైన డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఈ సమస్యపై దృష్టి సారించి పాఠశాల ఆవరణ ఆక్రమణకు గురికాకుండా, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసే లక్ష్యంతో ప్రహరీ నిర్మాణానికి చొరవ తీసుకున్నారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో నిర్మాణాన్ని పూర్తిచేసి సమస్యను కూడా పరిష్కరించారు. ఆంజనేయనగర్ ప్రాంతవాసుల కోసం రహదారిని కూడా అభివృద్ధి చేసి ఇటీవలే సీసీ రోడ్డు నిర్మించారు. తద్వారా ఆ ప్రాంత సమస్యకు పూర్తిగా చెక్ పెట్టారు. ఈ సమస్యకు పరిష్కారం దొరకడంతో జీర్ణించుకోలేని కొందరు అప్పటి మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. తాను అధికారంలోకి వచ్చాక సమస్య పరిష్కారిస్తానని భరోసా ఇచ్చిన నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అధికార బలంతో మంగళవారం రాత్రి రెవెన్యూ, ఆర్ అండ్ బీ, జెడ్పీ తదితర శాఖల అధికారులను పంపించి పాఠశాల ప్రహరీని కూల్చివేయించారు. ప్రజాప్రతినిధిగా ప్రభుత్వ ఆస్తిని పరిరక్షించాల్సిన ఎమ్మెల్యే ప్రభుత్వ నిధులతో నిర్మించిన ప్రహరీని బలవంతంగా కూల్చివేయించిన తీరు చూసి జనం ముక్కున వేలేసుకుంటున్నారు.

ఉద్యాన పంటల సాగు.. 'ఉపాధి'తో అనుసంధానం

గిరిజన గ్రామాల్లో పంచాయతీ భవనాల నిర్మాణం
రెండు ఫైళ్లపై ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సంతకం



బాధ్యతలు స్వీకరిస్తున్న పవన్ కళ్యాణ్

సాక్షి, అమరావతి: జనసేన పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ బుధవారం విజయవాడలోని తన అధికారిక క్యాంపు కార్యాలయంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, అటవీ, పర్యావరణ, శాస్త్ర సాంకేతిక శాఖల మంత్రిగా బుధవారం బాధ్యతలు స్వీకరించారు. తన సోదరుడు నాగబాబుతో కలిసి అధికారిక కార్యాలయానికి వచ్చిన ఆయన శ్రీ వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేసి పండితుల ఆశీర్వచనం తీసుకున్నారు. అనంతరం ఉదయం 10.30 గంటలకు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన రెండు ఫైళ్లపై సంతకాలు చేసినట్టు ఉప ముఖ్యమంత్రి కార్యాలయం తెలిపింది. రాష్ట్రంలో సొంత భవనాలు లేని గిరిజన గ్రామ పంచాయతీల్లో భవనాల నిర్మాణానికి సంబంధించిన ఫైలుపై పవన్ సంతకం చేసినట్టు తెలిపింది. అదే విధంగా ఉద్యాన పంటల సాగును ఉపాధి హామీ పథకంతో అనుసంధానం చేసే మరో ఫైల్ మీద కూడా పవన్ సంతకం చేసినట్టు వివరించింది. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్, కమిషనర్ కన్నబాబు, అటవీ శాఖ పీసీసీఎఫ్ చిరంజీవి చౌదరి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్న పవన్ కళ్యాణ్‌ను పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కలిసి అభినందనలు తెలిపారు. పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ కూడా శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, పలువురు పార్టీ ఎమ్మెల్యేలు, నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొని పవన్‌కళ్యాణ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

శాఖలవారీగా సమీక్ష

ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం పవన్ కళ్యాణ్ తన క్యాంపు కార్యాలయంలో శాఖాపరమైన విధుల్లో పాల్గొన్నారు. ఉదయం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలపై సమీక్ష చేశారు. సాయంత్రం అటవీ శాఖకు సంబంధించి వివిధ అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు.

పవన్‌ను కలిసిన సీఎస్ నీరభ్‌కుమార్

బుధవారం సాయంత్రం ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్‌కుమార్ ప్రసాద్ ప్రత్యేకంగా కలిశారు.

జలవనరుల శాఖ సలహాదారుగా వెంకటేశ్వరరావు

సాక్షి, అమరావతి: జలవనరుల శాఖ సలహాదారుగా రిటైర్డ్ ఇంజనీర్–ఇన్–చీఫ్ (ఈఎన్‌సీ) ఎం.వెంకటేశ్వరరావును ప్రభుత్వం నియమించింది. రెండేళ్లపాటు ఆయన సలహాదారుగా వ్యవహరిస్తారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర విభజన తర్వాత 2014 జూన్‌లో ఈఎన్‌సీగా బాధ్యతలు స్వీకరించిన వెంకటేశ్వరరావు 2019 డిసెంబర్‌లో పదవీ విరమణ చేశారు. ఆ తర్వాత ఆయనను గత ప్రభుత్వం జల వనరుల శాఖ సలహాదారుగా నియమించింది. గతేడాది డిసెంబర్‌తో ఆయన పదవీ కాలం ముగియగా.. తాజాగా ఆయనను సలహాదారుగా నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.

టీడీపీ కొత్త అధ్యక్షుడికి బుల్లెట్ ప్రూఫ్ కారు



గాజువాక: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు ఆ పార్టీ బుల్లెట్ ప్రూఫ్ కారు కేటాయించింది. రాష్ట్ర అధ్యక్షుడిగా అన్ని జిల్లాల్లో ఆయన పర్యటించాల్సి ఉన్న దృష్ట్యా ముఖ్యమంత్రి చంద్రబాబు బుల్లెట్ ప్రూఫ్ కారు కేటాయించినట్లు ఆ పార్టీ నాయకులు పేర్కొన్నారు.

భద్రాద్రిలో ఇక బ్రేక్ దర్శనం

- వచ్చే నెల 2 నుంచి అమలు
- టికెట్ ధర రూ.200గా నిర్ణయం
- ఉదయం 9 నుంచి 9.30 వరకు తిరిగి రాత్రి 7 నుంచి 7.30 వరకు సదుపాయం

భద్రాచలం: దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో కొత్తగా బ్రేక్ దర్శనాలను అమలు చేయాలని నిర్ణయించారు. జూలై 2 నుంచి ఈ నిర్ణయం అమల్లోకి వస్తుందని ఆలయ ఈఓ ఎల్.రమాదేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్రేక్ దర్శనం టికెట్ ధరను రూ. 200గా నిర్ణయించామని, ప్రతిరోజు ఉదయం 9 గంటల నుంచి 9.30 వరకు, తిరిగి రాత్రి 7 గంటల నుంచి 7.30 వరకు ఈ సదుపాయం ఉంటుందని వివరించారు. ఈ దర్శన సమయంలో ఉచిత, ప్రత్యేక దర్శనాలు, అంతరాలయ అర్చనలు తాత్కాలికంగా నిలిపివేస్తారని పేర్కొన్నారు. అయితే ఆలయంలో జరిగే విశేష, ఉత్సవ కార్యక్రమాల రోజుల్లో బ్రేక్ దర్శనం రద్దు లేదా వాయిదా వేసే అవకాశం ఉందని తెలిపారు. దీంతోపాటు ఈనెల 22న ఆలయంలో జ్యేష్టాభిషేకోత్సవం జరుగుతుందని, దీనిని పురస్కరించుకుని స్వామి వారికి జరిగే నిత్యకల్యాణం, తిరువీధి సేవ రద్దు చేస్తున్నట్లు ఈఓ వెల్లడించారు.

ఆన్‌లైన్‌లో కూడా..


దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు బ్రేక్ దర్శనం సౌకర్యవంతంగా ఉంటుందని ఆలయ వర్గాలు చెపుతున్నాయి. నిర్దిష్ట సమయంలో దర్శనం చేసుకుని ఉపాలయాల సందర్శన, ఇతర ప్రాంతాలను చూసేందుకు వీలు కలుగుతుందని అంటున్నారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న కౌంటర్లతోపాటు దేవస్థానం వెబ్‌సైట్‌లో కూడా బ్రేక్ దర్శనం టికెట్లు అందుబాటులోకి రానున్నాయి. ఇప్పటి వరకు దేవస్థానంలో భక్తుల కొరకు ఉచిత, ప్రత్యేక దర్శనాలు, ఇతర ఆర్జిత సేవలు ఉన్నాయి. ఈ జాబితాలో ఇప్పుడు బ్రేక్ దర్శనం కూడా చేరింది.

అభివృద్ధి, సంక్షేమంపై అసెంబ్లీలో చర్చలు
మంత్రి పయ్యావుల కేశవ్



సాక్షి, అమరావతి: రానున్న శాసన సభ సమావేశాలలో రాష్ట్రాభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి సంబంధించి అర్థవంతమైన చర్చలు జరగాలని కోరుకుంటున్నట్లు ఆర్థిక, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ చెప్పారు. టీడీఎల్పీలో దివంగత ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పించిన అనంతరం శాసన సభ కార్యాలయంలో అసెంబ్లీ వ్యవహారాల బాధ్యతలను కేశవ్ బుధవారం స్వీకరించారు. శాసన సభ ఏర్పాట్లకు చెందిన ఫైల్స్ పై తొలి సంతకాలు చేశారు. రాష్ట్ర ప్రజలకు జవాబుదారీ తనంతో కూడిన పారదర్శకమైన పాలనను చంద్రబాబు సారథ్యంలో ప్రజలకు అందించేందుకు కృషి చేస్తామన్నారు. శాసన సభ కార్యదర్శి పీపీకే రామాచార్యులు, సంయుక్త కార్యదర్శి విజయరాజు, ఉప కార్యదర్శి కె.రాజకుమార్, ఇతర అధికారులు, సిబ్బంది మంత్రికి అభినందనలు తెలిపారు.

ఏజీగా దమ్మాలపాటి నియామకం
నేడు బాధ్యతల స్వీకరణ



సాక్షి, అమరావతి: రాష్ట్ర అడ్వొకేట్ జనరల్ (ఏజీ)గా సీనియర్ న్యాయవాది దమ్మాలపాటి శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ మేరకు న్యాయశాఖ కార్యదర్శి సత్య ప్రభాకర్ రావు ఉత్తర్వులిచ్చారు. ఏజీగా దమ్మాలపాటి నియమితులు కావడం ఇది రెండోసారి. ఏజీగా ఆయన గురువారం హైకోర్టులో బాధ్యతలు చేపట్టనున్నారు. బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ఆయన నియామకం అమల్లోకి వస్తుంది. చంద్రబాబు సీఎంగా నియమితులైన వెంటనే ఏజీగా దమ్మాలపాటిని నియమించాలని నిర్ణయించారు. ఆ మేరకు చర్యలు తీసుకోవాలని సీఎస్‌కు స్పష్టం చేయడంతో దమ్మాలపాటి నియామక ఫైల్‌ను గవర్నర్ ఆమోదం కోసం పంపారు. దమ్మాలపాటి నియామకానికి గవర్నర్ ఆమోదం తెలపడంతో న్యాయశాఖ ఆయన నియామక ఉత్తర్వులు జారీ చేసింది.

యువతలో క్రీడా స్ఫూర్తిని పెంచాలి
రవాణా, యువజన సర్వీసులు, క్రీడలు శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి



సాక్షి, అమరావతి: యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేలా ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) చర్యలు చేపట్టాలని రవాణా, యువజన సర్వీసులు, క్రీడలు శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. బుధవారం విజయవాడలోని ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియం ప్రాంగణంలోని శాప్ కార్యాలయాన్ని సందర్శించారు. శాప్ ప్రాంగణంలో క్రీడాకారులకు అవసరమైన సౌకర్యాలను మెరుగుపర్చాలని అధికారులను ఆదేశించారు. అంతకు ముందు యువజన సర్వీసుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ప్రద్యుమ్న మంత్రికి పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు.

బుచ్చయ్యకు మళ్లీ భంగపాటు

టీడీపీ సీనియర్ నేతకు ఆది నుంచీ అవమానాలే.. ఏడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచినా పార్టీలో ప్రాధాన్యం కరవు

- ఈసారైనా మంత్రి పదవి దక్కుతుందని భావించిన గోరంట్ల
- ప్రాధాన్యం ఇవ్వని చంద్రబాబు
- అసెంబ్లీ స్పీకర్ పదవైనా వరిస్తుందని ఆశించిన కేడర్
- ప్రొటెం స్పీకర్‌తో సరిపెట్టిన సీఎం చంద్రబాబు
- చంద్రబాబు వ్యవహార శైలిపై బుచ్చయ్య వర్గంలో కలవరం
- బాబు జైల్లో ఉన్నపుడు సైతం సమన్వయ కమిటీలో దక్కని చోటు



సాక్షి, రాజమహేంద్రవరం: టీడీపీలో సీఎం చంద్రబాబు కంటే సీనియర్ నేత అయిన గోరంట్ల బుచ్చయ్య చౌదరికి మళ్లీ భంగపాటు ఎదురైందా? మంత్రి వర్గ విస్తరణలో చేదు అనుభవం మిగిలిందా? కనీసం అసెంబ్లీ స్పీకర్‌గా అయినా అవకాశం కల్పిస్తారన్న ఆశలు అడియాసలయ్యాయా..? మంత్రి వర్గంలోకి తీసుకోకపోవడం వెనుక మతలబు దాగుందా..? టీడీపీ పార్టీ ఆవిర్భావం నుంచి ఉన్నా.. తనకంటే జూనియర్లు, మొదటిసారి ఎమ్మెల్యేలుగా నెగ్గిన వారికి సైతం మంత్రి పదవులు ఇచ్చిన చంద్రబాబు పార్టీలో ఆయన గుర్తింపును హరిస్తున్నారా? కంటితుడుపు చర్యగా ప్రొటెం స్పీకర్‌గా ఎంపిక చేసి చేతులు దులుపుకోనున్నారా..? అంటే అవుననే సమాధానం వస్తోంది రాజకీయ విశ్లేషకుల నుంచి.

అమాత్య యోగానికి దూరం

రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్‌కు అత్యంత సన్నిహితుడు. చంద్రబాబు ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచిన సమయంలో ఆయన ఎన్టీఆర్ వర్గంలోనే ఉన్నారు. అనంతరం పార్టీ మీదున్న అభిమానంతో చాలాకాలం తర్వాత బాబు జట్టులోకి వచ్చారు. పార్టీలో ఉన్నా.. తనకు అన్యాయం జరిగితే అధినాయకత్వాన్నే ప్రశ్నించే తత్వం ఆయన సొంతం. ఇప్పటికి ఏడుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ఆయన వ్యవహార శైలిని చంద్రబాబునాయుడు జీర్ణించుకునే వారు కాదు. తనకు ఇష్టం లేకపోయినా పార్టీలో సీనియర్ అన్న కారణంగా పట్టించుకోకుండా వదిలేసేవారు. పార్టీపై ఉన్న అభిమానంతో గోరంట్ల సైతం టీడీపీలో అలాగే కొనసాగుతున్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ఏడవ సారి ఎమ్మెల్యేగా, రాజమహేంద్రవరం రూరల్ నుంచి హ్యాట్రిక్ విజయం సొంతం చేసుకున్న గోరంట్లకు ఈసారి చంద్రబాబు కేబినెట్‌లో అమాత్య పదవి దక్కడం ఖాయమని గోరంట్లతో పాటు ఆయన వర్గీయులు సైతం ఎంతో ఆశపడ్డారు. సీనియర్ నేతకు సరైన గుర్తింపు దక్కుతుందని సంతోషపడ్డారు. మంత్రుల పేర్లు ప్రకటించే వరకూ ఎంతో ఉత్కంఠతో ఎదురుచూశారు. వారి ఆశలను చంద్రబాబు అడియాసలుగా మిగిల్చేశారు. మంత్రి వర్గంలో బుచ్చయ్యకు చోటు దక్కలేదు. ఈ పరిణామంతో లోలోపల కుమిలిపోయిన బుచ్చయ్య పార్టీపై ఉన్న విధేయతతో మిన్నకుండిపోయారు. మంత్రి పదవి దక్కని సీనియర్ నేతకు అసెంబ్లీ స్పీకర్‌గా అవకాశం కల్పిస్తారన్న చర్చ నడిచింది. పోనీలే స్పీకర్‌తో అయినా సరిపెట్టుకుందామనుకుంటే చంద్రబాబు మరో బాంబు పేల్చారు.

ప్రొటెం స్పీకర్‌తో స్పీకర్ ఆశలూ గల్లంతు

టీడీపీ సీనియర్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరిని ప్రొటెం స్పీకర్‌గా ఎంపిక చేశారు. ఈ మేరకు ఏపీ శాసనసభ వ్యవహారాల మంత్రి పయ్యావుల కేశవ్ ఫోన్ చేసి ప్రొటెం స్పీకర్‌గా వ్యవహరించాలని కోరారు. అందుకు బుచ్చయ్య అంగీకరించారు. గురువారం ఆయనతో గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రమాణ స్వీకారం చేయించనున్నారు. ఈ నెల 21వ తేదీన అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్న దృష్ట్యా ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో గెలిచిన ఎమ్మెల్యేలతో బుచ్చయ్య ప్రమాణ స్వీకారం చేయించనున్నారు. అనంతరం స్పీకర్, డిప్యూటీ స్పీకర్‌ను ఎన్నుకుంటారు. స్పీకర్ పదవికి ఎమ్మెల్యే అయ్యన్నపాత్రుడు పేరు దాదాపు ఖరారైనట్లు తెలిసింది. అదే జరిగితే తనను వరిస్తుందనే ఆశతో ఉన్న స్పీకర్ పదవి సైతం దక్కే పరిస్థితి కనిపించడం లేదు. ఈ పరిణామంతో బుచ్చయ్య వర్గీయుల్లో ఆగ్రహావేశాలు వెల్లువెత్తుతున్నాయి. ప్రతిసారీ సీనియర్ నేతకు అన్యాయం చేస్తున్నారని మండిపడుతున్నారు. పార్టీ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా పనిచేస్తున్నా పట్టించుకోకపోవడంపై చంద్రబాబుపై బుచ్చయ్య వర్గం గుర్రుగా ఉంది.

ఆది నుంచీ అంతే?

దివంగత ఎన్టీఆర్ ఉన్నంత వరకు గోరంట్లకు పార్టీలో సముచిత స్థానం కల్పించారు. ఆయన మరణానంతరం చంద్రబాబు ఆయనకు ప్రాధాన్యం తగ్గిస్తూ వస్తున్నారు. గతంలో మంత్రి పదవి రాని సమయంలో పార్టీలో పదవులు అమ్ముకుంటున్నారని బుచ్చయ్య తీవ్రంగా ఆరోపించారు. స్వపక్షంపై చేసిన వ్యాఖ్యలను గమనించిన బాబు అప్పటి నుంచి బుచ్చయ్యను పక్కనబెట్టేశారు.

రూరల్ ఎమ్మెల్యే సీటుపైనా హైడ్రామా!

రాజమహేంద్రవరం రూరల్ సిట్టింగ్ ఎమ్మెల్యేగా వ్యవహరిస్తున్న గోరంట్లకు ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో సీటు కేటాయించడంపై హైడ్రామా నడిచింది. స్వప్రయోజనాల కోసం పొత్తు పెట్టుకున్న చంద్రబాబు రూరల్ సీటును జనసేనకు కట్టబెట్టడంతో తిరిగి ఆ స్థానాన్ని దక్కించుకునేందుకు బుచ్చయ్య పడిన పాట్లు వర్ణనాతీతం. సీటు సాధించుకునేందుకు పెద్ద యుద్ధమే చేయాల్సి వచ్చింది. చంద్రబాబుపై తీవ్ర స్థాయిలో ఒత్తిడి పెంచారు. చేసేది లేక దుర్గేష్‌ను నిడదవోలుకు పంపించి.. రాజమహేంద్రవరం రూరల్ స్థానం బుచ్చయ్యకు కేటాయించక తప్పని పరిస్థితి అధిష్టానానికి తలెత్తింది.

లోకేష్ ఎంట్రీతో మరింతగా...

యువగళం పాదయాత్ర, స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో చంద్రబాబు రాజమహేంద్రవరం జైలుకు వెళ్లడంతో తనయుడు లోకేష్ టీడీపీ రాజకీయ వ్యవహారాల్లో క్రియాశీలకంగా మారారు. అప్పటి నుంచి రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవానీ భర్త ఆదిరెడ్డి వాసును దగ్గరకు తీయడంతో బుచ్చయ్య ప్రభావాన్ని తగ్గిస్తూ వచ్చారన్న విమర్శలు వెల్లువెత్తాయి. బాబు జైల్లో ఉన్న 52 రోజుల పాటు పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నా పట్టించుకున్న దాఖలాలు లేవు. ఒక్కసారి కూడా బాబుతో ములాఖత్ ఏర్పాటు చేయలేదంటే పార్టీలో బుచ్చయ్య పరిస్థితి ఎలా ఉందో అర్థం అవుతుంది.

> వ్యక్తిత్వం అనేది అభౌతికం. ఆత్మే నిజమైన మీరు.
> మీ శరీరం మీరు కాదు. అది మీకు చెందుతుంది,
> కానీ అదే మీరు కాదు.
> – బ్రహ్మకుమారీలు

సాక్షి
గురువారం, 20 జూన్ 2024

చిత్తశుద్ధి కావాలి!

ఆరెస్సెస్ అధినేత మోహన్ భాగవత్ ఇటీవల బహిరంగంగా ఇచ్చిన సలహా వల్ల అయితేనేం, స్వీయజ్ఞానంతో అయితేనేం... మొత్తానికి మణిపూర్ భద్రతా వ్యవహారాలపై కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షా చాలాకాలం తర్వాత ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం జరిపారు. ఈశాన్య రాష్ట్రంలో ఇటీవల మళ్ళీ హింసాత్మక సంఘటనలు చెలరేగడంతో షా సారథ్యంలో సోమవారం జరిగిన ఈ భేటీ సహజంగానే ఆసక్తి రేపింది. భేటీ ముగిసిన అనంతరం కేంద్రం ఎప్పటిలానే తాము మణిపూర్ ప్రజల రక్షణ, భద్రతలకు కట్టుబడి ఉన్నామని ప్రకటించింది. రాష్ట్రంలోని మెయితీ, కుకీ వర్గాలు రెంటితోనూ చర్చలు జరిపి, జాతుల మధ్య వైమనస్యాలు తొలగించేందుకు సత్వరమే కృషి చేస్తామంటూ హోమ్‌మంత్రి పాతపాటే పాడారు. విపరీతంగా జాప్యమైనా, మోదీ సారథ్యంలోని ఎన్డీఏ ప్రభుత్వం మళ్ళీ అధికారంలోకి వచ్చాక ఈ సమస్య గురించి మళ్ళీ కనీసం ఆలోచన చేసినందుకు సంతోషించాలి. కానీ గంటకు పైగా సాగిన భేటీలో మణిపూర్ సీఎం బీరేన్‌సింగ్ కనిపించకపోవడమే విచిత్రం.

రాష్ట్రంలో అశాంతిని కట్టడి చేయడంలో తమ ప్రభుత్వం విఫలమైందని లోక్‌సభ ఎన్నికల తర్వాత సాక్షాత్తూ బీరేన్‌సింగే ఒప్పుకున్నారు. ఆలస్యంగానైనా వైఫల్యాన్ని అంగీకరించారు. తప్పొప్పుల బాధ్యత తలకెత్తుకున్నారు. మణిపూర్‌లో మెజారిటీ వర్గమైన మెయితీలకు షెడ్యూల్డ్ తెగల హోదా ఇవ్వాలన్న డిమాండ్ ఈ సుదీర్ఘ ఘర్షణలకు దారి తీసింది. ఆ డిమాండ్‌కు నిరసనగా రాష్ట్రంలోని పర్వతప్రాంత జిల్లాల్లో గిరిజన సంఘీభావ యాత్ర చేపట్టేసరికి గడచిన 2023 మే 3న జాతుల మధ్య ఘర్షణలు మొదలయ్యాయి. ఇప్పటికీ చల్లారని ఈ చిచ్చుకు ఏడాది దాటిపోయింది. ఈ పదమూడు నెలల్లో 220 మందికి పైగా మరణించగా, 60 వేల మందికి పైగా నిరాశ్రయులయ్యారు. వేలాది చిన్నారులు చదువుకు దూరమయ్యారు. మయన్మార్ నుంచి 'అక్రమంగా' వలసవచ్చిన బయటివారే ఘర్షణలకు బాధ్యులని కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు మొండిగా వాదిస్తూ వచ్చాయి. మణిపూర్‌లోని పర్వతప్రాంతాల్లో నివసించే కుకీ–జోలు, ఈ మయన్మార్ వలసదారులు ఒకే తెగ వారు గనక రాష్ట్రంలో ఘర్షణలకూ, మాదకద్రవ్యాల అక్రమ వ్యాపారానికీ వారే కారణమనేది సర్కారు వారి మాట. సమస్య మూలాల్లోకి వెళ్ళకుండా పక్షపాత ధోరణితో రాజకీయంగా వ్యవహరిస్తే, ఇలాగే ఉంటుంది.

అసలు 1990లలో ఈశాన్య రాష్ట్రాల్లోకెల్లా అత్యధిక తలసరి ఆదాయం ఘనత మణిపూర్‌దే. అలాంటి రాష్ట్రం ఇప్పుడు దేశంలోనే అత్యల్ప తలసరి ఆదాయమున్న మూడో రాష్ట్రంగా మారింది. విద్య, వైద్యం మొదలు ఉపాధి, ప్రాథమిక వసతి కల్పన దాకా అన్నింటా వెనకబడింది. ఈ పరిస్థితులు రాష్ట్రంలోని వివిధ జాతుల మధ్య ఉద్రిక్తతలు పెంచాయి. అయినవారికి ఆకుల్లో కానివారికి కంచాల్లో అన్న ధోరణి వనరుల కేటాయింపు, పరిపాలనల్లో సాగుతోందంటూ ఆరోపణలు వచ్చాయి. క్రమంగా అది వర్గాల మధ్య విభేదాలు పెంచి, ఘర్షణల దాకా తీసుకొచ్చింది. అయితే ఇటీవలి దాకా అశాంతి, అస్థిరతలకు దూరంగా, విభిన్న వర్గాల సమ్మిశ్రిత ఆవాసమైన జిరీబామ్ లాంటి జిల్లాలకూ తాజాగా ఘర్షణలు పాకిపోవడం మరింత ఆందోళన రేపుతోంది. అసోమ్‌ను ఆనుకొని ఉండే జిరీబామ్ జిల్లాలో సాక్షాత్తూ ముఖ్యమంత్రి అడ్వాన్స్ సెక్యూరిటీ కాన్వాయ్‌పైనే ఈ జూన్ 10న దాడులు జరగడం రాష్ట్రంలోని అరాచక పరిస్థితులకు అద్దం పడుతోంది. ఇటీవలి ఘర్షణలతో ఆ జిల్లా నుంచి వేలాది జనం అసోమ్‌కు పారిపోయారు. రాష్ట్రంలో ఇప్పటికి ఏడాదిగా కొన్ని వేలమంది తమ ఇళ్ళకు దూరంగా నిర్వాసితుల శిబిరాల్లోనో, బంధుమిత్రుల ఇళ్ళల్లోనో తలదాచుకొని, కాలం గడుపుతున్నారు. జీవనోపాధి మాత్రమే కాదు... చివరకు సాధారణ జీవితమే ప్రజలకు దూరమైంది.

రాష్ట్రం రావణకాష్ఠంగా మారినా ప్రభుత్వాలు గాలికి వదిలేశాయి. మాటలకే తప్ప చిత్తశుద్ధితో చేతలకు దిగలేదు. గత ఏడాది కాలంలో ప్రధాని మోదీ అనేక పర్యాయాలు ఈశాన్య రాష్ట్రాలను సందర్శించారు కానీ ఒక్కసారైనా మణిపూర్‌కు పోలేదు. మాటల్లోనైనా దాని ఊసెత్తలేదు. చివరకు ఆ మధ్య ఓ ఎన్నికల ప్రసంగంలో మణిపూర్ మాటెత్తినా, అక్కడ రాష్ట్ర ప్రభుత్వ ప్రయత్నాలు, కేంద్రం జోక్యంతో పరిస్థితి మెరుగు పడిందన్నారు. వాస్తవానికి పరిస్థితి మరింత దిగజారిందనేది జగమెరిగిన సత్యం. మణిపూర్‌పై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వ్యవహారశైలిని నిరసిస్తూ, మొన్నటి ఎన్నికల్లో రాష్ట్రంలోని రెండు స్థానాల్లోనూ కాంగ్రెస్‌కు పట్టం కట్టారు. ఇక, సీఎం సైతం మెయితీల వర్గానికి కొమ్ము కాస్తూ, తప్పంతా గిరిజన కుకీలదే అన్నట్టు వ్యవహరిస్తున్న తీరు ఆది నుంచీ తీవ్ర విమర్శల పాలైంది. గతంలో గుజరాత్, హర్యానాల్లో చిన్న కారణాలకే సీఎంలను మార్చేసిన బీజేపీ అధిష్ఠానం ఇంత జరుగుతున్నా మణిపూర్‌లో మాత్రం బీరేన్‌ను ఏడాదిగా అలాగే కొనసాగించడం పెను వింత.

కనీసం అంతకు ముందు దశాబ్దకాలంగా ప్రశాంతంగా ఉన్న మణిపూర్‌లో ఇవాళ ఇలా తయారైందంటే తప్పెవరిది? సాయుధ మూకలు తుపాకులు ధరించి, చివరకు సైనిక వాహనాలను సైతం అడ్డగిస్తున్న పరిస్థితి ఉందంటే, ఏమనాలి? సోషల్ మీడియాలో దేశమంతటా తిరుగుతున్న ఈ దృశ్యాలు పాలకులకే సిగ్గు చేటు. ఏ ఒక్క వర్గాన్నో కాదు... మొత్తం రాష్ట్రాన్నే మంటల్లో పడేసిన ప్రస్తుత పరిస్థితి మారాలంటే ప్రభుత్వాలు త్రికరణశుద్ధిగా కార్యాచరణకు దిగాలి. జాతి, మతం, రాజకీయాలతో ఎవరు చట్టాన్ని ఉల్లంఘించినా కఠిన చర్యలు చేపట్టాలి. మాటలు, సమీక్షల కన్నా సత్వర చర్యలు ముఖ్యం. రాజకీయ జోక్యం మాని, ఉన్మాద చర్యల్ని ఉక్కుపాదంతో అణచివేసేలా భద్రతా దళాలకు పూర్తి స్వేచ్ఛనివ్వాలి. అన్ని వర్గాల మధ్య సామరస్యం నెలకొనే నిరంతర రాజకీయ కృషి సాగాలి. నిష్పాక్షికంగా, నిర్ణయాత్మకంగా వ్యవహరిస్తేనే మణిపూర్ మళ్ళీ మామూలవుతుంది. లేదంటే, మణిపూరే కాదు... మానవ చరిత్ర కూడా మనల్ని క్షమించదు.

వలసలపై పాశ్చాత్యుల నటనలు

విశ్లేషణ



టంకశాల అశోక్

లాటిన్ అమెరికా, ఆసియా, ముఖ్యంగా ఆఫ్రికా దేశాల నుంచి యూరప్‌కు సాగుతున్న వలసలు అక్కడ ఒత్తిడి పెంచుతున్నాయి. ఫ్రాన్స్‌లోలా అల్లర్లు చెలరేగడం, పలురకాల నేరాలు జరగడం లాంటివి. వీటికి విరుగుడుగా యూరోపియన్ దేశాలు ఆఫ్రికాలో పెట్టుబడులు పెంచితే, అక్కడే అభివృద్ధి జరిగి, వారు యూరప్‌కు వలస రాకుండా ఉంటారని జీ–7 సమావేశాల్లో ఇటలీ ప్రధాని మెలోని చేసిన ప్రతిపాదన వినడానికి అద్భుతంగా ఉంటుంది. వాస్తవానికి యూరోపియన్లు, అమెరికన్లు వందల ఏళ్లుగా అనుసరించిన విధానాల పర్యవసానమే ఈ వలసలు. ఇప్పుడు ప్రత్యక్ష వలస పాలన నుంచి ఉపసంహరించుకున్నా, పరోక్షంగా నియంత్రిస్తూనే ఉన్నారు. వలసలు ఆగాలన్న చిత్తశుద్ధి వారికి ఉంటే చేయవలసింది పరోక్ష దోపిడీని మానివేయటం.

ప్రపంచంలోని పేద దేశాలన్నింటిని ఆరు వందల సంవత్సరాల నుంచి తమ వలసలుగా, నయా వలసలుగా మార్చుకుని అదుపులేని దోపిడీ సాగిస్తూ వస్తున్న పాశ్చాత్య దేశాలు, వారి బాగోగుల కోసం అంటూ మరొకమారు నటనలు చేస్తున్నాయి. ఇటలీలో గత వారాంతంలో జరిగిన జీ–7 సమావేశాలలో ఆ దేశపు ప్రధాని జార్జియో మెలోనీ చేసిన ప్రతిపాదనలను గమనిస్తే, ఈ విషయం స్పష్టమవుతుంది.

మెలోనీ చేసిన ప్రతిపాదనలు తమకు తక్షణ సమస్యగా మారిన ఆఫ్రికన్ వలసల గురించి. ఆఫ్రికా ఖండంలోని ఉత్తర భాగాన గల అరబ్ దేశాల నుంచి, దక్షిణాన సహారా ఎడారికి దిగువన గల అనేక ఇతర దేశాల నుంచి ఇటలీతో పాటు యూరప్ అంతటికీ వలసలు పెద్ద ఎత్తున సాగుతుంటాయి. వాటిలో చట్ట ప్రకారం జరిగేవాటి కన్నా, అక్రమంగా జరిగేవి అనేక రెట్లు ఎక్కువ. వారంతా ఆఫ్రికా, యూరప్‌ల మధ్య గల మధ్యధరా సముద్రం మీదుగా చిన్న చిన్న పడవలలో రహస్యంగా ప్రయాణిస్తారు. యూరోపియన్ దేశాల గస్తీ బోట్లు పట్టుకునేది కొందరినైతే, అనేక మంది పట్టుబడకుండా యూరప్ తీరానికి చేరతారు. అక్కడి నుంచి తమ మిత్రుల ద్వారానో, లేక స్థానిక అధికారులకు, ఏజెంట్లకు డబ్బు ఇచ్చుకునో వివిధ దేశాలకు వెళ్ళిపోతారు. యథాతథంగా ఇదే తమకు సమస్య అని యూరోపియన్ ప్రభుత్వాలు భావిస్తుండగా, మధ్యధరా సముద్రంపై ప్రయాణ సమయంలో పరిస్థితులు అనుకూలించక పడవలు మునిగి ప్రతి యేటా కొన్ని వందల మంది దుర్మరణం పాలవుతుంటారు.

ఈ నేపథ్యంలో, జీ–7 సమావేశాలు ముగిసిన రెండురోజులకే 'బీబీసీ' ప్రసారం చేసిన ఒక కథనం సంచలనంగా మారింది. మధ్యధరా సముద్రాన్ని ఆనుకుని ఉన్న యూరోపియన్ దేశాలలో ఇటలీ, గ్రీస్ ముఖ్యమైనవి. వాటి మీదుగానే వలసదారులు ఇతర చోట్లకు వెళుతుంటారు. అటువంటి స్థితిలో గ్రీస్ తీరప్రాంత గస్తీ అధికారులు వలసదారులను తరచు తిరిగి సముద్రంలోకి బలవంతాన తీసుకుపోయి మునిగిపోయేటట్లు చేస్తున్నారట. గత మూడేళ్ళలో జరిగిన ఇటువంటి ఘటనలలో కొన్నింటిని 'బీబీసీ' బయటపెట్టింది.

వలసల నివారణకు ఇటలీ ప్రధాని మెలోనీ చేసిన సూచనల ప్రకారం, యూరోపియన్ దేశాలు ఆఫ్రికాలో పెట్టుబడులు పెంచాలి. ఆ విధంగా అక్కడ అభివృద్ధి జరిగితే అక్కడి ప్రజలకు ఉపాధి లభించి వారు యూరప్‌కు వలస రాకుండా ఉంటారు. ఈ విధమైన ప్రతిపాదనలు చరిత్ర తెలియని వారికీ, అమాయకులకూ అద్భుతంగా తోస్తాయి. అటువంటి పెట్టుబడులంటూ నిజంగా జరిగితే, అవి సహజంగా ప్రైవేటువి అవుతాయి. వాటి యాజమాన్యాలు తమ 'జాబ్‌లెస్ గ్రోత్ టెక్నాలజీ' వల్ల కొద్దిపాటి ఉపాధులు కల్పించి, వాటికి నికరమైన దీర్ఘకాలిక హామీ ఏదీ లేకుండా చేసి, తమ దృష్టినంతా అక్కడి వనరులను, మార్కెట్లను కొల్లగొట్టటంపై కేంద్రీకరిస్తాయి. ఈ తరహా



విధానాల వల్ల వలసల సమస్య, ఆఫ్రికా పేదరికం సమస్య ఎంత మాత్రం పరిష్కారం కావు. యూరోపియన్లు మాత్రం తమ కొత్త పెట్టుబడులకు రాయితీలు సంపాదించి మరింత లాభపడతారు.

వాస్తవానికి యూరోపియన్లు, అమెరికన్లు వందల సంవత్సరాలుగా ఈ తరహా ఆర్థిక నమూనాలను అనుసరించిన దాని పర్యవసానమే ఈవిధంగా సాగుతున్న వలసలు. ఈ విషయం ఇటలీ ప్రధాని మెలోనీకి తెలియదని భావించలేము. అసలు మొత్తం పాశ్చాత్య దేశాల చరిత్రే ప్రపంచాన్ని తమ వలసలుగా మార్చుకోవటం; అక్కడి నుంచి లక్షలాది మందిని బానిసలుగా తెచ్చి తమ వాణిజ్య పంటల ఎస్టేట్లలో, ఇతరత్రా భయంకరమైన రీతిలో చాకిరీ చేయించుకోవటం; ఆఫ్రికా, లాటిన్ అమెరికా, ఆసియా సహజ వనరులను యథేచ్ఛగా దోపిడీ చేయటం; తమ ఉత్పత్తులను అక్కడి మార్కెట్లలో బలవంతంగా అమ్మి స్థానిక ఉత్పత్తులను ధ్వంసం చేయటం; స్థానిక పాలకులను రకరకాలుగా లొంగదీసుకుని తుదముట్టించటాలతో నిండిపోయి ఉంది. ఇది అక్కడి నిష్పాక్షికులైన చరిత్రకారులు, మేధావులు నేటికీ ధృవీకరిస్తున్న విషయం. అంతెందుకు, ప్రముఖ వలస రాజ్యాలలో ఒకటైన ఫ్రాన్స్ మాజీ అధ్యక్షుడు జాక్వెస్ షిరాక్ కొద్దికాలం క్రితం యూరోపియన్ దేశాల ప్రస్తుత సిరి సంపదలకు తమ వలస దోపిడీలు ఒక ప్రధాన కారణమని అంగీకరించారు.

యూరోపియన్ వలసల దశ 1940ల నుంచి 1970ల మధ్య దాదాపు ముగిసిపోయింది. వారి దోపిడీలు కూడా అంతటితో ఆగితే ఈరోజున అక్కడి ప్రజలు యూరప్‌కు గానీ, అమెరికాకు గానీ వలస వెళ్ళవలసిన అగత్యమే ఉండేది కాదు. అక్కడ గల అపారమైన సహజ వనరులు, మానవ నైపుణ్యాలతో వారు స్వయంగా అభివృద్ధి చెంది ఉండేవారు. కానీ పాశ్చాత్యులు ప్రత్యక్ష రాజకీయ వలస పాలన నుంచి ఉపసంహరించుకున్నా, స్థానిక నాయకులను, సైనికాధికారులను, సివిలియన్ అధికారులను, ఆర్థిక రంగానికి చెందిన ప్రముఖులను పరోక్షంగా నియంత్రిస్తూనే వచ్చారు. తమ పెట్టుబడులు, టెక్నాలజీలు, మార్కెటింగ్ వ్యవస్థల ద్వారా మొత్తం ఆర్థిక వ్యవస్థలు వారి ఆధీనంలోనే ఉంటూ వస్తున్నాయి. ఆసియా కొంత మెరుగుపడినా, ఆఫ్రికా, లాటిన్ అమెరికాలలో మార్పులు స్వల్పమే. ఇది మంచి చదువులు, ఉద్యోగాల కోసం వెళుతున్న వారి గురించి అంటున్న మాట కాదు. దిగువ స్థాయి వారికి సంబంధించిన విషయం.

ఈ విధంగా వలస వెళుతున్న వారి కారణంగా పాశ్చాత్య దేశాలలో సమస్యలు తలెత్తుతున్న మాట నిజమే. అట్లా వెళ్ళేవారికి ఉపాధి అవకాశాలు ఎక్కువ ఉండవు. వారు మురికి వాడలలో నివసిస్తుంటారు. వారి వల్ల తక్కిన సమాజంపై రకరకాల ఒత్తిడిలు ఏర్పడుతుంటాయి. ఫ్రాన్స్‌లో వలె ఒక్కోసారి తీవ్రమైన అల్లర్లు, హింస చెలరేగుతాయి. పలురకాల నేరాలు జరుగుతాయి. వారికోసం ఏ ప్రభుత్వమైనా కొన్ని సహాయ చర్యలు తీసుకున్నా అవి ఎంతమాత్రం సరిపోవు. మరొకవైపు వలసలు కొనసాగుతూనే ఉంటాయి. ఇటలీ ప్రధాని మెలోనీ మాటలను 'చీమా, చీమా ఎందుకు కుట్టావు?' అన్న నీతికథలో వలె శోధిస్తూపోతే, పైన చెప్పుకున్న వందల ఏళ్ళ పాశ్చాత్య వలస దోపిడీ చరిత్ర ముందుకు వస్తుంది. విచిత్రం ఏమంటే, ఇన్నిన్ని జరుగుతున్నా వారు తమ గత స్వభావాలను, విధానాలను మార్చుకోవటం లేదు. వారికి ఇప్పటికీ చిన్న చిన్న వలస భూభాగాలు, వందలాది సైనిక స్థావరాలు ఉన్నాయి. ఉదాహరణకు ఇటీవలి కాలానికే వస్తే, ఆఫ్రికాలోని మాజీ ఫ్రెంచి వలసలు సుమారు ఆరింటిలో, అక్కడి ఫ్రెంచ్ అనుకూల పాలకులపై తిరుగుబాట్లు జరిగాయి. కొత్తగా అధికారానికి వచ్చిన వారు అక్కడి ఫ్రెంచ్ సైనిక స్థావరాలను ఖాళీ చేయించి వెళ్ళగొట్టారు. దీనిపై ఫ్రెంచ్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ నానా రభస సృష్టించి కొత్త పాలకులపై ఒత్తిడి తెచ్చారు. కానీ వారు ససేమిరా లొంగలేదు.

ఇటలీ అధ్యక్షురాలు మెలోనీ నుంచి, అమెరికా అధ్యక్షుడు బైడెన్, మాజీ అధ్యక్షుడు ట్రంప్‌ల వరకు పాశ్చాత్య నాయకులకు ఇటువంటి వలసలను ఆపాలనే చిత్తశుద్ధి నిజంగా ఉందా? వలసలు యూరప్ అంతటా పెద్ద సమస్య అయినట్లు గత వారమే జరిగిన యూరోపియన్ యూనియన్ ఎన్నికలలో మితవాదుల ఓటు గణనీయంగా పెరగటం రుజువు చేసింది కూడా. వలసలు, జాతివాదమే అక్కడ ముఖ్యమైన అజెండాగా మారుతున్నాయి. అందువల్ల ఆ నాయకులకు చిత్తశుద్ధి ఉంటే చేయవలసింది ఆఫ్రికా, లాటిన్ అమెరికా, కరీబియన్, ఆసియా దేశాల దోపిడీని త్వరగా మానివేయటం. అక్కడి వనరులను, మార్కెట్లను అక్కడి ప్రజల నియంత్రణకు, ఉపయోగానికి వదిలివేయటం. వారితో అన్ని సంబంధాలను సమతులనంగా, పారదర్శకంగా, ప్రజాస్వామికంగా మార్చుకోవటం.

వ్యాసకర్త సీనియర్ సంపాదకుడు

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

బాగున్నారు!



నోమ్ చోమ్‌స్కీ (భాషా శాస్త్రవేత్త) మరణించినట్టు వచ్చిన వార్తలు మరీ ఎక్కువచేసి రాసినవి. 'జాకోబిన్', 'న్యూ స్టేట్స్‌మన్' పత్రికలు అనంతరం ఈ వార్తను తొలగించాయనుకోండి! ఆయన భార్య వలేరియా నాకు నిర్ధారించారు. ఆయన బతివున్నారు, బాగున్నారు.

– స్టీవెన్ పింకర్, శాస్త్రవేత్త

ఒక్క జిరాక్సు కోసం...



మీరు ఎవరికైనా ఓటు వేయండి గానీ, ఇక్కడ బతికి ఉంటున్నందుకే పశ్చాత్తాప పడేట్టు చేయడంలో ఇండియన్ బ్యూరోక్రసీ సమర్థతే వేరు. ఢిల్లీలోని పాస్‌పోర్టు సేవా కేంద్రంలో నా అనుభవమే తీసుకోండి. మిగతా విషయాలు అటుండనీ, హెచ్‌డీ నాణ్యతగల పాస్‌పోర్టు జిరాక్సు కోసం 50 డిగ్రీల ఎండలో నన్ను నడిపించారు.

– మేఘా మెహతా, న్యాయవాది

వీళ్లో రకం!



ఉన్న విశ్వ విద్యాలయాలను పాడు చేయాలి. లేని వాటి శిథిలాలకు ఉత్సవం చేయాలి. (బిహార్‌లోని రాజ్‌గిర్‌లో నలంద విశ్వ విద్యాలయ నూతన క్యాంపస్‌ను ప్రధాని మోదీ ప్రారంభించిన నేపథ్యంలో.)

– సాధికా తివారీ, జర్నలిస్ట్

వాస్తవాలు దాయొద్దు!



నలంద కేవలం ఒక విద్యాసంస్థ మాత్రమే కాదు; దాని వారసత్వాన్ని తుడిచి పెట్టలేని అమూల్యమైన చారిత్రక సంపద. నిజంగా చరిత్రలోని గాయాలను పట్టించుకోవాలనుకుంటే, దురాక్రమణదారులను గొప్ప చేయడం కాకుండా, వారి చర్యలను ఖండించాలి.

– సాజిద్ యూసుఫ్ షా, కశ్మీర్ బీజేపీ నాయకుడు

అందుకే కన్ను



ప్రపంచంలో తాగునీటి వనరులు అత్యంత తక్కువున్న దేశం చైనా (రష్యాలో అత్యధికం). మూడింట రెండొంతుల బ్రహ్మపుత్ర నది చైనాలో ఉంది, మిగిలింది అరుణాచల్‌లో ఉంది. ఒక హైడ్రాలజికల్ అధ్యయనం ప్రకారం, బ్రహ్మపుత్ర నీటి సంగ్రహం 20 శాతమే చైనాలో జరుగుతుండగా, 80 శాతం అరుణాచల్‌లో జరుగుతుంది. అందుకే డ్రాగన్ కళ్లు అరుణాచల్ మీదున్నాయి.

– రాకేశ్ కృష్ణన్ సింహా, జర్నలిస్ట్

ఇన్ బాక్స్

విచారణ జరిపించాలి

డాక్టర్ కావాలని ఎంతో కష్టపడి చదివి 'నీట్' పరీక్షకు హాజరైన లక్షలాది విద్యార్థుల ఆశలపై ఆ పరీక్షల ఫలితాలు నీళ్లు చల్లాయి. ఎన్నడూ లేనివిధంగా 67 మందికి 720 మార్కులకు 720 రావడం, అలా వచ్చినవారిలో పలువురు ఒకే పరీక్షా కేంద్రంలో పరీక్ష రాయడం విద్యార్థులనే కాక, వారి తల్లి తండ్రులనూ నిరుత్తరులను చేసింది. దీనికి తోడు నియమ నిబంధనలకు వ్యతిరేకంగా వందలాదిమందికి పరీక్షానిర్వహణ సంస్థ ఎన్టీఏ గ్రేస్ మార్కులను ఇవ్వడం కూడా విమర్శలకు దారితీసింది. ప్రజల ఆందోళనల నేపథ్యంలో చివరికి గ్రేస్ మార్కులను ఎన్టీఏ ఉపసంహరించుకుంది. కాని, పరీక్షల నిర్వహణలో మాత్రం ఎటువంటి అవకతవకలూ జరగలేదని అనడమే విడ్డూరంగా ఉంది.

ప్రతిసారీ విద్యార్థులతో 'పరీక్షా పే' చర్చా కార్యక్రమాన్ని నిర్వహించే ప్రధాని... కీలకమైన నీట్ పరీక్షపై ఆరోపణలు, అనుమానాలు, ఆందోళనలు వ్యక్తమవుతున్నప్పటికీ మాట్లాడకపోవడం విద్యార్థుల పట్ల ఆయనకున్న చిత్తశుద్ధి అర్థమవుతుంది. నీట్ పరీక్ష మాత్రమే కాక దేశంలోని ఎన్నో పోటీ పరీక్షలను ఎన్టీఏ నిర్వహిస్తోంది. తాజాగా బయటపడ్డ వివాదస్పద అంశాల కారణంగా దానిపై విద్యార్థులు నమ్మకం కోల్పోయే పరిస్థితి వచ్చింది. ప్రతిసారీ ఉత్తరాది రాష్ట్రాల విద్యార్థులకు ఎక్కువగా ర్యాంక్‌లు రావడం, దక్షిణాది రాష్ట్రాల విద్యార్థులకు తక్కువ ర్యాంకులు రావడంపై దక్షిణాది రాష్ట్రాల ప్రజలకు అనేక అనుమానాలు కల్గుతున్నాయి.

ఈ మొత్తం వ్యవహారంపై కేంద్రం సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరిపించి అవకతవకలు ఉన్నవని తేలితే బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. అక్రమంగా లబ్ధిపొందిన వారిపైనా చర్యలు తీసుకోవాలి. నీట్‌లో జరిగిన అక్రమాల కారణంగా కష్టపడి చదివిన విద్యార్థులకు ఎలాంటి నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలి.

– గద్దం శ్యామ్, పీడీఎస్‌యూ తెలంగాణ ఉపాధ్యక్షుడు

రాజకీయ చాతుర్యంలో ఆయనకు సాటి లేరు

సందర్భం



జిల్లా గోవర్ధన్

దేశ గమనాన్ని మలుపుతిప్పినవారు మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావు. నాటకీయ పరిణామాల మధ్య ప్రధాని పీఠాన్ని అధిష్ఠించి మైనారిటీ ప్రభుత్వాన్ని ఐదేళ్లు నడపడం ఆయన పాలనాదక్షతకు ప్రతీక. అసలు ఆయన ప్రధాని కాకపోతే నేటి సరళీకరణ ఫలాలు మనకు కనిపించేవి కావేమో?

దశ (అదృష్టం), దిశ (గమ్యం) రెండూ కొందరి జీవితాల్లో అనూహ్యంగా ట్విస్ట్ అవుతుంటాయి. దేశ రాజధానిలో మూడు దశాబ్దాల రాజకీయ జీవితానికి స్వస్తి చెప్పి, వానప్రస్థం స్వీకరించాలనుకున్న సీనియర్ కాంగ్రెస్ నేత పాములపర్తి వెంకట నరసింహారావు విషయంలో ఇదే జరిగింది. 1991 లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయకుండా ఢిల్లీ నుండి పెట్టే బేడాసర్దుకుని ఇంటిదారి పట్టేపనిలో ఉన్నారు. శ్రీ సిద్ధేశ్వరి మఠం (తమిళనాడు)లో శేష జీవితం గడపటానికి వెళ్ళబోతున్నానని తన సన్నిహితులకు చెప్పారు. ఈ తరుణంలోనే 1991 మే 21 రాత్రి కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు, మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ మృత్యువాత పడటంతో, దేశ రాజకీయ పరిస్థితి ఒక్కఉదుటున తారు మారయింది. ఇంకో విడత ఎన్నికలు జరగాల్సి ఉంది; పార్టీ అధ్యక్షుని హఠాన్మరణంతో అగాథంలో పడిన కాంగ్రెస్ నాయకులు మరుసటి రోజు మధ్యాహ్నం వర్కింగ్ కమిటీ మీటింగు ఏర్పాటు చేసి, అధ్యక్షుని స్థానంలో సీనియర్ నేత పీవీ నర్సింహారావును నియమించారు. కేవలం అరగంటపాటు జరిగిన ఆ సమావేశంలో వర్కింగ్ కమిటీ సభ్యులు, పార్టీ అధ్యక్షుని మరణ రీత్యా సంతాప తీర్మానం చేసి, తర్వాత తాత్కాలిక పార్టీ అధ్యక్షునిగా పీవీని నియమించారు. భర్తను కోల్పోయిన విషాదంలో, సోనియా గాంధీ పార్టీ కార్య కలాపాలకు దూరంగా ఉండాలనుకుంది. జూన్‌లో వెలువడిన 10వ లోక్‌సభ ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ పార్టీ 232 సీట్లు సంపాదించి, అతి పెద్ద పార్టీగా ప్రభుత్వ ఏర్పాటుకు సిద్ధమైంది. గాంధీ కుటుంబీకులు రేసులో లేకపోవటంతో... అర్జున్ సింగ్, మాధవ్ రావ్ సింధియా, రాజేష్ పైలట్, శరద్ పవార్ లాంటి సీనియర్ నాయకులు, కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత పదవికి బరిలోకి దిగినప్పటికీ ఎన్నికైన అత్యధిక ఎంపీలు, గాంధీ కుటుంబానికి విధేయత, అనుభవం ఉన్న పీవీ వైపే మొగ్గు చూపారు. 'పార్లమెంటు పార్టీ నేత ప్రధాని పీఠానికి అర్హుడు కాబట్టి, ఈ పదవికి పార్టీ ఎంపీలు తమలోని నాయకుణ్ణి డెమాక్రటిక్ పద్ధతిలోనే ఎన్నుకోవాలని' పాచిక విసిరారు శరద్ చంద్ర పవార్. రాజకీయ చదరంగం ఆటలో అప్పటికే ఆయన పేరొందిన ఆటగాడు, మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఆయన అనునాయిడూ, పూణె ఎంపీ అయిన సురేష్ కల్మాడి (ఇండియన్ ఎయిర్ ఫోర్స్ మాజీ స్క్వాడ్రన్ లీడర్) మహారాష్ట్ర సదన్ నుండి, ఉత్తరాది



రేపు పీవీ ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేసిన రోజు

కాంగ్రెస్ ఎంపీలను పవార్ లాబీ కోసం సమీకరణ చేస్తూ షాం-ఏ-దావతులు ఏర్పాటు చేశారు. ఇటు కేరళ హౌస్ నుండి, ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి కె. కరుణాకరన్, పీవీ కోసం దక్షిణాది కాంగ్రెస్ ఎంపీలను ఏకతాటిపై తేవటానికి ప్రయత్నాలు జరిపారు.

అక్బర్ రోడ్డులోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం జూన్ 19 నాడు కాంగ్రెస్ నేతలతో కిక్కిరిసింది. 232 మంది నూతన ఎంపీలను పార్లమెంటరీ పార్టీ నాయకుణ్ణి ఎన్నుకోమని ఒకవేళ ఓటింగ్ నిర్వహిస్తే పవార్ 35 ఓట్లతో వెనుకంజలో ఉంటాడని తెలిసిపోయింది. వీరిని తన వైపు మరల్చుకోవటానికి ఆయనకు ఇట్టే సమయం పట్టదని గ్రహించిన పీవీ, పోటీకి దిగిన శరద్ పవార్‌ను ఆఖరి ప్రయత్నంగా, ఒక వైపు తీసుకెళ్లాడు. ఏకాంతంలో పవార్‌తో, ఈ మధ్యనే తన గుండెకు శస్త్ర చికిత్స జరిగిందనీ, వయోభారంతో రాజకీయ విధులు నిర్వర్తించటం ఎక్కువ కాలం సాధ్యపడక పోవచ్చని చెబుతూ... మరాఠీలో, 'మీ హీ జబాబ్దారీ మార్యు ఖాంధ్యా వర్ కితీ దివస్ పేల్వూ (నేను ఈ బాధ్యత నా భుజాలపై వేసుకుని ఎన్ని రోజులని మోయగలను) అంటూ, 'కొన్ని రోజులపాటు తనకు ప్రధానిగా అవకాశం ఇవ్వవలసిందిగా' నవ్వుతూ కోరాడు పీవీ. పీవీ తాత్విక ధోరణితో మాట్లాడిన మాటలకు చలించి పోయారు పవార్ సాహెబ్.

మరుసటి రోజు ఉదయం (జూన్ 20) పార్లమెంటరీ పార్టీ సమావేశం జరిగింది. హాజరైన ఎంపీలు అంతా హాలులోకి ప్రవేశించిన శరద్ పవార్ వైపే సస్పెన్స్‌తో చూస్తున్నారు. మీటింగు ఆరంభం కావటంతోనే పవార్, జేబులోనుండి తను రాసిన ఒక లెటర్ తీసి సభ్యుల ముందుంచారు. 'పార్టీ నాయకత్వాన్ని నిర్ణయించడంలో సీపీపీని సమావేశ పరచాలన్న డిమాండ్‌ను కాంగ్రెస్ అధ్యక్షులు (పీవీ) అంగీకరించడాన్ని నేను స్వాగతిస్తున్నాను. సీపీపీ సభ్యులందరూ శ్రీ పీవీ నరసింహారావుకు మద్దతు ఇవ్వాలనీ, ఈ విషయంలో ఏకగ్రీవ నిర్ణయానికి రావాలనీ నేను విజ్ఞప్తి చేస్తున్నాను' అని అందులో కోరారు.

అంతే, మరునాడు (1991 జూన్ 21) రాష్ట్రపతి భవన్‌లో పీవీ నరసింహారావు తొమ్మిదవ ప్రధాన మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. తను ప్రధాని అయ్యాక, శరద్ పవార్‌ను పార్టీ జాతీయ అధ్యక్షునిగా నియమిస్తానని రావు ప్రామిస్ చేసినట్టు అంటారు. కాని, ఏప్రిల్ 1992 ఏప్రిల్‌లో జరిగిన తిరుపతి కాంగ్రెస్ పార్టీ సదస్సులో, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీని తన అనుకూల సభ్యులతో పునర్వ్యవస్థీకరించి, అధ్యక్షునిగా పార్టీ పగ్గాలు సైతం నాటకీయంగా కైవసం చేసుకున్నారు అపర చాణక్యుడు పీవీ నరసింహారావు.


(శరద్ పవార్ రాజకీయ ఆత్మకథ 'లోక్ మాఝే సాంగతి', రషీద్ కిద్వాయి రాసిన '24 అక్బర్ రోడ్' ఆధారంగా)

వ్యాసకర్త విశ్రాంత పీఎఫ్ కమిషనర్ | 9819096949

భిన్నత్వంలో ఏకత్వం

ఓ మానవుడా! భగవంతుని బ్రహ్మాండ రచనను మెచ్చుకొని దానికి శిరసు వంచి వినమ్రునిగా ఉండు. కొంచెం ఆలోచించు. ఎక్కడ నీడ ఉంటుందో అక్కడ ఒక చెట్టు; ఎక్కడ చెట్టు ఉంటుందో అక్కడ నీడ ఉంటుంది. అదే మాదిరిగా ఎక్కడైతే సంతోషం ఉంటుందో అక్కడ దుఃఖం, అది ఉన్న చోట సంతోషం ఉంటుంది. భిన్నత్వం, ఏకత్వాల కలబోతే ప్రకృతిమాత.

దత్తబోధ



శ్రీ గణపతి సచ్చిదానందస్వామి

ఎక్కడ భగవంతుడు ఉంటాడో, అక్కడ భక్తుడూ; ఎక్కడ భక్తుడు ఉంటాడో, అక్కడనే భగవంతుడూ ఉంటాడు. ఈ ఇరువురి మధ్య భిన్నత్వం లేదు. అదే మాదిరిగా ఎచ్చట శిష్యుడు ఉంటాడో, అచ్చటనే అతని గురువు ఉంటాడు; గురువు ఉన్న చోటే అతని శిష్యుడూ ఉండవలసినదే. ఈ ద్వంద్వాలను చూచి మోసపోకూడదు. ఈ బ్రహ్మాండ మంతయూ బ్రహ్మ పదార్థమే వ్యాపించియున్నది. ఈ సత్యాన్ని గ్రహించాలి. దేనివల్ల భిన్నత్వంలో ఏకత్వం, ఏకత్వములో భిన్నత్వం కలిగెనో అటువంటి మూలాన్ని స్తుతిస్తూ సాష్టాంగ నమస్కారం చెయ్యాలి. మౌనమే ధ్యానం. సాధకుడికి మౌనావలంబనం ఎంతైనా ముఖ్యం. మౌనం మానవుణ్ణి ప్రశాంతపరచి, ఆధ్యాత్మిక మార్గంలో ముందుకు వెళ్లడానికి సహాయపడుతుంది. ఏ ఒక్కరూ అనవసరంగా, అధికంగా మాట్లాడకూడదు. అత్యవసరమైనదే మాట్లాడాలి. నిర్ణీత వేళల్లో మౌనంతో ఉండడమే తపస్సు. కేవలం నాలుకను కదల్చకుండా ఉంచుట మౌనం కాదు. మనసుకు కూడా పూర్తి విశ్రాంతి ఇవ్వాలి. ఈ విధంగా చేసినపుడు మనిషి ఎక్కువ శక్తినీ, ఎక్కువ నిర్మలత్వాన్నీ పొందుతాడు. ఇందువలన మనసు అలసట తీర్చుకొంటుంది. ఏకాగ్రతా పెరుగుతుంది. నీ మనసు ఎంత ఖాళీగా ఉంటుందో, అంత ఏకాగ్రత పెరుగుతుంది. మనసును ఖాళీ చేయటానికి మౌనం చాలా ప్రభావశాలి. మహాత్ములు, జ్ఞానులు దీర్ఘకాలం మౌనం పాటిస్తారు. శ్రీకృష్ణ పరమాత్మ 'గీత'లో తెలిపిన విషయం:'గోప్యమైన వానిలో, నేనే మౌనమును'. అందువలన మనము కూడా మౌనాభ్యాసం చేద్దాం.

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి.
ఈ-మెయిల్: editpage@sakshi.com ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

గ్రహం అనుగ్రహం శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, జ్యేష్ఠ మాసం, **తిథి:** శు.త్రయోదశి ఉ.6.27 వరకు, తదుపరి చతుర్దశి, **నక్షత్రం:** అనూరాధ సా.5.41 వరకు, తదుపరి జ్యేష్ఠ, **వర్జ్యం:** రా.11.36 నుండి 1.15 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.9.51 నుండి 10.43 వరకు, తదుపరి ప.3.05 నుండి 3.57 వరకు, **అమృతఘడియలు:** ఉ.6.40 నుండి 8.23 వరకు; **రాహుకాలం:** ప.1.30 నుండి 3.00 వరకు, **యమగండం:** ఉ.6.00 నుండి 7.30 వరకు, **సూర్యోదయం:** 5.30, **సూర్యాస్తమయం:** 6.32.

క్లుప్తంగా...

సంస్కృత వర్సిటీకి నాక్ ఏ ప్లస్ గ్రేడ్!

తిరుపతి సిటీ: తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం (ఎన్‌ఎస్‌యూ)కు ప్రతిష్టాత్మకమైన నాక్ ఏ ప్లస్ గ్రేడ్ లభించింది. గతేడాది యూజీసీ నాక్ బృందం వర్సిటీలో పర్యటించి బోధన సౌకర్యాలు, మౌలిక వసతులు, నాక్ ఏ ప్లస్ గ్రేడ్ సాధనకు అవసరమైన అర్హతలపై ఆరా తీసింది. వర్సిటీలోని మౌలిక సదుపాయాలు, విద్యార్థులకు నాణ్యమైన విద్య, వసతులు వంటి విషయాలపై సంతృప్తి చెందిన నాక్ బృందం బుధవారం వర్సిటీకి నాక్ ఏ ప్లస్ గ్రేడ్‌ను ఇచ్చింది. దీంతో ఏ ప్లస్ గ్రేడ్ సాధించిన జాతీయ సంస్కృత వర్సిటీగా ఇక కార్యకలాపాలు సాగించనుంది. వర్సిటీ ఏ ప్లస్ గ్రేడ్ సాధించడంపై వీసీ జీఎస్‌ఆర్ కృష్ణమూర్తి అధికారికంగా గురువారం ప్రకటించనున్నారు.

ఈవీఎంల ట్యాంపరింగ్‌తోనే కూటమి గెలుపు

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షుడు మేరాజోత్ హనుమంత్ నాయక్



వెల్దుర్తి: బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు నిర్వహించాలని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోరితే టీడీపీ నేతలు ఎందుకు ఉలిక్కి పడుతున్నారో అర్థం కావటం లేదని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షుడు మేరాజోత్ హనుమంత్ నాయక్ అన్నారు. బుధవారం ఆయన పల్నాడు జిల్లా శ్రీరాంపురం తండాలో విలేకరులతో మాట్లాడుతూ.. ఏపీలో జరిగిన సార్వత్రిక ఎన్నికల ఫలితాలపై రాష్ట్ర ప్రజలకు పలు సందేహాలు ఉన్నాయన్నారు. చంద్రబాబు నమ్మిన ప్రజలను మోసం చేస్తాడనే అభిప్రాయం ప్రజల్లో బలంగా ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం సహకారంతో ఈవీఎంలను ట్యాంపరింగ్ చేయడం వలన గెలిచినందునే ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ప్రత్యేక హోదా అడిగే దమ్ము చంద్రబాబుకు లేకుండాపోయిందని చెప్పారు. దీనిపై విచారణ జరగాలని డిమాండ్ చేశారు.

జీవో 117ను రద్దు చేయాలి

- తల్లికి వందనం పథకాన్ని ప్రభుత్వ స్కూళ్లకే పరిమితం చేయాలి
- ప్రభుత్వానికి రాష్ట్రోపాధ్యాయ సంఘం విజ్ఞప్తి

సాక్షి, అమరావతి: ప్రభుత్వ ప్రాథమిక విద్యారంగానికి గొడ్డలిపెట్టుగా మారిన జీవో 117ను రద్దు చేయాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్. సాయిశ్రీనివాస్, మల్లు రఘునాథ రెడ్డి బుధవారం నూతన ప్రభుత్వాన్ని కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే జీవో 117ను రద్దుచేసి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను యథావిధిగా కొనసాగిస్తామని ప్రస్తుత మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ ఇచ్చిన హామీని నెరవేర్చుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేసే దిశగా అడుగులు వేయాలని, దానికి అనుగుణంగా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల విలీనాన్ని రద్దుచేసి ఒకటో తరగతి నుంచి 5వ తరగతి వరకు పాత పద్ధతిలో కొనసాగించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. తల్లికి వందనం పథకాన్ని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మాత్రమే పరిమితం చేయడం ద్వారా విద్యార్థుల సంఖ్యను పెంచవచ్చని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమంతో పాటు సమాంతరంగా తెలుగు, ఉర్దూ మాధ్యమాలను కొనసాగించాలన్నారు. వీలైనంత వేగంగా.. కోర్టు కేసులకు ఆస్కారం లేకుండా మెగా డీఎస్సీలో నియామకాలు చేపట్టాలని కోరారు. ఉపాధ్యాయులను బోధనకు మాత్రమే పరిమితం చేసి, అవసరం లేని యాప్‌లను రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు.

'హైస్కూల్ ప్లస్'పై స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వాలి

ప్రభుత్వానికి నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ విజ్ఞప్తి

సాక్షి, అమరావతి: గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన 500కుపైగా 'హైస్కూల్ ప్లస్' పాఠశాలలపై స్పష్టమైన మార్గదర్శకాలు విడుదల చేయాలంటూ కొత్త ప్రభుత్వాన్ని నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కరణం హరికృష్ణ, మాగంటి శ్రీనివాసరావు బుధవారం ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. జూన్ నెల ముగుస్తున్న నేపథ్యంలో హైస్కూల్ ప్లస్ కొనసాగింపుపై విద్యార్థులు, ఉపాధ్యాయుల్లో ఆందోళన నెలకొందన్నారు. గడిచిన విద్యా సంవత్సరంలో 210 హైస్కూల్ ప్లస్‌లో రెగ్యులర్ అధ్యాపకుల నియామకం జరగకపోవడంతో వీటి కొనసాగింపుపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని తెలిపారు. హైస్కూల్ ప్లస్‌లకు మేనేజ్‌మెంట్ వారీగా పేర్లు మార్చాలన్నారు. జిల్లా పరిషత్ హైస్కూల్ ప్లస్‌లకు జిల్లా పరిషత్ జూనియర్ కళాశాలలుగా గుర్తించి పూర్తిస్థాయి అధ్యాపకులను నియమించాలన్నారు. వీటిల్లో అర్హులైన స్కూల్ అసిస్టెంట్లకు రెగ్యులర్ ప్రాతిపదికన పదోన్నతులు ఇచ్చి జూనియర్ లెక్చరర్లుగా అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వంలో నూతన జాతీయ విద్యా విధానం అమలులో భాగంగా ప్రతి మండలానికి ఒక మహిళా కళాశాలను, ఒక కో-ఎడ్యుకేషన్ కళాశాలను ఏర్పాటు చేశారన్నారు. విధివిధానాల రూపకల్పనలో జాప్యం కారణంగా విద్యార్థుల్లో సరైన నమ్మకాన్ని కలిగించలేకపోయారని పేర్కొన్నారు. కొత్త ప్రభుత్వం గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నివసించే పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఇంటర్ విద్య చేరువ చేయాలని సూచించారు.

ఆదాయార్జనలో వాల్తేరు డివిజన్ టాప్

ఈస్ట్‌కోస్ట్ జోన్‌లో అత్యంత ఆదాయమిచ్చే రైలుగా ఏపీ ఎక్స్‌ప్రెస్ రికార్డు

- 2023-24 లో రూ.89.73 కోట్లు
- ఈ ఏడాదీ అదే జోరులో ఏపీ ఎక్స్‌ప్రెస్
- టాప్-10 ఆదాయమిచ్చిన రైళ్లలో విశాఖ నుంచి బయల్దేరే నాలుగు రైళ్లు
- 8వ స్థానంలో ఎల్టీటీ, టాప్-9లో వైజాగ్-సికింద్రాబాద్ వందే భారత్



సాక్షి, విశాఖపట్నం: ఆదాయార్జనలో వాల్తేరు డివిజన్ దూకుడు కొనసాగిస్తోంది. విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ కార్యకలాపాలు ప్రారంభం కాకముందే ప్రయాణికుల రాకపోకలతో పాటు ఆదాయార్జనలోనూ టాప్ గేర్‌లో దూసుకుపోతోంది. ఈస్ట్‌కోస్ట్ జోన్‌లో అత్యధిక ఆదాయం తీసుకొస్తున్న డివిజన్‌గా విశాఖపట్నం నిలవగా.. అత్యధిక ఆదాయం ఆర్జిస్తున్న రైలుగా విశాఖ నుంచి బయలుదేరుతున్న ఏపీ ఎక్స్‌ప్రెస్ నిలిచింది. భువనేశ్వర్ ప్రధాన కేంద్రంగా నడుస్తున్న జోన్‌లో టాప్-10 ఆదాయమిస్తున్న రైళ్లలో నాలుగు వాల్తేరు నుంచి ప్రారంభమవుతున్నవే ఉండటం గమనార్హం.

ఈస్ట్‌కోస్ట్ డివిజన్‌కు ఇదే బంగారు బాతు

వాల్తేరు డివిజన్ ఎప్పటిమాదిరిగానే ఈస్ట్‌కోస్ట్ జోన్‌లో నంబర్ వన్‌గా కొనసాగుతోంది. జోన్ ప్రధాన కేంద్రమైన భువనేశ్వర్‌ని తలదన్నేలా ఆదాయాన్ని అందిస్తూ.. వరుసగా నాలుగో ఏటా టాప్‌లో నిలిచింది. ఈస్ట్‌కోస్ట్ రైల్వే జోన్‌కు వాల్తేరు డివిజన్ బంగారు బాతులా మారింది. అతి పెద్దదైన ఈ డివిజన్ పరిధిలో ఏటా 2.5 కోట్లకు పైగా ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. ఈస్ట్‌కోస్ట్ రైల్వే జోన్‌కు ఏటా సుమారు రూ.14 వేల కోట్ల వరకు ఆదాయం వస్తుండగా.. ఇందులో సుమారు రూ.5 వేల కోట్ల నుంచి రూ.7 వేల కోట్ల వరకు ఒక్క వాల్తేరు డివిజన్ నుంచే వస్తోంది. 2023 ఏప్రిల్ 1వ తేదీ నుంచి 2024 మార్చి 31వ తేదీ వరకు విశాఖపట్నం రైల్వే స్టేషన్ ప్యాసింజర్ రిజర్వేషన్ సిస్టమ్(పీఆర్‌ఎస్) ద్వారా రూ.478.28 కోట్లు రాగా.. అన్‌రిజర్వ్‌డు టికెటింగ్ సిస్టమ్ (యూటీఎస్) ద్వారా రూ.67.86 కోట్లు వచ్చింది. మొత్తంగా విశాఖ రైల్వేస్టేషన్ నుంచి రూ.546.14 కోట్లు ఆదాయం లభించింది. అలాగే భువనేశ్వర్ స్టేషన్‌కు రూ.493.01 కోట్లు, ఆ తరువాత స్థానాలలో పూరీ స్టేషన్‌కు రూ.276.55 కోట్లు, బ్రహ్మపూర్ రైల్వేస్టేషన్‌కు రూ.101.94 కోట్ల ఆదాయం వచ్చింది. కాగా.. ప్రయాణికుల రాకపోకల విషయంలోనూ విశాఖ స్టేషన్ ప్రథమ స్థానంలో నిలిచింది. ఇక్కడి నుంచి 2,77,11,147 మంది రాకపోకలు సాగించారు. భువనేశ్వర్ స్టేషన్ ద్వారా 2,63,46,444 మంది ప్రయాణాలు చేశారు.

టాప్‌లో ఏపీ ఎక్స్‌ప్రెస్

అత్యధిక ఆదాయం అందిస్తున్న రైళ్ల విషయంలోనూ వాల్తేరు డివిజన్ నంబర్ వన్‌గా నిలిచింది. జోన్ నుంచి రాకపోకలు సాగిస్తున్న రైళ్లలో విశాఖ నుంచి బయలుదేరుతున్న ఏపీ ఎక్స్‌ప్రెస్ నంబర్ వన్‌గా నిలిచింది. 2023 జనవరి 1 నుంచి 2023 డిసెంబర్ 31 వరకూ విశాఖ నుంచి ఢిల్లీ వెళ్లే ఏపీ ఎక్స్‌ప్రెస్ ఏకంగా రూ.89,73,35,413 ఆదాయాన్ని తెచ్చిపెట్టింది. ఈ ఏడాది జనవరి 1 నుంచి మే 29 వరకూ రూ.39,05,31,575 ఆదాయం తీసుకొచ్చింది. రెండో స్థానంలో రూ.80.7 కోట్లు, రూ.35.59 కోట్లతో పురుషోత్తం ఎక్స్‌ప్రెస్ ఉండగా.. మూడో స్థానంలో భువనేశ్వర్ నుంచి ముంబై వెళ్లే కోణార్క్ ఎక్స్‌ప్రెస్ నిలిచింది. గతేడాది కోణార్క్ రూ.74.49 కోట్లు, ఈ ఏడాది రూ.31.13 కోట్లు ఆదాయాన్ని సాధించింది. ఇలా ఆదాయాన్ని ఆర్జించే టాప్-10 రైళ్లలో నాలుగు రైళ్లు విశాఖపట్నం నుంచి ప్రారంభమవుతున్నవే ఉండటం విశేషం. విశాఖ నుంచి లోకమాన్యతిలక్ (ముంబై) వెళ్లే ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ 8వ స్థానంలో, విశాఖ-సికింద్రాబాద్ వందేభారత్ టాప్-9లో, విశాఖ-నిజాముద్దీన్ సమతా ఎక్స్‌ప్రెస్ టాప్-10లో ఉన్నాయి. 11, 12వ స్థానాల్లో విశాఖ-హైదరాబాద్ గోదావరి ఎక్స్‌ప్రెస్, విశాఖ-సికింద్రాబాద్ గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్ నిలిచాయి.



పేదల ఇళ్ల స్థలాల ఆక్రమణపై విచారణ జరపండి

- నరసరావుపేట జిల్లా కలెక్టర్‌కు లోకాయుక్త ఆదేశం
- కాకానిలో జగనన్న లేఅవుట్‌ను ఆక్రమించిన టీడీపీ నాయకులు
- 'సాక్షి' కథనాన్ని సుమోటోగా తీసుకొని విచారణ చేయాలని నిర్ణయం



లోకాయుక్త కార్యాలయం

కర్నూలు (సెంట్రల్): నరసరావుపేట జిల్లా కాకానిలో పేదలకిచ్చిన జగనన్న లేఅవుట్‌లో టీడీపీ నేతలు ఇళ్ల స్థలాలను ఆక్రమించుకోవడంపై లోకాయుక్త సీరియస్ అయింది. పేదల స్థలాలను రాజకీయ పార్టీల నేతలు, కార్యకర్తలు ఎలా ఆక్రమిస్తారని ప్రశ్నించింది. 'సాక్షి'లో ప్రచురితమైన కథనాన్ని సుమోటోగా తీసుకొని 20 రోజుల్లో విచారణ చేసి నివేదిక సమర్పించాలని నరసరావుపేట జిల్లా కలెక్టర్‌ను ఆదేశించింది. 2021లో జేఎన్‌టీయూకే కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ సమీపంలో కాకానికి చెందిన 284 మందికి అసైన్‌మెంట్ భూమిలో జగనన్న లేఅవుట్ వేసి పట్టాలు ఇచ్చారు. ఇటీవల టీడీపీకి చెందిన కొందరు స్థానిక నేతలు జగనన్న లేఅవుట్‌లోని రాళ్లు, రోడ్లను ధ్వంసం చేసి జేసీబీతో చదును చేశారు. ఎకరాకు పైగా స్థలాన్ని ఆక్రమించుకొని సుబాబుల్ పంటను వేసేందుకు సిద్ధమయ్యారు. ఈ ఘటనపై బుధవారం 'సాక్షి'లో 'పేదల ఇళ్ల స్థలాలను ఆక్రమించిన టీడీపీ నేతలు' అంటూ కథనం ప్రచురితమైంది. దీని ఆధారంగా లోకాయుక్త, ఉపలోకాయుక్త సుమోటోగా కేసు నమోదు చేసింది. అసైన్‌మెంట్ భూమిలో జగనన్న లేఅవుట్ కోసం స్థలాన్ని కేటాయించారా? కేటాయించి ఉంటే ఎంత మందికి పట్టాలు ఇచ్చారు? నిజంగా జగనన్న లేఅవుట్ ఆక్రమణకు గురై ఉంటే ఏమి చర్యలు తీసుకున్నారో నరసరావుపేట ఆర్‌డీవో, తహసీల్దార్లతో విచారణ చేయించి జూలై 15న నివేదిక సమర్పించాలని ఆదేశించింది.


పేదల ఇళ్ల స్థలాలను ఆక్రమించిన టీడీపీ నేతలు

సుమోటోగా స్వీకరించిన 'సాక్షి'లో ప్రచురితమైన కథనం

శ్రీశైలంలో ప్లాస్టిక్ నిషేధం

- ఎన్‌ఎస్‌టీఆర్ కోర్ ఏరియాలో అమలుకు అటవీశాఖ నిర్ణయం
- సున్నిపెంటలో సమావేశమైన అటవీ, దేవస్థానం అధికారులు



సమావేశంలో పాల్గొన్న అటవీశాఖ, శ్రీశైలం దేవస్థాన అధికారులు

శ్రీశైలం ప్రాజెక్ట్: నాగార్జున సాగర్-శ్రీశైలం టైగర్ రిజర్వ్(ఎన్‌ఎస్‌టీఆర్) కోర్ ఏరియాలో ప్లాస్టిక్ వస్తువులను పూర్తిగా నిషేధించేందుకు అటవీశాఖ నిర్ణయించింది. శ్రీశైలం దేవస్థానానికి దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వస్తున్నారు. వారు ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లు, శీతల పానీయాలు, ప్లాస్టిక్ ప్యాకింగ్ కలిగిన తిను బండారాలు తీసుకువచ్చి అటవీ ప్రాంతంలో పడేస్తున్నారు. వాటిని తిని జంతువులు మృత్యువాత పడుతున్నాయి. అలాగే పర్యావరణ సమతుల్యత దెబ్బతింటోంది. ఈ విషయాన్ని గ్రహించిన అధికారులు ప్లాస్టిక్ వస్తువులను నిషేధించేందుకు చర్యలు చేపట్టారు. ఇప్పటికే ప్రకాశం జిల్లా దోర్నాల, నంద్యాల జిల్లా సున్నిపెంట వద్ద గల అటవీ చెక్‌పోస్టుల వద్ద తనిఖీ చేసి ప్లాస్టిక్ వస్తువులను సరఫరా చేసే వాహనాలు వెనక్కి పంపుతున్నారు. యాత్రికుల వాహనాలలో ఉన్న ప్లాస్టిక్ వస్తువులను పడవేస్తున్నారు. దేవస్థానంలో స్వామి అమ్మవార్ల ప్రసాదానికి జ్యూట్, కాగితంతో తయారు చేసిన బ్యాగ్‌లను వాడాలని, శ్రీశైలంలో గాజు బాటిళ్ల ప్యాకింగ్‌తో కూడిన మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని, అదనంగా 20 మంది సిబ్బందిని నియమించి అటవీ ప్రాంతంలోని రోడ్లకు ఇరువైపులా ఉన్న వ్యర్థాలను తొలగించాలని సమావేశంలో నిర్ణయించారు. కోర్ ఏరియాలో ప్లాస్టిక్ పూర్తి నిషేధానికి మూడోసారి బుధవారం అటవీ, దేవస్థానం అధికారులు సున్నిపెంట బయోలేబరేటరీలో సమావేశం నిర్వహించారు. సమావేశంలో కన్జర్వేటర్ బి.ఎస్‌ఎస్.మూర్తి, డీఎఫ్‌ఓలు విఘ్నేష్ అపావ్, సాయిబాబా, రేంజ్ అధికారి నరసింహులు, దేవస్థానం అధికారులు రామకృష్ణ అయ్యన్న, మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆ కుంభకోణాలు బయటపెడితే 'బొండా' జైలుకే

- ఎమ్మెల్యే బొండా ఉమా రెండు భారీ కుంభకోణాలు చేశారు
- వాటి పూర్తి ఆధారాలు నా వద్ద ఉన్నాయి
- వైఎస్సార్‌సీపీ దళిత నేత, మాజీ కార్పొరేటర్ నందెపు జగదీష్

సాక్షి ప్రతినిధి, విజయవాడ: విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం టీడీపీ ఎమ్మెల్యే బొండా ఉమా 2014లో ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో రెండు భారీ కుంభకోణాలకు పాల్పడ్డారని, వాటిని బయటపెడితే ఆయన జైలుకు వెళ్లడం ఖాయమని వైఎస్సార్‌సీపీ దళిత నేత, మాజీ కార్పొరేటర్ నందెపు జగదీష్ చెప్పారు. ఆ కుంభకోణాలకు సంబంధించిన పూర్తి సాక్ష్యాధారాలు తన వద్ద ఉన్నాయని, మరోసారి తన జోలికి వస్తే అవన్నీ బయట పెడతానని హెచ్చరించారు. బొండా కుంభకోణాలను సీఎం చంద్రబాబుకు వివరిస్తానన్నారు. దళితుడినైన తనను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, ఆస్తులు ధ్వంసం చేశారని, అధికారులపై ఒత్తిడి తెచ్చి మానసికంగా వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తనను వేధిస్తున్న తీరుపై ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తానని చెప్పారు. జగదీష్ బుధవారం ఇక్కడ న్యాయవాది ఒగ్గు గవాస్కర్‌తో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా పని చేసినందుకే బొండా ఉమా తనపై కక్ష సాధింపులకు పాల్పడుతున్నారని చెప్పారు. మున్సిపల్ అధికారులపై ఒత్తిడి తెచ్చి తన బిల్డింగులు కూల్చివేయించారని, ఇందులో ఆయన పాత్ర లేదని దళిత నేతలతో తనపై ఆరోపణలు చేయిస్తున్నారని చెప్పారు. బొండా ఉమాతో మాట్లాడుకోవాలని టౌన్ ప్లానింగ్ అధికారులు బాహాటంగానే చెబుతున్నారని తెలిపారు. తాను స్థలం కొనుక్కొని, భవనం నిర్మించుకొన్నానని, ఎవరి స్థలాలూ కబ్జా చేయలేదని అన్నారు. ప్రభుత్వ స్థలం కొంత ఆక్రమించానని చెబుతున్నారని, ఆక్రమిస్తే కూల్చే విధానం అది కాదని చెప్పారు. ఎవరి ఒత్తిడితో కూల్చివేస్తున్నారో తనకు తెలుసన్నారు. టీడీపీ కార్యాలయం కూడా తాను నిర్మించిందేనని, దాని జోలికి ఎందుకు వెళ్లలేదని ప్రశ్నించారు. ఇదే ప్రకాష్‌నగర్‌లో 50కు పైగా అక్రమ నిర్మాణాలు ఉన్నాయని, బొండా ఉమా కూడా అక్రమ నిర్మాణాలు చేపట్టారని తెలిపారు. విజయవాడలో మిగిలిన నియోజకవర్గాల్లో ఎక్కడా ఇలా బిల్డింగులు కూల్చలేదని, కేవలం సెంట్రల్ నియోజకవర్గంలోనే, అవి కూడా వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులవే కూల్చివేస్తున్నారని, ఇది కక్ష సాధింపు కాదా అని నిలదీశారు.

చంద్రబాబుకు ఫిర్యాదు చేస్తా

సీఎం చంద్రబాబును కలిసి ఈ కుంభకోణాలను వివరిస్తానని చెప్పారు. అలాగే, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ కృష్ణ తనను నమ్మించి మోసం చేశారని ఆరోపించారు. ఆయనే స్వయంగా 8 అక్రమ నిర్మాణాలు చేయించారని, వాటన్నింటిని డోర్ నంబర్లతో సహా కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తానని చెప్పారు.

అన్నప్రసాదంలో నాణ్యతను పెంచండి

టీటీడీ ఈవో జె.శ్యామలరావు



తిరుమల: తిరుమల శ్రీవారి దర్శనార్థం విచ్చేసే భక్తులకు నాణ్యమైన, రుచికరమైన అన్నప్రసాదాలు అందించాలని టీటీడీ ఈవో జె.శ్యామలరావు అధికారులను ఆదేశించారు. తిరుమలలోని గోకులం విశ్రాంతి భవనంలోని సమావేశ మందిరంలో జేఈవోలు గౌతమి, వీరబ్రహ్మంతో కలిసి అన్నప్రసాద విభాగం అధికారులతో బుధవారం సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న పనులను త్వరగా పూర్తిచేసి, తాత్కాలికంగా నిలిపివేసిన పాంచజన్యం వంటశాలను త్వరగా ప్రారంభించేలా చూడాలని ఆదేశించారు. తిరుమల, తిరుపతిలో కలిపి రోజుకు సుమారు 2.14 లక్షల మంది అన్నప్రసాదం స్వీకరిస్తున్నారు. ఒక రోజుకు అన్నప్రసాదం కోసం అవుతున్న ఖర్చు దాదాపు రూ.38 లక్షలుగా ఉంది. ఈ నేపథ్యంలో కూరగాయల దాతలు, ఒకరోజు విరాళం పథకం తదితర అంశాలపై కూడా ఈవో సమీక్షించారు. భక్తులకు అందజేస్తున్న మజ్జిగలో నాణ్యత పెంచాలని, వంట చేసే స్థలం పరిశుభ్రంగా, పొడిగా ఉంచాలని సూచించారు. ఆహార పదార్థాలను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని ఫుడ్ క్వాలిటీ ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించారు.

ఎలక్ట్రికల్ ఈఈపై జనసేన శ్రేణుల రుబాబు


చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ చిత్రపటాలకు ఈఈతో బలవంతంగా క్షీరాభిషేకం



ఈఈ భాస్కరరావుతో జనసేన శ్రేణుల వాగ్వాదం

మచిలీపట్నం టౌన్: విద్యుత్ శాఖ మచిలీపట్నం డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న ఎం.భాస్కరరావుపై జనసేన నాయకులు బుధవారం అధికార జులుం ప్రదర్శించారు. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌కు వ్యతిరేకంగా ఫేస్‌బుక్‌లో పోస్టులు ఎందుకు పెడుతున్నావంటూ ఆయనపై రుబాబు చేశారు. తమవెంట తీసుకువెళ్లిన సీఎం చంద్రబాబు, డెప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఫ్లెక్సీలకు ఈఈతో బలవంతంగా క్షీరాభిషేకం చేయించారు. వివరాలిలా ఉన్నాయి.. కృష్ణాజిల్లా మచిలీపట్నంలోని సుకర్లాబాద్ రామాలయం సమీపంలో ఉన్న ఈఈ భాస్కరరావు నివాసానికి బుధవారం స్థానిక జనసేన నాయకుడు కొట్టే వెంకట్రావు ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు వెళ్లారు. తమ నాయకుడు పవన్‌కళ్యాణ్, ముఖ్యమంత్రి చంద్రబాబుకు వ్యతిరేకంగా ఫేస్‌బుక్‌లో పోస్టులు ఎందుకు పెట్టావని ప్రశ్నించి.. మీడియాముఖంగా క్షమాపణ చెప్పాలని కోరారు. ఆయన దీనికి నిరాకరించారు. ఈ సందర్భంగా మీడియాతో జనసేన నాయకులు మాట్లాడుతూ.. గతంలో పవన్‌కళ్యాణ్‌కు వ్యతిరేకంగా పోస్టులు పెట్టిన ఈఈ భాస్కరరావు ఎప్పుడు దొరుకుతాడా అని ఎదురుచూస్తున్నామని చెప్పారు. ఈ రోజు ఆయన ఇంటికి వచ్చి గాంధేయవాదంతో పోస్టులు ఎందుకు పెట్టావంటూ ప్రశ్నించగా.. తాను ఫార్వర్డ్ చేశానని అమాయకంగా సమాధానం చెబుతున్నాడని జనసేన నాయకుడు వెంకట్రావు తెలిపారు. ఈ విధమైన పోస్టులు ఎవడు పెట్టినా క్షమించేది లేదని హెచ్చరించారు. పవన్‌కళ్యాణ్, చంద్రబాబుకు వ్యతిరేకంగా పోస్టులు పెడితే ఎవరినీ వదలమని వారి తాట తీస్తామని హెచ్చరించారు.

వైభవంగా శ్రీపద్మావతి అమ్మవారి తెప్పోత్సవాలు



చంద్రగిరి(తిరుపతి జిల్లా): తిరుచానూరులో కొలువైన శ్రీవారి దేవేరి శ్రీపద్మావతి అమ్మవారి వార్షిక తెప్పోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మూడో రోజు బుధవారం మధ్యాహ్నం అమ్మవారిని ఆలయం నుంచి వేంచేపుగా పుష్కరిణి మధ్యలో ఉన్న నీరాడ మండపానికి తీసుకొచ్చి కొలువుదీర్చారు. అనంతరం వేద పారాయణం, మంగళవాయిద్యాల నడుమ అమ్మవారికి ఆలయ అర్చకులు అభిషేకం నిర్వహించారు. సాయంత్రం 6.30 గంటలకు అమ్మవారు తెప్పపై కొలువుదీరి పుష్కరిణిలో మూడు పర్యాయాలు విహరిస్తూ భక్తులకు దివ్యదర్శనం ప్రసాదించారు. రాత్రి 7.30 గంటలకు సర్వాంగ శోభితురాలైన శ్రీపద్మావతి అమ్మవారు తిరుచ్చిపై తిరువీధుల్లో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. ఈ కార్యక్రమాల్లో నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్, ఏఈవో రమేష్, సూపరింటెండెంట్ శ్రీవాణి పాల్గొన్నారు. కాగా, తెప్పోత్సవాల్లో భాగంగా గురువారం శ్రీపద్మావతి అమ్మవారు గజవాహనంపై ఊరేగనున్నారు.

అవన్నీ అసత్య కథనాలే

- మేము కొన్న ఆస్తి సక్రమమైనదే
- అది సర్వే నంబర్ 69/2లో లేదు
- అగ్రిగోల్డ్ ఆస్తులకు, మా ఆస్తికి సంబంధం లేదు
- మాజీ మంత్రి జోగి రమేష్



కంకిపాడు: తనపై బురద జల్లి, వ్యక్తిగత ప్రతిష్టను దెబ్బతీసేలా రెండు రోజులుగా తెలుగుదేశం పార్టీ అనుకూల మీడియాలో వస్తున్న కథనాలన్నీ అసత్యాలే అని, వాటిల్లో ఒక్కటి కూడా వాస్తవం లేదని వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి జోగి రమేష్ చెప్పారు. ఇటువంటి నిరాధార కథనాలను నమ్మే స్థితిలో రాష్ట్ర ప్రజలు లేరని ఆయన బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తాను మంత్రిగా ఉన్న సమయంలో ఎటువంటి భూ ఆక్రమణలకు పాల్పడలేదని చెప్పారు. వ్యక్తిగత కక్షతో సంబంధం లేని విషయాలను తనపై రుద్ది, వారికి అనుకూలంగా మలచుకునే ప్రయత్నం చేస్తున్నారని, అబద్ధపు సాక్ష్యాలతో తనపై బురద జల్లుతున్నారని అన్నారు. ఈ అసత్య కథనాలు తనను, తన కుటుంబాన్ని తీవ్రంగా కలచివేస్తున్నాయన్నారు. 1969లో బొమ్ము వెంకట చలమారెడ్డి కొన్న ఆస్తిని వారు 2001లో పోలవరపు మురళీమోహన్‌కు విక్రయించారని, ఆయన 2014లో మహాలక్ష్మి ప్రాపర్టీస్‌కు అమ్మారని తెలిపారు. 2023లో ఆ ఆస్తిని తన కుటుంబం కొన్నదని చెప్పారు. మండల సర్వేయరుతో సర్వే చేయించి, సర్వే సర్టిఫికెట్ తీసుకున్న తరువాతే తహసీల్దార్ సర్టిఫికెట్ ఆధారంగా 2023లో పడిగపాటి దుర్గాప్రసాద్‌రెడ్డి తదితరులకు విక్రయించినట్లు పేర్కొన్నారు. టీడీపీ అనుకూల మీడియా ప్రచారం చేస్తున్నట్లు తమ ఆస్తి సర్వే నంబరు 69/2లో లేదన్నారు. ఆ ఆస్తి సర్వే నంబరు 88లో ఉండగా, మండల సర్వేయరు సర్వేతో ఆస్తి సర్వే నంబరు 87లో ఉన్నట్లు తెలిపారన్నారు. దాని ఆధారంగానే విక్రయించామన్నారు. తమ కుటుంబం కొన్న ఆస్తికి, అగ్రిగోల్డ్ వారికి చెందిన ఆస్తికి సంబంధం లేదని స్పష్టం చేశారు. పేపరు పబ్లికేషన్ తరువాతే ఆస్తి కొనుగోలు చేసినట్లు తెలిపారు. సీబీసీఐడీ ఏ ఆస్తులు ఎటాచ్ చేసిందో తమకు తెలియదని, తమకు సంబంధం లేదని తెలిపారు. అయినా, తమపై బురదజల్లేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారని, ఇది భావ్యం కాదని పేర్కొన్నారు.

రాష్ట్రంలో 'రబీ' నష్టం రూ. 320 కోట్లు

కరువు పరిశీలనకు వచ్చిన కేంద్ర బృందానికి సమగ్ర నివేదిక

- ఆరు జిల్లాల్లోని 87 మండలాలు కరువు జాబితాలో ప్రకటన
- పంటనష్టం రూ. 228 కోట్లు, ఇతర రంగాలకు రూ. 92 కోట్లు
- రాష్ట్ర స్థాయి రబీ నష్టంపై 'అనంత'లో కేంద్ర బృందం సమీక్ష

అనంతపురం అగ్రికల్చర్/కర్నూలు(అగ్రికల్చర్): గత రబీ సీజన్ (2023-24)లో కరువు పరిస్థితుల కారణంగా గత ప్రభుత్వం ఆరు జిల్లాల పరిధిలో ప్రకటించిన 87 కరువు మండలాల్లో రూ. 320 కోట్ల మేరకు నష్టం వాటిల్లినట్లు రాష్ట్ర ప్రకృతి విపత్తుల విభాగం మేనేజింగ్ డైరెక్టర్ ఆర్.కూర్మనాథ్ తెలిపారు. ఇన్‌పుట్ సబ్సిడీ రూపంలో ఆర్థిక సాయం అందజేయాలంటూ.. రాష్ట్ర పర్యటనకు వచ్చిన ఇంటర్ మినిస్టీరియల్ సెంట్రల్ టీం (ఐఎంసీటీ)కు సమగ్ర కరువు నివేదిక అందజేశారు. బుధవారం అనంతపురం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో రాష్ట్రస్థాయిలో రబీ నష్టంపై సమీక్ష నిర్వహించారు. అనంతపురం జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ నేతృత్వంలో ఈ సమీక్ష జరిగింది. కేంద్ర వ్యవసాయ మంత్రిత్వశాఖ జాయింట్ సెక్రటరీ రితేష్ చౌహాన్ నేతృత్వంలో ఆరుగురు కేంద్ర బృందం సభ్యులు పాల్గొన్నారు. మరో నలుగురితో కూడిన కేంద్ర బృందం నెల్లూరు నుంచి వర్చువల్ పద్ధతిలో సమీక్షలో పాల్గొన్నారు. అలాగే ఆర్.కూర్మనాథ్ నేతృత్వంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సి.నాగరాజు, గ్రౌండ్ వాటర్ ఏడీ విశ్వేశ్వరరావు, జేడీఏ జగ్గారావు, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డిప్యూటీ చీఫ్ ఇంజనీరు ఎం.బ్రహ్మాజీ, పశుశాఖ జేడీ జెడ్.ఈశ్వర్‌రావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బాషా, గ్రామీణాభివృద్ధిశాఖ జాయింట్ కమిషనర్ శివప్రసాద్‌తో కూడిన రాష్ట్ర స్థాయి బృందం సభ్యులు కూడా సమీక్షకు హాజరయ్యారు.

24 రకాల పంటలకు దెబ్బ

ఈశాన్య రుతుపవనాలు ప్రభావం చూపకపోవడంతో గత రబీలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నట్లు కేంద్ర బృందానికి రాష్ట్ర, జిల్లా అధికారులు తెలిపారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం అనంతపురం జిల్లాలో 14 మండలాలు, శ్రీసత్యసాయి జిల్లాలో ఒకటి, కర్నూలు జిల్లాలో 18, నంద్యాలలో 13, ప్రకాశంలో 31, నెల్లూరులో 10... మొత్తంగా ఆరు జిల్లాల పరిధిలో 87 మండలాలు కరువు జాబితాలో ప్రకటించినట్లు తెలిపారు. ఆరు జిల్లాల పరిధిలో 2.53 లక్షల హెక్టార్లలో 24 రకాల పంటలు దెబ్బతినడంతో రూ.1,207 కోట్లు విలువ చేసే 2.93 లక్షల మెట్రిక్ టన్నుల పంట ఉత్పత్తులు కోల్పోయినట్లు వివరించారు. ఎస్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్ నిబంధనల ప్రకారం ఒక్కో రైతుకు రెండు హెక్టార్లకు ఆర్థికసాయం అందించడానికి వీలుగా 2.38 లక్షల మంది రైతులకు రూ. 228.03 కోట్లు ఇన్‌పుట్‌సబ్సిడీ రూపంలో అందించాలని కోరారు. పంటనష్టం కాకుండా ఉద్యానశాఖ, పశుశాఖ, ఉపాధిహామీ, గ్రామీణ, పట్టణ తాగునీటి సరఫరా తదితర వాటికి మరో రూ. 91.74 కోట్లు... మొత్తంగా రూ.319.77 కోట్లు కరువు సాయం అందించాలని కోరుతూ సమగ్ర కరువు నివేదికను కేంద్ర బృందానికి అందించారు. ఇక్కడే ఆరు జిల్లాల పరిధిలో జరిగిన పంటనష్టం గురించి ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. అనంతరం ఒక బృందం శ్రీసత్యసాయి జిల్లా పర్యటనకు, మరొక బృందం కర్నూలు, నంద్యాల జిల్లాల పర్యటనకు వెళ్లాయి.



కర్నూలు జిల్లా ఆలూరులో ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న సెంట్రల్ టీమ్ ప్రతినిధులు

నగరడోణ, వేదవతి ప్రాజెక్టుల నిర్మాణంతోనే కరువు నివారణ

కర్నూలు జిల్లాలో కరువును శాశ్వతంగా నిర్మూలించాలంటే ప్రధానంగా నగరడోణ రిజర్వాయర్, వేదవతినదిపై ప్రాజెక్టు నిర్మించాలని, ఈ మేరకు కేంద్రానికి నివేదించాలని రైతులు, రైతు సంఘాల నేతలు ఐఎంసీటీ ప్రతినిధులను కోరారు. కేంద్ర బృందం బుధవారం కర్నూలు కలెక్టరేట్‌లో రబీ కరువును ప్రతిబింబించే ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలించింది. శనగ, జొన్న రైతులతో ముఖాముఖి మాట్లాడి కరువు తీవ్రతను తెలుసుకున్నారు. 2023-24 ఖరీఫ్, రబీల్లో వివిధ పంటల్లో పెట్టిన పెట్టుబడుల్లో 25 శాతం కూడా దక్కలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఖరీఫ్, రబీ సీజన్‌లకు సంబంధించి పంటల బీమా పరిహారం చెల్లించాలని కోరారు. గురువారం జిల్లాల్లో కరువు పరిశీలన తర్వాత అన్ని బృందాలు విజయవాడ చేరుకుంటాయని అధికారులు తెలిపారు.

స్టీల్‌ప్లాంట్‌కు ఐక్యరాజ్యసమితి ప్రశంసలు



ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ నిర్వహించిన ప్రపంచ పర్యావరణ కార్యక్రమాలకు ఐక్యరాజ్యసమితి పర్యావరణ కమిటీ నుంచి ప్రశంసలు లభించాయి. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఐక్యరాజ్యసమితి పర్యావరణ విభాగం (యునెప్) ప్రకటించిన 'మనం ఎడారీకరణ నుంచి భూమిని పునరుద్ధరించగలం, కరువును తట్టుకోగలం.. పోరాడగలం' థీమ్‌తో స్టీల్‌ప్లాంట్ సైకిల్ ర్యాలీ, పోస్టర్, వ్యాస రచన తదితర పోటీలు నిర్వహించింది. అనంతరం ఈ కార్యక్రమాలను యునెప్ వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. ఇందుకుగాను స్టీల్‌ప్లాంట్‌కు యునెప్ ప్రశంసా పత్రాన్ని జారీ చేసింది. ఈ సందర్భంగా సీఎండీ అతుల్ భట్ పర్యావరణ నిర్వహణ విభాగం సిబ్బందిని అభినందించారు.


బిహార్‌లో నలంద మహావిహార వద్ద ప్రధాని నరేంద్ర మోదీ

ప్రపంచ వైజ్ఞానిక కేంద్రంగా భారత్

అత్యాధునిక, పరిశోధనల ఆధారిత ఉన్నత విద్యా వ్యవస్థకు ప్రాధాన్యం

21వ శతాబ్దంలో భారత్ కీలకపాత్ర.. 2047 నాటికి వికసిత్ భారత్

- పరిశోధన, నవీన ఆవిష్కరణలకు రూ.లక్ష కోట్లతో ప్రత్యేక నిధి
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వెల్లడి
- బిహార్‌లో నలంద విశ్వవిద్యాలయం నూతన క్యాంపస్ ప్రారంభం

రాజ్‌గిర్: అత్యాధునిక, పరిశోధనల ఆధారిత ఉన్నత విద్యా వ్యవస్థతో ప్రపంచంలోనే అతిముఖ్యమైన వైజ్ఞానిక కేంద్రంగా భారత్ ఎదగాలని తాను కోరుకుంటున్నట్లు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. ఎల్లప్పుడూ జిజ్ఞాస, ధైర్యసాహసాలు కలిగి ఉండాలని విద్యార్థులకు ఉద్బోధించారు. బిహార్‌లోని రాజ్‌గిర్‌లో నలంద విశ్వవిద్యాలయం నూతన క్యాంపస్‌ను ప్రధాని మోదీ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన ప్రసంగించారు. మూడోసారి ప్రధానమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత 10 రోజుల వ్యవధిలోనే ఇక్కడికి వచ్చే అవకాశం దక్కడం తనకు చాలా సంతోషం కలిగిస్తోందన్నారు. విజ్ఞానాన్ని అగ్నికీలలతో కాల్చి బూడిద చెయ్యలేమని, ఇందుకు నలంద విశ్వవిద్యాలయమే ఒక ఉదాహరణ అని చెప్పారు. 21వ శతాబ్దంలో భారత్ కీలక పాత్ర పోషించనుందని, ఆ శతాబ్దం ఆసియాదేనని, 2047 నాటికి భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారుతుందని పునరుద్ఘాటించారు. విద్యా రంగంలో అద్భుతమైన ప్రగతి సాధించిన దేశాలే ఆర్థిక, సాంస్కృతిక రంగాల్లో అగ్రరాజ్యాలుగా ఎదుగుతాయని, ఇది చరిత్ర చెబుతున్న సత్యం అని పేర్కొన్నారు. ప్రాచీన కాలంలో మన దేశం ఆర్థిక, సాంస్కృతిక రంగాల్లో అగ్రరాజ్య హోదాను అనుభవించిందని గుర్తుచేశారు. అప్పట్లో నలంద, విక్రమశిల వంటి విద్యాసంస్థలు ప్రపంచ ప్రఖ్యాతిగాంచాయన్నారు.

గ్లోబల్ ర్యాంకింగ్స్‌లో మన వర్సిటీలు

భారత్‌ను ప్రపంచ వైజ్ఞానిక కేంద్రంగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇందులో భాగంగా చిన్నారుల్లో నవీన ఆలోచనలను ప్రోది చేసేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. 'అటల్ టింకరింగ్ ల్యాబ్'ల ద్వారా కోటి మందికిపైగా బాలలకు అత్యాధునిక టెక్నాలజీని అందుబాటులోకి తీసుకొస్తున్నామని వివరించారు. చంద్రయాన్, గగన్‌యాన్ వంటి ప్రయోగాలు మన బాలబాలికల్లో సైన్స్ పట్ల ఉత్సకతను కలిగిస్తున్నాయని చెప్పారు. పదేళ్ల క్రితం మన దేశంలో కేవలం 100 స్టార్టప్ కంపెనీలు ఉండేవని, ఇప్పుడు వాటి సంఖ్య 1.30 లక్షలు దాటేసిందని హర్షం వ్యక్తం చేశారు. రికార్డు స్థాయిలో పేటెంట్లు మనకు లభిస్తున్నాయని, రీసెర్చ్ పేపర్ల ప్రచురణలో ముందంజలో ఉన్నామని పేర్కొన్నారు. పరిశోధన, నవీన ఆవిష్కరణలకు మరింత ఊతం ఇవ్వడానికి రూ.లక్ష కోట్లతో ప్రత్యేక నిధిని ప్రకటించామన్నారు. గత పదేళ్లుగా చూస్తే మన దేశంలో సగటున ప్రతి వారానికొక యూనివర్సిటీని నెలకొల్పినట్లు, ప్రతి పది రోజులకొక ఐటీఐని స్థాపించినట్లు తెలుస్తోందని నరేంద్ర మోదీ అన్నారు. రెండు రోజులకొక అటల్ టింకరింగ్ ల్యాబ్, ప్రతిరోజూ రెండు కొత్త కాలేజీలు ఏర్పాటయ్యాయని స్పష్టంచేశారు. ప్రస్తుతం 23 ఐఐటీలు, 21 ఐఐఎంలు, 22 ఎయిమ్స్‌లు ఉన్నాయన్నారు. గత పదేళ్లలో మెడికల్ కాలేజీ సంఖ్య రెండింతలు అయ్యిందన్నారు.

నలంద మహా విహార సందర్శన

బిహార్ రాష్ట్రం నలంద జిల్లా రాజ్‌గిర్‌లోని ప్రాచీన నలంద విశ్వవిద్యాలయ శిథిలాలలో కూడిన నలంద మహా విహారను ప్రధాని మోదీ బుధవారం సందర్శించారు. ఈ కట్టడం విశేషాలను అధికారులు ఆయనకు వివరించారు. ఈ మహా విహార యునెస్కో ప్రపంచ వారసత్వ కట్టడంగా గుర్తింపు పొందింది.



మోదీ వేలిపై సిరా గుర్తు ఉందా?

నలంద విశ్వవిద్యాలయం నూతన క్యాంపస్ ప్రారంభోత్సవంలో ఆసక్తికరమైన సన్నివేశం చోటుచేసుకుంది. వేదికపై బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ ప్రధాని మోదీ ఎడమ చేతిని కొద్దిసేపు పట్టుకొని చూశారు. సార్వత్రిక ఎన్నికల్లో ఓటు వేసినప్పుడు మోదీ చూపుడు వేలిపై సిరా గుర్తు ఇంకా ఉందా? అని పరిశీలించారు. ఈ దృశ్యం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. నితీశ్ ఆకస్మిక చర్యకు మోదీ కూడా కొంత ఆశ్చర్యానికి గురైనట్లు కనిపించారు. అంతేకాదు ఆయన వెనుక ఉన్న భద్రతా సిబ్బంది వెంటనే అప్రమత్తమయ్యారు.

యూజీసీ–నెట్ రద్దు

పరీక్షలో అవకతవకలు జరిగి ఉండొచ్చన్న అనుమానాలు

- కేంద్ర విద్యా శాఖ ఆకస్మిక నిర్ణయం
- సమగ్ర దర్యాప్తు కోసం సీబీఐకి అప్పగింత
- త్వరలో మళ్లీ పరీక్షను నిర్వహించనున్న ఎన్‌టీఏ
- తేదీ, తదితర వివరాలు త్వరలో వెల్లడి

న్యూఢిల్లీ: వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశాలకు చేపట్టిన నీట్ పరీక్షలో బయల్పడిన అవకతవకల నీలినీడలు యూజీసీ–నెట్ పరీక్ష పైనా పడ్డాయి. దీంతో మంగళవారం నిర్వహించిన యూజీసీ–నెట్ పరీక్షను రద్దుచేస్తున్నట్లు కేంద్ర విద్యా శాఖ బుధవారం అనూహ్య నిర్ణయం తీసుకుంది. గతానికి భిన్నంగా ఈసారి ఒక్కరోజులోనే ఆఫ్‌లైన్‌లో పెన్, పేపర్(ఓఎంఆర్) విధానంలో దేశవ్యాప్తంగా 317 నగరాలు, పట్టణాల్లోని 1,205 పరీక్షా కేంద్రాల్లో యూజీసీ–నెట్ పరీక్ష మంగళవారం జరిగిన విషయం తెల్సిందే. త్వరలో మళ్లీ నెట్ పరీక్షను నిర్వహిస్తారని, త్వరలోనే సంబంధిత వివరాలు వెల్లడిస్తామని కేంద్ర విద్యా శాఖ ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు. '' నెట్ పరీక్ష విధానంలో అత్యంత పారదర్శకత, సమగ్రత, గౌరవానికి ఎలాంటి భంగం వాటిల్లకూడదు. పరీక్షలో అక్రమాలు జరిగి ఉండొచ్చన్న విశ్వసనీయ సమాచారం మేరకు 'యూజీసీ–నెట్ జూన్ 2024'ను రద్దుచేస్తున్నాం'' అని ఆ అధికారి వివరించారు. ఈ ఏడాది నెట్ పరీక్షకు 11,21,225 మంది దరఖాస్తు చేసుకోగా మంగళవారం పూర్తయిన ఈ పరీక్షను 9,08,580 మంది అభ్యర్థులు రాశారు. నెట్ పరీక్షలో అక్రమాలపై సమగ్ర దర్యాప్తు కోసం ఈ అంశాన్ని సీబీఐకి అప్పగిస్తూ నిర్ణయం తీసుకున్నట్లు ఎన్‌టీఏ తెలిపింది. నెట్ పరీక్షలో అక్రమాలు జరిగి ఉంటాయని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ)కు ప్రభుత్వ సైబర్ నిఘా సంస్థల సమాచారం అందడంతో ఆ మేరకు పరీక్షకు రద్దుచేస్తున్నట్లు తెలిపింది. ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్(ఐ4సీ) ఈ వివరాలను యూజీసీకి పంపింది. ఐ4సీలోని నేషనల్ సైబర్ క్రైమ్ థ్రెట్ అనలైటిక్స్ విభాగం సంబంధిత సమాచారాన్ని క్రోడీకరించి యూజీసీకి అందజేసింది. ఈ విభాగం దేశవ్యాప్తంగా జరుగుతున్న సైబర్ నేరాల దాడులపై సమాచారం ఇవ్వడంతోపాటు అప్రమత్తంగా ఉండాలని ముందస్తుగా హెచ్చరిస్తుంది. ఐ4సీ అనేది కేంద్ర హోం శాఖ పరిధిలో పనిచేస్తుంది. ఇది పరీక్షల సంబంధ వ్యవహారాలను చూస్తుంది. నీట్‌ను నిర్వహించిన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీయే ఈ నెట్ పరీక్షనూ చేపట్టింది.

యూజీసీ–నెట్ ఎందుకు రాస్తారు?

యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్– నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్(యూజీసీ–నెట్) పరీక్షలో ఉత్తీర్ణులైతే సైన్స్ సబ్జెక్టుల్లో పరిశోధనకు అవకాశం లభిస్తుంది. పరిశోధన వైపు వెళ్లొచ్చు లేదంటే అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా బోధనారంగం వైపూ వెళ్లొచ్చు. దేశంలోని ప్రఖ్యాత విశ్వవిద్యాలయాలు, కళాశాలలు, ఐఐటీ, ట్రిపుల్ ఐటీ కాలేజీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చేరొచ్చు. శాస్త్రీయ, పారిశ్రామిక పరిశోధనా మండలి(సీఎస్ఐఆర్) ఆధ్వర్యంలో నడిచే ప్రయోగ, పరిశోధనాశాలల్లో జూనియర్ రీసెర్చ్ ఫెలోగా చేరొచ్చు. జూనియర్ రీసెర్చ్ ఫెలోగా, ఆ తర్వాత సీనియర్ రీసెర్చ్ ఫెలోగా అవకాశం లభిస్తుంది. ఇలా శాస్త్రవేత్తగా ఎదగొచ్చు. పీహెచ్‌డీ చేసేందుకు అర్హత లభిస్తుంది. ప్రభుత్వరంగ ఓఎన్‌జీసీ వంటి సంస్థల్లోనూ ఉద్యోగాలు పొందొచ్చు. నెట్‌కు క్వాలిఫై అయిన వారికి విదేశాల్లోనూ చక్కటి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. నెట్ పరీక్షను ఏటా రెండు సార్లు నిర్వహిస్తారు. 80కిపైగా సబ్జెక్టుల్లో పరీక్ష రాసుకోవచ్చు.

కశ్మీర్‌లో ఇద్దరు తీవ్రవాదులు హతం

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లోని బారాముల్లా జిల్లాలో బుధవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు తీవ్రవాదులు హతమయ్యారు. ఇద్దరు భద్రతా సిబ్బందికి కూడా గాయాలయ్యాయి. బారాముల్లాలోని వాటర్‌గామ్ ప్రాంతంలో టెర్రరిస్టులు తలదాచుకొన్నారనే సమాచారంతో బుధవారం భద్రతాబలగాలు కూంబింగ్ ఆపరేషన్ చేపట్టాయని, తీవ్రవాదులు కాల్పులకు దిగడంతో ఎన్‌కౌంటర్ మొదలైందని అధికారవర్గాయి తెలిపాయి. కాల్పుల్లో మరణించిన తీవ్రవాదుల పేర్లు, వారు ఏ సంస్థకు చెందిన వారనే విషయాలను ఆరాతీస్తున్నారు. తీవ్రవాదుల కాల్పుల్లో ఒక పోలీసు, మరో జవానుకు గాయాలయ్యాయని వెల్లడించారు.

అమృత్‌పాల్ నిర్బంధం ఏడాది పొడగింపు

చండీగఢ్: సిక్కు తీవ్రవాద ప్రబోధకుడు అమృత్‌పాల్ సింగ్ నిర్బంధాన్ని ఏడాది పాటు పొడగిస్తూ పంజాబ్ ప్రభుత్వం ఈనెల 3న ఉత్తర్వులు జారీచేసింది. అయితే బుధవారం వీటిని బహిరంగ పర్చారు. వారిస్ దే పంజాబ్ చీఫ్ అమృత్‌పాల్, అతని తొమ్మిది మంది అనుచరులు జాతీయ భద్రతా చట్టం కింద అరెస్టయ్యి ప్రస్తుతం అస్సాంలోని డిబ్రూగఢ్ జైలులో ఉన్నారు. జైలులో ఉంటూనే అమృత్‌పాల్ లోక్‌సభ ఎన్నికల్లో పంజాబ్‌లోని ఖదూర్ సాహిబ్ స్థానం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి సమీప కాంగ్రెస్ ప్రత్యర్థిపై 1.97 లక్షల మెజారిటీతో ఎంపీగా విజయం సాధించాడు. ఫలితాలు ఈనెల 4న వెలువడగా.. 3వ తేదీనే అమృత్‌పాల్ నిర్బంధాన్ని ఏడాదిపాటు పొడగిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.

తమిళనాడులో కల్తీ సారాకు 18 మంది బలి

సాక్షి, చెన్నై: తమిళనాడులోని కళ్లకురిచ్చి జిల్లా కరుమాపురం గ్రామంలో కల్తీ సారా తాగిన 18 మంది బుధవారం మరణించారు. మరో 90 మంది ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరిలో పది మంది పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. మృతులలో ప్రవీణ్, సురేష్, శేఖర్, మోహన్, జగదీశ్, సుబ్రమణియన్, మణి ఉన్నారు. మరో ముగ్గురు సాయంత్రం మృతి చెందారు. ఈ సమాచారంతో కల్తీ సారా, సారా సేవించిన వారంతా ఆస్పత్రులకు పరుగులు తీశారు. ప్రస్తుతం కళ్లకురిచ్చి ప్రభుత్వ ఆస్పత్రిలో సారా సేవించిన వారు 90 మంది చికిత్స పొందుతున్నారు. వీరిలో పది మంది పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో కేంద్ర పాలిత ప్రాంతం పుదుచ్చేరిలోని జిప్మర్ ఆస్పత్రికి తరలించారు. అయితే, కల్తీ సారా తాగి మరణించినట్టుగా వైద్య పరీక్షల్లో తేలలేదని కళ్లకురిచ్చి కలెక్టర్ శ్రావణ్ కుమార్ స్పష్టం చేశారు. కాగా ఘటనపై విచారణకు ఆదేశించిన ప్రభుత్వం జిల్లా ఎస్పీ సమయసింగ్ మీనాపై సస్పెన్షన్ వేటు వేసింది. అలాగే కలెక్టర్ శ్రావణ్‌కుమార్‌ను బదిలీ చేసింది. 18 ప్రత్యేక వైద్య బృందాలను చెన్నై నుంచి కళ్లకురిచ్చికి పంపించినట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఆ జిల్లాలోని ఎక్సైజ్ విభాగం ఉన్నతాధికారులందరిపై వేటు వేస్తున్నట్లు ఆదేశాలు జారీ చేసింది.

నిజ్జర్‌కు కెనడా పార్లమెంటు నివాళి

న్యూఢిల్లీ: ఖలిస్తానీ తీవ్రవాది హర్దీప్‌సింగ్ నిజ్జర్ మృతి చెంది ఏడాది గడిచిన సందర్భంగా మంగళవారం కెనడా పార్లమెంటు నివాళులర్పించింది. హౌస్ ఆఫ్ కామన్స్‌లో సభ్యులు మౌనం పాటించారు. ఖలిస్తానీ టైగర్ ఫోర్స్ (కేటీఎఫ్) అధినేత నిజ్జర్ గత ఏడాది జూన్ 18న కెనడాలోని బ్రిటిష్ కొలంబియా గురుద్వారా ఎదుట జరిగిన కాల్పుల్లో హతమయ్యాడు. భారత ప్రభుత్వం ప్రకటించిన టెర్రరిస్టుల జాబితాలో నిజ్జర్ పేరు ఉంది. నలుగురు భారతీయులు నిజ్జర్ హత్య కేసులో నిందితులుగా ఉన్నారు. నిజ్జర్ హత్యలో భారత ప్రభుత్వ ప్రమేయం ఉందని కెనడా ఆరోపిస్తోంది. అప్పటినుంచి ఇరుదేశాల మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. 1997లో నకిలీ పాస్‌పోర్ట్‌పై నిజ్జర్ కెనడాకు వెళ్లాడు. శరణార్థిగా కెనడా పౌరసత్వాన్ని కోరాడు. ఇది తిరస్కరణకు గురైంది. అనంతరం తాను కెనడాకు రావడానికి సహాయపడ్డ మహిళను నిజ్జర్ వివాహమాడి మరోమారు పౌరసత్వానికి దరఖాస్తు చేసుకోగా.. మళ్లీ తిరస్కరణకు గురైంది. అయితే నిజ్జర్ హత్యకు గురైన వెంటనే కెనడా ప్రధాని జస్టిన్ ట్రుడెయూ అతను కెనడా పౌరుడని పార్లమెంటులో చెప్పారు. నిజ్జర్ కేటీఎఫ్ కోసం నియామకాలు చేసుకొని.. వారికి శిక్షణ ఇస్తున్నాడని భారత భద్రతా సంస్థలు పేర్కొన్నాయి. నిజ్జర్‌కు కెనడా పార్లమెంటు నివాళి అర్పించడంపై వాంకోవర్‌లోని భారత రాయబార కార్యాలయం స్పందించింది. 1985లో ఎయిర్ ఇండియా కనిష్క విమానంలో ఖలిస్తానీ తీవ్రవాదులు బాంబులు అమర్చడంతో 329 ప్రాణాలు కోల్పోయారు. వారి స్మృత్యర్థం ఈనెల 23న (విమాన ఘటన 39 ఏళ్లు) సంస్మరణ సభ నిర్వహించనున్నట్లు ప్రకటించింది.

మరింత బలమైన మైత్రీబంధం

- ఒకరిపై దాడి జరిగితే తోటి దేశం సాయపడేలా ఒప్పందం
- ద్వైపాక్షిక చర్చలు జరిపిన పుతిన్, కిమ్

సియోల్: పశ్చిమ దేశాల ఆంక్షల కత్తులు వేలాడుతున్నా రష్యా, ఉత్తర కొరియాలు మైత్రిబంధంతో మరింత దగ్గరయ్యాయి. శత్రుదేశం తమపై దాడి చేస్తే తోటి దేశం సాయపడేలా కీలక ఒప్పందం కుదుర్చుకున్నారు. ద్వైపాక్షిక అంశాలపైనా విస్తృతస్థాయి చర్చలు జరిపి కొన్ని కీలక ఉమ్మడి ఒప్పందాలపై రష్యా అధ్యక్షుడు పుతిన్, ఉ.కొరియా నేత కిమ్ జోంగ్ ఉన్ సంతకాలు చేశారు.

ఘన స్వాగతం పలికిన కిమ్

సరిగ్గా 24 ఏళ్ల తర్వాత ఉ.కొరియాలో పర్యటిస్తున్న పుతిన్‌కు ప్యాంగ్యాంగ్ నగర శివారులోని ఎయిర్‌పోర్ట్‌లో కిమ్ ఘన స్వాగతం పలికారు. ఆ తర్వాత కిమ్–2 సంగ్ స్క్వేర్‌లో వేలాది మంది చిన్నారులు బెలూన్లు ఊపుతూ పుతిన్‌కు ఆహ్వానం పలికారు. సైనికుల నుంచి పుతిన్ గౌరవవందనం స్వీకరించారు. తర్వాత అక్కడే తన సోదరి కిమ్ యో జోంగ్‌ను పుతిన్‌కు పరిచయం చేశారు. ఈ సందర్భంగా అక్కడి విమోచనా స్మారకం వద్ద పుతిన్ నివాళులర్పించారు.

పలు రంగాలపై ఒప్పందాలు

'కుమ్‌సుసాన్ ప్యాలెస్ ఆఫ్ ది సన్' అధికార భవనానికీ పుతిన్, కిమ్‌లు ఒకే కారులో వచ్చారు. ద్వైపాక్షిక చర్చల సందర్భంగా భద్రత, వాణిజ్యం, పెట్టుబడులు, సంస్కృతి, మానవ సంబంధాల రంగాల్లో ఒప్పందాలు కుదుర్చుకున్నారు. 1991లో సోవియట్ రష్యా పతనం తర్వాత ఇంతటి విస్తృతస్థాయిలో ఒప్పందాలు కుదుర్చుకోవడం ఇదే మొదటిసారి. 'ఈ ఒప్పందం అత్యంత పటిష్టమైంది. కూటమి అంత బలంగా ఇరుదేశాల సత్సంబంధాలు కొనసాగుతాయి. ఉక్రెయిన్‌లో రష్యా యుద్ధానికి పూర్తి మద్దతు, సాయం ప్రకటిస్తున్నా'' అని కిమ్ అన్నారు. అయితే ఉ.కొరియా ఎలాంటి సాయం చేయబోతోందనేది కిమ్ వెల్లడించలేదు. '' మైత్రి బంధాన్ని సమున్నత శిఖరాలకు చేర్చే విప్లవాత్మకమైన ఒప్పందమిది. అయితే ఉ.కొరియాకు సైనిక సాంకేతిక సహకారం అనేది ఈ ఒప్పందంలో లేదు' అని పుతిన్ స్పష్టంచేశారు. ఇరుదేశాల సరిహద్దు వెంట వంతెన నిర్మాణం, ఆరోగ్యసంరక్షణ, వైద్య విద్య, సామాన్య శాస్త్ర రంగాల్లోనూ ఒప్పందాలు కుదిరాయని రష్యా ప్రకటించింది.


కానుకగా వచ్చిన లిమోజిన్ కారు డ్రైవింగ్ సీట్లో కిమ్, పక్కన పుతిన్

కారు నడిపిన పుతిన్, కిమ్

కుమ్‌సుసాన్ ప్యాలెస్‌కు బయల్దేరిన సందర్భంగా వారు ప్రయాణించిన లిమోజిన్ కారును పుతిన్ స్వయంగా నడిపారు. మార్గ మధ్యంలో ఒక చోట ఆగి పచ్చిక బయళ్లపై కొద్దిసేపు నడుస్తూ మట్లాడుకున్నారు. మార్గమధ్యంలో మరో చోట ఆగి పుతిన్‌కు కిమ్ టీ పార్టీ ఇచ్చారు. తర్వాత సంగీత కచేరీకి వెళ్లారు. తర్వాత కిమ్ సైతం పుతిన్‌ను వెంటబెట్టుకుని ఆ కారును నడిపారు. ఒప్పందాల తర్వాత పుతిన్ చిత్రప టం ఉన్న కళాఖండాలను పుతిన్‌కు కిమ్ బహూకరించారు. కిమ్‌కు పుతిన్ రష్యాలో తయారైన ఆరాస్ లిమోజిన్ కారు, టీ కప్పుల సెట్, నావికా దళ ఖడ్గాన్ని బహుమ తిగా ఇచ్చారు. కిమ్‌కు పుతిన్ లిమోజిన్ కారును బహుమతిగా ఇవ్వడం ఇది రెండోసారి.

నీట్‌లో ఆరుగురి ఫస్ట్ ర్యాంకు గల్లంతు!

న్యూఢిల్లీ: జాతీయ అర్హత, ప్రవేశ పరీక్ష–అండర్ గ్రాడ్యుయేట్(నీట్–యూజీ)లో కొందరు అభ్యర్థులకు కేటాయించిన గ్రేసు మార్కులను రద్దు చేస్తున్నట్లు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) సుప్రీంకోర్టుకు తెలియజేసిన నేపథ్యంలో టాప్ ర్యాంకర్లపై ప్రభావం పడబోతోంది. టాపర్లలో కొందరు 60 నుంచి 70 శాతం పాయింట్లు కోల్పోతారని అంచనా. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈసారి ఏకంగా 67 మంది ఫస్ట్ ర్యాంకు సాధించిన సంగతి తెలిసిందే. వీరిలో గ్రేసు మార్కులతో ఫస్ట్ ర్యాంకు పొందినవారు ఆరుగురు ఉన్నారు. గ్రేసు మార్కులను రద్దు చేస్తుండడంతో వీరు ఫస్టు ర్యాంకును కోల్పోనున్నట్లు సమాచారం. అంటే టాపర్ల సంఖ్య 61కి పరిమితం కానుందని అంచనా వేస్తున్నట్లు ఎన్‌టీఏ వర్గాలు వెల్లడించాయి. నీట్–యూజీలో అక్రమాలు జరిగాయని, 1,563 మందికి ఉద్దేశపూర్వకంగా గ్రేసు మార్కులు కేటాయించారని ఆరోపణలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో అభ్యర్థుల మార్కులను ఎన్‌టీఏ పునర్ మూల్యాంకనం చేస్తోంది. గ్రేసు మార్కులను రద్దు చేసి, మళ్లీ ర్యాంకులు కేటాయించబోతున్నారు. గ్రేసు మార్కులు రద్దయిన వారికి ఈ నెల 23న మళ్లీ పరీక్ష నిర్వహిస్తారు. ఇదిలా ఉండగా, నీట్ పరీక్షలో ఎలాంటి అవకతవకలు జరగలేదని ఎన్‌టీఏ స్పష్టంచేసింది.

యథాతథంగా కౌన్సెలింగ్!

నీట్ కౌన్సెలింగ్‌ను నిలిపివేయాలని, అక్రమాలపై సీబీఐ దర్యాప్తు జరిపించాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు బుధవారం విచారణ చేపట్టింది. షెడ్యూల్ ప్రకారం వచ్చే నెల 6వ తేదీ నుంచి జరగాల్సిన కౌన్సిలింగ్ నిలిపివేసేందుకు నిరాకరించింది.

బీజేపీ గూటికి కిరణ్ చౌదరి

హరియాణా అసెంబ్లీ ఎన్నికల వేళ కాంగ్రెస్‌కు ఎదురుదెబ్బ



న్యూఢిల్లీ: అసెంబ్లీ ఎన్నికల వేళ హరియాణాలో కాంగ్రెస్‌కు గట్టి ఎదురుదెబ్బ తలిగింది. ఎమ్మెల్యే కిరణ్ చౌదరి, ఆమె కూతురు శ్రుతి చౌదరిని కాంగ్రెస్‌ను వీడి బుధవారం బీజేపీలో చేరారు. కేంద్రమంత్రి మనోహర్ లాల్ ఖట్టర్, బీజేపీ ప్రధాన కార్యదర్శి తరుణ్ చుగ్, హరియాణా సీఎం నయాబ్ సింగ్ సైనీల సమక్షంలో వీరిద్దరూ కాషాయ కండువాలు కప్పుకున్నారు. కిరణ్ చౌదరి ఎమ్మెల్యే కాగా, శృతి హరియాణా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎంపీ. హరియాణా మాజీ ముఖ్యమంత్రి బన్సీలాల్ కోడలు కిరణ్. హరియాణా కాంగ్రెస్ పార్టీని సొంత జాగీరులా నడుపుతున్నారని తన బద్ధ విరోధి, మాజీ సీఎం భూపిందర్ సింగ్ హుడాపై కిరణ్ ధ్వజమెత్తారు.

నీళ్లు ఇవ్వకుంటే నిరాహార దీక్ష

- 21 లోగా మాకు నీళ్లివ్వండి
- ప్రధాని మోదీకి ఢిల్లీ జల వనరుల శాఖ మంత్రి ఆతిషి లేఖ



సాక్షి, న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో జల సంక్షోభం రోజురోజుకి ఎక్కువౌతోంది. దాదాపు ప్రతీ ప్రాంతంలో నీటి కొరత నెలకొంది. నీటి సమస్య పరిష్కారానికి సుప్రీం కోర్టు జోక్యం చేసుకున్నా.. రాజధాని వాసులకు ఊరట లభించడం లేదు. రాజకీయ నాయకుల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. తాజాగా ఢిల్లీ జల వనరుల శాఖ మంత్రి ఆతిషి ప్రధాని నరేంద్ర మోదీకి బుధవారం లేఖ రాశారు. ఢిల్లీ ప్రజలకు నీటిని అందించాలని ఆతిషి అభ్యర్థించారు. ఢిల్లీకి 613 ఎంజీడీలను విడుదల చేయాల్సి ఉండగా.. మంగళవారం హరియాణా 513 ఎంజీడీలు మాత్రమే ఇచ్చిందన్నారు. ఒక్క ఎంజీడీతో 28,500 మందికి నీటిని సరఫరా చేయవచ్చని, హరియాణా 100 ఎంజీడీలు ఆపడమంటే.. 28 లక్షల మందికి నీటిని నిరాకరించడమేనని పేర్కొన్నారు. ఢిల్లీకి జూన్ 21లోగా 100 ఎంజీడీల నీరు అందించాలని కోరారు. లేకపోతే జూన్ 21 నుంచి నిరవధిక నిరాహార దీక్ష చేస్తానని ఆమె లేఖలో స్పష్టం చేశారు. హరియాణా నుంచి అయినా, ఎక్కడి నుంచైనా ఢిల్లీ ప్రజలకు నీటిని అందించాలని ఆతిషి కోరారు.

ఎదురొడ్డి నిల్చున్నారు

జన్మదిన వేడుకల్లో రాహుల్‌ను పొగడ్తల్లో ముంచెత్తిన కాంగ్రెస్, 'ఇండియా' నేతలు

న్యూఢిల్లీ: రాజ్యాంగం ప్రబోధించిన అంకితభావం, విలువలున్న రాహుల్ గాంధీ దేశంలో తమ వాణిని వినిపించలేకపోయిన కోట్లాది మందికి గొంతుకగా మారారని రాహుల్‌ను కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే పొగడ్తల్లో ముంచెత్తారు. బుధవారం ఢిల్లీలోని ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో రాహుల్ 54వ పుట్టినరోజు వేడుకను పార్టీ కీలక నేతలు జరిపారు. ఖర్గే, పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, ప్రియాంక గాంధీ, కోశాధికారి అజయ్ మాకెన్ తదితరుల సమక్షంలో రాహుల్ కేక్ కట్‌చేశారు. పెద్దసంఖ్యలో అక్కడికొచ్చిన కార్యకర్తలు రాహుల్‌కు శుభాకాంక్షలు తెలిపారు. దేశవ్యాప్తంగా తన పుట్టినరోజును ఘనంగా జరుపుకోవద్దని సామాజిక, దాతృత్వ కార్యక్రమాల్లో నిమగ్నమవ్వాలని పార్టీ కార్యకర్తలకు రాహుల్ పిలుపునిచ్చారు. '' కాంగ్రెస్ పాటించే సామరస్యం, భిన్నత్వంలో ఏకత్వం, తపన అన్నీ మీలో ప్రతిబింబిస్తున్నాయి. ప్రతి ఒక్కరి కన్నీటి కష్టాలు తుడిచేసి సత్యానికి ఉన్న శక్తిని చాటుతున్నారు' అని ఖర్గే 'ఎక్స్'లో ట్వీట్‌చేశారు. '' నా ప్రియమైన సోదరుడికి పుట్టినరోజు శుభాకాంక్షలు. సమాజం కోసం పరితపించే విలక్షణమైన వ్యక్తి, నా స్నేహితుడు, మార్గదర్శకుడు, నేత' అంటూ ప్రియాంకా ట్వీట్‌చేశారు. ''ప్రియమైన సోదరుడికి పుట్టినరోజు శుభాకాంక్షలు. ప్రజల పట్ల మీకున్న అంకితభావం దేశాన్ని ఉన్నత శిఖరాలకు చేరుస్తుంది' అని తమిళనాడు సీఎం స్టాలిన్ ట్వీట్‌చేశారు. ఉత్తరప్రదేశ్ మాజీ సీఎం, ఎస్పీ చీఫ్ అఖిలేశ్ యాదవ్, ఎన్సీపీ(ఎస్పీ) చీఫ్ శరద్ పవార్, శివసేన (యూబీటీ) నేత ఆదిత్య ఠాక్రే, ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.


ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో రాహుల్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతున్న ఖర్గే, పక్కన ప్రియాంక

రూ.100 కోట్లు డిమాండ్ చేసిన కేజ్రీవాల్

- మా దగ్గర ఆధారాలున్నాయ్
- ఆయనకు బెయిల్ ఇవ్వొద్దు: ఈడీ
- కస్టడీ వచ్చే 3 దాకా పొడిగింపు

న్యూఢిల్లీ: మద్యం కుంభకోణంలో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ సౌత్ గ్రూప్ నుంచి రూ.100 కోట్లు డిమాండ్ చేశారని, ఇందుకు ఆధారాలున్నాయని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టుకు తెలియజేసింది. అప్రూవర్లు ఇచ్చిన స్టేట్‌మెంట్లను చట్టప్రకారం సాక్ష్యంగా పరిగణించవచ్చని వెల్లడించింది. ఢిల్లీ మద్యం కుంభకోణానికి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో కేజ్రీవాల్ జ్యుడీషియల్ కస్టడీ గడువు ముగియడంతో అధికారులు ఆయనను బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టులో ప్రవేశపెట్టారు. అలాగే కేజ్రీవాల్ దాఖలు చేసిన రెగ్యులర్ బెయిల్ పిటిషన్‌పై ప్రత్యేక న్యాయమూర్తి బిందూ విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా కేజ్రీవాల్ తరఫు న్యాయవాది వాదనలు వినిపించారు. కేవలం కొందరు వ్యక్తులు ఇచ్చిన స్టేట్‌మెంట్ల ఆధారంగా కేజ్రీవాల్‌పై అక్రమంగా కేసు నమోదు చేశారని ఆక్షేపించారు. సౌత్ గ్రూప్ నుంచి రూ.100 కోట్లు వసూలు చేసినట్లు కొందరు చెబుతున్నారు తప్ప అందుకు ఎలాంటి ఆధారాలు లేవన్నారు. సౌత్ గ్రూప్ నుంచి ముడుపుల రూపంలో కేజ్రీవాల్ రూ.100 కోట్లు డిమాండ్ చేసినట్లు సీబీఐ విచారణలో తేలిందని ఈడీ వెల్లడించింది. ఆమ్ ఆద్మీ పార్టీ కోసం కేజ్రీవాల్ ఈ డబ్బు డిమాండ్ చేశారని పేర్కొంది. మద్యం కేసులో ఆమ్ ఆద్మీ పార్టీ నేరానికి పాల్పడింది కాబట్టి నాయకత్వం వహిస్తున్న కేజ్రీవాల్ ముమ్మాటికీ దోషి అవుతారని ఈడీ చెప్పింది. దీంతో కేజ్రీవాల్ జ్యుడీషియల్ కస్టడీని వచ్చే నెల 3వ తేదీ దాకా పొడిగిస్తూ న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు. బెయిల్ పిటిషన్‌పై గురువారం కూడా వాదనలు కొనసాగుతాయి.

ఈవీఎంల ట్యాంపరింగ్ సాధ్యమే: సెంథిల్



తిరువళ్లూరు: ఈవీఎంల ట్యాంపరింగ్‌పై కాంగ్రెస్ పార్టీకి ఉన్న అనుమానాల వెనుక బలమైన కారణాలు ఉన్నాయని తిరువళ్లూరు పార్లమెంట్ సభ్యుడు, మాజీ ఐఏఎస్ అధికారి శశికాంత్ సెంథిల్ స్పష్టం చేశారు. ప్రభుత్వ అతిథి గృహంలో బుధవారం కాంగ్రెస్ ఎంపీ శశికాంత్ సెంథిల్ విలేకరులతో మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత అన్ని వర్గాల ప్రజలను టార్గెట్ చేసి, కొన్ని వర్గాలకు పంచిపెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 'సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ గెలుపుపై మాతో పాటు సాధారణ ప్రజలకు కూడా అనుమానం ఉంది. తాము వేసిన ఓటు ఎక్కడికి వెళ్తుందోనని ఆలోచన చేసే స్థాయికి చేరారు. దేశంలో ఈవీఎంలు లేకపోయి ఉంటే బీజేపీ హ్యాట్రిక్ సాధించేదా..? అని ప్రశ్నించారు. ఈవీఎంలను నిషేధించాలన్న తమ పార్టీ విధానానికి ఇప్పటికి కట్టుబడి ఉన్నామన్నారు. ఈవీఎంలను హ్యాక్ చేయడం కుదరదన్న వారే ఎలాన్ మస్క్ సవాలుకు తోక ముడిచారన్నారు.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
గురువారం : 20 : జూన్ : 2024

రాష్ట్రంలో పెంచిన పెట్రోలు, డీజిల్ ధరలను తగ్గించాలంటూ బుధవారం బెంగళూరు స్వతంత్ర పార్కులో వామపక్ష సంఘాల నిరసన



న్యూస్‌రీల్

కామాంధునికి 10 ఏళ్ల జైలు



మైసూరు: అంధ మహిళపై అత్యాచారం చేసిన నేరానికి ఒక వ్యక్తికి 10 ఏళ్ల జైలు శిక్ష, రూ. 20 వేల జరిమానా విధిస్తూ మైసూరు ఏడో అదనపు జిల్లా సెషన్స్ కోర్టు తీర్పు చెప్పింది. మైసూరు జిల్లా హుణసూరు తాలూకా బిళికెరె హోబళి కొమ్మగౌడ కొప్పలు గ్రామ నివాసి చెలువరాజు (50) నిందితుడు. 2019, ఆగస్టులో ఓ అంధ మహిళ ఇంటిలో ఒంటరిగా ఉన్న సమయంలో చెలువరాజు ఆమెపై అత్యాచారానికి ఒడిగొట్టాడు. ఈ విషయం ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదిరించాడు. బాధితురాలు ధైర్యంగా బిళికెరె పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి చెలువరాజును అరెస్టు చేసి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. విచారణలో ఆరోపణలు నిరూపితం కావడంతో అతనికి జడ్జి ఎం.రమేశ్ ఈ మేరకు శిక్ష ఖరారు చేశారు.

అధ్వానంగా ఆర్థిక పరిస్థితి: ఎమ్మెల్సీ

మైసూరు: రాష్ట్రంలో గ్యారంటీ పథకాలు ఎలా నడుస్తున్నాయో, అలాగే అభివృద్ధి పనులు ఎలా సాగుతున్నాయో తెలుసుకునేందుకు వెంటనే శ్వేతపత్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాలని ఎమ్మెల్సీ హెచ్.విశ్వనాథ్ డిమాండ్ చేశారు. బుధవారం మైసూరు ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ హయాంలో ఎలాంటి ఉద్యోగాల భర్తీ జరగడం లేదని ఆరోపించారు. అన్ని ఖాళీలను ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ప్రాతిపదికన నియమించుకుని పనులు చేసుకుంటున్నారని విమర్శించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి పూర్తిగా గాడి తప్పిందని, 15 సార్లు బడ్జెట్ తీసుకొచ్చిన సిద్ధరామయ్య తప్పొప్పుల్ని చూసుకోవడం లేదన్నారు. అనేక శాఖల్లో నిధులు బదలాయింపులు, దుర్వినియోగానికి గురవుతున్నాయని ఆరోపించారు. సిద్ధరామయ్య సర్కార్ ఆర్థికంగా దివాళా తీసిందని మండిపడ్డారు. గ్యారంటీల అమలు కోసం పాట్లు పడుతున్నారని ఎద్దేవా చేశారు.

వైభవంగా జాతర



జ్యోతులు మోస్తున్న మహిళలు

పావగడ: తాలూకాలోని నలిగానహళ్ళి గ్రామంలో దుర్గమ్మ దేవి జాతరను బుధవారం వైభవంగా నిర్వహించారు. ఇటీవల నూతనంగా ప్రతిష్ఠించిన దుర్గమ్మ దేవి ఉత్సవ ప్రతిమను గ్రామంలో ఊరేగించారు. మహిళలు జ్యోతులు మోశారు. యువకులు డ్రమ్ములు, తప్పెట్ల వాద్యాలకు నృత్యాలు చేశారు. గత 14 సంవత్సరాలుగా దుర్గమ్మ దేవి జాతరను నిర్వహిస్తున్నారు.

కొనగలరా.. కూరగాయలు?

కూరగాయలు లేనిదే ఏ వంటా సాగదు. పదో పరకో ఇచ్చి కొనే కాయగూరలు ఇప్పుడు కొండెక్కి కూర్చున్నాయి. మామూలు టమాటా, వంకాయ, బీన్స్ కొనాలంటే పెద్ద మొత్తంలో చెల్లించాల్సిందే. ఎప్పుడూ లేని విధంగా ధరలు పెరిగిపోవడంతో గృహిణులకు చింత ఏర్పడింది. కరోనా లాక్‌డౌన్ కాలంలో లారీల కొద్దీ కూరగాయలు, పండ్లను వృథాగా పడేసిన రోజులను తలచుకుంటే ఆశ్చర్యంగానూ ఉంటుంది.

- భగ్గుమంటున్న ధరలు
- ఏదైనా కేజీ రూ.వంద, రెండు వందలు
- పేద, మధ్య తరగతిపై భారం





బనశంకరి: రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై ప్రతిపక్షాలు ధర్నా చేస్తుంటే, మరోవైపు కూరగాయలు, ఆకుకూరలు, పండ్ల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. నిత్యావసరాలు కాస్తా విలాస వస్తువులుగా మారాయి. స్వీట్లు, గుడ్లు, మాంసం కంటే కూరగాయలు సమస్యగా మారాయి. టమాటాకు ఎక్కడ లేని డిమాండ్ ఏర్పడింది. పచ్చి మిరపకాయ, బీన్స్, కొత్తమీర రేటు ధరలు మండిపోతున్నాయి. ఏది ముట్టుకున్నా రూ. వంద, 2 వందలు దాటుతున్నాయి. నైరుతి రుతు పవనాల వల్ల వర్షాలు అధికమై పంట దిగుబడులు తగ్గిపోయాయి. అంతేగాక పాఠశాల కాలేజీలు హాస్టల్స్, శుభకార్యాలు, హోటల్స్‌లో అధిక డిమాండ్ నెలకొంది. డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా లేకపోవడంతో రేట్లు పెరిగినట్లు వ్యాపారులు, దళారులు చెబుతున్నారు.

బీన్సే బంగారమాయె

గత ఒకటిన్నర నెల నుంచి కూరగాయల ధరలు పెరుగుతూనే ఉన్నాయి. కానీ వారం రోజుల నుంచి ధరలు ఆకాశం వైపు చూస్తున్నాయి. సాధారణంగా కేజీ రూ.50–80 వరకు ఉండే బీన్స్ ధర గత నెల నుంచి కిలో రూ.200 దాటింది. ప్రస్తుతం రూ.250 వరకు చేరుకుంది. ప్రభుత్వ హాప్‌కామ్స్ దుకాణాల్లో కిలో బీన్స్ రూ.229 పలుకుతోంది. మిగతా కూరగాయలదీ అదే తంతు. దీంతో వంట ఎలా చేయాలా అని మహిళలు ఇబ్బంది పడాల్సి వస్తోంది. ఫలితంగా కూరగాయలతో పనిలేని కూరలు, వంటకాలను చేసుకుంటున్నారు. మే నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిరంతరం వర్షాల వల్ల టమాట పంట రోగం బారినపడింది. దీంతో టమాటా కిలో రూ.20 -25 ఉండగా ప్రస్తుతం సెంచరీ దాటగా మరింత పెరిగే అవకాశం ఉంది. వేసవిలో అరటిపండ్లు అడిగేవారే ఉండరు, కానీ మామూలు రకం కిలో రూ.40–50, యాలక్కి రూ.100 ధర పలుకుతున్నాయి.

మరికొంతకాలం తప్పదు

బెంగళూరు గ్రామాంతర, చిక్కబళ్లాపుర, ఆనేకల్, తుమకూరు, నెలమంగల తదితర ప్రాంతాలనుంచి బెంగళూరుకు కూరగాయలు సరఫరా అవుతాయి. ఆషాఢం, మూఢంలో ధరలు తగ్గుతాయని భావిస్తే వ్యతిరేకంగా జరిగింది. మరికొంతకాలం ధరలు ఇలాగే ఉంటాయని కేఆర్ మార్కెట్ కూరగాయల వ్యాపారి ప్రసాద్ తెలిపారు.

బెంగళూరు హాప్‌కామ్స్‌లో కూరగాయల ధరలు (కేజీ, రూపాయలలో)

బీన్స్	రూ.229
వంకాయ	100
బజ్జీ మిరపకాయ	114
క్యాప్సికం	114
ముల్లంగి	70
మునక్కాయ	184
బీరకాయ	100
క్యారెట్	92
నవిలుకోసు	98
టమాటా	100
అల్లం	198
వెల్లుల్లి	338
నాటి కొత్తిమీర	250
యాలక్కి అరటి	86



ఈ ఏడాది ఆరంభంలో కేజీ రూ.60, 70 ఉన్న ధరలు ఇప్పుడు వందను దాటాయి

రైతులపై భల్లూకం దాడి



పావగడ: తుమకూరు జిల్లా పావగడ తాలూకాలోని కేటీ హళ్ళి గ్రామానికి చెందిన ఇద్దరు రైతులపై ఎలుగుబంటి దాడి చేసి గాయపరచిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. వివరాలు.. రైతులు హుత్తన్న, దాసన్న గేదెలు, మేకలను మేపడానికి పొలంలోకి వెళ్ళారు. సాయంత్రం సుమారు 4 గంటల సమయంలో ఓ ఎలుగుబంటి ఇద్దరి పైన దాడి చేసి గాయపరచింది. బాధితులు కేకలు వేస్తూ పరుగులు తీశారు. స్థానికులు వారిద్దరినీ సమీపంలోని కేటీ హళ్ళి పీహెచ్‌సీ కి తరలించి చికిత్స అందించారు. కేటీ హళ్ళి గ్రామం పరిసర ప్రాంతాల్లో ఎలుగుబంట్ల బెడద తీవ్రంగా ఉందని, రైతులు పొలాలకు, ఊరిబయటకు వెళ్లాలంటే భయపడుతున్నామని తెలిపారు. అటవీ అధికారులకు ఎన్నిమార్లు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆరోపించారు. బాధితులకు నష్ట పరిహారం చెల్లించాలని కుటుంబ సభ్యులు కోరారు.

హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్ల గడువు పెంపు

శివాజీనగర: ఇప్పటికే పలుసార్లు వాహనాలకు హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్లను అమర్చుకునే గడువును రాష్ట్ర ప్రభుత్వం పొడిగించింది. సెప్టెంబర్ 15 వరకు మరోసారి విస్తరించింది. రాష్ట్రంలో అన్ని రకాల వాహనాలు ఈ నంబర్ ప్లేట్లను అమర్చుకోవడాన్ని తప్పనిసరి చేసింది. కానీ నంబరు ప్లేట్ల కొరత వల్ల అనేక మంది అమర్చుకోలేకపోయారు. ఈ నేపథ్యంలో హైకోర్టులో కేసులు వేయడంతో కోర్టు గడువును జూలై 4 వరకు పొడిగించింది. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబర్ 15 వరకు మినహాయింపును ఇవ్వడంతో వాహనదారులకు ఊరట లభించింది.

చాక్లెట్‌లో పురుగులు వచ్చాయని ధర్నా

బళ్లారి అర్బన్: మూన్ వాకర్స్ సాంస్కృతిక కళా సంఘం ఇటీవల నిర్వహించిన వార్షికోత్సవంలో స్థానిక దుర్గమ్మ గుడి వద్ద గల బేకరిలో బిస్కెట్, జూస్ బాటిల్లు, తదితరాలను కొనుగోలు చేశారు. అక్కడ కొనుగోలు చేసిన చాక్లెట్ కవర్‌ని ఓపెన్ చేయగానే పురుగు బయటకు వచ్చింది. అది తెలియక తిన్న కొందరు పిల్లలు, విద్యార్థులు వాంతులు చేసుకున్నారు. ఈ విషయాన్ని బేకరి యజమాని దృష్టికి తేగా ఇందులో మా బాధ్యత ఏమీ లేదని, చాక్లెట్ తయారు చేసిన కంపెనీదే బాధ్యత అని సమాధానం ఇచ్చారని పృథ్వీరాజ్, వసంత్‌కుమార్ తెలిపారు. జిల్లాధికారికి వినతి పత్రాన్ని సమర్పించారు. సదరు బేకరిలో ఆహార నాణ్యత అధికారులు సోదాలు చేసి చర్యలు తీసుకోవాలని ర్యాలీ నిర్వహించారు.

అన్న చేతిలో సోదరి హతం

- ఆస్తి గొడవలతో దారుణం
- 6 మంది అరెస్టు



పట్టుబడిన నిందితులు



హత్యకు గురైన నర్సు సత్యభామ (ఫైల్)

శివాజీనగర: ఆస్తుల ముందు అనుబంధాలు చిన్నబోతున్నాయి. సొంత సోదరిని అన్న కడతేర్చాడు. ఆస్తి గొడవల్లో ఓ మహిళను హత్య చేసిన ఆరోపణతో ఆరుమంది నిందితులను నగరంలోని హైగ్రౌండ్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. సాగర్ (20), ఆకాశ్ (19), శివశంకర్ (50), ప్రవీణ్ (24), పూజా (22) గాయత్రిదేవి (52) అరెస్ట్ అయిన నిందితులు. వివరాలు.. నగరం నడిబొడ్డున విండ్సర్ మ్యానర్ హోటల్ వద్ద సామిని సత్యభామ (46) అనే మహిళను జూన్ 11న రాత్రి హోటల్ హెల్మెట్లు ధరించి వచ్చిన దుండగులు హత్యచేశారు. ఆమె ఒక ఆస్పత్రిలో నర్సుగా పనిచేసేది. సామిని సోదరుడైన శివశంకర్ కారణమని పోలీసులు తేల్చారు. చామరాజపేటలో తల్లిదండ్రుల ఆస్తిలో భాగం రాలేదనే కోపంతో శివశంకర్, అతని కుమారుడు సాగర్ ఆమె హత్యకు ప్లాన్ చేశారు. సామిని డ్యూటీ పూర్తిచేసుకొని వెళుతుండగా విండ్సర్ మ్యానర్ వంతెన వద్ద దాడి చేయించాడు. కత్తులు, రాడ్లతో కొట్టి చంపి పరారయ్యారు. కేసు నమోదు చేసుకొని తనిఖీ జరిపిన పోలీసులు.. సొంత కుటుంబీకులే కారణమని తేల్చారు. బుధవారం శివశంకర్, ముఠాని అరెస్ట్ చేశారు.

కేసును బలహీనపరచబోం: హోంమంత్రి

శివాజీనగర: రేణుకాస్వామి హత్య కేసును బలహీనపరిచే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని, స్పెషల్ ప్రాసిక్యూటర్ ప్రసన్నకుమార్ మార్పు గురించి తెలియదని, ఒకవేళ మార్చినప్పటికీ తప్పేమి లేదని హోం మంత్రి జీ.పరమేశ్వర్ అన్నారు. సదాశివనగర తన ఇంటి వద్ద మీడియాతో మాట్లాడిన ఆయన, నటుడు దర్శన్ కేసులో చట్టం, న్యాయ నిపుణుల సలహా మేరకే అన్ని జరుగుతున్నట్లు చెప్పారు. బీజేపీ గురువారం పెట్రో ధరలపై చేపట్టే రాస్తారోకోపై స్పందిస్తూ పోలీసుల అనుమతి తీసుకొని నిరసనలు చేయాలి, లేదంటే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే ధర్నాలు చేశారు, పదేపదే ఆందోళనలు చేయడం ఎందుకని అన్నారు.

ఆలయానికి వెళ్లి వస్తూ దంపతుల దుర్మరణం




ప్రమాదంలో విగతజీవులైన దంపతులు

బళ్లారి అర్బన్: బళ్లారి తాలూకాలోని కక్కబేవినహళ్లి గ్రామ సమీపంలో టిప్పర్ ఢీకొని భార్యభర్తలు దుర్మణం పాలయ్యారు. సండూరు తాలూకా హొసదరోజికి చెందిన నాగరాజు (45), భార్య పార్వతి (38), కుమారుడు రాకేష్‌తో కలిసి అనంతపురం జిల్లా విడపనకల్లులోని సుంకులమ్మ ఆలయానికి వెళ్లారు. ఆలయంలో పూజలు ముగించుకొని బైక్ పై తిరిగి వస్తుండగా ఘటనాస్థలి వద్ద ఎదురుగా వస్తున్న టిప్పర్ లారీ బైక్‌ను బలంగా ఢీకొనింది, దీంతో భార్య భర్తలు తీవ్రగాయాలతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. కుమారుడు రాకేష్‌కు గాయాలు అయ్యాయి. స్థానికులు బళ్లారి పోలీసులకు సమాచారం ఇవ్వగా చేరుకుని మృతదేహాలను, బాలున్ని విమ్స్ ఆస్పత్రికి తరలించారు. ఈ మార్గంలో టిప్పర్లు, ట్రక్కులు వంటి భారీ వాహనాలు అతివేగంగా సంచరిస్తూ ఉంటాయి. దీనివల్ల తరచూ చిన్నా పెద్ద ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. స్పీడ్ బ్రేకర్లు, హెచ్చరిక బోర్డులు వంటివి ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేశారు.



డిమాండ్ల సాధన కోసం బెంగళూరు ఫ్రీడంపార్క్‌లో అంగన్‌వాడీల ధర్నా



పార్కింగ్ భవంతి లోపల ఆర్ట్ గ్యాలరీ తరహాలో అలంకారం

హైటెక్ పార్కింగ్

- బెంగళూరు ఫ్రీడంపార్క్‌లో నేడు ఆరంభం

బనశంకరి: బెంగళూరు నగరంలో బైక్‌లు, కార్లలో సంచరించడం బాగానే ఉంటుంది కానీ, వాటిని పార్క్ చేయడానికి తిప్పలు తప్పవు. రోడ్డు పక్కన నిలిపితే జరిమానా తప్పదు. ఇలాంటి తరుణంలో బీబీఎంపీ ఫ్రీడంపార్క్‌లో రైట్ పార్కింగ్ పేరుతో బహుళ అంతస్తుల పార్కింగ్ భవనాన్ని నిర్మించింది. గత నాలుగైదేళ్లుగా నిర్మాణంలో ఉన్న భవనం పూర్తయి గురువారం నుంచి అందుబాటులోకి రాబోతోంది. ఇందులో 600 కార్లు, 750 బైక్‌లను పార్క్ చేయవచ్చు. బైక్‌కు గంటకు రూ.7.50 పాటు జీఎస్టీ, కారుకైతే రూ.12.50, జీఎస్టీ అదనం. ఇది భారతదేశంలోనే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించినట్లు పాలికె అధికారులు తెలిపారు. ఇందులో ఉన్నంతసేపు వినియోగదారులకు ఉచిత వై-ఫై లభిస్తుంది. 2 కిలోమీటర్ల వరకూ ఉచిత బస్ పాస్ ఇస్తారు. దివ్యాంగుల వాహనాలకు ప్రత్యేక పార్కింగ్ వ్యవస్థ ఉంటుంది. భవనం లోపల రాష్ట్ర ఘన చరితకు అద్దం పట్టే చిత్రాలు ఆకట్టుకుంటాయి.



వాహనాలు నిలిపే ప్రదేశం



రైట్ పార్కింగ్ సముదాయం

దర్శన్‌ను కలిసిన సతీమణి

- అరెస్టయ్యాక తొలిసారి భేటీ
- చట్ట ప్రకారం దర్యాప్తు: సీఎం సిద్దు



విజయలక్ష్మి, దర్శన్, విజయలక్ష్మి (ఫైల్)

దొడ్డబళ్లాపురం: రేణుకాస్వామి హత్య కేసులో అరెస్టై పోలీసుల కస్టడీలో ఉన్న హీరో దర్శన్‌ను ఆయన భార్య విజయలక్ష్మి కలిశారు. అన్నపూర్ణేశ్వరి నగర పోలీస్ స్టేషన్‌లో కస్టడీలో ఉన్న దర్శన్‌ను బుధవారం ఆమె వెళ్లి కలిసి కాసేపు చర్చించారు. ఈ నెల 10న దర్శన్ అరెస్టయ్యాక విజయలక్ష్మి ఇన్‌స్టా గ్రామ్ ప్రొఫైల్ ఫోటోను తొలగించి, దర్శన్‌ను అన్‌ఫాలో చేసింది. అంతేకాక ఈ కేసు గురించి ఒక్క మాట కూడా మాట్లాడలేదు. దర్శన్‌కు బెయిల్ ఇప్పించడానికి, కేసు వాదించడానికి రంగనాథరెడ్డి, అనిల్‌బాబు అనే లాయర్లను ఆమె నియమించింది. మరోవైపు పోలీసులు రేణుకాస్వామి హత్య కేసులో ఆమెను కూడా ఠాణాకు పిలిపించి విచారించారని ప్రచారం సాగుతోంది. పవిత్ర వల్ల వారి సంసారంలో తీవ్ర గొడవలు ఏర్పడ్డాయి. దంపతులు ఎడమొహం, పెడమొహంగా ఉంటున్నారు.

రూ.30 లక్షలు ఇచ్చానన్న దర్శన్

హత్యకు, మృతదేహాన్ని తరలించేందుకు రూ.30 లక్షలు ఇచ్చినట్టు దర్శన్ ఒప్పుకున్నట్టు పోలీసుల సమాచారం. అయితే పట్టణగెరెలోని షెడ్‌లో రేణుకాస్వామిపై జరిగిన దాడిలో తాను పాల్గొనలేదని చెబుతున్నాడు. రేణుకాస్వామి హతమయ్యాక కేసు తనపై రాకుండా ఉండేందుకు శవాన్ని తరలింపు పనులు తదితరాల కోసం రూ.30 లక్షలు ఇచ్చినట్టు దర్శన్ ఒప్పుకున్నాడు. హత్య జరిగిన రోజు దర్శన్ తన జీప్‌లో షెడ్ వైపు రావడం సమీపంలోని సీసీటీవీ కెమెరాల్లో రికార్డయింది. షెడ్‌లో ఉన్న సీసీ కెమెరా చిత్రాలను దర్శన్ అనుచరులు మాయం చేశారు.

సాక్ష్యాధారాల సేకరణ

రేణుకాస్వామి హత్య కేసులో అతన్ని కిడ్నాప్ చేసిన ఎటియోస్ కారును చిత్రదుర్గలో స్వాధీనం చేసుకున్నారు. మృతదేహాన్ని తరలించే క్రమంలో శవం మీదున్న బంగారు ఉంగరం, చైన్, వాచ్ దోచిన జగదీష్, అనుకుమార్‌ల నుండి వాటిని రికవరీ చేసుకున్నారు. మరో నిందితుడు రాఘవేంద్ర ఆర్‌ఆర్ నగర్లోని ఐడియల్ హోమ్స్‌లో వదిలేసిన దుస్తులు, చెప్పులను స్వాధీనం చేసుకున్నారు. దర్శన్ ఇంటిలో హత్య రోజున ఆయన ధరించిన షూస్ , దుస్తులు వగైరా స్వాధీనం చేసుకున్నారు. దర్శన్, అనుచరులకు బుధవారంనాడు పోలీసులు డీఎన్ఏ, రక్త, ఆరోగ్య పరీక్షలు జరిపించారు. విక్టోరియా ఆస్పత్రిలో దర్శన్, పవిత్ర సహా 10 మందికి డీఎన్ఏ పరీక్షలు చేయించారు.

చట్ట ప్రకారం దర్యాప్తు: సీఎం

శివాజీనగర: రేణుకాస్వామి హత్య కేసులో తనిఖీకి పోలీసులకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చినట్లు సీఎం సిద్దరామయ్య తెలిపారు. నగరంలో ఆయన మాట్లాడుతూ పోలీసు అధికారులు, లాయర్ల మార్పుపై మీడియాలో జరుగుతున్న ప్రచారం అబద్ధం, చట్టం ఏమి చెబుతుందో దానినే తాము చేస్తామన్నారు. పోలీసులకు ఈ కేసులో పూర్తి స్వేచ్ఛ ఇవ్వడమైనది. చట్ట ప్రకారం దర్యాప్తు చేయాలని ఆదేశించినట్లు చెప్పారు.

దర్శన్ భార్యపై పవిత్ర మాజీ భర్త ఆగ్రహం



పవిత్రగౌడ, భర్త సంజయ్‌సింగ్ (ఫైల్)

దర్శన్ భార్య విజయలక్ష్మిపై నటి పవిత్రగౌడ మాజీ భర్త సంజయ్‌సింగ్ మండిపడ్డాడు. సోషల్ మీడియాలో పలు ప్రశ్నలను సంధించాడు. దర్శన్‌తో 10 ఏళ్ల నుండి సంబంధం ఉన్నట్టు పవిత్ర కొన్ని ఫోటోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేసిందన్నారు. పవిత్ర దర్శన్‌ను బుట్టలో వేసుకుందని ఆరోపించే విజయలక్ష్మి ఆమె భర్తను అదుపులో పెట్టుకోలేపోయిందని దుయ్యబట్టాడు. 10 ఏళ్ల నుంచి వారిద్దరి గురించి ఆమెకు తెలియదా అని ప్రశ్నించాడు. ఈ హత్య కేసుతో పవిత్రకు సంబంధం లేదని నమ్ముతున్నానన్నాడు. బెంగళూరులో చామరాజపేటకు చెందిన సంజయ్‌సింగ్ చిరు వ్యాపారి, పవిత్రను అతడు ప్రేమించి పెళ్లాడాడు. తరువాత ఆమె సినిమాలలోకి రావడం, దర్శన్‌తో సహజీవనంతో పేరుపొందింది.

క్లుప్తంగా

సంయుక్త సేద్యంపై జాగ్రత



సిద్దనపల్లి గ్రామంలో రైతులకు శిక్షణ అందజేస్తున్న దృశ్యం

హోసూరు: సంయుక్త వ్యవసాయంతో అధిక లాభాలు పొందవచ్చని క్రిష్ణగిరి వ్యవసాయ శాఖ ఉపడైరెక్టర్ బాలసుబ్రమణ్యం రైతులకు సూచించారు. బుధవారం హోసూరు తాలూకా సిద్దనపల్లి గ్రామంలో పొలాల్లో రైతులకు అవగాహన కల్పించారు. సంయుక్త వ్యవసాయం ద్వారా ప్రతి రైతు అధిక లాభాలను ఆర్జించవచ్చునని, సేంద్రియ పద్ధతిలో పంటలు పండించాలని సూచించారు. అంతర్ పంటల ద్వారా అధిక లాభాలు పొందవచ్చని, రైతులు కొద్ది పాటి మెళకువలు పాటించి ఎక్కువ దిగుబడి, అధిక లాభాలను పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

ఆయుష్ తొలి డైరెక్టర్ రంగకర్మి న.రత్న కన్నుమూత



న.రత్న(ఫైల్)

మైసూరు: రంగకర్మి, మైసూరు అఖిల భారత వాక్కు, శ్రవణ సంస్థ (ఆయిష్) తొలి డైరెక్టర్ న.రత్న (89) గుండెపోటుతో బుధవారం ఉదయం బెంగళూరులో కన్నుమూశారు. ఆయనకు భార్య లత, కుమారుడు, కుమార్తె ఉన్నారు. తమిళనాడుకు చెందిన ఈయన 1934, డిసెంబర్ 12న జన్మించారు. న్యూయార్క్ హంటర్ వర్సిటీ, ఇండియానా వర్సిటీలో వాక్కు, శ్రవణ విద్యలో ఎంఎస్, డాక్టరేట్ డిగ్రీ పొందారు. 1966లో ఆయిష్‌ను స్థాపించి తొలి డైరెక్టర్‌గా నియమితులయ్యారు. 1989 వరకు సేవలందించారు. 1985–87లో యవర్‌జంగ్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హియరింగ్ హ్యాంటికెప్డెన్ డైరెక్టర్‌గా పని చేశారు. 2005లో కర్ణాటక నాటక అకాడమీ అవార్డు, 2013లో రాజ్యోత్సవం అవార్డుతో పాటు ఎన్నో అవార్డులు, రివార్డులు సాధించారు. సరస్వతీపురం జోడి రోడ్డులోని ఆయన నివాసంలో పార్థీవదేహాన్ని అంతిమ దర్శనం కోసం ఉంచారు. ఎలాంటి ధార్మిక విధి విధానాలు లేకుండా జేఎస్ఎస్ ఆస్పత్రికి న.రత్న దేహాన్ని దానం చేశారు.


కాలం చెల్లిన ఆహారం విక్రయిస్తే కఠిన చర్యలు

శివాజీనగర: బస్టాండ్లలోని దుకాణాల్లో కాలావధి మీరిన ఆహార పదార్థాలను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. శుభ్రత పాటించకపోవంతోపాటు కాలం చెల్లిన ఆహారాన్ని విక్రయిస్తున్నట్లు ఫిర్యాదులు రావడంతో రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేట్ బస్టాండ్లలో ఈనెలలో తనిఖీలు చేశారు. 748 వ్యాపార దుకాణాలు, ఆహార పదార్థాలను శాంపుల్స్‌గా సేకరించారు. ఇకపై ఆహార సురక్షిత, నాణ్యత చట్టం 2006, 2011 నియమాలను పాటించకపోతే చర్యలు తప్పవని హెచ్చరిస్తూ ముఖ్యమంత్రి కార్యాలయం ఆ ప్రకటనలో పేర్కొంది.

నటుడు ప్రథమ్‌కు బెదిరింపు కాల్స్

శివాజీనగర: తనకు ప్రాణబెదిరింపు కాల్స్ వచ్చినట్లు బిగ్ బాస్ ప్రముఖ నటుడు ప్రథమ్ జ్ఞానభారతి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని సామాజిక మాధ్యమాల్లో అప్‌లోడ్ చేశారు. తనకు నిత్యం బెదిరింపు ఫోన్ కాల్స్ వస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రథమ్ ఇటీవల రేణుకాస్వామి కేసుకు సంబంధించి మాట్లాడారు. ఇది దర్శన్ అభిమానుల కోపానికి కారణమైంది. ఇదే కారణంతో కొందరు దర్శన్ అభిమానులు ప్రథమ్‌కు బెదిరింపు కాల్‌లు చేస్తున్నట్లు తెలిసింది.

హాస్టల్ తనిఖీ



వంటగదిని పరిశీలిస్తున్న కలెక్టర్ శుభకల్యాణ్

తుమకూరు: సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలోని కొరటిగెరె పట్టణంలో ఉన్న డాక్టర్ అంబేడ్కర్ ప్రభుత్వ మెట్రిక్ బాలుర హాస్టల్‌ను బుధవారం జిల్లాధికారి శుభకల్యాణ్ తనిఖీ చేశారు. విద్యార్థులకు కల్పిస్తున్న సదుపాయాలపై ఆరా తీశారు. హాస్టల్ వార్డెన్, సిబ్బందితో మాట్లాడి వివరాలు తీసుకున్నారు. అనంతరం వంటగది, వసతి గదులు పరిశీలించి స్వచ్ఛతపై పలు సూచనలు చేశారు.

అడవిలో ఏనుగు మృతి

మైసూరు: జిల్లాలోని నాగరహోళె జాతీయ ఉద్యానవనం అంతరసంతె జోన్‌లో అడవి ఏనుగు మరణించింది. గస్తీలో ఉన్న సిబ్బంది అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. డీసీఎఫ్ డాక్టర్ హర్షకుమార్, ఆర్ఎఫ్‌వో భరత్ తదితరులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. వెటర్నరీ డాక్టర్ ప్రసన్న ఏనుగు కళేబరానికి పోస్టుమార్టం నిర్వహించారు. సుమారు 25 నుంచి 30 ఏళ్ల ఆడ ఏనుగుగా గుర్తించారు. సహజంగా మరణించినట్లుగా ఉన్నప్పటికీ కచ్చితమైన కారణాలు ఇంకా తెలియరాలేదు. కళేబరాన్ని ఇతర ప్రాణుల ఆహారం కోసం అక్కడే వదిలేశారు.

లక్ష్యాన్ని మించి ఉపాధి పనులు

- రాష్ట్రంలోనే బళ్లారి జిల్లాకు అగ్రస్థానం
- రెండో స్థానంలో నిలిచిన గదగ్ జిల్లా



ఉపాధి హామీ పనుల్లో చురుకుగా పాల్గొన్న కూలీలు



పరికరాలతో పనులకు వెళుతున్న మహిళా కూలీలు

సాక్షి బళ్లారి: గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న వ్యవసాయ కూలీలకు ఉపాధి హామీ పనులు పెద్ద దిక్కుగా మారాయి. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఉపాధి హామి పథకం పనుల ద్వారా వ్యవసాయ కూలీలకు కడుపు నిండడంతో పాటు పలు గ్రామాల్లో అభివృద్ధి పనులు జరగడానికి కూడా దోహద పడుతోంది. కర్ణాటక రాష్ట్రంలో 31 జిల్లాల్లో బళ్లారి జిల్లా ఉపాధి హామీ పనులు ఎక్కువగా చేయించిన జిల్లాల్లో మొదటి స్థానంలో నిలిచిందంటే జిల్లాలో ఏ మేరకు వ్యవసాయ కూలీలు ఉపాధి హామి పనుల ద్వారా లబ్ధి పొందారో అర్థం చేసుకోవచ్చు. జిల్లా వ్యాప్తంగా ఐదు తాలూకాలకు గాను 100 గ్రామ పంచాయతీల్లో 1,80,000 ఉపాధి హామీ జాబ్‌కార్డుల ద్వారా దాదాపు 5 లక్షల మంది ఉపాధి హామీ పనులు చేయడానికి నమోదు చేయించుకున్నారు. వీరిలో వ్యవసాయ కూలీలతో పాటు సన్న, చిన్నకారు, మోతుబరి రైతులు కూడా ఉపాధి హామీ పనుల్లో పాల్గొని ఉపాధి పొందుతున్నారు.

చురుగ్గా పాల్గొంటున్న రైతు కూలీలు

ఉదయం లేస్తూనే రైతు కుటుంబాలు వ్యవసాయ పొలాలకు ఎలా వెళ్తారో అంతకన్నా పదింతలు ఎక్కువగా గ్రామీణ ప్రాంతాల్లో జాతర తరహాలో పలుగు, పార, గడార పట్టుకొని ఉపాధి హామీ పనుల్లో చురుకుగా పాల్గొంటున్నారు. ఈఏడాది జిల్లా వ్యాప్తంగా 60 లక్షల పనిదినాలు కల్పిస్తే ఇప్పటికే దాదాపు 38 లక్షల పనిదినాలు పూర్తి కావడంతో లక్ష్యానికి మించి దాదాపు 63 శాతం ఉపాధి హామీ పనులు సాధించినట్లు అధికారుల గణాంకాలు తెలియజేస్తున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 31 జిల్లాల్లో 13 కోట్ల మానవ పని దినాలు నిర్దేశించగా జిల్లాకు 62 లక్షల పనిదినాలు కల్పిస్తే రాష్ట్రంలో బళ్లారి జిల్లా ప్రథమ స్థానం, గదగ్ జిల్లా రెండో స్థానం, బెంగళూరు చివరి స్థానంలో నిలిచింది. రాయచూరు మూడో స్థానం, విజయనగర జిల్లా నాలుగో స్థానం, కొప్పళ ఐదో స్థానం, ఉడిపి ఆరో స్థానం, కలబుర్గి ఏడో స్థానం, బీదర్ ఎనిమిదో స్థానం, శివమొగ్గ తొమ్మిదో స్థానం, హావేరి పదో స్థానంలో నిలిచినట్లు తెలిసింది.

గ్రామాల్లో అభివృద్ధికి ఊతం

ఉపాధి హామీ పనుల ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా వ్యవసాయ ఫారంపాండ్, చెరువులు, తుంగభద్ర ఆయకట్టు పరిధిలోని కాలువల్లో పూడికతీత, చెక్ డ్యాంలు, బోరుబావుల నిర్మాణం, గ్రామాల్లో మట్టి రోడ్లు తదితర పనులు చేయడం ద్వారా ఇటు గ్రామాల్లో అభివృద్ధి పనులతో పాటు ఉపాధి హామీ కల్పిస్తూ వ్యవసాయ కూలీలకు అండగా నిలుస్తుండటంతో రాష్ట్రంలోనే బళ్లారి జిల్లా వాసులు ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకొన్నారు. గత ఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితులతో పంటలను నష్టపోయిన రైతులకు ఉపాధి హామీ పనులు కూడా ఆసరాగా నిలిచాయి. రైతాంగంతో పాటు కూలీలకు ప్రతి రోజు ఈ పనుల ద్వారా ఒక్కొక్కరికి రూ.300లకు పైగా కూలీ అందుతుండటంతో నెలకు రూ.7 వేల నుంచి రూ.8 వేల వరకు ఆదాయం పొందుతున్నారు. రైతులు వ్యవసాయ కూలీలతో పాటు డిగ్రీ చదివిన నిరుద్యోగులు సైతం ఉపాధి హామీ పనుల్లో పాల్గొని ఉపాధిని పొందుతుండటం గమనార్హం.



ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు

ఇన్‌చార్జి మంత్రిని మార్చాలని ధర్నా



ధర్నా నిర్వహిస్తున్న రైతు సంఘం పదాధికారులు

కోలారు: రైతుల సమస్యలపై స్పందించని ఇన్‌చార్జ్ మంత్రిని మార్చాలని డిమాండ్ చేస్తూ రైతు సంఘం పదాధికారులు బుధవారం నగర సమీపంలోని జాతీయ రహదారిపై ధర్నా నిర్వహించారు. సంఘం ఉపాధ్యక్షుడు కె నారాయణగౌడ మాట్లాడుతూ జిల్లాలో ముంగారు వానలకు రైతుల బతుకు ఛిద్రమైందన్నారు. దీనికి తోడు టమాటా పంటకు నానా రోగాలు తగిలి పంట తీవ్రంగా తగ్గిందన్నారు. ప్రైవేటు కంపెనీల వారు నకిలీ విత్తనాలు, మందులను విక్రయించడం వల్ల ఎన్ని మందులు చల్లినా రోగాలు అదుపులోకి రాలేదన్నారు. దీని వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ఇలాంటి సమయంలో రైతులను ఆదుకోవాల్సిన జిల్లా ఇంఛార్జి మంత్రి భైరతి సురేష్ రైతుల సమస్యలపై ఏమాత్రం స్పందించడం లేదన్నారు. ఇలాంటి మంత్రి తమకు అవసరం లేదు. వెంటనే ఆయనను మార్చాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ ద్వారా ముఖ్యమంత్రికి వినతిపత్రం సమర్పించారు. ధర్నాలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఫారూక్‌పాషా, జిల్లా అధ్యక్షుడు ఈకంబళ్లి మంజునాథ్, రాష్ట్ర కార్యదర్శి బంగారి మంజు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

క్వారీ నుంచి మృతదేహం వెలికితీత



ప్రవీణ్(ఫైల్)



ఘటనా స్థలంలో పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

మాలూరు: తాలూకాలోని టేకల్ ఫిర్కా హళపాళ్య గ్రామం వద్ద రాతి క్వారీలో హిటాచి వాహనం బోల్తా పడి మరణించిన డ్రైవర్ ప్రవీణ్ మృతదేహాన్ని 24 గంటల అనంతరం బుధవారం 10 గంటలకు పోలీసులు వెలికితీశారు. ఆ సమయంలో అక్కడే ఉన్న సంబంధీకుల రోదన మిన్నంటింది. ఎమ్మెల్యే కేవై నంజేగౌడ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఆ సమయంలో ఎమ్మెల్యే అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కొంతమంది ఇక్కడ అనధికారికంగా యంత్రాలను ఉపయోగించి క్వారీ తవ్వకాలు చేస్తున్నారని, అధికారులు కళ్లు మూసుకుని ఎందుకున్నారని ప్రశ్నించారు. మృతుడి కుటుంబానికి సాంత్వన తెలిపారు. ఇకపై ఇలాంటి ఘటనలు జరగకుండా జాగ్రత్త పడాలని అధికారులకు సూచించారు. ఘటనా స్థలం వద్దకు కలెక్టర్ అక్రం పాషా, ఎస్పీ ఎం నారాయణ, తహసీల్దార్ రమేష్, గనులు భూ విజ్ఞాన శాఖ అధికారులు వచ్చి పరిశీలించి వెళ్లారు.

దొడ్డమ్మ ఆలయంలోకి వర్షం నీరు



పై వంతెన కింద నిల్వ ఉన్న వర్షం నీరు

తుమకూరు: నగరంలోని క్యాత్సంద్ర ఆది శక్తి దొడ్డమ్మ ఆలయంలోకి వర్షపు నీరు చేరడంతో భక్తులు ఇబ్బందులు పడ్డారు. క్యాత్సంద్ర నుంచి సిద్ధగంగ మఠానికి నిర్మించిన పై వంతెన దిగువన రోడ్డు, కాలువ నిర్మాణాలు పూర్తి కాకపోవడంతో ఈ ఇబ్బంది ఏర్పడింది. వంతెన పనులు పూర్తయి నెలలు అవుతోంది. వాహనాల రాకపోకలు కూడా సాగిస్తున్నాయి. అయితే వంతెన కింద రెండు లైన్ల రోడ్డు, కాలువ పనులు మాత్రం పూర్తి చేయలేదు. దీంతో వర్షం పడితే వంతెన కిందకి వచ్చేనీరు పల్లపు ప్రాంతంలో ఉన్న ఆలయంలోకి ప్రవహిస్తోంది. దీంతో ఆలయంఒ పూజా కైంకర్యాలకు అడ్డుగా మారింది. అధికారులు స్పందించి ఆలయంలోకి నీరు రాకుండా చూడాలని భక్తులు కోరుతున్నారు.

టిప్పర్‌ను ఢీకొని బైకిస్టు మృతి



టిప్పర్ కిందకు దూసుకెళ్లిన బైక్

దొడ్డబళ్లాపురం: టిప్పర్‌ను ఢీకొని బైకిస్టు మృతి చెందాడు. ఈఘటన దొడ్డ తాలూకా మాచగొండనహళ్లి వద్ద చోటుచేసుకుంది. బీహార్‌కు చెందిన ధర్మేంద్రకుమార్, ఆదిత్యసింగ్‌లు మంగళవారం రాత్రి బైక్‌పై వస్తూ మాచగొండనహళ్లి వద్ద రోడ్డు పక్కన నిలిపి ఉన్న టిప్పర్‌ను వెనుక వైపు ఢీకొన్నారు. బైక్ టిప్పర్ కిందకు దూసుకెళ్లడంతో ధర్మేంద్రకుమార్ మృతి చెందగా ఆదిత్య సింగ్ తీవ్రంగా గాయపడ్డాడు. దొడ్డ రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

నేడు, రేపు సీఎం పర్యటన

సాక్షి,బళ్లారి/బళ్లారిఅర్బన్: రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్దరామయ్య గురు, శుక్రవారాల్లో రెండు రోజుల పాటు ఉమ్మడి బళ్లారి జిల్లాలో పర్యటించనున్నారు. గురువారం సాయంత్రం ఆయన బెంగళూరు హెచ్ఏఎల్ విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో తోరణగల్లు విమానాశ్రయానికి చేరుకుని, అదే రోజు రాత్రికి జేఎస్‌డబ్ల్యూ ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా రత్న కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం అక్కడే బస చేసి, 21న ప్రపంచ యోగా దినోత్సవంలో భాగంగా తోరణగల్లులోని జిందాల్ ఫ్యాక్టరీ విద్యానగరలో నిర్వహించే యోగా కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం అక్కడ నుంచి విజయనగర జిల్లాలో వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటున్నట్లు అధికారులు తెలిపారు.

యువతితో ప్రేమ.. యువకుడిపై దాడి

హుబ్లీ: యువతితో ప్రేమ విషయంలో ఆమె కుటుంబ సభ్యులు యువకుడిపై తీవ్రంగా దాడి చేసిన ఘటన హుబ్లీ తాలూకా సుళ్ళ గ్రామంలో చోటు చేసుకుంది. ఆ గ్రామ నివాసి దమ్మనగౌరి దాడికి గురైన యువకుడు. అదే గ్రామానికి చెందిన శాంతినాథ్ తిక్కనవర, విద్యాధర, పార్శ్వనాథ, కల్మేష, దర్శన్ అనే వ్యక్తులు దాడి చేసినట్లు బాధితుడు హుబ్లీ గ్రామీణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

దొంగ అరెస్టు.. నగదు, ల్యాప్‌టాప్‌లు స్వాధీనం

మైసూరు: ఇంట్లో చోరీలకు పాల్పడుతున్న దొంగను హెబ్బాళ పోలీసులు అరెస్టు చేశారు. అతని వద్దనుంచి సుమారు రూ. 2.22 లక్షల విలువ చేసే ఏడు ల్యాప్‌టాప్‌లు, రెండు మొబైళ్లు, రూ. 2 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. హెబ్బాళ పారిశ్రామిక ప్రాంతంలోని ఒక పీజీలో, మాదేగౌడ సర్కిల్‌లోని ఒక ఇంట్లో, హెబ్బాళ్‌లోని ఇంట్లో మొత్తం ఏడు ల్యాప్‌టాప్‌లు, మూడు సెల్‌ఫోన్లు దొంగతనం చేశాడు. బాధితుల ఫిర్యాదుతో పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. మైసూరు గ్రామీణ బస్టాండ్‌వద్ద నిందితుడు ఉండగా దాడి చేసి అరెస్ట్ చేశారు. మరో నిందితుడు కూడా దొంగతనం భాగమై ఉన్నట్లు తెలిసింది.

రైలులో నగదు, ఆభరణాలు చోరీ

హుబ్లీ: రైలులో మహిళా ప్రయాణికురాలి నగదు, ఆభరణాలు చోరీకి గురైన ఘటన జరిగింది. వివరాలు.. అరక్కోణం నుంచి హుబ్లీకి రావడానికి చెన్నై– హుబ్లీ ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణిస్తున్న స్థానిక కేశ్వాపురకు చెందిన కనకవల్లి వాసుదేవన్ అనే మహిళ వ్యానిటీ బ్యాగ్‌లో ఉన్న రూ.2 వేల నగదుతో పాటు ఉన్న మొత్తం 3.17 లక్షల విలువ చేసే బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు బాధితురాలు హుబ్లీ రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బైక్‌ను కారు ఢీకొని ఇద్దరు మృతి



ఘటన స్థలంలో ఉన్న కారు



మృతి చెందిన యువకుడు

హొసపేటె: తాలూకాలోని కమలాపుర హంపీ కన్నడ యూనివర్సిటీ బీ గేట్ దగ్గర అతివేగంగా వస్తున్న కారు బైక్‌ను ఢీకొనడంతో బైక్ చోదకుడితో పాటు వెనుక కూర్చొన్న వ్యక్తి స్థలంలోనే మృతి చెందిన ఘటన మంగళవారం రాత్రి జరిగింది. ఈ ఘటనలో కొప్పళ జిల్లా గంగావతి తాలూకా మల్లాపుర గ్రామానికి చెందిన ఆంజనేయ(53) హనుమేష్ (18) అనే ఇద్దరు మృతి చెందారు. బైక్ రైడర్లు కమలాపుర నుంచి పాపినాయకనహళ్లి గ్రామానికి వెళ్తున్నారు. హొసపేటె వైపునకు వేగంగా వెళుతున్న కారు ఎదురుగా వచ్చిన బైక్‌ను ఢీకొనడంతో ఇద్దరు మృత్యువాత పడ్డారు. సమాచారం అందిన వెంటనే కమలాపుర పోలీసులు సంఘటన స్థలాన్ని సందర్శించి పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

కోలారు వార్తలు...

ట్రాఫిక్ సమస్య తీర్చాలని వినతి

కోలారు: నగరంలో తీవ్రంగా ఉన్న ట్రాఫిక్ సమస్యను కలెక్టర్, పోలీస్ అధికారుల సహకారంతో నివారించాలని కోరుతూ ఎంపీ ఎం.మల్లేష్‌బాబుకు, జిల్లాధికారికి నగర సీనియర్ సిటిజన్ల సమాఖ్య సంచాలకుడు ముని వెంకటేష్ బుధవారం వినతిపత్రం సమర్పించారు. నగరంలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకు అధికం అవుతోందన్నారు. ప్రత్యేకంగా నగరంలోని ఎంజీ రోడ్డులో జనసందడి ఎక్కువగా ఉండడం వల్ల ట్రాఫిక్ సమస్య మరింత అధికంగా ఉందన్నారు. నగరంలో ప్రముఖ వాణిజ్య కేంద్రమైన ఎంజీ రోడ్డులో ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకు ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంటోందన్నారు. ఈ సమయంలో నగర వాసులు తమ వాహనాలను తీసుకు వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పార్కింగ్ స్థలం కూడా చాలా తక్కువగా ఉండడం వల్ల వాహన సంచారానికి తీవ్ర అంతరాయం కలుగుతోందన్నారు. ఎంజీ రోడ్డుతో పాటు నగరంలోని దొడ్డపేట, టవర్ క్లాక్, ఎంబీ రోడ్డులో కూడా ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉందని, వెంటనే నగరంలోని ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా కన్నడ సాంస్కృతిక పరిషత్ అధ్యక్షుడు ఎస్‌సీ వెంకటకృష్ణప్ప ఉన్నారు.

ఉపాధ్యాయుల డిమాండ్లు నెరవేర్చండి



డీఈఓకు వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

కోలారు: వ్యాయామ ఉపాధ్యాయుల డిమాండ్లను నెరవేర్చాలని బుధవారం జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం పదాధికారులు డీడీపీఐ కృష్ణమూర్తికి వినతి పత్రం సమర్పించారు. పదాధికారులు మాట్లాడుతూ వ్యాయామ ఉపాధ్యాయులను సహ ఉపాధ్యాయులుగా పరిగణించి ప్రధానోపాధ్యాయులుగా ప్రమోషన్లు ఇవ్వాలన్నారు. అంతేకాకుండా సహ ఉపాధ్యాయులకు అందిస్తున్న అన్ని సౌకర్యాలను వ్యాయామ ఉపాధ్యాయులకు కూడా అందించాలని డిమాండ్ చేశారు. ప్రొఫెసర్ వైద్యనాథన్ నివేదికను ప్రభుత్వం పూర్తిగా అంగీకరించి కేబినెట్ ఆమోదం పొంది ఆమోద ముద్రను కూడా వేసింది. ఆ నివేదికలోని 12 అంశాలను మాత్రమే జారీ చేసి 13వ అంశమైన వ్యాయామ ఉపాధ్యాయుల ప్రమోషన్, సహ ఉపాధ్యాయులకు ఇచ్చే సౌకర్యాలను అమలు చేయాలన్నారు. జులై నెలాఖరులోగా తమ అన్ని డిమాండ్లను నెరవేర్చకుంటే ప్రస్తుత విద్యా సంవత్సరంలో నిర్వహించే అన్ని క్రీడా పోటీలను బహిష్కరిస్తామని హెచ్చరించారు. సంఘం అధ్యక్షుడు వి.మురళీ మోహన్, గౌరవ అధ్యక్షుడు అబ్దుల్ మన్నన్, ప్రధాన కార్యదర్శి వి వెంకటేశప్ప, కోశాధికారి ఆర్ నాగరాజ్ పాల్గొన్నారు.

శ్మశాన స్థలాన్ని సంరక్షిస్తా



స్థల పరిశీలన చేస్తున్న తహసీల్దార్ రశ్మి

కోలారు: బంగారుపేట తాలూకాలోని సక్కలహళ్లి గ్రామంలోని ప్రభుత్వ శ్మశాన స్థలాన్ని నకిలీ దాఖలాలు సృష్టించి వేరే వ్యక్తికి అప్పగించినట్లు గ్రామస్తుల ఫిర్యాదు మేరకు తహసీల్దార్ రశ్మి బుధవారం గ్రామాన్ని సందర్శించి స్థల పరిశీలన చేశారు. ఆమె మాట్లాడుతూ గ్రామంలోని సర్వే నెంబర్–19లో పోతి ఖాతా కోసం దరఖాస్తు చేసుకున్నారు. అయితే దీనిపై గ్రామస్తుల నుంచి తకరారు అర్జీ వచ్చిన నేపథ్యంలో కొన్ని సర్వే నెంబర్లలో శ్మశానం, కుంటలు ఉన్నాయని తన దృష్టికి రావడంతో స్థల పరిశీలనకు వచ్చినట్లు తెలిపారు. తన పరిశీలనలో ఇక్కడ శ్మశానం ఉన్నట్లు తెలిసింది. సర్వే, రెవిన్యూ దాఖలాలు పరిశీలించిన అనంతరం శ్మశాన స్థలాన్ని సంరక్షిస్తానన్నారు. గ్రామస్తులు మాట్లాడుతూ ఎట్టి పరిస్థితిలోను శ్మశాన స్థలం కబ్జాకు అనుమతించకూడదని కోరారు.

ఇంటి యజమానే దొంగ

మైసూరు: ఇంటిని అద్దెకు ఇచ్చిన యజమానే దొంగతనానికి పాల్పడిన ఘటన మైసూరులో ఆలస్యంగా వెలుగు చూసింది. లోకనాయక నగరలో నివాసం ఉంటున్న మంజునాథ్ అనే వ్యక్తి తన ఇంటిలోని ఒక భాగాన్ని మేఘరాజ్ అనే వ్యక్తికి ఆరు నెలల క్రితం అద్దెకు ఇచ్చాడు. అద్దె విషయంలో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. అడ్వాన్స్ వెనక్కు ఇవ్వాలని మేఘరాజ్ కోరగా మంజునాథ్ అంగీకరించకపోవడంతో బాధితుడు మేటగళ్లి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు మంజునాథ్‌ను మందలించి మేఘరాజ్ అక్కడే ఉండేలా సర్ది చెప్పారు. అయినప్పటికీ మంజునాథ్ కరెంట్ కట్ చేస్తూ వేధించసాగాడు. కొన్ని రోజుల క్రితం మేఘరాజ్ తన కుటుంబ సమేతంగా సొంతూరుకువెళ్లాడు. ఆ సమయంలో బంగారు ఆభరణాలు, నగదు, వాషింగ్ మెషిన్, హెర్బల్ ఉత్పత్తులు, ఫ్రిడ్జ్ చోరీ జరిగింది. మేఘరాజ్ ఊరు నుంచి వచ్చి చూడగా ఈటన వెలుగు చూసింది. పోలీసులకు ఫిర్యాదు చేయగా అనుమానంతో మంజునాథ్‌ను అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టగా తానే దొంగతనం చేసినట్లు అంగీకరించాడు. పోలీసులు అతనిపై కేసు నమోదు చేశారు.

రేపు సీఎం అధ్యక్షతన జిల్లా ప్రగతిపై సమీక్ష

హొసపేటె: విజయనగర జిల్లా పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి ఈ నెల 21న విజయనగర జిల్లా స్థాయి అధికారులతో చేపట్టే కేడీపీ సమావేశంలో వివిధ శాఖల పురోగతిని పరిశీలిస్తారని జిల్లాధికారి ఎంఎస్ దివాకర్ పేర్కొన్నారు. ఆయన బుధవారం తన కార్యాలయ భవనంలోని ఆడిటోరియం హాలులో వివిధ శాఖల అధికారులతో మరో దఫా సమావేశం నిర్వహించారు. శాఖల వారీగా ప్రగతి సమీక్ష సమావేశం కావడంతో అన్ని ముఖ్యమైన శాఖల అధికారులు తగిన సమాచారంతో సమావేశానికి హాజరు కావాలన్నారు. శాఖల పురోగతికి అనుగుణంగా సీఎం కోరిన సమాచారం వెంటనే ఇవ్వాలని ఆదేశించారు. అధికారులు కార్యాలయంలోని ఇతర అధికారులను నియమించకుండా వ్యక్తిగతంగా సమావేశానికి హాజరు కావాలన్నారు. సమయానికి అడిగే ప్రశ్నలకు అనవసర వివరణలు లేకుండా నేరుగా సమాధానాలు చెప్పాలన్నారు. ఎలాంటి గందరగోళానికి తావు లేకుండా ఆబ్జెక్టివ్ సమాచారం అందించాలని ఆదేశించారు. ప్రజాప్రతినిధులు, నామినేటెడ్ సభ్యులు, అధికారులకు సీట్లు ఏర్పాటు చేయాలన్నారు.

అధిక ఓట్లు సాధించిన అభ్యర్థికి సన్మానం



అత్యధిక ఓట్లు సాధించిన కే.శ్రీనివాసులుతో బృందం సభ్యులు

బనశంకరి: బనశంకరి రెండోస్టేజ్‌లోని గంగా యాదవసంఘానికి ఇటీవల నిర్వహించిన ఎన్నికల్లో శ్రీగంగా యాదవ సంఘానికి 11 స్థానాలు, శ్రీగంగా వేణుగోపాల ఆంజనేయ బృందం వర్గానికి 8 స్థానాలు లభించాయి. శ్రీగంగా వేణుగోపాల ఆంజనేయ వర్గం నేత కే.శ్రీనివాసులు అత్యధికంగా 64 శాతం ఓట్లు సాధించి మొదటి స్థానంలో నిలిచారు. మంగళవారం రాత్రి జయనగరలో కే.శ్రీనివాసులును ఘనంగా సన్మానించారు. కే.శ్రీనివాసులు పలు సేవాకార్యక్రమాలు నిర్వహిస్తూ తమ వంతు సమాజానికి సేవలు అందిస్తున్నారు.

కెంపేగౌడ జయంతిని ఘనంగా జరపాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రూపా శశిధర్

కేజీఎఫ్: నాడప్రభు కెంపేగౌడ జయంతిని అన్ని సముదాయాల వారి సహకారంతో ఈ నెల 27వ తేదీన అత్యంత వైభవంగా నిర్వహించాలని ఎమ్మెల్యే రూపా శశిధర్ తెలిపారు. ఆయన బుధవారం నగరంలోని టీపీ కార్యాలయంలో జాతీయ పండుగల ఆచరణ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన కెంపేగౌడ జయంతి నిర్వహణపై పూర్వ సిద్ధతా సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కెంపేగౌడ పల్లకీ ఉత్సవాలు, కళాబృందాల ప్రదర్శనలతో వైభవంగా జయంతిని ఆచరించాలన్నారు. పలువురు మహనీయులు సమాజానికి తమదైన సేవలు అందించారు. అలాంటి వారి సేవలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలన్నారు. వారి జయంతులను ఘనంగా నిర్వహించాలన్నారు. అన్ని జీపీల నుంచి వచ్చిన పల్లకీలను ఊరేగించాలన్నారు. సమావేశంలో టీపీ ఈఓ మంజునాథ్ హర్తి, కాంగ్రెస్ నాయకుడు ఆము లక్ష్మినారాయణ, నగరసభ కమిషనర్ పవన్‌కుమార్, డీఎస్పీ పాండురంగ తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారంతో హైటెక్ పాఠశాలలు



విద్యార్థులకు నోటు పుస్తకాలు అందిస్తున్న దృశ్యం

శ్రీనివాసపురం: ప్రభుత్వ పాఠశాలల్లో చదివి నేడు అనేక ఉన్నత స్థానాల్లో ఉన్న వారంతా ముందుకు వచ్చి తాము చదివిన పాఠశాలకు భూరిగా విరాళాలు అందిస్తే ప్రభుత్వ పాఠశాలలను కూడా హైటెక్ పాఠశాలలుగా మార్చవచ్చని మాజీ ఎమ్మెల్సీ వైఏ నారాయణస్వామి తెలిపారు. ఆయన బుధవారం పట్టణంలోని త్యాగరాజ కాలనీలోని ప్రభుత్వ మోడల్ పాఠశాలలో పాత విద్యార్థుల సంఘం నుంచి పాఠశాల విద్యార్థులకు ఉచితంగా నోటు పుస్తకాలను పంపిణీ చేసి మాట్లాడారు. ఫ్యాక్టరీలు అందించే సీఎస్ఆర్ నిధులను కూడా కేవలం ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికే వినియోగించాలన్నారు. బీఈఓ లక్ష్మయ్య మాట్లాడుతూ పాత విద్యార్థులు, దాతల సహకారంతో ఉత్తమ విద్యాభ్యాసం చేసి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని పిలుపు నిచ్చారు. సంఘం అధ్యక్షుడు మధుసూదనరెడ్డి, ఎస్‌డీఎంసీ అధ్యక్షుడు ఆనందరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు ఎం.భైరేగౌడ పాల్గొన్నారు.

క్లుప్తంగా

బాలుడి ప్రాణం తీసిన ఈత సరదా


ముజాబీల్ కాజోద్దీన్(ఫైల్)

యశవంతపుర: సరదాగా ఈతకు వెళ్లిన బాలుడు జల సమాధి అయ్యాడు. ఈ ఘటన బీదర్ జిల్లా బసవకల్యాణ తాలూకా ఖేర్డ బీ గ్రామం సమీపంలోని ముల్లామారి జలాశయంలో జరిగింది. బసవ కల్యాణ తాలూకా సస్తాపూర్ గ్రామానికి చెందిన ముజాబీల్ కాజోద్దీన్ (15) అనే బాలుడు తన తల్లి పనిపై బయటకు వెళ్లిన సమయంలో ఐదుగురు స్నేహితులతో కలిసి ముల్లామారి జలాశయంలో ఈతకు వెళ్లాడు. ఈత రాకపోయినా నీటిలో దిగి మునిగిపోయాడు. స్నేహితులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది వచ్చి గాలించి మృతదేహాన్ని వెలికి తీశారు. ముడబి పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

మంటల్లో ఇల్లు దగ్ధం

మైసూరు: ఆకస్మికంగా చెలరేగిన మంటలకు ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. ఇంటిలోని రూ. 2 లక్షల విలువ చేసే సామాగ్రి బూడిదైంది. ఈ ఘటన చామరాజనగర జిల్లా హనూరు పోలీసు స్టేషన్ పరిధిలోని హోసపాళ్యలో జరిగింది. గ్రామానికి చెందిన నాగమ్మ తెల్లవారుజామునే పొయ్యిలో నిప్పంటించి వంట చేసి ఆ తర్వాత కూలీ పనులకు వెళ్లింది. అయితే ఆ మంటలను సరిగ్గా ఆర్పలేదు. ఈ క్రమంలో మధ్యాహ్నం 12 గంటలకు మంటలు ఇంటి మొత్తం వ్యాపించి సామాగ్రి మొత్తం కాలిపోయింది. ఇంట్లో ఎవరూ లేకపోవడతో ప్రాణాపాయం తప్పింది.

ఎన్ని కష్టాలు వచ్చినా చదువు ఆపొద్దు


విద్యార్థులకు బస్సు పాస్‌లు అందజేస్తున్న ఎమ్మెల్యే పుట్టస్వామిగౌడ

గౌరిబిదనూరు: విద్యార్థులకు అండగా ఉంటానని, ఎట్టి పరిస్థితుల్లోనూ చదువు ఆపొద్దని ఎమ్మెల్యే పుట్టస్వామి గౌడ తెలిపారు. పట్టణంలోని తా.పం.కార్యాలయం ఆవరణలోని తన కార్యాలయంలో బుధవారం ఆయన కేహెచ్‌పీ ఫౌండేషన్ ద్వారా విద్యార్థులకు ఉచిత బస్సు పాస్‌లు పంపిణీ చేసి మాట్లాడారు. ఆర్థిక సమస్యలతో ఏ విద్యార్థీ మధ్యలోనే చదువు ఆపకూడదన్నారు. ముందు టెన్త్, పీయూసీలో ప్రతిభ చూపిన వారికి ప్రతిభాపురస్కారాలు, ఉచితంగా కంప్యూటర్లు అందజేస్తామని తెలిపారు. ఫౌండేషన్ సంస్థ ముఖ్యస్థులు శ్రీనివాసగౌడ, ఆర్. అశోక్‌కుమార్, మల్లసంద్ర గంగాధర్, అల్తాఫ్, గోపి, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో గొర్రెపిల్ల మృతి

మైసూరు: వీధి కుక్కల దాడిలో గొర్రెపిల్ల మృతి చెందింది. ఈ ఘటన టి.నరసీపుర తాలూకా కుప్పే గ్రామంలో జరిగింది. మహదేవ అనే వ్యక్తి తన ఇంటి ముందు గొర్రెపిల్లను కట్టేశాడు. అక్కడికి వచ్చిన వీధి కుక్కలు గొర్రెపిల్లపై దాడి చేసి చంపేశాయి.

చెరువులో వృద్ధురాలి శవం


నీటిపైన తేలుతున్న శవం

దొడ్డబళ్లాపురం: దేవనహళ్లి తాలూకా బూదిగెరె గ్రామంలోని చెరువులో బుధవారం ఉదయం వృద్ధురాలి శవం తేలియాడుతుండగా స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు అగ్నిమాపకదళం సిబ్బంది వచ్చి శవాన్ని వెలికితీశారు. మృతురాలికి 70 సంవత్సరాల వయస్సు ఉంటుందని నిర్ధారించారు. వివరాలు తెలియకపోవడంతో మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. వృద్ధురాలి ఆచూకీ తెలిస్తే ఆమెది ఆత్మహత్య? లేక ప్రమాదవశాత్తూ నీటిలో పడి మృతి చెందిందా అనేది తెలుస్తుందని పోలీసులు తెలిపారు.

ఇంధన ధరలు తగ్గించాలని బీజేపీ ధర్నా


ధర్నా చేస్తున్న దృశ్యం

చిక్కబళ్లాపురం: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో చిక్కబళ్లాపురం ఎంపీ డాక్టర్ కె.సుధాకర్ బుధవారం జిల్లా కేంద్రంలో ధర్న నిర్వహించారు. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయని, ప్రస్తుతం ఇంధన ధరలు పెంచడంతో సామాన్యులపై పెను భారం పడుతోందన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు బీజేపీకి మద్దతు ఇచ్చారని, దీంతో కాంగ్రెస్ ప్రభుత్వం కక్షతో ధరలు పెంచి పేదలపై భారం మోపిందని ఆరోపించారు. పేదలను దృష్టిలో ఉంచుకొని ధరలు తగ్గించాలని ఎంపీ డిమాండ్ చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామలింగప్ప, మాజీ ఎమ్మెల్యే రాజణ్ణ, కేవీ నాగరాజు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక పర్యాటకానికి కేరాఫ్ భట్కల్

- ఆకట్టుకుంటున్న పురాతన మసీదులు, ఆలయాలు
- ఆహ్లాదం పంచుతున్న బీచ్‌లు

బనశంకరి: మనస్సుకు ఆహ్లాదాన్ని ఇచ్చే పర్యాటక ప్రాంతాలతోపాటు ఆధ్యాత్మికతను తెలుసుకోవాలంటే ఉత్తర కన్నడ జిల్లాలో తీర ప్రాంతమైన భట్కల్‌కు వెళ్లి తీరాల్సిందే. అనేక ధార్మిక కట్టడాలకు నిలయం ఈ పట్టణం. దేవాలయాలు, మసీదులు, జైన ఆలయాలకు నెలవు.

రాష్ట్రంలోనే పురాతన పట్టణం

కార్వారకు 130 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ పట్టణం రాష్ట్రంలో అతి పురాతనమైనది. దేశంలోని పురాత ఓడరేవులకు భట్కల్ ప్రసిద్ధి. ఆహ్లాదకరమైన బీచ్‌లకు నిలయం. ఈ పట్టణంలోని రైలుమార్గం కొంకణ్ రైల్వేకు అనుసంధానమైంది. జామియా మసీదు, ఖలీఫా మసీదు, నూర్‌మసీదు వంటి ఎంతో ప్రాచుర్యం పొందిన కట్టడాలు ఎంతో పేరుపొందాయి. ఇక్కడ ఉన్న దేవాలయాల్లో కేతపయ్య నారాయణ ఆలయం ప్రసిద్ధిగాంచింది.

సందర్శించాల్సిన మసీదులు

ఇక్కడ ముస్లింలకు అంత్యంత ప్రీతిపాత్రమైన జామియా మసీదుకు ఏటా పెద్ద సంఖ్యలో పర్యాటకులు విచ్చేస్తుంటారు. బంగారు గోపురం కలిగిన ఈ మసీదులో ఒకేసారి పదివేల మంది ప్రార్థన చేయవచ్చు. అదేవిధంగా 1211హిజీరాలో టిప్పు సుల్తాన్ ద్రవిడ శైలిలో నిర్మించిన సుల్తాన్ మసీదు ఎంతో ప్రాముఖ్యత కలిగి ఉంది. అదేవిధంగా జాతీయ రహదారిలో 1966లో నిర్మించిన నూర్ మసీదు రాష్ట్రంలోనే పేరుగాంచింది. భట్కల్‌లోని 8 పురాతన మసీదుల్లో ఖలీఫా జామియా మసీదు ఒకటి. ఇది సుమారుగా 200 ఏళ్లక్రితం నాటిది. ఈమసీదు షరాబీనది ఒడ్డున ఉంది. అదేవిధంగా ముఖ్దూమ్‌మసీదు తప్పక


పురాతన జామియా మసీదు

చూడాలి హజరత్ ముఖ్దూమ్ పాకీ ఇస్మాయిల్ సూక్రీ పేరుపై నిర్మించారు. ప్రవక్త సుమారు 40 రోజులు ప్రార్థనలు చేసి అల్లాను మెప్పించారని చెబుతారు.

భట్కల్‌బీచ్...

పర్యాటకులు భట్కల్‌బీచ్‌ను భట్కల్ ఓడరేవు పట్టణ సందర్శనలో చూడవచ్చు. చుట్టూ పడమటి కనుమలు కొండలు, కొబ్బరిచెట్లు, భట్కల్‌బీచ్, అరేబియాసముద్రం కలిగి ఎంతో ఆహ్లాదకరంగా ఉంటుంది.

కేతపయ్య నారాయణస్వామి ఆలయం


భట్కల్‌లో కొలువైన కేతపయ్యనారాయణస్వామి ఆలయం విజయనగర రాజుల శిల్ప కళావైభవానికి అద్దం పడుతుంది. నవరంగగా చెప్పబడే నాలుగు స్తంభాలతో పెద్ద హాలు నిర్మించారు. దీనిచుట్టూ అష్టదిక్పాలక విగ్రహాలను 8 దిక్కుల్లో నిర్మించారు.

భట్కల్ లైట్‌హౌస్

భట్కల్ లైట్‌హౌస్‌ను 1891లో నిర్మించారు. భట్కల్‌నది ప్రవేశంలో దక్షిణదిశగా కొండపై భట్కల్ కోట సమీపంలో ఉంది.

కడవినకట్ట డ్యామ్

కడలినకట్టడ్యామ్, భట్కల్ కడవినకట్టడ్యామ్‌ను వెంకటాపూర్ నదిపై నిర్మించారు. బోటింగ్ వంటి వినోద


ఖలీఫా మసీదులోని అంతర్భాగం


టిప్పు మసీదు

కార్యక్రమాలను ఇక్కడ నిర్వహిస్తుంటారు.

భట్కల్‌ను ఏలా చేరుకోవాలంటే...

మంగళూరు విమానాశ్రయం భట్కల్ నుంచి విమానాశ్రయం 144 కిలోమీటర్లు దూరంలో ఉంది. హైదరాబాద్, మంగళూరు, గుల్బర్గా, హుబ్లీ, బీదర్, ముంబై, పూణే వంటి ప్రధాన నగరాలనుంచి బస్సు సదుపాయం ఉంది. ఢిల్లీ, జైపూర్, మార్గోవా రైల్వే స్టేషన్ల నుంచి భట్కల్‌కు చేరుకోవచ్చు.


నారాయణ ఆలయం


భట్కల్ లైట్‌హౌస్



నారాయణ ఆలయంలోని అద్భుతంగా చెక్కిన శిల్పాలు


భట్కల్ బీచ్‌లో పర్యాటకుల సందడి

రైల్వే పథకాలు పూర్తి చేయండి

శివాజీనగర: రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న రైల్వే ప్రాజెక్టులను పూర్తి చేయాలని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్.డీ.కుమారస్వామి విజ్ఞప్తి చేశారు. రైల్వే మంత్రి అశ్వని వైష్ణవ్‌ను కుమారస్వామి కలిసి రాష్ట్రంలోని రైల్వే పథకాలపై చర్చించారు. పెండింగ్‌లో ఉన్న, ప్రస్తుతం జరుగుతున్న రైల్వే ప్రాజెక్టులను కాల పరిమితిలోగా పూర్తి చేయటం, కొత్త రైల్వే మార్గాలకు అనుమతినిచ్చి ఆర్థిక సహకారాలు అందించే విషయమై రైల్వే మంత్రితో సమాలోచనలు జరిపారు. మాజీ ప్రధాని హెచ్.డీ.దేవేగౌడ హయాంలో మంజూరైన బెంగళూరు-సత్యమంగల-చామరాజనగర (కనకపుర-మళవళ్లి మార్గం) రైల్వే ప్రాజెక్ట్‌ను చేపట్టి పూర్తి చేయాలని కుమారస్వామి కోరారు.

బతికుండగానే చంపేశారు

యశవంతపుర: ప్రాణంతో ఉన్న వ్యక్తి మరణించినట్లు వైద్య సిబ్బంది అతని కుటుంబానికి సమాచారం ఇచ్చారు. ఈ ఘటన దక్షిణకన్నడ జిల్లా మంగళూరులో జరిగింది. ఉప్పినంగడి తాలూకా ఆర్పేల్‌కు చెందిన 55 ఏళ్ల వయస్సున్న వ్యక్తి శనివారం నగరంలోని వెన్లాక్ ప్రభుత్వ ఆస్పత్రిలో చేరాడు. అయితే అయన మృతి చెందాడని ఆస్పత్రి వర్గాలు మంగళూరు దక్షిణ పోలీసులకు సమాచారం ఇచ్చాయి. ఉప్పినంగడిలోని సదరు వ్యక్తి కుటుంబానికి సమాచారం ఇవ్వాలని పోలీసులు ధర్మస్థల పోలీసులకు సమాచారం ఇచ్చారు. ధర్మస్థల పోలీసులు ఇచ్చిన సమాచారంతో రోగి బంధువులు లబోదిబోమంటూ మంగళూరు వెన్లాక్ ఆస్పత్రికి వచ్చి చూడగా ఆయన బతికే ఉన్నారు. ఆస్పత్రి సిబ్బంది తప్పుడు సమాచారం ఇవ్వడంతో ఈఘటన జరిగినట్లు తేలింది.

పిన్నిని చంపిన యువకుడు


హేమావతి(ఫైల్)

యశవంతపుర: తల్లితో సమానమైన చిన్నమ్మపట్ల బాలుడు అసభ్యకరంగా వ్యవహరించగా ఆమె అడ్డుకుంది. దీంతో బాలుడు ఆమెను గొంతు నులిమి చంపేశాడు.ఈ ఉదంతం దక్షిణకన్నడ జిల్లా ఉప్పినంగడి గ్రామాంతర పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. హేమావతి(37) అనే మహిళ ఇంటిలో ఆమె అక్క కుమారుడు ఉంటున్నాడు. ఇతను స్థానికంగా ఉన్న పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. ఆదివారం రాత్రి హేమావతి నిద్రిస్తుండగా బాలుడు ఆమెను ముట్టుకున్నాడు. హేమావతి గట్టిగా కేకలు వేసి అడ్డుకుంది. భయం దోళనకు గురైన బాలుడు హేమావతిని గొంతు నులమడంతో ఆమె మృతి చెందింది. హేమావతి భర్త ఉప్పినంగడి పోలీసులకు ఫిర్యాదు చేయటంతో బాలుడిని అదుపులోకి తీసుకున్నట్లు గ్రామాంతర సీఐ రవి బీఎస్ తెలిపారు.

రక్తహీనతను అరికడదాం

- వైద్యారోగ్య మంత్రి దినేశ్

మైసూరు: ఆరోగ్య సేవలను అభివృద్ధి చేసి మంచి నాణ్యమైన ఆరోగ్య సేవలను అందించడంతో పాటు రాష్ట్రాన్ని రక్తహీనత రహిత కర్ణాటకగా మార్చడమే లక్ష్యమని వైద్యారోగ్య మంత్రి దినేశ్ గుండూరావు తెలిపారు. బుధవారం మైసూరు జిల్లా పంచాయతీ సభాంగణంలో వైద్య ఆరోగ్య శాఖ ఏర్పాటు చేసిన ప్రపంచ సికెల్ సెల్ ఎనిమీయా నిర్మూలన అభియాన్‌ను మంత్రి ప్రారంభించి మాట్లాడారు. చందన ప్రాజెక్టు ద్వారా సికెల్‌సెల్ ఎనీమియా వ్యాధిపై రాష్ట్రమంతటా అవగాహన, చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. ఏడు జిల్లాల్లో సికెల్‌సెల్ ఎనిమియా పరీక్షలను చేపట్టినట్లు, చామరాజనగర, మైసూరు, కొడగు జిల్లాల్లో ఈ వ్యాధిని గుర్తించినట్లు మంత్రి తెలిపారు. రానున్న రెండేళ్లలో 2.56 లక్షల మందికి పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు. ఈ వ్యాధి అనువంశికంగా వ్యాపిస్తుందని, ప్రారంభంలో గుర్తించి చికిత్స అందించాలని తెలిపారు.


బాలలకు ఔషధాలను అందిస్తున్న మంత్రి

పోస్టుమార్టం నివేదికను మార్చలేదు

రేణుకాస్వామి హత్య కేసు పోస్టుమార్టం నివేదికను మార్చే ప్రయత్నాలు జరగలేదని మంత్రి చెప్పారు. డబ్బులకు ఆశపడి నివేదిక మార్చి రాసినట్లు వస్తున్న ఊహాగానాలన్నారు. కేసు దర్యాప్తునకు ప్రభుత్వం అన్ని విధాల సహకరిస్తుందని, పోలీసులు వారి పని వారు చేసుకుపోతున్నారని చెప్పారు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే కర్ణాటకలో ఇంధన ధరలు తక్కువగా ఉన్నాయని తెలిపారు. అలాగే గ్యారెంటీ పథకాలకు , ధరల పెరుగుదలకు ఎలాంటి సంబంధం లేదన్నారు.

వారం రోజుల్లో కాలువలకు సాగునీరు

మండ్య: పనుల వల్ల కాలువలో నీటి సరఫరా ఆపారని అవాస్తవాలు ప్రచారం చేయడం సరికాదని వ్యవసాయ శాఖ మంత్రి, జిల్లా ఇంచార్జి మంత్రి ఎన్.చెలువరాయస్వామి తెలిపారు. శ్రీరంగపట్టణ తాలూకా కేఆర్‌ఎస్‌లో జలవనరుల శాఖ అధికారులతో బుధవారం మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. కాలువలకు సాగునీటిని విడుదల చేయాల్సిన సమయం ఆసన్నమైందని, అందుకే అధికారులతో చర్చించినట్లు తెలిపారు. వారంలో నీటిని కాలువలకు విడుదల చేస్తామన్నారు. రూ.300 కోట్లతో 46 కిలోమీటర్ల కాలువ ఆధునీకరణ పనులు చేపట్టగా 24 కిలోమీటర్ల మేరకు పనులు పూర్తయ్యాయన్నారు. 1932లో నిర్మా


సమీక్షలో పాల్గొన్న మంత్రి చెలువరాయస్వామి

మైన కేఆర్‌ఎస్‌కు ఇప్పటివరకు ఆధునీకరణ పనులు చేపట్టలేదని, ఈ క్రమంలో పనులు కొద్దిగా ఆలస్యంగా జరుగుతున్నాయన్నారు. అంతేకానీ ఈ పనుల వల్ల కాలువల్లోకి నీరు వదలడం లేదని ప్రతిపక్షాలుచేస్తున్న ఆరోపణల్లో నిజం లేదని కొట్టిపారేశారు.

ప్రతి హోబళిలో రెసిడెన్సియల్ పాఠశాల

శివాజీనగర: విద్యను పొందటం ప్రతి ఒక్కరి హక్కు అని, ఈ దిశలో రాష్ట్రంలోని ప్రతి హోబళి స్థాయిలో రెసిడెన్సియల్ పాఠశాల ఏర్పాటు చేసి అందరికీ విద్యను అందిస్తామని ముఖ్యమంత్రి సిద్దరామయ్య ప్రకటించారు. బెంగళూరు నగరంలోని వసంతనగర డాక్టర్ అంబేద్కర్ భవన్‌లో సాంఘిక సంక్షేమ శాఖ, కర్ణాటక రెసిడెన్సియల్ విద్యా సంస్థల సంఘం సంయుక్తంగా బుధవారం ఏర్పాటు చేసిన ప్రతిభాపురస్కార ప్రదాన కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. టెన్త్, పీయూసీలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు పురస్కారాలు అందించి సన్మానించి మాట్లాడారు. ఇప్పటికే కొన్ని హోబళిల్లో రెసిడెన్సియల్ పాఠశాలలు ఏర్పాటయ్యాయన్నారు. మరో 20 హోబళిల్లో రెసిడెన్సియల్ పాఠశాలలు ఏర్పాటు చేస్తామన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ కింద 833, మైనార్టీ శాఖ కింద 113 రెసిడెన్సియల్ పాఠశాలలు ఉన్నాయన్నారు. రానున్న రోజుల్లో వీటి సంఖ్య పెంచుతామని తెలిపారు. విధానపరిషత్ సభాధ్యక్షుడు బసవరాజ హొరట్టి మాట్లాడుతూ హెచ్.సీ.మహదేవప్పను సాంఘిక సంక్షేమ శాఖ మంత్రిగా చేయటం ద్వారా ముఖ్యమంత్రి సిద్దరామయ్య రాష్ట్రానికి ఉత్తమ సేవలు అందించారన్నారు. మంత్రి డాక్టర్ హెచ్.సీ. మహదేవప్ప మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే రిజ్వాన్ హర్షద్ అధ్యక్షత వహించారు. పరిషత్ సభ్యులు సుదామ్ దాస్, శాఖాధికారులు పాల్గొన్నారు.

వాహనాలకు హెడ్‌లైట్ల అమరిక తప్పనిసరి

బనశంకరి: కేంద్ర మోటారు వాహనచట్టం అనుగుణంగా అన్ని రకాల వాహనాలకు తప్పనిసరిగా హెడ్‌లైట్లు అమర్చుకోవాలని రాష్ట్ర ట్రాఫిక్ , రోడ్డు సురక్షతా విభాగ అదనపు పోలీస్ డీజీపీ అలోక్‌కుమార్ బుధవారం ఆదేశాలు జారీచేశారు. ఇటీవల రోజుల్లో అధిక వెలుగు ఇచ్చే ఎల్‌ఇడీ లైట్లను వాహనాలకు అమరుస్తున్నారని, దీంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో వాహనాలకు హెడ్ లైట్లు తప్పనిసరిగా అమర్చాలన్నారు. నిబంధనల ఉల్లంఘనకు పాల్పడితే వాహనదారులపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. ట్రాఫిక్ పోలీసులు తమ పరిధిలో సంచరించే వాహనాలపై నిఘాపెట్టాలని ఆదేశించారు.

హోసూరు వార్తలు..

రోడ్డుపై గజ భయం



కెలమంగలం: అంచెట్టి అటవీ ప్రాంతంలో ఒంటి ఏనుగు రోడ్డుపై వెళ్లే వాహనాలను వెంబడిస్తుండడంతో వాహనదారులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. డెంకణీకోట, అంచెట్టి అటవీ ప్రాంతంలో పది ఏనుగులకు పైగా మకాం వేసి రాత్రి వేళల్లో పంటపొలాలపై దాడులు చేసి ధ్వంసం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో మంద ఏనుగుల నుంచి విడిపోయిన ఒంటి ఏనుగు డెంకణీకోట- అంచెట్టి మార్గంలో వెళ్లే వాహనాలను వెంబడిస్తుండడంతో వాహనదారులు భయపడుతున్నారు. అంచెట్టి, చుట్టుపక్కల గ్రామాల నుంచి ఉద్యోగులు, వ్యాపారులు, కార్మికులు, విద్యార్థులు పెద్దసంఖ్యలో వాహనాల్లో డెంకణీకోట, హోసూరు, బెంగళూరు ప్రాంతాలకు వెళ్తుంటారు. ఏనుగు సంచారం వల్ల ప్రాణాలను గుప్పెట్లో పెట్టుకొని వెళ్తున్నామని వాపోయారు. అటవీశాఖాధికార్లు వెంటనే ఏనుగును దూరంగా మళ్లించాలని కోరారు.

పార్సిల్‌లో డ్రగ్స్ వచ్చాయని రూ.20 లక్షలు మస్కా

హోసూరు: పార్సిల్లో డ్రగ్స్ వచ్చాయని సైబర్ నేరగాళ్లు ప్రైవేట్ కంపెనీ ఉద్యోగిని బెదిరించి రూ. 20 లక్షలు కాజేశారు. వివరాల మేరకు క్రిష్ణగిరి సమీపంలోని చిన్నమేలుపల్లి గ్రామానికి చెందిన మిథున్(33). ప్రైవేట్ కంపెనీ ఉద్యోగి. గత మే నెల 8వ తేదీ అతని సెల్ నంబర్‌కు ఫోన్ చేసిన ఓ వ్యక్తి తాను ముంబై పోలీసునని పరిచయం చేసుకొని మీ పేరుమీద కొరియర్‌లో మత్తు పదార్థాలు వచ్చాయని చెప్పాడు. దీనిపై కేసు నమోదు చేయనున్నామని, కేసుపై స్థానిక ఐజీ, ఇతర పెద్ద ఆఫీసర్లు మాట్లాడుతున్నారని చెప్పాడు. కొద్దిసేపటికే మరో రెండు ఫోన్‌లలో బెదిరింపులు రావడంతో భయపడిన మిథున్ వారందజేసిన బ్యాంకు ఖాతాకు రూ. 19.90 లక్షలు జమ చేశాడు. కేసు ఏమైందని అడగడానికి ఫోన్ చేయగా స్విచాఫ్ రావడంతో మోసం అని తెలుసుకుని క్రిష్ణగిరి క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

రాహుల్ పుట్టినరోజు వేడుకలు


ఊత్తంగేరిలో వేడుకల్లో ఎంపీ

హోసూరు: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను బుధవారం క్రిష్ణగిరి జిల్లావ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా జరుపుకొన్నారు. ఊత్తంగేరి ప్రాంతంలో జిల్లా ఎంపీ కే.గోపినాథ్ ముఖ్య అతిథిగా పాల్గొని కేక్ కత్తిరించారు. నాయకులు, కార్యకర్తలు ఆలయాల్లో పూజలు నిర్వహించి, ఆస్పత్రులలో రోగులకు పాలు, బ్రెడ్లు, పండ్లు అందజేశారు.

రెండు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

హోసూరు: హోసూరు, క్రిష్ణగిరి ప్రాంతాల్లో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. వివరాలు.. హోసూరు కార్పొరేషన్ పరిధిలోని దర్గా ఆనంద్‌నగర్ ప్రాంతానికి చెందిన లారీ డ్రైవర్ గోవిందరాజ్ (47) గత 16వ తేదీ దర్గా సమీపంలోని ముత్తుమారియమ్మ ఆలయం వద్ద నడిచి వెళుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. తీవ్ర గాయాలేర్పడిన అతన్ని బంధువులు ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించగా బుధవారం రాత్రి మృతి చెందాడు.

మహిళ మృతి

క్రిష్ణగిరి జిల్లా మిట్టపల్లి సమీపంలోని దాసంబట్టి గ్రామానికి చెందిన కూలికార్మికుడు శక్తివేల్ భార్య లక్ష్మి (27), గత 17వ తేదీ రాత్రి క్రిష్ణగిరి వైపు నడిచి వెళుతుండగా లారీ ఢీకొనింది. తీవ్ర గాయాలతో ఆమె అక్కడే మరణించింది. ఈ ఘటనలపై స్థానిక పోలీసులు కేసులు నమోదు చేశారు.

యువకుడు ఆత్మహత్య

క్రిష్ణగిరి: ఉరివేసుకొని యువకుడు ఆత్మహత్య చేసుకొన్న ఘటన సూళగిరి వద్ద జరిగింది. వివరాల మేరకు సూళగిరి సమీపంలోని గుట్టూరు గ్రామానికి చెందిన క్రిష్ణన్ కొడుకు ఉదయ్‌కుమార్ (30) రెండు రోజుల క్రితం ఇంటి నుంచి బయటకెళ్లి తిరిగి రాలేదు. సొంత మామిడి తోటలో చెట్టుకు ఉరివేసుకుని శవమై తేలాడు. కుటుంబీకులు, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని శవాన్ని ఆస్పత్రికి తరలించారు.

భర్త అక్రమ సంబంధంతో భార్య ఆత్మహత్య

యశవంతపుర: భర్త అక్రమ సంబంధాన్ని భరించలేక భార్య ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన బెంగళూరు శెట్టిహళ్లిలో జరిగింది. శెట్టిహళ్లిలో కాంతరాజు, లతా(30) దంపతులు నివాసం ఉంటున్నారు. కాంతరాజు ఓ మహిళతో ఆక్రమ సంబధం పెట్టుకున్నాడు. లత దీనిపై అనేక సార్లు హెచ్చరించింది. కాంతరాజులో మార్పు రాకపోవడంతో డెత్‌నోట్ రాసి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకోంది. పోలీసులు కాంతరాజును పోలీసులు అరెస్ట్ చేసి విచారణ చేపట్టారు.

చెన్నపట్టణం నుంచే రాజకీయ అందలం

దొడ్డబళ్లాపురం: తన రాజకీయ జీవితంలో చెన్నపట్టణ నుండే పెను మార్పులు సంభవించాయని ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ అన్నారు. బుధవారం ఆయన కెంగల్ ఆంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం స్థానిక ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. అతి చిన్న వయసులోనే బంగారప్ప మంతివర్గంలో తనకు చోటు రావడానికి కారణం మీరేనని అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో తన తమ్ముడు డీకే సురేశ్ ఓటమిపాలయ్యాడంటే తనలోనే ఏదో లోపం, న్యూన్యత ఉందని అర్థమవుతోందన్నారు. తన తప్పులు తెలుసుకుని దిద్దుకుంటానన్నారు. చెన్నపట్టణ అభివృద్ధికి తాను కట్టుబడి ఉన్నానన్నారు. త్వరలో జరగనున్న ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ఎవరనేది ప్రకటిస్తామని అందరూ తప్పకుండా ఆశీర్వదించాలని కోరారు.

రేషన్ బియ్యం సీజ్

హోసూరు: తమిళనాడు నుంచి కర్ణాటకకు తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని ఆహార భద్రతాశాఖాధికారులు స్వాధీనపరుచుకొని నిందితున్ని అరెస్ట్ చేశారు. బుధవారం వేకువజామున క్రిష్ణగిరి-హోసూరు హైవేలో టెంపోను తనిఖీ చేయగా 110 సంచుల్లో 5.5 టన్నుల రేషన్ బియ్యం పట్టుబడింది. చిత్తూరు జిల్లా లెనిన్ నగర్‌కు చెందిన ఢిల్లీ బాబు అనే డ్రైవర్‌ని అరెస్టు చేశారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం


హోమాలు నిర్వహిస్తున్న దృశ్యం

కెలమంగలం: డెంకణీకోట తాలూకా తళి సమీపంలోని రామయ్యన అగ్రహారం గ్రామంలో శ్రీ హరికేశ్వరస్వామి ఆలయ పదవ వార్షికోత్సవం గత మూడు రోజులుగా ఘనంగా జరిపించారు. బుధవారం ఉదయం నుంచి వివిధ పూజలు, హోమాలను జరిపించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు.

రైలు కింద పడి విద్యార్థిని మృతి

తుమకూరు: రైలు కింద పడి విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటన తుమకూరు జిల్లా తిపటూరు రైల్వే స్టేషన్‌లో జరిగింది. చిక్కమగళూరు జిల్లా కడూరు తాలూకా దేవారహళ్లికి చెందిన వర్షిణి టీఎస్ (19) తిపటూరు నగరంలోని కల్పతరు కాలేజీలో రెండో ఏడాది బీఏ చదువుతోంది. ఏ కారణం చేతనో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు అరసికెరె రైల్వే పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం తరలించారు.

నకిలీ పత్రాలతో మహిళకు టోకరా

మైసూరు: స్థలం ఇప్పిస్తానని నమ్మించి మహిళ నుంచి రూ 8 లక్షలు తీసుకుని నకిలీ ధ్రువీకరణ పత్రాలను ఇచ్చి మోసం చేసిన ఘటన మైసూరులో జరిగింది. నగరానికి చెందిన బోగాది నివాసి టైలర్ రాజమ్మకు ఆమె ఇంటి సమీపంలోనే ఉంటున్న మహేంద్ర, పూజా అనే వ్యక్తులు తక్కువ ధరలో ముడా (మైసూరు అభివృద్ధి ప్రాధికార మండలి) ఇంటి స్థలం ఇప్పిస్తామని నమ్మబలికారు. వారి మాటలు నమ్మి రూ. 8 లక్షలను రాజమ్మ సమర్పించుకుంది. ఆ తర్వాత మైసూరు నగరాభివృద్ధి ప్రాధికార నుంచి స్థలం లభించినట్లు నకిలీ ధ్రువీకరణ పత్రాలు రాజమ్మ చేతిలో పెట్టారు. కొద్ది రోజుల తర్వాత ఆ పత్రాలను అధికారుల వద్ద చూపించగా నకిలీవని తేలింది. మోసపోయానని గ్రహించిన రాజమ్మ.. మహేంద్ర ఇంటికి వద్దకు వెళ్లి నిలదీసింది. డబ్బు వెనక్కు ఇవ్వాలని కోరగా అసభ్య పదజాలంతో దూషించి దాడి చేసి పంపించారు. దీంతో బాధితురాలు సరస్వతీపురం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

జీవనాడిపై దాడి!

పోలవరం ఉసురు తీసిందెవరు? ప్రాణం పోసిందెవరు?

జీవం తీసిన వారే బురద జల్లుతున్నారు

తాజాగా పోలవరాన్ని సందర్శించిన సీఎం చంద్రబాబు జీవనాడి లాంటి ప్రాజెక్టును వైఎస్ జగన్ విధ్వంసం చేశారంటూ నిస్సిగ్గుగా బుకాయించారు. కమీషన్లకు ఆశ పడి పోలవరం జీవం తీసిన చంద్రబాబు దీన్ని కప్పిపుచ్చి జీవం పోసిన వైఎస్ జగన్‌పై బురద జల్లే యత్నం చేయడాన్ని సాగునీటిరంగ నిపుణులు తప్పబడుతున్నారు.

సాక్షి, అమరావతి: పోలవరం ప్రాజెక్టు మన రాష్ట్రానికి జీవనాడి. గరిష్ఠంగా 194.6 టీఎంసీల సామర్థ్యంతో గోదావరిపై నిర్మిస్తున్న అతి పెద్ద జలాశయం ఇదే. కుడి, ఎడమ కాలువ ద్వారా 7.2 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీళ్లందించడంతో గోదావరి, కృష్ణా డెల్టాల్లో 23.5 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించవచ్చు. ఎడమ కాలువ నుంచి ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకం ద్వారా 8 లక్షల ఎకరాలకు నీళ్లందించవచ్చు. విశాఖ నగరం పారిశ్రామిక, తాగునీటి అవసరాలను తీర్చవచ్చు. ప్రాజెక్టులో నిర్మించే జలవిద్యుత్కేంద్రంలో 960 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేయవచ్చు. పోలవరం పూర్తయితే రాష్ట్రం రూపురేఖలు సమూలంగా మారిపోవడం ఖాయం. దేశంలో ఈ స్థాయిలో సాగునీరు, తాగునీరు, విద్యుత్తు అవసరాలను తీర్చే బహుళార్థ సాధక ప్రాజెక్టు మరొకటి లేదు. దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి 2005లో ప్రారంభించిన పోలవరాన్ని విభజన నేపథ్యంలో 2014లో కేంద్రం జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించింది. తామే వంద శాతం ఖర్చుతో పూర్తి చేస్తామని హామీ ఇచ్చింది. విభజన చట్టం ప్రకారం కేంద్రమే పూర్తి చేయాల్సిన పోలవరం నిర్మాణ బాధ్యతలను కేంద్రానికి ప్రత్యేక హోదా తాకట్టు పెట్టి మరీ 2016 సెప్టెంబరు 7న అధికారంలో ఉండగా చంద్రబాబు దక్కించుకున్నారు. 2013–14 ధరల ప్రకారం రూ.20,946 కోట్లతోనే ప్రాజెక్టును పూర్తి చేస్తానని నమ్మబలికి కేంద్రానికి హామీ ఇచ్చారు. 2014 ఏప్రిల్ 1 వరకూ ఖర్చు చేసిన రూ.4,730.71 కోట్లు పోనూ మిగతా రూ.15,667 కోట్లే ఇస్తామని కేంద్రం తెగేసి చెబితే దానికీ చంద్రబాబు తలూపారు. సీడబ్ల్యూసీ (కేంద్ర జలసంఘం) ఖరారు చేసిన ప్రాజెక్టు నిర్మాణ ప్రణాళికను కమీషన్ల దాహంతో తుంగలో తొక్కి పనులు చేపట్టారు. వరదను మళ్లించేలా స్పిల్‌వే, ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లను పూర్తి చేయకుండానే ఈసీఆర్ఎఫ్ డ్యామ్ పునాది డయాఫ్రమ్‌వాల్‌ను నిర్మించారు. చివరకు ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లను పూర్తి చేయలేక ఇరువైపులా ఖాళీ ప్రదేశాలను వదిలేసి 2019 ఫిబ్రవరిలో చేతులెత్తేశారు. ఈ నిర్వాకాల కారణంగా 2019 జూన్ తర్వాత గోదావరిలో పోటెత్తిన భారీ వరద కాఫర్ డ్యామ్‌ల ఖాళీల మీదుగా అధిక ఉద్ధృతితో ప్రవహించడంతో డయాఫ్రమ్‌వాల్ దెబ్బతింది. ఈసీఆర్ఎఫ్ డ్యామ్ నిర్మాణ ప్రాంతంలో ఇసుక తిన్నెలు కోతకు గురై భారీ అగాధాలు ఏర్పడ్డాయి. ఇదే పోలవరం పనులను అత్యంత సంక్లిష్టంగా మార్చింది. స్పిల్‌వే, కాఫర్ డ్యామ్‌ల పనులను చంద్రబాబు గాలికొదిలేసి డయాఫ్రమ్‌వాల్‌ను నిర్మించడమే ఈ క్లిష్ట పరిస్థితికి మూల కారణం.


రాత్రిపూట కాఫర్ డ్యామ్ పనులు చేస్తున్న దృశ్యం (ఫైల్)

అక్రమాలు అరికట్టి కీలక పనులు పూర్తి..

2019 మే 30న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి టీడీపీ సర్కార్ చేసిన చారిత్రక తప్పిదాలను సరిచేస్తూ ప్రణాళికాబద్ధంగా ప్రాజెక్టు పనులు చేపట్టారు. పీపీఏ, సీడబ్ల్యూసీ అభ్యంతరాలను బేఖాతర్ చేస్తూ రూ.2,917 కోట్ల విలువైన పనులను నవయుగకు నాడు చంద్రబాబు సర్కార్ నామినేషన్‌పై కట్టబెట్టింది. వీటితోపాటు జలవిద్యుత్కేంద్రం పనుల కాంట్రాక్టు ఒప్పందాన్ని రద్దు చేసి రివర్స్ టెండరింగ్ నిర్వహించడం ద్వారా రూ.783 కోట్లను ఖజానాకు వైఎస్ జగన్ ఆదా చేశారు. నిర్వాసితులకు పునరావాసం కల్పిస్తూ స్పిల్‌వే, స్పిల్ చానల్, అప్రోచ్ ఛానల్, పైలట్ ఛానల్, ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లను పూర్తి చేసి 2021 జూన్ 11నే గోదావరి ప్రవాహాన్ని స్పిల్ వే మీదుగా 6.1 కి.మీ. పొడవున మళ్లించారు. కుడి, ఎడమ కాలువలను జలాశయంతో అనుసంధానించే కనెక్టివిటీస్‌ను పూర్తి చేశారు. ఎడమ కాలువలో వరాహ నదిపై అత్యంత పొడవైన అక్విడెక్టుతోసహా కీలకమైన పనులను విజయవంతంగా పూర్తి చేశారు. జలవిద్యుత్కేంద్రం పనులను సైతం కొలిక్కి తెచ్చారు. ఈసీఆర్ఎఫ్ నిర్మాణ ప్రాంతంలో అగాధాలను సీడబ్ల్యూసీ మార్గదర్శకాల మేరకు ఇసుకతో పూడ్చి వైబ్రో కాంపాక్షన్ చేస్తూ యథాస్థితికి తెచ్చారు. ఇక డయాఫ్రమ్‌వాల్ భవితవ్యాన్ని తేల్చితే 18 నెలల్లోగా ప్రాజెక్టును యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తామని 2022 డిసెంబర్ నుంచి వైఎస్ జగన్ కేంద్రాన్ని కోరుతూ వచ్చారు. అయితే అంతర్జాతీయ సాంకేతిక నిపుణుల సహకారం తీసుకుని డిజైన్లు ఖరారు చేసి పనులు చేపట్టేలా సీడబ్ల్యూసీ ప్రణాళిక రచించింది. 2017–18 ధరల ప్రకారం భూసేకరణ, నిర్వాసితుల పునరావాసం వ్యయమే రూ.33,168.23 కోట్లని, అందువల్ల 2013–14 ధరల ప్రకారం రూ.20,946 కోట్లతో ప్రాజెక్టును పూర్తి చేయడం అసాధ్యమని ప్రధాని మోదీకి నాడు సీఎం హోదాలో వైఎస్ జగన్ అనేక సార్లు విన్నవించారు. ఈ క్రమంలో తాజా ధరల మేరకు నిధులిచ్చి పోలవరం పూర్తికి సహకరించాలన్న వైఎస్ జగన్ వినతిపై ప్రధాని మోదీ సానుకూలంగా స్పందించారు. ప్రధాని ఆదేశాల మేరకు పోలవరం తొలి దశ పూర్తికి రూ.12,157.53 కోట్లు విడుదల చేయాలని కేంద్ర జల్ శక్తి శాఖ మార్చి 6న కేంద్ర కేబినెట్‌కు ప్రతిపాదన పంపింది. అయితే అప్పటికే బీజేపీతో టీడీపీ–జనసేనకు పొత్తు కుదిరింది. ఈ నేపథ్యంలో పోలవరానికి నిధులు మంజూరు చేస్తూ కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపితే అది ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా మారుతుందని, అందువల్ల దాన్ని ఆపేయాలని బీజేపీ అధిష్టానంపై చంద్రబాబు ఒత్తిడి తెచ్చారు. ఇలా అడ్డుపుల్ల వేయడంతో నిధుల విడుదల ప్రతిపాదనను కేంద్ర కేబినెట్ పక్కన పెట్టింది.

జలవిద్యుత్కేంద్రం

పోలవరం ఈసీఆర్ఎఫ్ డ్యామ్‌కు ఎడమ వైపున 960 మెగావాట్ల సామర్థ్యంతో జలవిద్యుత్కేంద్రాన్ని నిర్మించాలి. ఎడమ వైపు ఉన్న కొండను తొలిచి 12 ప్రెజర్ టన్నెల్స్ తవ్వి టర్బైన్లను అమర్చి విద్యుత్కేంద్రాన్ని పూర్తి చేయాలి.

2014-19: టీడీపీ హయాంలో

జలవిద్యుత్కేంద్రం నిర్మాణ పనుల్లో కొండను తొలిచే పనుల్లో కేవలం 25 శాతం మాత్రమే చేసి టీడీపీ సర్కార్ చేతులు దులుపుకొంది.

పవర్‌హౌస్ టన్నెల్స్



2019-24: వైఎస్సార్ సీపీ పాలనలో

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే జలవిద్యుత్కేంద్రం పనులు శరవేగంగా సాగాయి. కొండను తొలిచే పనులను యుద్ధప్రాతిపదిక పూర్తి చేసి 12 ప్రెజర్ టన్నెల్స్‌ను పూర్తి చేసింది. టర్బైన్లను అమర్చడానికి అవసరమైన అన్ని పనులు పూర్తి చేసింది. టర్బైన్ల తయారీ బాధ్యతను బీహెచ్‌ఈఎల్‌కు అప్పగించింది. జలవిద్యుత్కేంద్రం పనులను దాదాపుగా కొలిక్కి తెచ్చింది. పోలవరం జలాశయం పనులు పూర్తయ్యేలోగా విద్యుదుత్పత్తి ప్రారంభించే విధంగా జలవిద్యుత్కేంద్రం పనులను వేగవంతం చేసింది.



ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లు..

ఎగువ కాఫర్ డ్యామ్



నదికి అడ్డంగా ఎర్త్ కమ్ రాక్ ఫిల్ (ఈసీఆర్ఎఫ్) డ్యామ్ నిర్మించడానికి వీలుగా.. గోదావరి వరద ప్రవాహాన్ని స్పిల్ వే మీదుగా మళ్లించేందుకు ఈసీఆర్ఎఫ్‌కు ఎగువన 2,840 మీటర్ల పొడవు, 43 మీటర్ల ఎత్తుతో ఒక కాఫర్ డ్యామ్‌ను, దిగువన 1,655 మీటర్ల పొడవు, 31.5 మీటర్ల ఎత్తుతో మరో కాఫర్ డ్యామ్‌ను నిర్మించాలి.

2014-19: టీడీపీ హయాంలో

ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లను నిర్మించకముందే ఈసీఆర్ఎఫ్ డ్యామ్ గ్యాప్–2లో పునాది డయాఫ్రమ్‌వాల్‌ను 1,396 మీటర్ల పొడవున పూర్తి చేసిన చంద్రబాబు 2018 జూన్ 11న జాతికి అంకితం చేశారు. ఎగువ కాఫర్ డ్యామ్ నిర్మించాలంటే 41.15 మీటర్ల కాంటూర్ పరిధిలో ముంపునకు గురయ్యే 54 గ్రామాల్లోని 20,946 కుటుంబాలకు పునరావాసం కల్పించాలి. ఈమేరకు సీడబ్ల్యూసీ, పీపీఏకు హామీ ఇచ్చిన చంద్రబాబు సర్కార్ 2018 నవంబర్‌లో ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌ల పనులు ప్రారంభించింది. అయితే రూ.484 కోట్లు ఖర్చు చేసి కేవలం 3,110 కుటుంబాలకు మాత్రమే పునరావాసం కల్పించారు. మిగతా నిర్వాసితులకు పునరావాసం కల్పించకుండా, కాఫర్ డ్యామ్‌లకు ఇరువైపులా ఖాళీ ప్రదేశాన్ని వదిలేసిన చంద్రబాబు సర్కార్ ఆ పనులను పూర్తి చేయలేక చేతులెత్తేసింది. 2019 జూన్‌లో ప్రారంభమైన గోదావరి వరద ప్రవాహానికి ఎగువ కాఫర్ డ్యామ్ అడ్డంకిగా మారింది. దాంతో కాఫర్ డ్యామ్ ఖాళీ ప్రదేశాల గుండా అధిక ఉద్ధృతితో ప్రవహించడంతో గ్యాప్–2లో డయాఫ్రమ్‌వాల్ నాలుగు చోట్ల కోతకు గురై 485 మీటర్ల పొడవున దెబ్బతింది. ఈసీఆర్ఎఫ్ నిర్మాణ ప్రాంతంలో సగటున 26 మీటర్ల నుంచి 36.5 మీటర్ల లోతు వరకు భారీ అగాధాలు ఏర్పడ్డాయి.

2019-24: వైఎస్సార్ సీపీ పాలనలో

ఎగువ కాఫర్ డ్యామ్ ప్రభావం వల్ల ముంపునకు గురయ్యే 8,446 కుటుంబాలకు రూ.1,670 కోట్లతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పునరావాసం కల్పించింది. ఆ తర్వాత ఎగువ కాఫర్ డ్యామ్‌ను 43 మీటర్ల ఎత్తుతో, దిగువ కాఫర్ డ్యామ్‌లో కోతకు గురైన ప్రాంతాన్ని సీడబ్ల్యూసీ మార్గదర్శకాల మేరకు 31.5 మీటర్ల ఎత్తుతో పూర్తి చేసింది. ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లతోపాటు 2.1 కి.మీ. పొడవున అప్రోచ్ ఛానల్, 2.92 కి.మీ. పొడవున స్పిల్ ఛానల్, వెయ్యి మీటర్ల పొడవున పైలట్ ఛానల్‌ను పూర్తి చేసి 2021 జూన్ 11న గోదావరి ప్రవాహాన్ని మళ్లించింది.

దిగువ కాఫర్ డ్యామ్



స్పిల్ వే

గోదావరికి 50 లక్షల క్యూసెక్కుల వరద వచ్చినా సులభంగా దిగువకు విడుదల చేసేలా స్పిల్‌వేను నిర్మించాలి. ప్రాజెక్టు పనుల్లో తొలుత పూర్తి చేయాల్సింది స్పిల్ వేనే. 1,118 మీటర్ల పొడవు, 53.32 మీటర్ల ఎత్తుతో నిర్మించే స్పిల్ వేకు 25.72 మీటర్ల నుంచి 45.72 మీటర్ల వరకూ 20 మీటర్ల ఎత్తు, 16 మీటర్ల వెడల్పుతో గేట్లు అమర్చాలి. వరద వచ్చినప్పుడు దిగువకు విడుదల చేయడానికి వీలుగా అత్యాధునిక హైడ్రాలిక్ హాయిస్ట్‌లను గేట్లకు అమర్చాలి. ప్రపంచంలో గరిష్ఠంగా వరద జలాలను దిగువకు విడుదల చేసే అతి పెద్ద స్పిల్ వే పోలవరంలోనే ఉంది.

2014-19: టీడీపీ హయాంలో

2014 జూన్ 8న సీఎంగా బాధ్యతలు స్వీకరించిన చంద్రబాబు 2016 డిసెంబర్ 30న స్పిల్ వే పనులను ప్రారంభించారు. టీడీపీ అధికారం కోల్పోయే నాటికి అంటే 2019 మే 29 నాటికి స్పిల్ వే పనులు పునాది స్థాయిని కూడా దాటలేదు. స్పిల్ వేలో కేవలం రెండు (39, 40) పియర్స్‌ను 30 మీటర్ల వరకూ చేసి వాటి మధ్య ఒక ఇనుప రేకు పెట్టి గేట్ అమర్చినట్లు 2018 డిసెంబర్ 24న చంద్రబాబు ఘనంగా ప్రకటించుకున్నారు.



2019-2024: వైఎస్సార్‌సీపీ పాలనలో

2019 మే 30న సీఎంగా వైఎస్ జగన్ ప్రమాణ స్వీకారం చేశారు. అదే ఏడాది జూన్‌లో ప్రారంభమైన వరద ప్రవాహం నవంబర్ వరకూ కొనసాగింది. 2020 మార్చి నుంచి 2021 వరకూ కరోనా మహమ్మారి విరుచుకు పడింది. అయితే గోదావరి వరదలు, కరోనా ప్రతికూల పరిస్థితుల్లోనూ వైఎస్ జగన్ రికార్డు సమయంలో స్పిల్ వేను పూర్తి చేశారు. లాక్‌డౌన్‌లోనూ జర్మనీ, జపాన్ నుంచి హైడ్రాలిక్ హాయిస్ట్ సిలిండర్లను దిగుమతి చేసుకుని స్పిల్ వేకు 48 గేట్లను బిగించారు. 2021 జూన్ 11న గోదావరి వరదను స్పిల్ వే మీదుగా విజయవంతంగా మళ్లించారు.

హనీమూన్ వద్దు.. హామీలు అమలు చేయండి..

- పోలవరంపై శ్వేతపత్రం విడుదల చేయాలి
- మొండి పట్టు పట్టయినా సరే చంద్రబాబు హోదా తేవాలి
- ఏపీసీసీ చీఫ్ షర్మిల

సాక్షి, అమరావతి : అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం హనీమూన్ జరుపుకొనే పరిస్థితిలో రాష్ట్రం లేదని.. ఇచ్చిన హామీలను చంద్రబాబు వెంటనే అమలు చేయాలని ఏపీసీసీ చీఫ్ షర్మిల అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయంలో బుధవారం జరిగిన రాహుల్ గాంధీ పుట్టిన రోజు వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఈ సారి జరిగిన ఎన్నికల్లో ఊహించని ఫలితాలొచ్చాయన్నారు. కాంగ్రెస్‌కు ఎన్నికల ముందు 8 శాతం ఓటు బ్యాంక్ వస్తుందనుకున్నా రాలేదని చెప్పారు. కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రధానమంత్రి కావడానికి ఏపీ ఎంపీలే కారణమని, మొండిపట్టు పట్టయినా హోదా సాధించుకుని రావాలని చంద్రబాబును ఆమె డిమాండ్ చేశారు. పోలవరం అంచనాలను చంద్రబాబునాయుడు రూ.29 వేల కోట్లకు పెంచారని, 2018 నాటికి పూర్తి చేస్తామని చేయలేదని, తన హయాంలోనే 75 శాతం పనులు పూర్తయ్యాయంటున్న బాబు.. మిగతా 25 శాతం పనులకు నాలుగేళ్లు ఎందుకు పడుతుందో చెప్పాలని ప్రశ్నించారు. ఎవరి హయాంలో ఏ మేరకు పనులు జరిగాయనేది తెలిపేలా పోలవరం మీద ఒక శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే సూపర్ సిక్స్ హామీలను ఎప్పటి నుంచి అమలు చేస్తారో, విధి విధానాలేంటో స్పష్టత ఇవ్వాలని చంద్రబాబును కోరారు. ఈవీఎం, బ్యాలెట్ అంశంపై సుప్రీం కోర్టుతో సహా మేధావులంతా కూర్చుని చర్చించి ఒక నిర్ణయం తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్ విగ్రహాలు ధ్వంసం చేయడం దారుణమని, చనిపోయిన వాళ్లకు గెలుపోటములు ఆపాదించడం న్యాయం కాదని, ఇకనైనా ప్రతీకారదాడులు ఆపాలని ఆమె కోరారు. కాంగ్రెస్ పార్టీలో తనపై వస్తున్న చిల్లర ఆరోపణలను తాను పట్టించుకోనని, ఆయా వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని షర్మిల స్పష్టం చేశారు.

పట్టణ పేదల ఇళ్ల నిర్మాణంలో ఏపీనే నంబర్ వన్

- ఇళ్ల నిర్మాణంలో ఏపీది అగ్రస్థానమని కేంద్రం కితాబు
- ఆంధ్రప్రదేశ్‌లో అత్యధికంగా పట్టణ పేదలకు 21.37 లక్షల ఇళ్ల నిర్మాణం
- రెండో స్థానంలో 17.76 లక్షల ఇళ్లతో ఉత్తరప్రదేశ్
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 31 లక్షలకు పైగా పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ
- 17005 కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు
- ఈ ఏడాది మే నాటికి 21.31 లక్షల ఇళ్లకు రూ.12,295 కోట్లు వ్యయం


సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ప్రతి పేద కుటుంబం సొంతింట్లో నివసించాలని, అక్క చెల్లెమ్మలు సంతోషంగా ఉండాలనే తలంపుతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన ఇళ్ల నిర్మాణం రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రస్థానంలో నిలబెట్టింది. పట్టణ పేదల ఇళ్ల నిర్మాణంలో ఆంధ్రప్రదేశ్ నంబర్ 1 అని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. పట్టణ పేదల ఇళ్ల నిర్మాణాల్లో ఆంధ్రప్రదేశ్ ఉత్తమ పనితీరు కనపరిచిందని ప్రశంసించింది. ప్రధాన మంత్రి అవాస్ యోజన (పట్టణ) కింద భారత దేశంలో వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో గణనీయమైన పురోగతి సాధించినట్లు తెలిపింది. పేదలందరికీ ఇళ్లు అనే విస్తృత లక్ష్యం పట్ల రాష్ట్రాలు సామూహిక నిబద్ధతను ప్రతిబింబిస్తున్నాయని పేర్కొంది. పట్టణ పేదల ఇళ్ల నిర్మాణాల్లో ఉత్తమ పనితీరు కనపరుస్తున్న పది రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో ఉందని తెలిపింది. రెండో స్థానంలో ఉత్తరప్రదేశ్ ఉన్నట్లు పేర్కొంది. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (పట్టణ) కింద ఈ ఏడాది జూన్ 10 నాటికి దేశవ్యాప్తంగా 1.18 కోట్ల ఇళ్లు మంజూరు చేయగా ఇందులో 1.14 కోట్ల ఇళ్ల నిర్మాణాలు ప్రారంభమయ్యాయని కేంద్రం పేర్కొంది. ఇందులో 83.67 లక్షల ఇళ్లు నిర్మాణాలు పూర్తయ్యాయని తెలిపింది. ఈ పథకం కింద 1,99,652 కోట్లు వ్యయం చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటి వరకు 1,63,926 కోట్లు విడుదల చేసినట్లు తెలిపింది. ఇందులో 1,51,246 కోట్లు వ్యయం చేసినట్లు పేర్కొంది. అదనంగా మరో 16 లక్షల ఇళ్లు కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నిర్మిస్తున్నట్లు వెల్లడించింది.

పేదల ఇళ్ల నిర్మాణంలో తొలి 10 స్థానాల్లో ఉన్న రాష్ట్రాలు

రాష్ట్రం	మంజూరైన ఇళ్లు
ఆంధ్రప్రదేశ్	21,37,028
ఉత్తరప్రదేశ్	17,76,823
మహారాష్ట్ర	13,64,923
గుజరాత్	10,05,204
మధ్యప్రదేశ్	9,61,147
తమిళనాడు	6,80,347
పశ్చిమ బెంగాల్	6,68,953
కర్ణాటక	6,38,121
రాజస్థాన్	3,19,863
బీహార్	3,14,477

రాష్ట్రంలో 31 లక్షలకు పైగా ఇళ్ల స్థలాలు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదలందరికీ ఇళ్లు పేరుతో ఏకంగా 31 లక్షలకు పైగా స్థలాలను మహిళల పేరిట పంపిణీ చేసి, 17005 కాలనీల్లో పెద్ద ఎత్తున ఇళ్ల నిర్మాణాన్ని ఓ యజ్ఞంలా చేపట్టింది. ఇందు కోసం వేల ఎకరాల ప్రైవేటు భూములను సైతం సేకరించింది. ఈ ఏడాది మే నెలాఖరుకి 21.31 లక్షల ఇళ్ల నిర్మాణానికి రూ.12,295.87 కోట్లు వ్యయం చేసింది. ఇందులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటా ఉంది. పేదల ఇళ్ల కోసం ఊర్లను తలపించేలా పెద్ద కాలనీలు అభివృద్ధి చేసింది. ఆ కాలనీల్లో అన్ని రకాల మౌలిక సదుపాయాలను కల్పించేందుకు చర్యలు చేపట్టింది. తొలి దశలో 15 లక్షలకుపైగా ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసింది. ఇంత పెద్ద ఎత్తున పేదల ఇళ్ల నిర్మాణం ఇప్పటివరకు దేశంలో ఏ రాష్ట్రంలోనూ జరగలేదు. పేద అక్కచెల్లెమ్మల సొంతింటి కల నెరవేర్చడానికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన చర్యలే ఇప్పుడు రాష్ట్రాన్ని ప్రథమ స్థానంలో నిలబెట్టింది.



ఓ విజేత ప్రస్థానం

రజనీ బెక్టార్

రజనీ బెక్టార్... సమైక్య భారతంలోని కరాచీ నగరంలో 1940లో పుట్టారామె. తండ్రి అకౌంటెంట్ జనరల్. తండ్రి ఉద్యోగరీత్యా కొంతకాలం లాహోర్‌లో పెరిగారు. ఆమెకు ఏడేళ్లు నిండేలోపే దేశవిభజన జరిగింది. రజని కుటుంబం భారత దేశానికి వచ్చింది. ఇండియాకి వచ్చిన తర్వాత ఢిల్లీలోని మిరిండా హౌస్‌లో చదువుకుందామె. కాలేజ్ చదువు పూర్తయ్యేలోపే లూథియానాలోని ఒక వ్యాపార కుటుంబంలోకి కోడలిగా అడుగుపెట్టింది. ఆమె జీవితంలో కీలకమైన ఘట్టాలు జరిగాయి. గానీ అప్పటికి ఆమె వయసు పదిహేడే. చదువు పూర్తికాకముందే పెళ్లికి తలవంచాల్సి రావడంతో కలిగిన ఆ అసంతృప్తే ఆమెను ఇప్పుడు విజేతగా నిలిపింది. లూథియానాలో అడుగుపెట్టినప్పటి నుంచి పద్మశ్రీ అవార్డు అందుకునే వరకు సాగిన ఆమె విజయయాత్రను సంతోషంగా గుర్తు చేసుకుంటున్నారామె.

ఓ కొత్త ప్రపంచం

''నేను లూథియానాకి వచ్చేనాటికి అది చాలా చిన్న పట్టణం. ఢిల్లీ నుంచి వచ్చిన నాకు లూథియానాను పట్టణం అనడానికి కూడా మనసొప్పేది కాదు. పట్టణం మొత్తానికి నాలుగు కార్లుండేవి అంతే. మా అత్తగారింటివాళ్లు ఛాందసులు. మా పుట్టింట్లో అమ్మ వైపు, నాన్న వైపు వాళ్లందరూ ఉన్నత విద్యావంతులు, విశాల దృక్పథం కలిగిన వాళ్లు. అత్తగారిల్లు- పుట్టిల్లు ఒకదానికొకటి పూర్తిగా భిన్నం. దాంతో నేను కొత్త మనుషుల మధ్యకు మాత్రమే కాదు, ఏకంగా కొత్త ప్రపంచంలోకి వచ్చి పడ్డాననే చెప్పాలి.

వంటతో స్నేహం

నాకు రకరకాలు వండడం, కొత్త వంటలను ప్రయత్నించడం హాబీ. ఆ హాబీయే నాకు పెద్ద ఆలంబన అయింది. స్నేహితులను, బంధువులను ఇంటికి ఆహ్వానించడం వారికి చేసి పెట్టడం, వారు ప్రశంసిస్తుంటే పొంగిపోవడమే జీవితంగా మారిపోయాను. హీరో మోటార్ కార్పొరేషన్‌కు చెందిన బ్రిజ్‌మోహన్ ముంజాల్, ఎవన్ సైకిల్స్ కంపెనీకి చెందిన పహ్వాలు 'లూథియానా ప్రజలకు మంచి వంటలను రుచి చూపిస్తున్నావ్' అన్నారు. అప్పటి ఎమ్మెల్యే ఒకరు తన మనుమరాలి పెళ్లికి కేటరింగ్ చేసి పెట్టమని అడిగారు. ఒక్క క్షణం ఏమీ అర్థం కాలేదు. స్థాణువులా ఉండిపోయాను. ఎలాగో ధైర్యం చేసి అంగీకారంగా తలూపాను. ఇద్దరు అసిస్టెంట్‌ల సాయంతో రెండు వేల మందికి వంటలు చేయించాను. ఆ తర్వాత స్నేహితులు, బంధువుల ఇళ్లలో ఏ వేడుక జరిగినా నాకు కబురు వచ్చేది. అయితే అవేవీ కమర్షియల్ సర్వీస్‌లు కాదు, స్నేహపూర్వక సర్వీస్‌లే. కొంతకాలానికి ఇంట్లోనే కుకరీ క్లాసులు మొదలు పెట్టాను. అప్పుడు మా అత్తగారు తీవ్రంగా వ్యతిరేకించారు. 'ఇంట్లో మగవాళ్లు వ్యాపారంలో బాగా సంపాదిస్తున్నారు, నువ్వు క్లాసులు చెప్పి సంపాదించాల్సిన అవసరం ఏమొచ్చింది' అని కోప్పడ్డారు. మా వారు నాకు మద్దతుగా నిలవడంతో ఆ పెనుతుఫాను సమసిపోయింది. పంజాబ్ అగ్రికల్చర్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ జైన్ మా ఫ్యామిలీ ఫ్రెండ్. ఆయన సలహాతో అందులో ఫుడ్ డైరీ ప్రొడక్ట్స్, బేకరీ కోర్సులో చేరాను. పిల్లలు కొంచెం పెద్దయి బోర్డింగ్ స్కూల్‌కెళ్లిన తర్వాత నేను కాలేజ్‌లో చేరడంతో ఇంట్లో నాకు ఎటువంటి ఇబ్బందీ రాలేదు. యూనివర్సిటీలో అడుగు పెట్టగానే నాకు కలిగిన సంతోషం అంతా ఇంతా కాదు. పెళ్లి కారణంగా చదువాపేసినప్పటి నుంచి మనసులో దాగి ఉన్న దిగులు ఒక్కసారిగా ఎగిరిపోయింది. కోర్సు పూర్తి కాగానే మా వారిచ్చిన ఇరవై వేలతో 1978లో క్రిమికా ఐస్‌క్రీమ్ యూనిట్ ప్రారంభించాను. 'క్రీమ్ కా' అనే అర్థంలో పెట్టానా పేరు. లూథియానాలో క్వాలిటీ ఐస్‌క్రీమ్ స్టాల్ పక్కన నేను స్టాల్ తెరిచాను కాని క్వాలిటీ ఐస్‌క్రీమ్‌ను కాదని మా యూనిట్‌కి ఎవరైనా వస్తారా అనే భయం చాలా రోజులు వెంటాడింది. అయితే నేను స్టాల్‌లో కూర్చోవడం లూథియానాలో మహిళలకు స్ఫూర్తినిచ్చింది. ఇంట్లో మగ్గిపోకుండా బయటకు వచ్చి ఏదైనా సాధించాలనే తపన ఉన్న వాళ్లందరూ తమ ఇంట్లో వాళ్లను ఒప్పించడానికి నన్ను మోడల్‌గా చూపించేవారు. నా ఐస్‌క్రీమ్‌కి కూడా ఆదరణ పెరగసాగింది.





మెక్‌డీ బర్గర్‌లో మా బన్ను

మెక్ డొనాల్డ్ ఫుడ్ చైన్ మనదేశంలో అడుగుపెట్టింది. వాళ్లకు అవసరమైన బన్ కోసం బేకరీలన్నింటినీ సందర్శించారు. మా బేకరీని ఎంపిక చేసుకున్నారు. అయితే వారికి కావల్సిన నియమాలు, పరిమితులకు లోబడి తయారు చేసి ఇవ్వడానికి ఒక ఏడాదిపాటు ఎక్సర్‌సైజ్ చేశాం. మధ్యప్రదేశ్‌లో పండే నాణ్యమైన గోధుమల పిండితో చేసిన బన్ వారి ఆమోదం పొందింది. మొదట్లో కొంత నష్టం వచ్చినప్పటికీ క్వాలిటీ కంట్రోల్ నుంచి ఆమోదం వచ్చిన తర్వాత ఇక మాకు వెనక్కి చూసుకోవాల్సిన అవసరం రాలేదు. ఆ తర్వాత మెక్‌డీకి అవసరమైన సాస్ ప్లాంట్ కూడా పెట్టాం. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలతోపాటు విదేశాల్లో కూడా వేగంగా విస్తరించగలిగాం. టర్నోవర్ ఏడు వేల కోట్లకు చేరింది. మా ముగ్గురబ్బాయిలు బాధ్యతలు పంచుకుని వ్యాపారాన్ని కొనసాగించారు. ఇప్పుడు మూడవ తరం అడుగుపెట్టింది. మా మనుమడు ఢిల్లీ మార్కెట్ మీద దృష్టి పెట్టాడు.

ఐస్‌క్రీమ్‌తో మొదలు బిస్కట్ వరకు

క్వాలిటీని కాదని మా స్టాల్‌కి రావాలంటే వాళ్ల కంటే ఎక్కువగా చేయాలి. ఐస్‌క్రీమ్‌తోపాటు బ్రెడ్, బిస్కట్ వంటి బేకరీ ఫుడ్ చేయడం మొదలు పెట్టాను. మా స్టాల్‌ను విస్తరించి జీటీ రోడ్‌లోకి మార్చాం. అంతా గాడిలో పడిందనుకునే సమయంలో ఆపరేషన్ బ్లూస్టార్ మొదలైంది. పంజాబ్ అట్టుడికిపోయింది. అనంతరం దేశం మొత్తాన్ని కుదిపేసిన దుర్ఘటన ఇందిరాగాంధీ హత్య జరిగింది. అప్పటికి వందేళ్ల నుంచి మా కుటుంబం చేస్తున్న ధాన్యం, ఎరువుల వ్యాపారం స్తంభించిపోయింది. రైతులతో సంబంధాలు తెగిపోయాయి. బెదిరింపులు ఎక్కువయ్యాయి. మా పెద్దబ్బాయి మీద అపహరణ ప్రయత్నం కూడా జరిగింది. ఈ పరిస్థితుల్లో ఆ వ్యాపారాన్ని మూసివేయాల్సి వచ్చింది. ఆ తర్వాత అంటే.. 1990 నుంచి నా ఫుడ్ బిజినెస్సే ఇంట్లో అందరికీ ఫుడ్ పెట్టింది. ఇంట్లో అందరమూ క్రిమికా కోసమే పని చేయడం మొదలుపెట్టాం.

పదహారు గంటల పని

ఇప్పుడు క్రిమికాకు సంబంధించిన రోజువారీ బాధ్యతలేవీ లేవు. కానీ కీలకమైన సమయాల్లో రోజుకు పదహారు గంటలు పనిచేశాను. ఆహారం మీద నాకున్న ప్రత్యేకమైన అభిరుచే నన్ను ఈ రంగంలోకి తీసుకొచ్చింది. విజేతగా నిలబెట్టింది. నేను నా టేస్ట్‌బడ్స్‌కి థ్యాంక్స్ చెప్పాలి. క్వాలిటీ చెక్‌లో భాగంగా ప్రతిదీ రుచి చూడాలి. కేవలం రుచి మాత్రమే చూడాలి. కడుపు నిండా తినకూడదు. కడుపు నిండితే రుచిని గ్రహించే శక్తిని కోల్పోతాం. ఆ నియమం పాటిస్తేనే విజయం మనదవుతుంది. ఈ దేశంలో జీవించాలని వచ్చాం. ఇక్కడే సవాళ్లనెదుర్కొన్నాం. జీవితాన్ని వెతుక్కున్నాం. మూడేళ్ల కిందట పద్మశ్రీ పురస్కారం అందుకున్నాను. ఈ దేశం నాకు చాలా ఇచ్చింది'' అన్నారు రజనీ బెక్టార్.

ఫస్ట్ టైమ్



డిజిటల్ దివా జరా శతవరి

దివ్య వెలుగుల డిజిటల్ సుందరి

'కృత్రిమ నవ్వు' అని వెక్కిరిస్తాం.
'వారి మాటల్లో అంతా కృత్రిమత్వమే' అని విమర్శిస్తాం.
'కృత్రిమత్వం' 'సహజత్వం' భిన్న ధ్రువాలు అనే వాస్తవాన్ని కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) తిరగ రాసింది.
కృత్రిమ మేధస్సు నుంచి పుట్టిన అందాల యువతులు నవ్వితే ఆ నవ్వులో ఎక్కడా కృత్రిమత్వం కనిపించదు.
మాట్లాడితే... మళ్లీ మళ్లీ వినాలనిపిస్తుందేగానీ ఎక్కడా కృత్రిమ ఛాయ కనిపించదు.
మానవులతో పోటీ పడుతూ 'ఎక్కడా తగ్గేదేలే' అంటున్న డిజిటల్ సొగసరులకు ఏఐ సబ్‌స్క్రిప్షన్ ప్లాట్‌ఫామ్ 'ఫ్యాన్ వ్యూ' అందాల పోటీ నిర్వహించింది.
'మిస్ ఏఐ' పోటీ జరగడం చరిత్రలో ఇదే తొలిసారి.
'మిస్ ఏఐ' పోటీలో ప్రపంచవ్యాప్తంగా పదిహేను వందల ఏఐ మోడల్స్, డిజిటల్ ఇన్‌ఫ్లుయెన్సర్‌లు పోటీ పడ్డారు. 'టాప్ -10' ఫైనలిస్ట్ జాబితాలో మన దేశం నుంచి డిజిటల్ దివా జరా శతవరి చోటు సాధించింది.









కృత్రిమ మేధస్సు మంచి చెడుల గురించి చర్చ జరుగుతున్న సమయంలో 'శతవరి' పనితీరును ఎలా చూడాలి? ' అనే ప్రశ్నకు 'వందశాతం పాజిటివ్'గానే అనే సమాధానం వినిపిస్తుంది

బ్యూటీ, టెక్ స్కిల్స్, సోషల్ మీడియాలో వీరి ప్రభావం ఎంత... మొదలైన అంశాలు 'మిస్ ఏఐ' ఎంపిక ప్రక్రియలో ఉంటాయి.

న్యాయ నిర్ణేతలలో ఇద్దరు ఏఐ ఇన్‌ఫ్లుయెన్సర్‌లు ఉండడం విశేషం.

'మిస్ ఏఐ విజేత' ఎవరవుతారో అనే ఆసక్తికంటే 'ఎవరీ జరా శతవరి?' అనే ఆరా ఎక్కువ అయింది. అందానికి అక్షరాలా నిర్వచనంలా ఉన్న ఈ శతవరి ఎవరో తెలుసుకుందాం..

ఒక మొబైల్ కంపెనీ యాడ్ ఏజెన్సీకి కో-ఫౌండర్ అయిన రాహుల్ చౌదరి శతవరి సృష్టికర్త.

శతవరిని 'డిజిటల్ మీడియా మేధావి'గా అభివర్ణించాడు రాహుల్.

'మిస్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్'లో శతవరికి 'టాప్-10' చోటు దక్కిన సందర్భంగా తన లింక్‌డ్ ఇన్ పోస్ట్‌లో సంతోషాన్ని వ్యక్తం చేశాడు రాహుల్.

'ఈ గుర్తింపు ఏఐ ఇన్‌ఫ్లుయెన్సర్ కమ్యూనిటీకి జరా శతవరి చేసిన విశేష కృషిని తెలియజేస్తుంది. ప్రపంచ వేదికపై భారత్, ఆసియాకు ప్రాతినిధ్యం వహించడం గొప్ప గౌరవంగా భావిస్తాను. శతవరి భారత్ నుంచి ఏకైక ఫైనలిస్ట్, ఆసియా నుంచి ఇద్దరిలో ఒకరు' అని పోస్ట్‌లో స్పందించాడు రాహుల్.

శతవరి శక్తి ఇది...

* ఆన్‌లైన్ లెర్నింగ్ ప్లాట్‌ఫామ్స్‌లో ఏఐ-పవర్డ్ సోషల్ మీడియా స్ట్రాటజీ, ఎనాలటిక్స్ నేర్చుకుంది.
* 2023 నుంచి పీఎంహెచ్ బయోటెక్‌కు 'బ్రాండ్ అంబాసిడర్'గా ఉంది.
* 'ఇన్‌ఫ్లూయెన్సర్ మార్కెటింగ్ టాలెంట్ మేనేజర్'గా తన టాలెంట్‌ను చూపించింది.
* సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌గా 'వావ్' అనిపించింది. ఇన్‌స్టాగ్రామ్‌లో సుమారు 8000 మంది ఫాలోవర్‌లు ఉన్నారు.
* స్ట్రాటిజిక్ ప్లానింగ్, కంటెంట్ డెవలప్‌మెంట్, డేటా ఎనాలిసిస్, బ్రాండ్ ఎవేర్‌నెస్, బ్రాండ్ అడ్వకసీ, ఇన్‌ఫ్లుయెన్సర్ మార్కెటింగ్, క్రియేటివ్ ఐడియేషన్, ట్రెండ్-సావి, హెల్త్ అండ్ వెల్‌నెస్ కన్సల్టింగ్, సోషల్ మీడియా మార్కెటింగ్, కంటెంట్ క్రియేషన్, ఫ్యాషన్ స్టైలింగ్, కెరీర్ డెవలప్‌మెంట్ లాంటి విభాగాలలో ప్రతిభ చాటుతోంది.



కృత్రిమ మేధస్సు మంచి చెడుల గురించి చర్చ జరుగుతున్న సమయంలో 'శతవరి'ని ఎలా చూడాలి?' అనే ప్రశ్నకు 'వందశాతం పాజిటివ్'గానే అనే సమాధానం వినిపిస్తోంది.

అందం, సోషల్ మీడియాలోని అభిమాన గణం మాత్రమే శతవరి విలువకు ప్రాతిపదిక కాదు. హార్మోన్ సమస్యల నుంచి కుంగుబాటు వరకు ఎన్నో అంశాలపై మహిళలకు అవగాహన కలిగిస్తుంది. కృత్రిమ మేధస్సులోని సానుకూల కోణానికి సంపూర్ణంగా అద్దం పడుతుంది.

'ఏ.ఐ. సామర్థ్యం గురించి ప్రజలకు అవగాహన కలిగించడం ఆమె లక్ష్యం' అంటున్నాడు జరా శతవరి సృష్టికర్త రాహుల్.

బ్యూటిప్స్



పండులాంటి ప్యాక్



అరటితొక్కతో సహా పండుని ముక్కలుగా తరిగి పేస్టు చేయాలి. ఈ పేస్టుకు రెండు టీస్పూన్ల పచ్చిపాలు పోసి మరోసారి గ్రైండ్ చేసి పదిహేను నిమిషాలు రిఫ్రిజిరేటర్‌లో పెట్టాలి. తరువాత ఈ మిశ్రమాన్ని ముఖానికి, మెడకు పూతలా అప్లై చేసి ఇరవై నిమిషాల తరువాత కడిగేయాలి. అరటి పండులో ఉన్న విటమిన్ బి6, బి12, ప్రొటీన్, ఫైబర్, మెగ్నీషియం, పొటాషియంలు చర్మానికి పోషణ అందించి ఆరోగ్యంగా ఉంచుతాయి. ఈ ప్యాక్‌ను వారానికి రెండుసార్లు వేసుకోవడం వల్ల ముఖచర్మం నిగారింపుని సంతరించుకుంటుంది. క్రమం తప్పకుండా వాడితే ఫలితం త్వరగా కనిపిస్తుంది.

కిచెన్ టిప్స్



- మినరల్ వాటర్ క్యాన్‌లో రెండు టేబుల్ స్పూన్ల రాళ్ల ఉప్పు, టీస్పూను బేకింగ్ సోడా, ఒక నిమ్మకాయ రసం, కొద్ది గోరువెచ్చని నీళ్లు పోసి పదిహేను నిమిషాలు నానబెట్టాలి. తరువాత క్యాన్‌ను పైకీ కిందకు బాగా గిలకొట్టాలి. పది నిమిషాలపాటు ఇలా గిలకొట్టి రెండుమూడుసార్లు నీటితో కడగాలి. తరువాత డిష్ వాష్ లిక్విడ్‌తో వాటర్ క్యాన్ బయటవైపు తోముకుంటే క్యాన్ మురికి వదిలి కొత్తదానిలా మెరుస్తుంది.



- బట్టల మీద పడిన ఇంక్ మరకలు పోవాలంటే.. ఇంక్ మరకలపై కొద్దిగా నీళ్లు చల్లాలి. ఇప్పుడు టూత్ పేస్టును అప్లై చేసి బ్రష్‌తో రుద్ది నీటితో వాష్ చేస్తే ఇంక్ మరకలు ఇట్టే పోతాయి.



- స్ప్రే బాటిల్‌లో టేబుల్ స్పూను బేకింగ్ సోడా, టేబుల్ స్పూను వెనిగర్, టీ స్పూను డిష్ వాష్ లిక్విడ్, రెండు గ్లాసులు నీళ్లు పోసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని కిచెన్ ప్లాట్‌ఫాం, స్టవ్ మీద చల్లుకుని తుడుచుకుంటే ఎటువంటి క్రిములూ దరిచేరవు. దీనిలో ఎటువంటి రసాయనాలు లేవు కాబట్టి ఆరోగ్యానికి కూడా మంచిదే.

కలలు కనడమే కాదు.. వాటి సాకారానికి కృషి చేయాలనే ఆలోచన ఓ ముగ్గురు గృహిణులలో కలిగింది.
ఫలితంగా వాహనాలను రిపేర్ చేయడంలో శిక్షణ తీసుకున్నారు.
అంతటితో ఆగిపోకుండా 'సిగ్నోరా' పేరుతో వెంచర్‌ను కూడా ఏర్పాటు చేశారు.
మేరీ, బిన్సీ, బింటు అనే ఈ ముగ్గురు మహిళలు కేరళలోని కాసర్‌గోడ్‌కు చెందినవారు.
'ఫస్ట్ ఆల్ ఉమెన్ టు ఆటోమొబైల్ వెంచర్‌గా మా సంస్థకు గుర్తింపు రావడం గర్వంగా ఉంది' అని చెబుతున్న ఈ మహిళల లక్ష్యం ఎంతోమందికి స్ఫూర్తి కలిగిస్తోంది.



మేరీ, బిన్సీ, బింటు

సిగ్నోరా @ సర్వీస్ సెంటర్

పనిముట్లను అందుకున్న మేరీ అరగంట కృషితో రిపేర్‌లో ఉన్న కారును డ్రైవింగ్‌కు అనుకూలంగా మార్చేసింది. మేరీ, బిన్సీ, బింటు ముగ్గురూ ఆ తర్వాత మరో వాహనాన్ని రిపేర్ చేయడంలో మునిగిపోయారు. సాధారణంగా మహిళలు వెనకడుగు వేసే ఆటోమొబైల్ రిపేరింగ్ రంగంలో ఈ ముగ్గురూ సక్సెస్‌ను చూపుతున్నారు.

శిక్షణతో ముందడుగు

మహిళలు ఒంటరిగా లేదా బృందంగా వ్యాపారం ప్రారంభించేందుకు శిక్షణ ఇవ్వడానికి పరప్ప బ్లాక్ పంచాయితీ ఆలోచన చేసింది. ఆ సమయానికి బిన్సీ, బింటు, మేరీలు ఎవరి కాపురాలు వారు చేసుకుంటూ కుటుంబ జీవనం గడుపుతున్నారు. అయితే తాము కుటుంబ బాధ్యతలకు అతీతంగా సమాజం ముందు సగర్వంగా నిలబడాలని కలలు కన్నారు. అంతటితో ఆగిపోలేదు.. వాటిని సాకారం చేసుకోవాలనుకున్నారు. పరప్ప బ్లాక్ పంచాయితీ ద్విచక్ర వాహనాల మరమ్మతులో వృత్తి శిక్షణ కోర్సును ప్లాన్ చేసింది. ఆ శిక్షణా కార్యక్రమమే ముగ్గురు మహిళల జీవితాల్లో కొత్త వెలుగులు నింపింది.

గ్రూప్‌గా ఏర్పాటు..

పద్దెనిమిది నుండి నలభై ఐదు సంవత్సరాల మధ్య వయసు గల ఇరవై మంది మహిళలను కోర్సుకు ఆహ్వానించింది. ఈ ప్రాజెక్ట్‌ను అమలు చేసేందుకు ఏడు పంచాయతీలను ఎంపిక చేశారు. మొత్తం 23 మంది మహిళలు శిక్షణకు ముందుకు వచ్చారు. వీరికి నెల రోజుల పాటు నిపుణులు శిక్షణ ఇచ్చారు. బిన్సీ మాట్లాడుతూ 'కోర్సు పూర్తవగానే వెంచర్ ప్రారంభించాలనుకునేవారికి సహాయం అందిస్తామన్నారు. అప్పుడే మేం ఒక గ్రూప్‌గా ఏర్పడి సరైన ప్లాన్‌తో ముందుకు రావాలనుకున్నాం. ఒకే ప్రాంతంలో ఎంటర్‌ప్రైజ్ ప్రారంభించాలనుకున్నాను. సిగ్నోరా అంటే లాటిన్ భాషలో 'పెళ్లయిన స్త్రీ' అని అర్థం. కుటుంబ సభ్యులు కూడా మాకు మద్దతునిచ్చారు. ఆటో సర్వీసింగ్ రంగం మహిళలకు అంత సులువైన పనికాదనే అభిప్రాయం అందరిలోనూ ఉంది. దీనిని అధిగమించాలనే పట్టుదలతోనే మేం వర్క్‌షాప్‌ను ప్రారంభించాం. భీమానది-కలిక డవ్ మార్గంలో మా వెంచర్‌ను ఏర్పాటు చేశాం. తొలినాళ్లలో 'ఆడవాళ్లు రిపేర్లు చేస్తే ఇక ఆ వాహనం ముందుకు నడిచినట్టే..' లాంటి వ్యంగ్యపు మాటలు వినవచ్చేవి. అలాంటి ఆలోచనతో చాలా మంది మా వెంచర్‌కు వచ్చేవారు కాదు. అయితే, ఆ తర్వాత మెల్లగా మా వెంచర్‌కు వచ్చిన వాహనాలకు తగిన రిపేర్ చేయడంతో మంచి గుర్తింపు రావడం మొదలైంది. ఎలాంటి వాహన సమస్యనైనా మేం పరిష్కరించగలం.



మేరీ, బిన్సీ, బింటు

ప్రతిరోజూ కొత్త విషయాలు..

'విజయాన్ని త్వరగా సొంతం చేసుకోగల వృత్తి ఇది కాదని మేం నమ్ముతున్నాం. దీనివల్ల లాభాలు గడిస్తాం అని కూడా అనుకోవడం లేదు. ప్రస్తుతం వచ్చే ఆదాయం అద్దెకు, రుణం చెల్లించడానికి సరిపోతుంది. సర్వీస్ సెంటర్‌లో అధునాతన పరికరాలు కొనుగోలు చేయడానికి డబ్బు కావాలి. ప్రతి రోజూ ఒక్కో వాహనం గురించి కొత్త విషయాలు నేర్చుకుంటున్నాం. మా ముగ్గురికీ ఆర్థిక సహకారం అందించేలా సంస్థ క్రమంగా ఎదుగుతుందని ఆశిస్తున్నాం' అంటున్నారు ఈ మహిళలు. మొదట్లో ఆటోమొబైల్ సర్వీస్ ట్రెయినింగ్‌కు విముఖత చూపిన పలువురు స్థానిక మహిళలు ఇప్పుడు ఆసక్తిగా ఈ పారిశ్రామికవేత్తలను సంప్రదిస్తున్నారు. తమ వెంచర్ విజయవంతమైతే ద్విచక్రవాహనాల రిపేరింగ్‌లో అమ్మాయిలకు శిక్షణ ఇవ్వాలనుకుంటున్నామ'ని మేరీ చెబుతోంది.

'ఈ వెంచర్‌ను ప్రారంభించి ఆరు నెలలు కావస్తోంది. యూనిఫామ్ ధరించి పని చేస్తున్నప్పుడు మాపై మాకు నమ్మకంగానూ, గర్వంగానూ అనిపిస్తుంది. టెక్నాలజీ రోజు రోజుకూ మారుతున్న కొద్దీ ఇంకా కొత్త కొత్త విషయాలు నేర్చుకుంటూనే ఉండాలి. చాలామంది అమ్మాయిలు, మహిళలు ఇప్పుడు మమ్మల్ని ఈ పని నేర్పించమని అడుగుతున్నారు. ఆసక్తి ఉన్నవారికి శిక్షణ అందించాలనుకుంటున్నాం. మా వెంచర్‌ను పెద్ద సంస్థగా తీర్చిదిద్దాలనేది మా లక్ష్యం' అంటున్నారు ఈ ఉమెన్ మెకానిక్స్.

సాక్షి
గురువారం
20-6-2024

స్పోర్ట్స్



కెప్టెన్సీకి విలియమ్సన్ గుడ్‌బై

క్రైస్ట్‌చర్చ్: ఐసీసీ ఈవెంట్లలో ప్రతీ సారి నిలకడైన ప్రదర్శన కనబర్చే న్యూజిలాండ్ జట్టు ఈ సారి టి20 వరల్డ్ కప్‌లో పేలవ ఆటతో కనీసం సూపర్-8కు కూడా చేరకుండా నిష్క్రమించింది. ఈ నేపథ్యంలో జట్టు కెప్టెన్‌గా ఉన్న కేన్ విలియమ్సన్ తాను నాయకుడిగా తప్పుకుంటున్నట్లు ప్రకటించాడు. దీంతో పాటు వన్డే కెప్టెన్సీకి కూడా అతను రాజీనామా చేశాడు. టి20 వరల్డ్ కప్‌లో అఫ్గానిస్తాన్, వెస్టిండీస్ చేతుల్లో ఓడిన కివీస్ జట్టు ఉగాండా, పపువా న్యూగినీలపై మాత్రమే గెలుపొందింది. తాజా పరిణామాలతో న్యూజిలాండ్ క్రికెట్ బోర్డు సెంట్రల్ కాంట్రాక్ట్‌నుంచి కూడా కేన్ తప్పుకున్నాడు. అయితే ఆటగాడిగా మాత్రం కొనసాగుతానని అతను వెల్లడించాడు. ఏడాది క్రితమే విలియమ్సన్ టెస్టు కెప్టెన్ హోదాను కూడా స్వచ్ఛందంగా వదులుకున్నాడు. విలియమ్సన్ కెప్టెన్సీలో 2019 వన్డే వరల్డ్ కప్, 2021 టి20 వరల్డ్ కప్‌లలో ఫైనల్ చేరిన న్యూజిలాండ్...2021 వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్‌లో విజేతగా నిలిచింది. మొత్తం 40 టెస్టులు, 91 వన్డేలు, 75 టి20ల్లో అతను కివీస్‌కు కెప్టెన్‌గా వ్యవహరించాడు.


హర్మన్

అటు హర్మన్...ఇటు స్మృతి

- శతకాలతో చెలరేగిన భారత ద్వయం
- 4 పరుగులతో ఓడిన దక్షిణాఫ్రికా
- వోల్‌వార్ట్, కాప్ సెంచరీలు

బెంగళూరు: భారత్, దక్షిణాఫ్రికా మహిళల క్రికెట్ సమరంలో రికార్డులు హోరెత్తాయి. చిన్నస్వామి స్టేడియంలో పరుగుల వరద పారి హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో చివరకు భారత్‌దే పైచేయి అయింది. బుధవారం జరిగిన రెండో వన్డేలో భారత్ 4 పరుగుల స్వల్ప తేడాతో దక్షిణాఫ్రికాపై విజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 50 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 325 పరుగుల భారీ స్కోరు సాధించింది. వన్డేల్లో భారత్‌కు ఇది మూడో అత్యధిక స్కోరు. కెప్టెన్, 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' హర్మన్‌ప్రీత్ కౌర్ (88 బంతుల్లో 103 నాటౌట్; 9 ఫోర్లు, 3 సిక్స్‌లు) మెరుపు సెంచరీ సాధించగా, స్మృతి మంధాన (120 బంతుల్లో 136; 18 ఫోర్లు, 2 సిక్స్‌లు) వరుసగా రెండో వన్డేలోనూ శతకంతో చెలరేగింది.అనంతరం సఫారీ టీమ్ చివరి వరకు పోరాడి ఓడింది. 50 ఓవర్లలో దక్షిణాఫ్రికా 6 వికెట్లకు 321 పరుగులు సాధించింది. కెప్టెన్ లారా వోల్‌వార్ట్ (135 బంతుల్లో 135 నాటౌట్; 12 ఫోర్లు, 3 సిక్స్‌లు), మరిజాన్ కాప్ (94 బంతుల్లో 114; 11 ఫోర్లు, 3 సిక్స్‌లు) సెంచరీలు సాధించారు. పూజ వస్త్రకర్ వేసిన ఆఖరి ఓవర్లో దక్షిణాఫ్రికా విజయానికి 11 పరుగులు అవసరం కాగా, తొలి 2 బంతుల్లో 5 పరుగులు వచ్చాయి. అయితే తర్వాతి 2 బంతులకు 2 వికెట్లు పడ్డాయి. ఆఖరి 2 బంతుల్లో 1 బై మాత్రమే వచ్చింది. సిరీస్‌ను 2-0తో భారత్ సొంతం చేసుకోగా, మూడో వన్డే ఆదివారం జరుగుతుంది.

4 మహిళల వన్డేలో నలుగురు బ్యాటర్లు సెంచరీలు సాధించడం ఇదే తొలిసారి.

646 ఇరు జట్లు కలిపి చేసిన పరుగులు. ఇది రెండో అత్యధికం. గతంలో ఇంగ్లండ్, దక్షిణాఫ్రికా మధ్య మ్యాచ్‌లో 678 పరుగులు నమోదయ్యాయి

7 వన్డేల్లో ఏడో సెంచరీ సాధించిన స్మృతి...భారత్ తరఫున మిథాలీ రాజ్ (7)ని సమం చేసింది.

★ హైదరాబాద్‌కు చెందిన పేస్ బౌలర్ అరుంధతి రెడ్డి ఈ మ్యాచ్‌తో వన్డేల్లో అరంగేట్రం చేసింది. భారత్ తరఫున ఆమె ఇప్పటికే 26 టి20లు ఆడింది.


స్మృతి

'ఎయిట్'లో సమరానికి సై!

- నేడు సూపర్-8లో భారత్ తొలి మ్యాచ్
- అఫ్గానిస్తాన్‌తో కీలక సమరం
- జోరు మీదున్న రోహిత్ సేన
- రా.గం.8.00 నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్ స్టార్‌లలో ప్రత్యక్ష ప్రసారం

ఎలాంటి విధ్వంసక బ్యాటింగ్ ప్రదర్శనలు లేవు...ఎలాంటి అసాధారణ బౌలింగ్ గణాంకాలు లేవు...ఐర్లాండ్, అమెరికాలపై సులువుగా గెలిస్తే పాక్ పోటీనిచ్చినా ఫలితం మన వైపే నిలిచింది. పెద్దగా ప్రతిఘటన లేకుండా ముందంజ వేసిన భారత జట్టు ఇప్పుడు దానిని కొనసాగించాలని పట్టుదలగా ఉంది. అప్పుడప్పుడు సంచలనాలతో అలరించే అఫ్గానిస్తాన్ ఎదురుగా నిలిచింది.


రషీద్


రోహిత్

బ్రిడ్జ్‌టౌన్: టి20 వరల్డ్ కప్‌లో లీగ్ దశతో పోలిస్తే కాస్త బలమైన ప్రత్యర్థులతో తలపడే అవకాశం ఉన్న సూపర్-8లో భారత జట్టు తమ తొలి మ్యాచ్ కోసం సన్నద్ధమైంది. నేడు జరిగే పోరులో అఫ్గానిస్తాన్‌తో టీమిండియా తలపడుతుంది. లీగ్ దశలో ఓటమి లేకుండా సాగిన భారత జట్టే ఇక్కడా ఫేవరెట్‌గా కనిపిస్తుండగా...అఫ్గాన్ తమ బౌలింగ్ బలాన్నే నమ్ముకుంది. ఇరు జట్ల మధ్య ఇప్పటి వరకు 8 అంతర్జాతీయ టి20 మ్యాచ్‌లు జరగ్గా...భారత్ 7 గెలిచింది. మరో మ్యాచ్‌లో ఫలితం రాలేదు.

అదే జట్టుతో...

సూపర్-8లో పిచ్‌లు స్పిన్‌ను అనుకూలించే పరిస్థితి ఉంది కాబట్టి భారత్ కుల్దీప్‌ను తీసుకోవచ్చనే చర్చ జరిగింది. అయితే అక్షర్ అటు స్పిన్‌తో పాటు ఇటు బ్యాటింగ్‌తో కూడా కీలక పరుగులు సాధిస్తుండటంతో మేనేజ్‌మెంట్ ఆ సాహసం చేయకపోవచ్చు. రోహిత్, కోహ్లి ఓపెనర్లుగా చెలరేగితే జట్టుకు తిరుగుండదు. కోహ్లి అన్ని మ్యాచ్‌లలో విఫలమైనా... ఒక్క సరైన ఇన్నింగ్స్ అతని స్థాయిని చూపించగలదు. పంత్ మూడో స్థానంలో చక్కగా నిలదొక్కుకున్నాడు. అఫ్గాన్ స్పిన్నర్లపై ఎదురుదాడికి మిడిలార్డర్‌లో సూర్యకుమార్, దూబే సరైనవాళ్లు కాగలరు. ఆ తర్వాత కూడా పాండ్యా, జడేజా, అక్షర్ రూపంలో బ్యాటింగ్ బలగం ఉంది కాబట్టి సమస్య లేదు. బుమ్రా అద్భుత బౌలింగ్‌ను అఫ్గాన్ ఏమాత్రం ఎదుర్కోగలదనేది చూడాలి.

స్పిన్నర్లు రాణిస్తే...

గత మ్యాచ్‌లో వెస్టిండీస్ చేతిలో చిత్తుగా ఓడినా...అఫ్గానిస్తాన్ టీమ్‌లో ఆత్మస్థైర్యానికి లోటు లేదు. జట్టు ప్రధానంగా బౌలింగ్‌పైనే ఆధారపడుతోంది. టోర్నీలో అత్యధిక వికెట్లు తీసిన ఫజల్ హక్ తన పదునైన పేస్, స్వింగ్‌తో ప్రత్యర్థులను ఇబ్బంది పెడుతున్నాడు. మధ్య ఓవర్లలో కెప్టెన్ రషీద్ ఖాన్ బౌలింగ్‌పైనే జట్టు విజయావకాశాలు ఆధారపడి ఉన్నాయి. గతంలో 2 సార్లే భారత్‌తో ఆడిన రషీద్ ఒక్క వికెట్ తీయకపోయినా...అతడిని తక్కువగా అంచనా వేయడానికి లేదు. చైనామన్ స్పిన్నర్ నూర్ అతడికి అండగా నిలుస్తాడు. ఐపీఎల్ అనుభవంతో చెలరేగుతున్న గుర్బాజ్, మరో ఓపెనర్ ఇబ్రహీమ్ జట్టుకు మంచి ఆరంభాలు అందించారు. ఈ ఏడాది జనవరిలో భారత్‌తో జరిగిన మ్యాచ్‌ను 212 పరుగుల స్కోరుతో అఫ్గాన్ 'టై' చేసిన విషయం మరచిపోవద్దు.

పిచ్, వాతావరణం

న్యూయార్క్‌లో పరుగులే రావడం గగనమైన పిచ్‌తో పోలిస్తే ఇది బ్యాటింగ్‌కు బాగా అనుకూలం. టోర్నీలో ఒక సారి 200కు పైగా స్కోరూ నమోదైంది. వర్షసూచన లేదు.

పోర్చుగల్ విజయం


రొనాల్డో

లీప్‌జిగ్ (జర్మనీ): ప్రతిష్టాత్మక యూరో కప్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లలో ఒకటైన పోర్చుగల్ శుభారంభం చేసింది. గ్రూప్ 'ఎఫ్'లో భాగంగా జరిగిన తమ తొలి పోరులో పోర్చుగల్ 2-1 గోల్స్ తేడాతో చెక్ రిపబ్లిక్‌పై విజయం సాధించింది. పటిష్ట పోర్చుగల్‌ను చివరి వరకు నిలువరించి మ్యాచ్‌ను చెక్ జట్టు డ్రా దిశగా తీసుకెళ్లినా...అదనపు సమయంలో గోల్ ఇచ్చి మ్యాచ్‌ను చేజార్చుకుంది. ల్యూకాస్ ప్రావోడ్ (62వ నిమిషం) గోల్‌తో చెక్ 1-0తో ఆధిక్యంలోకి వెళ్లింది. దురదృష్టవశాత్తూ చెక్ ఆటగాడు రాబిన్ రానక్ (69వ నిమిషం) సెల్ఫ్ గోల్ చేయడంతో స్కోరు సమమైంది. ఆ తర్వాత ఆధిపత్యం కోసం ఇరు జట్లూ పోరాడాయి. చివరకు ఫ్రాన్సిస్కో కాన్సికావో (90+2వ ని.) గోల్ కొట్టడంతో పోర్చుగల్ గెలుపు ఖాయమైంది. స్టార్ ప్లేయర్ క్రిస్టియానో రొనాల్డో గోల్ చేయకపోయినా...జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. రికార్డు స్థాయిలో అతను ఆరో సారి 'యూరో' బరిలో దిగడం విశేషం.

మరో మ్యాచ్‌లో ఆతిథ్య జర్మనీ 2-0తో హంగేరీని ఓడించి ప్రిక్వార్టర్స్‌లోకి అడుగు పెట్టింది.

సఫారీ సూపర్ విక్టరీ

18 పరుగులతో అమెరికాపై గెలుపు
- గెలిపించిన డికాక్, రబాడ
- ఆండ్రియెస్ గూస్ పోరాటం వృథా


డికాక్

నార్త్‌సౌండ్: ప్రపంచ కప్ లీగ్ దశలో పెద్ద జట్లలో కనిపించిన అలసత్వం, చిన్న స్కోరుకే పడిన ఆపసోపాలు సూపర్-8కు వచ్చేసరికి దూరమైనట్లున్నాయి. బోర్ కొట్టించిన స్కోర్ల స్థానంలో ఆసక్తికర ధనాధన్ సమరం టి20 మజాను పంచింది. దీంతో ఆడుతున్న తొలి టి20 ప్రపంచకప్‌లోనే ముందంజ వేసిన అమెరికా ఆటలు ఈ దశ (సూపర్-8)లో సాగలేదు. పటిష్టమైన దక్షిణాఫ్రికా ఆల్‌రౌండ్ దెబ్బకు ఆతిథ్య అమెరికా ఓడింది. బుధవారం జరిగిన తొలి సూపర్-8 పోరులో సఫారీ టీమ్ 18 పరుగుల తేడాతో అమెరికా జట్టుపై విజయం సాధించింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 194 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' క్వింటన్ డికాక్ (40 బంతుల్లో 74; 7 ఫోర్లు, 5 సిక్స్‌లు) ధనాధన్ షో చేశాడు. మరో ఓపెనర్ రిజా హెండ్రిక్స్ (11) విఫలమైనా... వన్‌డౌన్‌లో వచ్చిన కెప్టెన్ మార్క్‌రమ్ (32 బంతుల్లో 46; 4 ఫోర్లు, 1 సిక్స్) అండతో రెండో వికెట్‌కు చకచకా 110 పరుగులు జోడించాడు. తర్వాత 126 పరుగుల స్కోరు వద్ద డికాక్, మిల్లర్ (0) అవుటయ్యారు. అయితే హెన్రిచ్ క్లాసెన్ (22 బంతుల్లో 36 నాటౌట్; 3 సిక్స్‌లు), ట్రిస్టన్ స్టబ్స్ (16 బంతుల్లో 20 నాటౌట్) ధాటిగా ఆడటంతో దక్షిణాఫ్రికా భారీ స్కోరు చేసింది. అనంతరం అమెరికా కొంత పోరాడినా లక్ష్యానికి దూరంగా ఉండిపోయింది. ఆ జట్టు 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 176 పరుగులకే పరిమితమైంది. ఓపెనర్ ఆండ్రియెస్ గూస్ (47 బంతుల్లో 80 నాటౌట్; 5 ఫోర్లు, 5 సిక్స్‌లు) ఒంటరి పోరాటం చేశాడు. అతనికి జోడీగా దిగిన స్టీవెన్ టేలర్ (14 బంతుల్లో 24; 4 ఫోర్లు, 1 సిక్స్) కూడా వేగంగా పరుగులు సాధించడంతో 3.2 ఓవర్లలోనే అమెరికా 33 పరుగులు చేసింది. కానీ మరుసటి బంతికి టేలర్ అవుటయ్యాక జట్టు నిలబడలేకపోయింది. నితీశ్ కుమార్ (8), కెప్టెన్ ఆరోన్ జోన్స్ (0), కోరీ అండర్సన్ (12), జహంగీర్ (3) ఇలా వచ్చి అలా వెళ్లి పోయారు. హర్మీత్ దేశాయ్ (22 బంతుల్లో 38)తో గూస్ వికెట్ల పతనాన్ని అడ్డుకున్నాడు. ఇద్దరు కాసేపు భారీ షాట్లతో వణికించారు. అయితే హర్మీత్‌ను రబాడ (3/18) అవుట్ చేయడంతో ఆశలు ఆవిరయ్యాయి.

టి20 ప్రపంచకప్‌లో నేడు

వెస్టిండీస్ X ఇంగ్లండ్
వేదిక: గ్రాస్ ఐలెట్; ఉ.గం.6.00 నుంచి
భారత్ X అఫ్గానిస్తాన్
వేదిక: బ్రిడ్జ్‌టౌన్; రాత్రి గం. 8 నుంచి
స్టార్ స్పోర్ట్స్, హాట్ స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

సినిమా

కల్కిలాంటి సినిమా నేనిప్పటివరకూ చేయలేదు - అమితాబ్


అమితాబ్ బచ్చన్, కమల్‌హాసన్, దీపికా పదుకోన్, ప్రభాస్

''కల్కి 2898 ఏడీ' సెట్స్‌లో తొలిసారి అమితాబ్ బచ్చన్‌గారిని కలిసినప్పుడు ఆయన కాళ్లను తాకాలనుకున్నాను. అమితాబ్‌గారు వద్దన్నారు. నువ్వు చేస్తే నేనూ చేయాల్సి ఉంటుందన్నారు. సార్... ప్లీజ్ అన్నాను. అప్పట్లో ఎవరైనా టాల్‌గా ఉంటే అమితాబ్ అనే వారు. అమితాబ్ బచ్చన్‌గారి హెయిర్ స్టయిల్ బాగా ఫేమస్. ఇక 'సాగర సంగమం' చూసి ఆ సినిమాలో కమల్‌గారిలా డ్రెస్ కావాలని మా అమ్మతో అన్నాను. 'ఇంద్రుడు చంద్రుడు'లో ఆయన నటన చూసి ఎగ్జైట్ అయ్యాను. ఈ స్టార్స్, దీపికా పదుకోన్‌తో కలిసి యాక్ట్ చేయడం నాకో మంచి ఎక్స్‌పీరియన్స్'' అని ప్రభాస్ అన్నారు. ప్రభాస్ హీరోగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'కల్కి 2898 ఏడీ'. దీపికా పదుకోన్, అమితాబ్ బచ్చన్, కమల్‌హాసన్ ఇతర లీడ్ రోల్స్‌లో నటించారు. సి. అశ్వినీదత్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 27న విడుదల కానుంది. ఈ సందర్భంగా ముంబైలో జరిగిన 'కల్కి 2898 ఏడీ' ప్రీ రిలీజ్ వేడుకకు హీరో రానా హోస్ట్‌గా వ్యవహరించారు. ఈ సినిమా తొలి టికెట్‌ను అమితాబ్ బచ్చన్‌కు అశ్వినీదత్ అందించగా, ఆయన నగదు చెల్లించి తీసుకున్నారు. ఈ టికెట్‌ను ఇవ్వాలనుకుంటే ఎవరికి ఇస్తారు? అని అమితాబ్‌ను రానా అడగ్గా, మై బ్రదర్ కమల్‌హాసన్‌కి అని చెప్పారు. ఆ తర్వాత ఈ టికెట్‌ను అమితాబ్ నుంచి కమల్ అందుకుని, 'షోలే' సినిమా 'ఫస్ట్ డే ఫస్ట్ షో' టికెట్ జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఇంకా ఈ వేడుకలో అమితాబ్ బచ్చన్ మాట్లాడుతూ– ''కల్కి 2898 ఏడీ'లో భాగం కావడాన్ని గౌరవంగా భావిస్తున్నాను. నేనిప్పటివరకూ ఇలాంటి సినిమా చేయలేదు. నాగ్ అశ్విన్ కథ చెప్పినప్పుడు అతను ఏం తాగితే ఇలాంటి ఐడియా వచ్చిందా అనిపించింది. తన విజన్ అద్భుతం. అశ్వినీదత్‌గారు సింపుల్‌గా ఉంటారు. సెట్స్‌లో నాకు కోపరేటివ్‌గా ఉన్నారు'' అన్నారు. కమల్‌హాసన్ మాట్లాడుతూ– ''కల్కి 2898 ఏడీ' సినిమా స్టార్ట్ చేసేప్పుడు ఆసక్తిగా అనిపించింది. సెట్స్‌లో పాల్గొన్న తర్వాత సర్‌ప్రైజింగ్‌గా అనిపించింది. ఇప్పుడు అద్భుతంగా అనిపిస్తోంది. సాధారణంగా కనిపించేవారు అసాధారణ పనులు చేస్తుంటారు. నాగ్ అశ్విన్ విషయంలో నాకు అదే అనిపించింది. బ్యాట్‌మేన్‌లాంటి కథలు చేయాలని నాకు ఉండేది. ఈ సినిమాలో చేశాను. ఈ సినిమాలో నేనొక పాత్ర చేయాలనుకున్నా.. ఈ పాత్రను అమిత్‌జీ చేస్తున్నారన్నారు. మరో పాత్ర ఎంచుకున్నా.. అది ప్రభాస్ చేస్తున్నారన్నారు. ఫైనల్‌గా సుప్రీమ్ యాస్కిన్ అనే పాత్ర చేశాను'' అన్నారు. ''కరోనా టైమ్‌లో జూమ్‌లో నాగ్ అశ్విన్ కథ చెప్పారు. తన విజన్ క్లియర్‌గా ఉంటుంది. ఇందులో తల్లి పాత్ర చేశాను. ఈ సినిమా సెట్స్‌లో ప్రభాస్ ఈ రోజు ఎవరికి ఏం ఫుడ్ పెట్టారు అన్నదే హైలైట్ డిస్కషన్‌గా ఉండేది (సరదాగా)'' అన్నారు దీపికా పదుకోన్. దర్శకుడు నాగ్ అశ్విన్ ఈ వేడుకకు హాజరు కాలేదు. కానీ 'కల్కి 2898 ఏడీ' గురించి నాగ్ అశ్విన్ మాట్లాడిన వీడియో బైట్‌ను ప్లే చేశారు. కాశీ, కాంప్లెక్స్, శంబాల అనే మూడు ప్రపంచాల నేపథ్యంలో ఈ కథ ఉంటుందని చెప్పి, ఈ ప్రపంచాల నేపథ్యాలను వివరించారు నాగ్ అశ్విన్. ఈ కార్యక్రమంలో నిర్మాతలు స్వప్నాదత్, ప్రియాంకా దత్, అనిల్ తడానీ తదితరులు పాల్గొన్నారు. అలాగే ప్రెగ్నెంట్‌గా ఉన్న దీపికా పదుకోన్ స్టేజ్ నుంచి దిగేటప్పుడు ప్రభాస్, స్టేజ్ ఎక్కేటప్పుడు అమితాబ్ హెల్ప్ చేయడం ఈవెంట్‌లో హైలైట్‌గా నిలిచింది.

ఆర్కిటెక్ట్ నిత్య ఆన్ సెట్


సాక్షీ వైద్య

శర్వానంద్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'శర్వా 37' (వర్కింగ్ టైటిల్). 'సామజవరగమన' వంటి హిట్ మూవీ తర్వాత రామ్ అబ్బరాజు దర్శకత్వం వహిస్తున్న చిత్రమిది. ఇందులో హీరోయిన్‌గా సాక్షీ వైద్యని ఖరారు చేసినట్లు ప్రకటించారు మేకర్స్. 'ఏజెంట్, గాండీవధారి అర్జున' చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకు సాక్షీ వైద్య సుపరిచితురాలే. తాజాగా శర్వానంద్‌కి జోడీగా నటిస్తున్నారామె. ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్, అడ్వెంచర్స్ ఇంటర్నేషనల్ పతాకాలపై అనిల్ సుంకర, రామబ్రహ్మం సుంకర ఈ సినిమా నిర్మిస్తున్నారు. కాగా బుధవారం (జూన్ 19) సాక్షీ వైద్య పుట్టినరోజు. ఈ సందర్భంగా ఆమెకు శుభాకాంక్షలు చెబుతూ సెట్‌లోకి స్వాగతించింది యూనిట్. 'శర్వా 37'లో ఆర్కిటెక్ట్ నిత్య పాత్రలో సాక్షీ వైద్య నటిస్తున్నారు. ''పర్ఫెక్ట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న చిత్రం ఇది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతోంది'' అన్నారు మేకర్స్. ఈ చిత్రానికి సంగీతం: విశాల్ చంద్రశేఖర్, కెమెరా: జ్ఞానశేఖర్ వీఎస్.

ఇక డైరెక్షన్‌పైనే ఫోకస్

- రాజేష్ జగన్నాథం



''మలయాళ సినిమాలు చూసి ఇలాంటి చిత్రాలు మన వద్దకు ఎందుకు రావడం లేదని తెలుగు ప్రేక్షకులు అనుకుంటారు. కానీ, మా 'నింద' చూశాక 'బాగా తీశారు.. మన వద్ద కూడా మంచి కాన్సెప్ట్ బేస్డ్ చిత్రాలు వస్తున్నాయి' అనుకుంటారు. ఒక్క మాటలో చెప్పాలంటే 'నింద' అందరికీ నచ్చే చిత్రం అవుతుంది'' అని చిత్ర దర్శక-నిర్మాత రాజేశ్ జగన్నాథం అన్నారు. వరుణ్ సందేశ్ హీరోగా నటించిన చిత్రం 'నింద'. రాజేశ్ జగన్నాథం స్వీయ దర్శకత్వంలో నిర్మించిన ఈ చిత్రం రేపు విడుదల కానుంది. ఈ సందర్భంగా రాజేశ్ జగన్నాథం మాట్లాడుతూ– ''మాది నర్సాపురం. నెల్లూరు, చెన్నై, యూఎస్‌లో చదువుకుని, అమెరికాలో ఉద్యోగం చేస్తూ ఉండిపోయాను. ఫిల్మ్ మేకింగ్‌లో కోర్సులు చేసి, అక్కడే షార్ట్ ఫిలింస్ చేశాను. వాస్తవ ఘటనలు, కల్పిత సన్నివేశాలతో 'నింద' స్క్రిప్ట్ రాశాను. ఈ కథ వరుణ్ సందేశ్‌కి మంచి కమ్ బ్యాక్‌లా ఉంటుందని భావించి ముందుకెళ్లాం. కథపై ఉన్న నమ్మకంతోనే నేనే నిర్మించాను. ఈ మూవీలో వరుణ్ సందేశ్ చాలా కొత్తగా కనిపిస్తాడు. 'నింద' తర్వాత ఎక్కువగా దర్శకత్వం మీదే ఫోకస్ పెడతాను'' అన్నారు.

కోపాలు చాలండి శ్రీమతిగారు


మీనాక్షీ చౌదరి, దుల్కర్ సల్మాన్

'మహానటి, సీతారామం' ఫేమ్ దుల్కర్ సల్మాన్ హీరోగా నటిస్తున్న తెలుగు చిత్రం 'లక్కీ భాస్కర్'. వెంకీ అట్లూరి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో మీనాక్షీ చౌదరి కథానాయిక. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్న ఈ చిత్రానికి జీవీ ప్రకాశ్‌కుమార్ సంగీతదర్శకుడు. ఈ మూవీ నుంచి 'శ్రీమతి గారు..' అంటూ సాగే మొదటి పాటని విడుదల చేసింది చిత్ర బృందం. 'కోపాలు చాలండి శ్రీమతిగారు.. కొంచెం కూల్ అవ్వండి మేడంగారు..' అంటూ ఈ మెలోడీ సాంగ్ సాగుతుంది. శ్రీమణి సాహిత్యం అందించిన ఈ పాటని విశాల్ మిశ్రా, శ్వేతా మోహన్ ఆలపించారు. తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో ఈ సినిమా విడుదల కానుంది.

మంచి కామెడీ దెయ్యం


నందితా శ్వేత, అబినికా, నవమి, అనూప్ రూబెన్స్

నందితా శ్వేత, 'వెన్నెల' కిశోర్, నవమీ గాయక్, 'షకలక' శంకర్, రజత్ రాఘవ్ ప్రధాన పాత్రల్లో నటించిన హారర్ కామెడీ ఎంటర్‌టైనర్ మూవీ 'ఓఎమ్‌జీ (ఓ మంచి ఘోస్ట్). శంకర్ మార్తాండ్ దర్శకత్వంలో డా.అబినికా ఇనాబతుని నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 21న విడుదల కానుంది. ఈ ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో నందితా శ్వేత మాట్లాడుతూ–''శంకర్ గారు స్టోరీ నరేట్ చేస్తుంటే నవ్వుతూనే ఉన్నాను. హారర్, కామెడీ జానర్స్ మిళితమై వస్తున్న ఈ సినిమాను కుటుంబసమేతంగా చూడొచ్చు'' అన్నారు. ''ఈ సినిమా ప్రారంభం కావడానికి కారణమైన సంగీత దర్శకుడు అనూప్ రూబెన్స్, మూవీ స్క్రిప్ట్, డైలాగ్స్‌లో సాయం చేసిన దర్శకుడు రితేష్ రానా, మాపై నమ్మకం ఉంచిన అబినికా, ఈ సినిమాను రిలీజ్ చేస్తున్న ఏషియన్ ఫిల్మ్స్, బాలాజీ ఫిల్మ్స్‌లకు ధన్యవాదాలు'' అన్నారు శంకర్ మార్తాండ్. ''కథను ఎంత బాగా చెప్పారో, అంత బాగా సినిమా తీశారు శంకర్'' అన్నారు అబినికా ఇనాబతుని.

థ్రిల్లింగ్ లెవన్


నవీన్ చంద్ర, రేయా హరి

''ఇటీవల 'మహారాజ' సినిమా చూశాను... అందులోని ఇంటెన్స్ చూశాక రెండు రోజులు నిద్రపట్టలేదు. ఆ మూవీలోని ట్విస్టులు, మలుపులు, స్క్రీన్ ప్లే గురించి ప్రతి ఒక్కరూ చాలా బాగా చెప్పారు. అదే తరహాలో మా 'లెవన్' మూవీలోనూ కథ, స్క్రీన్ ప్లే, యాక్షన్, యాక్టింగ్.. అన్నీ అద్భుతంగా ఉంటాయి. నా కెరీర్‌లో 'లెవన్' బెస్ట్ థ్రిల్లర్ అవుతుంది'' అని నవీన్ చంద్ర అన్నారు. లోకేశ్ అజ్ల్స్ దర్శకత్వంలో నవీన్ చంద్ర, రేయా హరి జంటగా నటించిన చిత్రం 'లెవన్'. అజ్మల్ ఖాన్, రేయా హరి తెలుగు, తమిళ భాషల్లో నిర్మించారు. ఈ చిత్రం టీజర్‌ని హీరో నిఖిల్ విడుదల చేశారు. ''ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రం 'లెవన్'. ఇందులోని యూనిక్ పాయింట్ ప్రేక్షకుల్ని ఆశ్చర్యపరుస్తుంది'' అన్నారు లోకేశ్ అజ్ల్స్. ''త్వరలో మా సినిమాని విడుదల చేస్తాం'' అన్నారు అక్బర్.

కళాశాలలో...


ప్రణవ్, షాజ్ఞ

ప్రణవ్ ప్రీతమ్, షాజ్ఞ శ్రీ వేణున్ జంటగా శ్రీనాథ్ పులకురం దర్శకత్వం వహించిన చిత్రం 'ప్రభుత్వ జూనియర్ కళాశాల పుంగనూరు-500143'. కొవ్వూరి అరుణ సమర్పణలో భువన్ రెడ్డి కొవ్వూరి నిర్మించిన ఈ చిత్రం రేపు రిలీజ్ అవుతోంది. ఈ సందర్భంగా శ్రీనాథ్ పులకురం మాట్లాడుతూ– 'మా ఊరు పుంగనూరు పేరుతో సినిమా తీయడం గర్వంగా ఉంది. ఈ సినిమా చూశాక అందరూ తమ పేరెంట్స్‌ని గుర్తుకు తెచ్చుకుంటారు'' అన్నారు. ''శ్రీనాథ్‌గారికి సినిమాపై ఉన్న ప్యాషన్ వల్లే నిర్మాతగా మారాను'' అన్నారు భువన్ రెడ్డి. ''పుంగనూరులో ఈ మూవీ షూటింగ్ చేయడం ఆహ్లాదంగా అనిపించింది'' అన్నారు ప్రణవ్.

నా నిద్రను తిరిగిచ్చేయ్..!


శ్రద్ధా కపూర్

పడ్డానండీ ప్రేమలో మరి అని బాహాటంగానే చెప్పేశారు శ్రద్ధా కపూర్. హిందీలో 'ప్యార్ కా పంచనామా 2, సోనూ కే టిట్లూ కీ స్వీటీ, తు ఝూటీ మైన్ మక్కర్' వంటి సినిమాలకు రచయితగా చేసిన రాహుల్ మోదీతో శ్రద్ధా కపూర్ ప్రేమలో ఉన్నారని కొన్ని రోజులుగా వార్తలు వస్తున్నాయి. తరచూ వీరు ముంబై వీధుల్లో, రెస్టారెంట్స్‌లో జంటగా కనిపించడం కూడా వీరి ప్రేమను కన్ఫార్మ్ చేసినట్లయింది. తాజాగా 'దిల్ రఖ్ లే.. నీంద్‌తో వాపస్ దే దే యార్' (నా మనసును నీ దగ్గర ఉంచుకో... కానీ నా నిద్రను తిరిగిచ్చేయ్') అని తన ఇన్‌స్టా స్టేటస్‌లో పోస్ట్ చేసి, రాహుల్ ఇన్‌స్టా హ్యాండిల్‌ను ట్యాగ్ చేసి, అతనితో ఉన్న ఫోటోను శ్రద్ధా షేర్ చేశారు. దీంతో రాహుల్, శ్రద్ధా ప్రేమలో ఉన్నారని అంటున్నారు ఆమె అభిమానులు. ఇదిలా ఉంటే.. రణ్‌బీర్ కపూర్, శ్రద్ధా కపూర్ జంటగా లవ్ రంజన్ దర్శకత్వంలో 2019లో ప్రకటించిన 'తు ఝూటీ మైన్ మక్కర్' సినిమాకు రచయితగా చేశారు రాహుల్. ఈ సినిమా అప్పుడే వీరు ప్రేమలో పడ్డారని టాక్.


రాహుల్ మోదీతో...

సాక్షి బిజినెస్
గురువారం
20-6-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▼
36	42
77,338	23,516

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	17,860	▲	3
డోజోన్స్	38,835	▲	57
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,205	▲	14
డాక్స్	18,068	▼	64
షాంఘై	3,018	▼	12
నికాయ్	38,571	▲	89

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)		
71,704	▲	419
బంగారం (99.5 స్వచ్ఛత)		
71,417	▲	417
వెండి (కిలో)		
88,195	▲	642

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	భాయుస్‌మెంట్	81.63	85.31
£	బ్రిటన్ పౌండ్	భాయుస్‌మెంట్	103.84	108.75
€	యూరో	భాయుస్‌మెంట్	87.50	91.98
¥	జపాన్ ఎన్ (100)	భాయుస్‌మెంట్	42.00	64.00
AUS	ఆస్ట్రేలియా డాలర్	భాయుస్‌మెంట్	53.34	58.06
S$	సింగపూర్ డాలర్	భాయుస్‌మెంట్	59.48	64.17
SAR	సౌదీ రియాల్	భాయుస్‌మెంట్	21.39	22.92
UAE D	యూఏఈ దిర్హామ్	భాయుస్‌మెంట్	21.84	23.62
¥	చైనా యువాన్	భాయుస్‌మెంట్	10.80	12.45

జ్యూరిక్ చేతికి కొటక్ ఇన్సూరెన్స్

70 శాతం వాటా కొనుగోలు ● డీల్ విలువ రూ. 5,560 కోట్లు



న్యూఢిల్లీ: కొటక్ జనరల్ ఇన్సూరెన్స్‌లో 70 శాతం వాటాను జ్యూరిక్ ఇన్సూరెన్స్ కంపెనీ కొనుగోలు చేసింది. ఈ డీల్ విలువ రూ. 5,560 కోట్లుగా కొటక్ మహీంద్రా బ్యాంక్ పేర్కొంది. సంబంధిత నియంత్రణ సంస్థల అనుమతుల తదుపరి జ్యూరిక్ 70 శాతం వాటా కొనుగోలును పూర్తి చేసినట్లు తెలియజేసింది. దీంతో విదేశీ యాజమాన్య వాటాను 74 శాతం వరకూ అనుమతించిన తర్వాత దేశీయంగా జనరల్ ఇన్సూరెన్స్‌లో ప్రవేశించిన తొలి విదేశీ కంపెనీగా జ్యూరిక్ నిలిచినట్లు పేర్కొంది. 49 శాతం నుంచి 74 శాతానికి పెంచుతూ 2021లో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి(ఎఫ్‌డీఐ) నిబంధనలను సవరించిన సంగతి తెలిసిందే.

30 శాతం బ్యాంక్ చేతిలో

కొటక్ జనరల్ ఇన్సూరెన్స్‌లో మిగిలిన 30% వాటాను ప్రస్తుతం కొటక్ మహీంద్రా బ్యాంక్ కలిగి ఉంది. మరోపక్క మెజారిటీ వాటా కొనుగోలుతో సంస్థ పేరు జ్యూరిక్ కొటక్ జనరల్ ఇన్సూరెన్స్‌గా మారినట్లు జ్యూరిక్ ఇన్సూరెన్స్ పేర్కొంది.

ఆతిథ్య రంగంలో కొలువుల మేళా!

డిమాండ్–సరఫరా మధ్య అంతరం ● 10 లక్షలకు పైగా ఉద్యోగావకాశాలు



ముంబై: ఆతిథ్య రంగం నిపుణుల కొరతను ఎదుర్కొంటోందని, దీంతో వచ్చే కొన్నేళ్లలో 10 లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. కరోనా అనంతరం ఆతిథ్య పరిశ్రమలో డిమాండ్‌కు అనుగుణంగా కొత్త సామర్థ్యాలు పెద్ద ఎత్తున ఏర్పాటు కావడం నిపుణుల కొరతకు కారణంగా పేర్కొంటున్నారు. ప్రస్తుతం పరిశ్రమవ్యాప్తంగా డిమాండ్–సరఫరా మధ్య అంతరాయం 55–60 శాతంగా ఉంటుందని ర్యాండ్‌స్టాడ్ ఇండియా డైరెక్టర్ సంజయ్ శెట్టి తెలిపారు. కరోనా విపత్తు తర్వాత పరిశ్రమలో బూమ్ (అధిక డిమాండ్) నెలకొందని, వచ్చే కొన్నేళ్ల పాటు ఇదే ధోరణి కొనసాగుతుందన్నారు. కరోనా తర్వాత ఆతిథ్య పరిశ్రమలో నియామకాలు 4 రెట్లు పెరిగిన ట్టు చెబుతున్నారు. ముఖ్యంగా ఆరంభ స్థాయి ఉద్యోగాలకు ఎక్కువ డిమాండ్ ఉన్నట్టు చెప్పారు. నిపుణుల అంతరాన్ని అధిగమించేందుకు ఆతిథ్య కంపెనీలు తమ సిబ్బందికి నైపుణ్య శిక్షణ ఇప్పిస్తున్నట్టు నిపుణులు వెల్లడించారు. పోటీతో కూడిన వేతనాలు ఆఫర్ చేస్తూ ఉన్న సిబ్బందిని కాపాడుకోవడంతోపాటు కొత్త వారిని ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నట్టు తెలిపారు. ''2023లో పర్యాటకం, ఆతిథ్య రంగం 11.1 మిలియన్ల మందికి ఉపాధి కల్పించింది. 2024 చివరికి 11.8 మిలియన్ల ఉద్యోగుల అవసరం ఏర్పడుతుంది. ఈ డిమాండ్ 2028 నాటికి 14.8 మిలియన్లకు పెరగొచ్చు. ఏటా 16.5 శాతం వృద్ధికి ఇది సమానం''అని టీమ్‌లీజ్ బిజినెస్ హెడ్ ధృతి ప్రసన్న మహంత వివరించారు. ప్రస్తుత సిబ్బంది, భవిష్యత్ మానవ వనరుల అవసరాల మధ్య ఎంతో అంతరం కనిపిస్తున్నట్టు టీమ్‌లీజ్ సర్వీసెస్ వైస్ ప్రెసిడెంట్, స్టాఫింగ్ బిజినెస్ హెడ్ ఎ.బాలసుబ్రమణియన్ సైతం తెలిపారు. నిపుణుల కొరతను అధిగమించేందుకు హోటల్ అండ్ రెస్టారెంట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసింది. అప్రెంటిస్‌షిప్‌ల ద్వారా నిపుణుల కొరతను తీర్చుకునేందుకు ఈ టాస్క్‌ఫోర్స్ కృషి చేస్తోంది.

రికార్డు స్థాయిల్లో లాభాల స్వీకరణ

- నాలుగో రోజూ సెన్సెక్స్ ఆల్‌టైమ్ హై
- నష్టాలతో ముగిసిన నిఫ్టీ



ముంబై: జీవితకాల గరిష్టాల వద్ద స్టాక్ సూచీలను ముందుకు నడిపించే కీలక కాంశాలేవీ లేకపోవడంతో లాభాల స్వీకరణ చోటు చేసుకుంది. ఫలితంగా బుధవారం సెన్సెక్స్ స్వల్ప లాభాల్లో, నిఫ్టీ నష్టాల్లో మిశ్రమంగా ముగిశాయి. ప్రథమార్ధంలో బ్యాంకింగ్, ఫైనాన్స్, ఐటీ షేర్లు రాణించడంతో సెన్సెక్స్ 551 పాయింట్లు పెరిగి 77,852 వద్ద, నిఫ్టీ 106 పాయింట్లు బలపడి 23,664 వద్ద సరికొత్త జీవితకాల గరిష్ట స్థాయిలను నమోదు చేశాయి. లాభాల స్వీకరణతో చివరికి సెన్సెక్స్ 36 పాయింట్లు లాభంతో 77,338 వద్ద, నిఫ్టీ 42 పాయింట్ల నష్టపోయి 23,516 వద్ద నిలిచాయి. గ్లాండ్ ఫార్మాలో ప్రమోటర్ సంస్థ ఫోసన్ ఫార్మా 6 శాతం వాటాను ఓపెన్ మార్కెట్ లావాదేవీ ద్వారా విక్రయించింది. ఈ బల్క్ డీల్ విలువ రూ. 1,754 కోట్లు. దీంతో గ్లాండ్‌లో ఫోసన్ వాటా 57.86% నుంచి 51.86 శాతానికి తగ్గింది.

ఇన్‌క్యుబేషన్ సెంటర్ల ఏర్పాటులో రామ్‌ఇన్ఫో

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: టెక్నాలజీ సొల్యూషన్స్ అందించే లిస్టెడ్ సంస్థ రామ్‌ఇన్ఫో వచ్చే మూడేళ్లలో టాప్ 5 మధ్య స్థాయి టెక్ కంపెనీల్లో ఒకటిగా ఎదగాలని నిర్దేశించుకుంది. ఇందులో భాగంగా అమెరికాలో కూడా కార్యకలాపాలు విస్తరిస్తోంది. అంకుర సంస్థలకోసం అమెరికాలో రెండు, భారత్‌లో ఒకటి చొప్పున ఇన్‌క్యుబేషన్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు కంపెనీ ఎండీ ఎల్ శ్రీనాథ్‌రెడ్డి బుధవారమిక్కడ తెలిపారు. హైదరాబాద్ కేంద్రంగా 1994లో ఏర్పాటైన రామ్‌ఇన్ఫో .. ఈసేవ, మీసేవ, సువిధా వంటి సొల్యూషన్స్‌తో అటు ప్రభుత్వాలు, ఇటు కంపెనీలకు ఐటీ, డిజిటల్ పరివర్తన సేవలు అందిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం 9 రాష్ట్రాల్లో సాగిస్తున్న కార్యకలాపాలను 2024–25లో 15 రాష్ట్రాలకు విస్తరించనున్నట్లు శ్రీనాథ్‌రెడ్డి వివరించారు. 135 మిలియన్ డాలర్ల ఆదాయం నిర్దేశించుకున్నట్లు చెప్పారు.

ఒమేగా హాస్పిటల్స్‌లో మోర్గాన్ స్టాన్లీ పెట్టుబడి

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఒమేగా హాస్పిటల్స్ పేరుతో వైద్య సేవల రంగంలో ఉన్న హైదరాబాద్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీ ప్రైవేట్ లిమిటెడ్‌లో మోర్గాన్ స్టాన్లీ పీఈ ఆసియా ఫండ్ రూ.500 కోట్లు పెట్టుబడి చేసింది. డాక్టర్ మోహన వంశీ నేతృత్వంలో 2010లో ప్రారంభం అయిన ఒమేగా హాస్పిటల్స్ క్యాన్సర్ చికిత్సలో దేశంలో పేరెన్నికగలది. సంస్థకు 10కిపైగా ఆసుపత్రులు ఉన్నాయి. మొత్తం పడకల సామర్థ్యం 1,400. దేశవ్యాప్త విస్తరణ లక్ష్యానికి ఈ నిధులు దోహదం చేయగలవని ఒమేగా కృతనిశ్చయంతో ఉంది. రాబోయే సంవత్సరాల్లో క్యాన్సర్ చికిత్సలో భారత్‌లో అగ్రశ్రేణి సంస్థగా నిలుపుతామని ఒమేగా ఎండీ మోహన వంశీ ఈ సందర్భంగా తెలిపారు.

వడ్డీ ఆదాయంపై పన్ను ఊరటనివ్వాలి: దినేశ్ ఖారా

న్యూఢిల్లీ: రాబోయే పూర్తి స్థాయి బడ్జెట్‌లో వడ్డీ ఆదాయంపై పన్నుపరంగా ఊరటనివ్వాలని కేంద్రానికి ఎస్‌బీఐ చైర్మన్ దినేశ్ కుమార్ ఖారా విజ్ఞప్తి చేశారు. ఈ దిశగా చర్య తీసుకుంటే డిపాజిటర్లకు ప్రోత్సాహకంగా ఉండి పొదుపు పెరుగుతుందని, అలా వచ్చే నిధులను దీర్ఘకాలిక మౌలిక రంగ ప్రాజెక్టుల కోసం ఉపయోగించుకునేందుకు వీలవుతుందని ఆయన పేర్కొన్నారు.



ప్రస్తుతం ఒక ఏడాదిలో ఒక వ్యక్తికి సంబంధించి అన్ని శాఖల్లో ఉన్న డిపాజిట్లపై వడ్డీ ఆదాయం రూ. 40,000 దాటితే బ్యాంకులు ట్యాక్స్‌ను డిడక్ట్ చేయాల్సి ఉంటోంది. అదే, సేవింగ్స్ అకౌంట్లయితే రూ. 10,000 వరకు వడ్డీ ఆదాయంపై పన్ను మినహాయింపు ఉంటోంది.

వొడాఫోన్‌కు 15,300 కోట్లు

ఇండస్‌లో 18% వాటా సేల్

న్యూఢిల్లీ: బ్రిటిష్ టెలికం దిగ్గజం వొడాఫోన్ రూ. 15,300 కోట్లు సమకూర్చుకుంది. ఇందుకు టెలికం టవర్ల కంపెనీ ఇండస్ టవర్స్‌లో 18 శాతం వాటాను విక్రయించింది. దేశీయంగా వొడాఫోన్ ఆస్తులపై తీసుకున్న 1.8 బిలియన్ యూరోల బ్యాంక్ రుణాలను తిరిగి చెల్లించేందుకు నిధులను వినియోగించనుంది. వొడాఫోన్ గ్రూప్ పీఎల్‌సీ తాజాగా ఇండస్ టవర్స్‌లో 48.47 కోట్ల షేర్లను విక్రయించింది. తద్వారా రూ. 15,300 కోట్లు(1.7 బిలియన్ యూరోలు) సమీకరించింది. ఈ లావాదేవీ తర్వాత ఇండస్ టవర్స్‌లో వొడాఫోన్ వాటా 3.1%కి పరిమితమైంది. కాగా.. ఇండస్ టవర్స్‌లో భారతీ ఎయిర్‌టెల్ వాటా 1% పెరిగి 48.95 శాతానికి బలపడింది. ఇందుకు 862 కోట్లకు పైగా వెచ్చించింది.

టెలికం యూజర్లు @120 కోట్లు



న్యూఢిల్లీ: దేశీయంగా టెలికం యూజర్ల సంఖ్య ఏప్రిల్‌లో 120 కోట్లు దాటింది. ట్రాయ్ విడుదల చేసిన గణాంకాల ప్రకారం ఏప్రిల్‌లో మొత్తం సబ్‌స్క్రయిబర్స్ సంఖ్య 120.12 కోట్లుగా నమోదైంది. ఈ ఏడాది మార్చిలో ఇది 119.92 కోట్లుగా ఉంది. చివరిసారిగా 2017 జూలైలో 121 కోట్ల రికార్డు స్థాయిని తాకింది. తాజాగా, వైర్‌లెస్ విభాగంలో రిలయన్స్ జియోకి ఏప్రిల్‌లో 26.8 లక్షల మంది కొత్త యూజర్లు జత పడంతో మొత్తం యూజర్ల సంఖ్య 47.24 కోట్లకు చేరింది. 7.52 లక్షల కొత్త కస్టమర్లు, మొత్తం 26.75 కోట్ల యూజర్లతో ఎయిర్‌టెల్ తర్వాత స్థానంలో ఉంది. బీఎస్ఎన్ఎల్ యూజర్ల సంఖ్య 12.3 లక్షలు, వొడాఫోన్ ఐడియా యూజర్లు 7.35 లక్షల మేర తగ్గారు.

అదానీ 100 బిలియన్ డాలర్ల పెట్టుబడులు



న్యూఢిల్లీ: హరిత ఇంధన ఉత్పత్తికి అవసరమయ్యే కీలక భాగాల తయారీ సామర్థ్యాలను పెంచుకోవడంపై, ఇంధన పరివర్తన ప్రాజెక్టులపై వచ్చే దశాబ్ద కాలంలో అదానీ గ్రూప్ 100 బిలియన్ డాలర్లపైగా ఇన్వెస్ట్ చేయనుంది. సోలార్ పార్కులను నిర్మించడం నుంచి హరిత హైడ్రోజన్, పవన విద్యుత్ టర్బైన్లు మొదలైన వాటి కోసం ఎలక్ట్రోలైజర్లను తయారు చేయడం వరకు భారీ ప్లాంట్లను గ్రూప్ ఏర్పాటు చేస్తోంది. రేటింగ్స్ ఏజెన్సీ క్రిసిల్ నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ ఈ విషయాలు తెలిపారు. ఇంధన పరివర్తన, డిజిటల్ మౌలిక సదుపాయాల కల్పనలో లక్షల కోట్ల (ట్రిలియన్ల) డాలర్లకు వ్యాపార అవకాశాలు ఉన్నాయని, ఇవి భారత్ రూపురేఖలను దేశీయంగానూ, అంతర్జాతీయంగాను మార్చేయగలవన్నారు. అంతర్జాతీయంగా ఇంధన పరివర్తన మార్కెట్ 2023లో 3 ట్రిలియన్ డాలర్లుగా ఉండగా ఇది 2030 నాటికి 6 ట్రిలియన్ డాలర్లకు చేరగలదని, అటుపైన 2050 వరకు ప్రతి పదేళ్లకు రెట్టింపు కానుందని అదానీ చెప్పారు. భారత్ నిర్దేశించుకున్నట్లుగా 2030 నాటికి 500 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యాలు సాధించాలంటే ఏటా 150 బిలియన్ డాలర్ల పైగా పెట్టుబడులు అవసరమన్నారు.

టాటా వాణిజ్య వాహనాలు ప్రియం



న్యూఢిల్లీ: వాణిజ్య వాహనాల ధరలను 2 శాతం వరకు పెంచుతున్నట్టు టాటా మోటార్స్ బుధవారం ప్రకటించింది. జూలై 1 నుంచి సవరించిన ధరలు అమలులోకి వస్తాయని వెల్లడించింది. అన్ని రకాల వాణిజ్య వాహనాలకు కొత్త ధరలు వర్తిస్తాయి. ఈ ఏడాది ఏప్రిల్‌లో సైతం 2 శాతం వరకు వాహనాల ధరలను కంపెనీ పెంచింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

20-6-2024	
విశాఖ	500-00
చిత్తూరు	553-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	485-00
విజయవాడ	500-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	505-00
వరంగల్	507-00
రిటైల్ ధర	5.65

భవిత

పోటీ పరీక్షల ప్రత్యేకం తెలంగాణ చరిత్ర కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

ఐకార్-ఐఐఓఆర్, రాజేంద్రనగర్‌లో 12 జూనియర్ రీసెర్చ్ ఫెలోలు

హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని ఐసీఏఆర్-ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయిల్ సీడ్స్ రీసెర్చ్(ఐఐఓఆర్).. ఒప్పంద ప్రాతిపదికన జూనియర్ రీసెర్చ్ ఫెలోల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 12.
» **పోస్టుల వివరాలు:** జూనియర్ రీసెర్చ్ ఫెలోలు–07, యంగ్ ప్రొఫెషనల్–1: 05.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగాల్లో డిప్లొమా, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణుల వ్వాలి. నెట్/గేట్ స్కోరు, పని అనుభవం ఉండాలి.
» **వేతనం:** నెలకు జూనియర్ రీసెర్చ్ ఫెలో పోస్టుకు రూ.37,000, యంగ్ ప్రొఫెషనల్‌కు రూ.30,000.
» **వయసు:** జూనియర్ రీసెర్చ్ ఫెలో పోస్టుకు మహిళలకు 40 ఏళ్లు, పురుషులకు 35 ఏళ్లు మించకూడదు, యంగ్ ప్రొఫెషనల్‌కు వయసు 21–45 ఏళ్ల మధ్య ఉండాలి.
» **గూగుల్ ఫాం ద్వారా దరఖాస్తులకు చివరితేది:** 08.07.2024.
» **వెబ్‌సైట్:** https://icariior.org.in

ఐకార్-ఐఐఆర్ఆర్‌లో వివిధ ఉద్యోగాలు

హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని ఐసీఏఆర్-ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రైస్ రీసెర్చ్(ఐఐఆర్ఆర్).. తాత్కాలిక ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** సీనియర్ రీసెర్చ్ ఫెలో–01, యంగ్ ప్రొఫెషనల్–01, టెక్నికల్ అసిస్టెంట్–01.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వేతనం:** నెలకు సీనియర్ రీసెర్చ్ ఫెలో పోస్టుకు రూ.35,000, యంగ్ ప్రొఫెషనల్‌కు రూ.30,000, టెక్నికల్ అసిస్టెంట్‌కు రూ.15,000.
» **వయసు:** సీనియర్ రీసెర్చ్ ఫెలో పోస్టుకు పురుషులకు 35 ఏళ్లు, మహిళలకు 40 ఏళ్లు మించకూడదు. ఇతర పోస్టులకు 21 నుంచి 45 ఏళ్ల మధ్య ఉండాలి.
» **దరఖాస్తు విధానం:** ఈమెయిల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఈమెయిల్:** victornpet@gmail.com
» **దరఖాస్తులకు చివరితేది:** 26.06.2024.
» **వెబ్‌సైట్:** https://www.icariirr.org/

అగ్రి కోర్సులు.. ఎవర్‌గ్రీన్ కెరీర్

» ఏపీ, తెలంగాణలో అగ్రి డిప్లొమా, డిగ్రీ కోర్సులు
» డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల
» బ్యాచిలర్ కోర్సులకు ఈఏపీసెట్ ర్యాంకు ఆధారంగా ప్రవేశం
» కోర్సులు పూర్తి చేసుకుంటే.. విస్తృత అవకాశాలు

అగ్రికల్చర్ కోర్సులతో ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో కొలువులు సొంతం చేసుకోవచ్చు. అందుకే వ్యవసాయ కోర్సులపై విద్యార్థుల్లో ఆసక్తి పెరుగుతోంది. పదో తరగతి, ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణులు తమ అర్హతలకు తగ్గ కోర్సుల్లో చేరుతున్నారు. తాజాగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో.. అగ్రికల్చల్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైంది. బ్యాచిలర్ స్థాయి కోర్సులకు కూడా త్వరలోనే ప్రవేశ ప్రక్రియ ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో.. ఏపీ, తెలంగాణలో.. అగ్రికల్చరల్ డిప్లొమా, డిగ్రీ కోర్సులు.. ప్రవేశ విధానాలు.. భవిష్యత్ అవకాశాలపై ప్రత్యేక కథనం..



పదో తరగతి తర్వాత విద్యార్థుల ముంగిట ఎన్నో కోర్సులు. అధిక శాతం మంది ఇంజనీరింగ్, మెడిసిన్ లక్ష్యంగా ఎంపీసీ, బైపీసీ గ్రూప్స్‌తో ఇంటర్‌లో చేరుతున్నారు. అదేవిధంగా సత్వర ఉపాధి కోసం కొంతమంది డిప్లొమా కోర్సులను ఎంచుకుంటున్నారు.అలాంటి వారికి అందుబాటులో ఉన్న మరో ప్రత్యామ్నాయం అగ్రికల్చర్ డిప్లొమా కోర్సులు.

పదో తరగతితో అగ్రి డిప్లొమా

పదో తరగతి ఉత్తీర్ణతతోనే అగ్రికల్చర్ డిప్లొమా కోర్సుల్లో చేరొచ్చు. వ్యవసాయ రంగానికి సంబంధించి క్షేత్ర నైపుణ్యాలు అందించే కోర్సులు ఇవి. వీటికోసం ప్రత్యేకంగా పాలిటెక్నిక్స్‌ను సైతం నెలకొల్పారు. ఆంధ్రప్రదేశ్‌లో ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం, అదే విధంగా తెలంగాణలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వ విద్యాలయం పరిధిలో అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాలలను నిర్వహిస్తున్నారు.

పలు విభాగాలు

- అగ్రికల్చర్ డిప్లొమా కోర్సులకు సంబంధించి ప్రస్తుతం పలు విభాగాల్లో డిప్లొమా కోర్సులు అందుబాటులో ఉన్నాయి.
- డిప్లొమా ఇన్ అగ్రికల్చర్, డిప్లొమా ఇన్ సీడ్ టెక్నాలజీ, డిప్లొమా ఇన్ ఆర్గానిక్ అగ్రికల్చర్, డిప్లొమా ఇన్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తున్నారు.
- డిప్లొమా ఇన్ అగ్రికల్చర్ ఇంజనీరింగ్ కోర్సు వ్యవధి మూడేళ్లు. మిగతా కోర్సుల కాల వ్యవధి రెండేళ్లు.

భారీ సంఖ్యలో సీట్లు

అగ్రికల్చరల్ డిప్లొమా కోర్సులకు సంబంధించి తెలంగాణలో ప్రభుత్వ పాలిటెక్నిక్స్‌లో 260 సీట్లు, ప్రైవేట్ పాలిటెక్నిక్స్‌లో 540 సీట్లు ఉన్నాయి. అదేవిధంగా ఏపీలో ప్రభుత్వ పాలిటెక్నిక్స్‌లో 688 సీట్లు, ప్రైవేట్ పాలిటెక్నిక్స్‌లో 2,530 సీట్లు ఉన్నాయి.

ప్రవేశ ప్రక్రియ ప్రారంభం

2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని వ్యవసాయ పాలిటెక్నిక్స్‌లో ప్రవేశ ప్రక్రియ ప్రారంభమైంది. నోటిఫికేషన్ కూడా విడుదల చేశారు.

ఎంపిక ఇలా

అగ్రి పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి ఏపీ, తెలంగాణలో వేర్వేరు నిబంధనలు అమలవుతున్నాయి. తెలంగాణ రాష్ట్రంలో.. విద్యార్థులు పదో తరగతి ఉత్తీర్ణతతోపాటు టీఎస్ పాలిసెట్‌లో అర్హత సాధించాల్సి ఉంటుంది. దాని ఆధారంగా దరఖాస్తు చేసుకోవాలి. ఏపీలో పదో తరగతి మార్కుల ఆధారంగా మెరిట్ జాబితా రూపొందించి సీట్లు కేటాయిస్తారు.

పల్లె విద్యార్థులకు వెయిటేజీ

సీట్ల కేటాయింపులో గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ప్రత్యేకంగా వెయిటేజీ కల్పిస్తున్నారు. తెలంగాణలో.. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు 60 శాతం సీట్లను కేటాయిస్తారు. ఏపీలో నిబంధనల ప్రకారం–పదో తరగతిలోపు కనీసం నాలుగేళ్లు గ్రామీణ ప్రాంతాల్లో చదివిన వారికి మొత్తం సీట్లలో 75 శాతం సీట్లను, పట్టణ ప్రాంతాల్లో చదివిన వారికి 25 శాతం సీట్లను కేటయిస్తారు.

ఇంగ్లిష్ మీడియం బోధన

అగ్రికల్చర్ డిప్లొమాలను ఇంగ్లిష్ మీడియంలో బోధిస్తారు. ఆయా రంగాల్లోని వాస్తవ పరిస్థితులను క్షేత్ర స్థాయిలో అవగాహన చేసుకోవడంతో పాటు, డిప్లొమా తర్వాత జాబ్ మార్కెట్, ఉన్నత విద్యావకాశాలు అందిపుచ్చుకోవడంలో ఇంగ్లిష్ భాష దోహదపడుతుందని ఈ విధానాన్ని అమల్లోకి తెచ్చారు.

కెరీర్ అవకాశాలు

- అగ్రికల్చర్, డెయిరీ, హార్టికల్చర్(ఉద్యాన) విభాగాలకు డిమాండ్ పెరుగుతోంది. దీనికి అనుగుణంగా ఈ రంగంలో కెరీర్ అవకాశాలు మెరుగవుతున్నాయి.
- పదో తరగతి అర్హతతోనే ఈ విభాగాల్లో నైపుణ్యం సాధించేందుకు,ఆ తర్వాత ఉద్యోగం, స్వయం ఉపాధి పొందేందుకు డిప్లొమా కోర్సులు దోహద పడుతున్నాయి.
- ఈ కోర్సులు పూర్తి చేసుకున్న వారికి ఫెర్టిలైజర్స్, పెస్టిసైడ్స్, న్యూట్రియంట్ పరిశ్రమల్లో ప్లాంట్ అసిస్టెంట్, టెక్నీషియన్ వంటి ఉద్యోగాలు లభిస్తాయి. ప్రారంభంలోనే నెలకు రూ.15 వేల వరకు వేతనం అందుకోవచ్చు.
- ఉన్నత విద్య పరంగా బ్యాచిలర్ డిగ్రీ, మాస్టర్ డిగ్రీలు పూర్తి చేసుకుంటే.. విత్తన ఉత్పత్తి కేంద్రాలు, రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్స్‌లో ఉన్నత స్థాయి కొలువులు సొంతం చేసుకోవచ్చు. అదే విధంగా ప్రభుత్వ విభాగాల్లో వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖల్లోనూ అవకాశాలు లభిస్తాయి.

ఉన్నత విద్యలోనూ ప్రాధాన్యం

అగ్రికల్చర్, అనుబంధ డిప్లొమా కోర్సులు పూర్తి చేసుకున్న వారికి బ్యాచిలర్ డిగ్రీ ప్రవేశాల్లో ప్రాధాన్యం కల్పిస్తారు. ఇందుకోసం వీరికి ప్రత్యేకంగా కొన్ని సీట్లు కేటాయిస్తారు. అదే విధంగా అగ్రికల్చర్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ డిప్లొమా పూర్తి చేసుకున్న వారు బీటెక్ అగ్రికల్చర్ ఇంజనీరింగ్‌లో నేరుగా రెండో సంవత్సరంలో ప్రవేశం పొందొచ్చు. ఇందుకు సంబంధించి నిర్వహించే ప్రవేశ పరీక్ష(అగ్రిసెట్)లో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది.

ఈఏపీ సెట్‌తో బ్యాచిలర్ కోర్సులు

- అగ్రికల్చర్ విభాగంలో.. ఇంటర్మీడియెట్ అర్హతతో బ్యాచిలర్ కోర్సులు కూడా అందుబాటులో ఉన్నాయి. బీఎస్సీ ఆనర్స్(అగ్రికల్చర్), బీటెక్ ఫుడ్ టెక్నాలజీ, బీఎస్సీ ఆనర్స్ కమ్యూనిటీ సైన్స్, బీటెక్ (అగ్రికల్చరల్ ఇంజనీరింగ్), బీఎస్సీ ఆనర్స్–కమ్యూనిటీ సైన్స్ కోర్సుల్లో ప్రవేశం కల్పిస్తారు. విద్యార్థులు ఈఏపీ–సెట్‌లో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది.
- బీఎస్సీ అగ్రికల్చర్ ఆనర్స్, కమ్యూనిటీ సైన్స్, బీవీఎస్సీ అండ్ ఏహెచ్, బీఎఫ్ఎస్సీ, బీఎస్సీ ఆనర్స్–హార్టికల్చర్ కోర్సుల సీట్లను ఈఏపీ-సెట్ బైపీసీ స్ట్రీమ్ ర్యాంకు ఆధారంగా భర్తీ చేస్తారు. బీటెక్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్, బీటెక్ ఫుడ్ టెక్నాలజీ సీట్లను ఈఏపీ సెట్ ఎంపీసీ స్ట్రీమ్ ర్యాంకు ఆధారంగా భర్తీ చేస్తారు. దీంతోపాటు.. బీఎస్సీ ఆనర్స్ కమ్యూనిటీ సైన్స్ సీట్లను ఎంపీసీ స్ట్రీమ్ ర్యాంకు ఆధారంగా భర్తీ చేస్తారు.
- ఈఏపీసెట్ ర్యాంకు ఆధారంగా వ్యవసాయ విశ్వ విద్యాలయాలు ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించి సీట్లు భర్తీ చేస్తాయి. అగ్రికల్చర్ యూనివర్సిటీల్లో బ్యాచిలర్ కోర్సుల్లో ప్రవేశానికి త్వరలో నోటిఫికేషన్ వెలువడనుంది.

ఉన్నత ఉద్యోగాలు

- అగ్రికల్చర్ అనుబంధ విభాగాల్లో బ్యాచిలర్ కోర్సులు పూర్తి చేసుకున్న వారికి భవిష్యత్తులో ఉజ్వల కెరీర్ అవకాశాలు స్వాగతం పలుకుతాయనడంలో సందేహం లేదు.
- అగ్రికల్చర్ బీఎస్సీ పూర్తి చేసుకున్న వారికి ప్రైవేటు రంగంలో విత్తన తయారీ సంస్థలు, పౌల్ట్రీ ఫామ్స్‌లో అవకాశాలు లభిస్తాయి. ప్రభుత్వ విభాగాల్లో వ్యవసాయ శాఖలో అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ వంటి కొలువులు దక్కించుకోవచ్చు. బ్యాంకుల్లో సైతం రూరల్ బ్యాంకింగ్ ఆఫీసర్ విభాగంలో ఉద్యోగాలు సొంతం చేసుకోవచ్చు.
- బీటెక్–ఫుడ్ టెక్నాలజీ సర్టిఫికెట్‌తో.. ఫుడ్ ప్రొడక్షన్ యూనిట్స్, ప్యాకేజ్డ్ ఫుడ్ మ్యాన్యుఫ్యాక్చరింగ్ సంస్థల్లో కొలువుదీరొచ్చు. అదే విధంగా.. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్స్, క్రాప్ ప్రొడక్షన్ కంపెనీలలో మేనేజ్‌మెంట్ విభాగాల్లో ఉద్యోగాలు లభిస్తాయి.
- బీటెక్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ పూర్తి చేసుకుంటే.. అగ్రి ఎక్విప్‌మెంట్ సంస్థలు, క్రాప్ పొడక్షన్ కంపెనీలలో సాంకేతిక విభాగాల్లో ఉద్యోగాలు లభిస్తాయి.
- బీఎస్సీ కమ్యూనిటీ సైన్స్ పూర్తి చేసుకుంటే.. హాస్పిటల్స్, చైల్డ్‌కేర్ ఇన్‌స్టిట్యూట్స్, సోషల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్స్, ఎన్‌జీఓలలో ఉద్యోగావకాశాలు లభిస్తాయి.

అగ్రికల్చర్ కోర్సులు.. ముఖ్యాంశాలు

- అగ్రికల్చర్ డిప్లొమా, డిగ్రీ కోర్సులతో ఉన్నత విద్య, ఉపాధి మార్గాలు.
- సీడ్స్, ఫెర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ తదితర సంస్థల్లో ఉద్యోగావకాశాలు.
- ప్రభుత్వ విభాగంలోనూ వ్యవసాయ శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖల్లో ఉద్యోగాలు.
- నెలకు రూ.15 వేల నుంచి రూ.60 వేల వరకు వేతనం అందుకోవచ్చు.
- బ్యాచిలర్ కోర్సులకు ఈఏపీసెట్ ర్యాంకు ఆధారంగా ప్రవేశాలు.
- డిప్లొమా కోర్సులకు తెలంగాణలో పాలిసెట్ ర్యాంకు; ఏపీలో పదో తరగతి మెరిట్ ఆధారంగా ఎంపిక.

ఏపీలో అగ్రికల్చరల్ డిప్లొమా.. ముఖ్య సమాచారం

- **అర్హత:** పదో తరగతి ఉత్తీర్ణత ఉండాలి.
- **వయసు:** ఆగస్టు 31 నాటికి 15–22 ఏళ్ల ఉండాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** 2024,జూన్ 20
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://angrau.ac.in

తెలంగాణలో అగ్రికల్చరల్ డిప్లొమా.. ముఖ్య సమాచారం

- **అర్హత:** పదో తరగతి ఉత్తీర్ణత, టీఎస్ పాలిసెట్ (అగ్రికల్చర్ స్ట్రీమ్) అర్హత.
- **వయసు:** డిసెంబర్ 31, 2024 నాటికి 15–22 ఏళ్లు ఉండాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** 2024, జూన్ 25
- **ఆన్‌లైన్ దరఖాస్తు సవరణ అవకాశం:** 2024, జూన్ 27
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://diploma.pjtsau.ac.in

క్లుప్తంగా...

ఉద్యోగుల బకాయిలను చెల్లించాలి

ముఖ్యమంత్రికి ఏపీ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ విజ్ఞప్తి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలని సీఎం చంద్రబాబుకు ఏపీ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (ఆప్టా) అధ్యక్షుడు ఏజీఎస్ గణపతిరావు, ప్రధాన కార్యదర్శి కె.ప్రకాష్‌రావు బుధవారం విజ్ఞప్తి చేశారు. ట్రెజరీల్లో ఆమోదం పొంది.. సీఎఫ్ఎంఎస్‌లో గత కొన్నేళ్లుగా బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. సరెండర్ సెలవులు, ఏపీజీఎల్ఐ, పీఎఫ్, మెడికల్ బిల్లులు చెల్లించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్నికలకు ముందు కొందరు ఉద్యోగులకు మాత్రమే చిన్న మొత్తాల్లో ఆర్థిక బకాయిలను విడుదల చేశారని పేర్కొన్నారు.

చిరంజీవి మాజీ అల్లుడు శిరీష్ మృతి



మణికొండ (హైదరాబాద్): మెగాస్టార్ చిరంజీవి మాజీ అల్లుడు శిరీష్ అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. ఆయన గత కొంతకాలంగా లంగ్ కేన్సర్‌తో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. చిరంజీవి కుమార్తె శ్రీజను 2007లో వివాహం చేసుకున్న శిరీష్ 2014లో చట్టబద్ధంగా విడాకులు తీసుకున్నారు. అనంతరం 2019లో మరో వివాహం చేసుకుని మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని ల్యాంకోహిల్స్‌లో నివసిస్తున్నారు. బుధవారం ఆసుపత్రి నుంచి శిరీష్ మృతదేహాన్ని ల్యాంకోహిల్స్‌లోని ఎల్‌హెచ్–5 టవర్‌లోని ఆయన నివాసానికి తీసుకుని వచ్చారు. అనంతరం సాయంత్రం మహాప్రస్థానంలో అంత్యక్రియలు నిర్వహించినట్లు బంధువులు తెలిపారు.

టన్ను రూ.90 వేలు పలికిన బంగినపల్లి

ఉలవపాడు: రాష్ట్రంలో పేరొందిన ఉలవపాడు బంగినపల్లి మామిడి రకం పదేళ్లలో ఎన్నడూ లేని విధంగా తొలిసారిగా టన్ను రూ.90 వేలు పలికింది. రెండు రోజులుగా వ్యాపారులు టన్ను రూ.80 వేల నుంచి రూ.90 వేల మధ్య కొనుగోలు చేసి ఎగుమతి చేస్తున్నా రు. ఈ ఏడాది కాపు తక్కువగా ఉండడంతో రేట్లు అధికంగా పలికాయి. కాయల్లో పురుగు లేకపోవడం, నాణ్యత బాగుండడమే దీనికి కారణమని వ్యాపారులు చెబుతున్నారు. హైదరాబాద్, ముంబై, కోల్‌కతా నుంచి వ్యాపారులు అధికంగా మామిడి కాయల కోసం రావడంతో డిమాండ్ ఏర్పడింది. తోటల్లో కాయలను మొత్తం దులిపివేసి ఎగుమతి చేస్తున్నారు. కవర్ కట్టిన కాయలు అయితే రూ.లక్ష పైనే పలుకుతుండగా, ప్రస్తుతం అవి అందుబాటులో లేవు. కవర్ కట్టని సాధారణ బంగినపల్లి రకం మామిడి ప్రస్తుతం రూ.90 వేలు పలుకుతుండడం విశేషం. గత పదేళ్లలో గరిష్టంగా రూ.50 వేలు పలికిన మామిడి ఈ ఏడాది మాత్రం రూ.90 వేలు పలికింది.

ఎన్ఎస్ఎస్–ఎస్‌పీయూఎన్ డిబేట్ విన్నర్‌గా శ్రీచైతన్య

నేషనల్ స్పేస్ సొసైటీ–యూఎస్ఏ నిర్వహించిన ఎస్‌పీయూఎన్ డిబేట్స్–24లో శ్రీచైతన్య స్కూల్ విజేతగా నిలిచిందని ఆ స్కూల్ డైరెక్టర్ సీమ తెలిపారు. అంతరిక్షంలో మానవ ఆవాసాల స్థాపనకు కృషి చేస్తున్న అమెరికా వారి స్పేస్ సొసైటీ ఎస్‌పీయూఎన్ డిబేట్స్–24 స్పేస్ పాలసీ, యూనివర్సలైజేషన్ అనే విషయంపై ఈ పోటీలను నిర్వహించింది. ఈ డిబేట్‌లో 9 దేశాల నుంచి 100 మంది విద్యార్థులు పోటీపడగా, గెలుపొందిన ఇద్దరు విద్యార్థుల్లో ఒకరు శ్రీచైతన్య విద్యార్థి అని సీమ తెలిపారు. విజేతగా నిలిచిన విద్యార్థిని, ఆమె తల్లిదండ్రులను, టీచింగ్ స్టాఫ్‌ను స్కూల్ డైరెక్టర్ సీమ అభినందించారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ఆకాశ్ ఇన్‌స్టిట్యూట్ ప్రతిభ

సాక్షి, హైదరాబాద్: జేఈఈ అడ్వాన్స్‌డ్–2024లో ఆకాశ్ ఇన్‌స్టిట్యూట్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపారని ఒక ప్రకటనలో తెలిపింది. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో తమ ఇన్‌స్టిట్యూట్ విద్యార్థులు 3,081 మంది ఉత్తీర్ణత సాధించినట్లు వెల్లడించింది. అందులో 2,819 మంది క్లాస్‌రూమ్ ప్రోగ్రామ్స్ ద్వారా, 262 మంది డిస్టెన్స్, డిజిటల్ కోర్సుల ద్వారా ఫలితాలు సాధించినట్లు తెలిపింది. అడ్వాన్స్‌డ్ పరీక్షకు హాజరైన ప్రతి ముగ్గురు ఆకాశ్ ఇన్‌స్టిట్యూట్ విద్యార్థుల్లో ఒకరు ఉత్తీర్ణత సాధించారంది. టాప్–100 మంది విద్యార్థుల్లో ఆకాశ్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన వారు 9 మంది అని, టాప్–500లో 46 మంది అని, టాప్–1000లో 89 మంది ఆకాశ్ ఇన్‌స్టిట్యూట్ విద్యార్థులేనని పేర్కొంది. హైదరాబాద్‌కు చెందిన రిషి శుక్లా 300ల మార్కులకు గాను 300 స్కోరు సాధించి తెలంగాణ టాపర్‌గా సత్తాచాటాడని తెలిపింది. కృష్ణ సాయి శిశిర్ 67వ ర్యాంకు సాధించినట్లు వెల్లడించింది.

వ్యవసాయంలో స్థిరత్వాన్ని సాధించాలి

- ఇందుకోసం వినూత్న విధానాలను రూపొందించాలి
- విద్యార్థులకు రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ సూచన
- ఘనంగా ఆచార్య ఎన్.జీ.రంగా వర్సిటీ 56వ స్నాతకోత్సవం



మాట్లాడుతున్న గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్

బాపట్ల: వ్యవసాయంలో స్థిరత్వాన్ని సాధించడం కోసం వినూత్న విధానాలను రూపొందించేందుకు విద్యార్థులు కృషి చేయాలని రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ సూచించారు. బాపట్ల వ్యవసాయ కళాశాలలోని డా.బి.వి.నాథ్ ఆడిటోరియంలో బుధవారం నిర్వహించిన ఆచార్య ఎన్.జీ.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ 56వ స్నాతకోత్సవ సభలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ మంటే కేవలం ఆహారోత్పత్తి మాత్రమే కాదని, జీవితాన్ని పోషించడమనే వాస్తవాన్ని విద్యార్థులంతా గ్రహించాలని గవర్నర్ సూచించారు. నేర్చుకోవడమనేది నిరంతర ప్రక్రియ అని, దాన్ని ఎప్పటికీ ఆపొద్దని, వ్యవసాయ రంగ భవిష్యత్ విద్యార్థుల భుజస్కంధాలపైనే ఆధారపడి ఉందన్నారు. ప్రపంచవ్యాప్తంగా వ్యవసాయ రంగంలో వస్తున్న అనూహ్య మార్పులను అర్థం చేసుకుంటూ, సృజనాత్మకతతో మేధస్సును పెంచుకోవాలని సూచించారు. దేశ ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయ రంగం కీలకపాత్ర పోషిస్తోందని, ఇది మనం గర్వించదగ్గ విషయమన్నారు. పెరుగుతున్న జనాభా, వాతావరణ ప్రతికూల పరిస్థితులు వ్యవసాయ రంగాన్ని ప్రశ్నిస్తున్నా... విద్యార్థులు తమ భవిష్యత్‌కు బాటలు వేసుకుంటూ, డ్రోన్, రిమోట్ సెన్సింగ్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌వంటి నూతన సాంకేతికతలను క్షుణ్ణంగా నేర్చుకుని రైతు సంక్షేమానికి కృషి చేయాలని సూచించారు. విద్యార్థులు తమ చదువును పుట్టిన గ్రామాల సౌభాగ్యానికి వినియోగిస్తే వికసిత భారత్ సాధ్యపడుతుందన్నారు. అనంతరం విశ్వవిద్యాలయ నివేదికను వర్సిటీ ఉప కులపతి డాక్టర్ ఆర్.శారద జయలక్ష్మీదేవి సమర్పించగా, ముఖ్య అతిథిగా పాల్గొన్న ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ డైరెక్టర్ జనరల్ డా.హిమాన్షు పాఠక్ కళాశాల, విశ్వవిద్యాలయ ఉన్నతిని కొనియాడారు. అవార్డుల ప్రదానోత్సవ సభను యూనివర్సిటీ రిజిస్ట్రార్ డా.జి.రామచంద్రరావు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాపట్ల ఎమ్మెల్యే వేగేశ్న నరేంద్ర వర్మ, కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వి. శ్రీనివాసరావు, యూనివర్సిటీ అధికారులు, వివిధ కళాశాలల అసోసియేట్ డీన్లు, ప్రొఫెసర్లు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

కోస్తాంధ్రపై కొనసాగుతున్న ఆవర్తనం

- వచ్చే మూడు రోజులు తేలికపాటి వర్షాలు
- ఉరుములు, మెరుపులతో పాటు పిడుగులు



సాక్షి, విశాఖపట్నం: కోస్తాంధ్ర, తెలంగాణపై ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. దీని ప్రభావంతో రానున్న మూడు రోజులు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురవనున్నాయి. గురువారం శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, తూర్పు, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, నెల్లూరు, వైఎస్సార్, అన్నమయ్య, తిరుపతి జిల్లాలు, శుక్ర, శనివారాల్లో విజయనగరం, పార్వతీపురం మన్యం,అల్లూరి, అనకాపల్లి, కాకినాడ, విశాఖపట్నం, కోనసీమ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. అదే సమయంలో గంటకు 40–50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని తెలిపింది. ఉరుములు, మెరుపులతో పాటు పిడుగులు కూడా పడతాయని పేర్కొంది.

‘శిలాఫలకాల ధ్వంసం శోచనీయం’



పోలీస్‌స్టేషన్‌లో వైఎస్సార్‌సీపీ నేతల ఫిర్యాదు

యలమంచిలి: పశ్చిమగోదావరి జిల్లా యలమంచిలి గ్రామంలో సచివాలయం మీద నవరత్నాల పథకాలను వివరిస్తూ మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఫొటోతో ఉన్న శిలాఫలకాన్ని మంగళవారం దుండగులు ధ్వంసం చేసిన ప్రాంతాన్ని వైఎస్సార్ సీపీ నేతలు పరిశీలించారు. పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి), నాయకులు యడ్ల తాతాజీ, చేగొండి సూర్యప్రకాష్‌తో కలసి బుధవారం సచివాలయం వద్దకు వచ్చి ఘటనను తీవ్రంగా ఖండించారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌కు, ఎంపీడీఓ కార్యాలయానికి వెళ్లి దుండగులపై చర్య తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. గోపి మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాలు మారడం అనేది సహజమని, అలాగని గత ప్రభుత్వంలో చేసిన పనులను ఈ విధంగా ధ్వంసం చేయడం క్షమించరాని నేరమన్నారు. డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, చేగొండి సూర్యప్రకాష్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో నిర్మించిన అనేక భవనాలపై నారా లోకేశ్, నిమ్మల రామానాయుడు పేర్లు ఉన్నాయని, జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో వాటిని ఎక్కడైనా ధ్వంసం చేశారా అని ప్రశ్నించారు. ఓదూరి భాస్కరరావు, చివటపు నాగేశ్వరరావు, రావూరి వెంకట కోటి మురళీకృష్ణ, ఉచ్చుల స్టాలిన్, వినుకొండ రవి, కొప్పాడి శ్రీనుబాబు, మోకా నరసింహారావు, మల్లుల బుజ్జి, బొంతు వెంకట కర్ణారెడ్డి, మంద హరికుమార్, వీరా ఉమాశంకర్, మానుకొండ సోమరాజు, పొన్నమండ నాగరాజు, కవురు గోపి, బుంగా జయరాజు, మోర్త గిరీష్, చెన్ను విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రానిక్ రంగ నిపుణులతో ఈసీ వివరణ ఇవ్వాలి

రాష్ట్ర ఎస్సీ కమిషన్ మెంబర్ ఆనందప్రకాష్



పాలకొల్లు అర్బన్: ఈవీఎంల పనితీరుపై దేశవ్యాప్తంగా ఆరోపణలు తలెత్తుతున్న నేపథ్యంలో తక్షణం ఎలక్ట్రానిక్ రంగ నిపుణులతో ఎన్నికల కమిషన్ వివరణ ఇవ్వాలని రాష్ట్ర ఎస్సీ కమిషన్ మెంబర్ చెల్లెం ఆనందప్రకాష్ కోరారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈవీఎంలను ప్రపంచ వ్యాప్తంగా 27 దేశాలు వినియోగించుకుంటున్నాయని.. కానీ, భారతదేశంలో ఈవీఎంల పనితీరుపై ఎన్నో అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ప్రపంచ దేశాల్లో మన దేశ ప్రతిష్ట దిగజారిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రపంచ ఎలక్ట్రానిక్ దిగ్గజం ఎలెన్ మస్క్ కూడా ఈవీఎంల పనితీరుపై అనుమానం వ్యక్తం చేస్తున్నారన్నారు. అలాగే ఎలక్ట్రానిక్ రంగ నిపుణులు సైతం ఈవీఎంలను ట్యాంపరింగ్ చేయవచ్చు లేదా మార్చవచ్చని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈసీ అలసత్వం వహించకుండా తక్షణం వివరణ ఇవ్వాలన్నారు. లేనిపక్షంలో ఎన్నికల కమిషన్‌ను రద్దుచేసి సుప్రీంకోర్టు న్యాయమూర్తులతో ఎన్నికలు జరిపించాలని ఆనందప్రకాష్ కోరారు.

రికార్డ్ సృష్టించిన విశాఖ పోర్ట్

- ప్రపంచ పోర్టుల్లో 19వ స్థానం
- 2022లో 115వ స్థానం నుంచి మెరుగు
- కేంద్ర నౌకాయాన మంత్రి సర్బానంద సోనోవాల్

సాక్షి, న్యూఢిల్లీ: విశాఖపట్నం పోర్టు రికార్డు సృష్టించింది. ప్రపంచవ్యాప్తంగా పోర్టు ర్యాంకింగ్‌లో 19వ స్థానంలో నిలిచింది. ప్రపంచబ్యాంకు, ఎస్‌పీ గ్లోబల్ మార్కెటింగ్ ఇంటెలిజెన్స్ రూపొందించిన కంటైనర్ పోర్టు పెర్‌ఫార్మెన్స్ ఇండెక్స్ (సీపీపీఐ) నివేదికలో ప్రపంచవ్యాప్తంగా టాప్ 100 పోర్టుల్లో దేశీయంగా 9 పోర్టులు స్థానం సాధించాయని కేంద్ర నౌకాయాన శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్ తెలిపారు. 2022లో 115వ స్థానంలో ఉన్న విశాఖపట్నం పోర్టు అద్భుత పనితీరు కనబరిచి 19వ స్థానానికి చేరుకుందని పేర్కొన్నారు. 21.4 గంటల టర్న్ అరౌండ్ సమయం, కనిష్ట బెర్త్ ఐడల్ టైమ్ ప్రదర్శించడంతో పాటు క్రేన్ అవర్ గంటకు 27.5 కదలికలు నమోదు చేసిందని వివరించారు. ఈ కొలమానాలు కంటైనర్ షిప్‌లు నిర్వహణలో పోర్టు సామర్థ్యాన్ని హైలెట్ చేసిందని తెలిపారు. భారత నౌకాశ్రయాలకు ఇది ఒక అద్భుతమైన విజయమన్నారు. విశాఖపట్నం పోర్టుతో పాటు దేశంలోని ముంద్రా (27), పిపావవ్ (41), కామరాజార్ (47), కొచ్చిన్ (63), హాజీరా (68), కృష్ణపట్నం (71), చెన్నై (80), జవహర్‌లాల్ నెహ్రూ (96) పోర్టులు టాప్ 100లో నిలిచాయని కేంద్రమంత్రి పేర్కొన్నారు.

సికిల్ సెల్ ఎనీమియా నిర్మూలనే లక్ష్యం

గిరిజన సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శి కాంతిలాల్ దండే

సాక్షి, అమరావతి: దేశంలో 2047 నాటికి సికిల్ సెల్ ఎనీమియాను నిర్మూలించడమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శి కాంతిలాల్ దండే తెలిపారు. మంగళగిరిలోని ఎయిమ్స్‌లో సికిల్ సెల్ ఎనీమియా నిర్మూలన మిషన్‌పై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన దండే మాట్లాడుతూ.. గిరిజనుల్లో ఈ వ్యాధి ఎక్కువగా సంభవిస్తోందన్నారు. ఈ క్రమంలో దేశవ్యాప్తంగా గిరిజన ప్రాంతాల్లో 0–40 ఏళ్ల వయసుకు చెందిన 7 కోట్ల మందికి అవగాహన కల్పించడం, నిర్ధారణ పరీక్షలు, కౌన్సెలింగ్ నిర్వహించడమే సికిల్ సెల్ ఎనీమియా నిర్మూలన మిషన్ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. అదే విధంగా రాష్ట్రంలో 20 లక్షల మందికి స్క్రీనింగ్ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రతి 86 మంది గిరిజన జనాభాలో ఒకరు సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి బారిన పడుతున్నట్లు రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ మురళీ అన్నారు. వ్యాధి నిర్మూలన మిషన్‌పై రూపొందించిన పోస్టర్లు, పాంప్లెట్స్‌ను దండే ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ డైరెక్టర్ డాక్టర్ పద్మావతి, ఎయిమ్స్ డీన్ డాక్టర్ శ్రీకాంత్‌కుమార్ పాల్గొన్నారు.

వీసీలపై టీడీపీ దాడులు హేయం

- వర్సిటీలను రాజకీయాలకు వేదికగా మార్చిందే బాబు, లోకేశ్
- రిజిస్ట్రార్లను అడ్డంపెట్టుకొని వీసీలను డమ్మీలను చేశారు
- చంద్రబాబు వర్సిటీలను బూతు బంగ్లాలుగా మార్చారు
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 3,295 పోస్టుల భర్తీకి ఆదేశాలిచ్చింది
- విద్యారంగంలో జగన్ వెలిగించిన అఖండ జ్యోతిని ఆర్పేయకండి
- వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి నాగార్జున యాదవ్



సాక్షి, అమరావతి: విశ్వవిద్యాలయాలను రాజకీయాలకు వేదికగా మార్చిందే చంద్రబాబు, నారా లోకేశ్ అని వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి నాగార్జున యాదవ్ ధ్వజమెత్తారు. వైస్ చాన్సలర్లు, ప్రొఫెసర్లపై టీడీపీ శ్రేణులు దాడులకు తెగబడటం, దూషించడం హేయమన్నారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో నాగార్జున యాదవ్ బుధవారం మీడియాతో మాట్లాడారు. గతంలో చంద్రబాబు, నారా లోకేశ్ పుట్టిన రోజులను ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో నిర్వహించిన ఫొటోలను ఈ సందర్భంగా మీడియాకు చూపించారు. చంద్రబాబు వర్సిటీలను బూతు బంగ్లాలుగా చేస్తే.. జగన్ అత్యున్నత స్థాయికి తీసుకెళ్లారని గుర్తు చేశారు. వర్సిటీల్లో 3,295 పోస్టుల భర్తీకి ఆదేశాలిచ్చారని చెప్పారు. గతంలో బాబు పాలనలో న్యాక్ గుర్తింపు పొందిన సంస్థలు 160 మాత్రమే ఉంటే జగన్ పాలనలో 209 ఉన్నాయన్నారు. అలాగే చంద్రబాబు హయాంలో ఏ++ గ్రేడ్ ఒకటే సంస్థకు ఉంటే జగన్ పాలనలో 8 సంస్థలకు వచ్చిందన్నారు. వైఎస్ జగన్ తన పాలనలో విద్యా విధానంలో ఎన్నో సంస్కరణలు, మార్పులు, పారదర్శకత తీసుకొచ్చారని కొనియాడారు. వర్సిటీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్లో 50 శాతం మహిళలే ఉండేలా చర్యలు తీసుకున్నారన్నారు. విద్యారంగంలో జగన్ వెలిగించిన అఖండ జ్యోతిని ఆర్పేయాలనే కుట్ర చేయొద్దని టీడీపీ నేతలకు హితవు పలికారు. ఈ సందర్భంగా నాగార్జున యాదవ్ ఇంకా ఏమన్నారంటే..

ప్రక్షాళన అంటే దాడులు చేయడమా?

‘చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు వర్సిటీలన్నీ భూతల స్వర్గంలా ఉన్నాయని.. వైఎస్ జగన్ సీఎం అయ్యాక అవేదో బాగోలేదన్నట్టు ఎల్లో మీడియా చిత్రీకరిస్తోంది. వర్సిటీలను ప్రక్షాళన చేస్తామంటూ టీడీపీ నేతలు వీసీలను దూషిస్తున్నారు. ఎస్కే వర్సిటీ వీసీ కారును ఆపి.. ఆయనను బూతులు తిట్టి, కారు డ్రైవర్‌పై దాడి చేయడాన్ని ప్రక్షాళన అంటారా? ఆంధ్రా యూనివర్సిటీ వీసీకి, రిజిస్ట్రార్‌కు ఫోన్ చేసి నడిరోడ్డుమీదే హత మారుస్తామని బెదిరించడం, వైఎస్సార్ విగ్రహాల్ని వర్సిటీ క్యాంపస్ నుంచి తీసేయడం ప్రక్షాళన అవుతుందా? మరి పద్మావతి, జేఎన్టీయూఏ, ద్రవిడ యూనివర్సిటీల్లో ఎన్టీఆర్ విగ్రహాలు ఉన్నాయి.. వాటిని కూడా తొలగిస్తారా?’ అని నాగార్జున యాదవ్ ప్రశ్నించారు.

బాబు జమానాలో వీసీలు, రిజిస్ట్రార్లు ఎవరు?

‘గతంలో చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు వీసీలు, రిజిస్ట్రార్లంతా ఎవరో గమనించాలి. ఆంధ్రా వర్సిటీలో నాగేశ్వరరావు అనే బీసీ వ్యక్తిని వీసీగా నియమించి రిజిస్ట్రార్‌గా బాబు తన సామాజికవర్గానికి చెందినవారినే పెట్టుకున్నారు. అలాగే జేఎన్టీయూ కాకినాడలో రామలింగరాజు వీసీగా ఉన్నా అప్పుడు అధికారం చెలాయించింది చంద్రబాబు సామాజికవర్గానికి చెందిన ఏపీపీఎస్సీ చైర్మన్ ఉదయభాస్కర్. ఎస్వీ వర్సిటీలో దామోదర్ వీసీగా ఉంటే దేవరాజులు, అనురాధ అనే ఇద్దరిని రిజిస్ట్రార్లుగా చేసి వారితో చక్రం తిప్పించి ఆయనను పని చేయకుండా చేసింది చంద్రబాబు కాదా? జేఎన్టీయూ అనంతపురంలో పేరుకు ముస్లింకు వీసీగా పదవిచ్చినా.. అక్కడ కూడా కృష్ణయ్య అనే చంద్రబాబు సామాజికవర్గానికి చెందిన వ్యక్తికే రిజిస్ట్రార్ పదవి ఇచ్చారు. ఎస్కే వర్సిటీలో వీసీగా వేరే వ్యక్తి ఉంటే సుధాకర్ బాబును రిజిస్ట్రార్‌గా, మాసినేని రామయ్యను ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా చేసి వీసీని డమ్మీని చేశారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీలోనూ వీసీని డమ్మీగా మార్చి రోశయ్య అనే బలమైన సామాజికవర్గానికి చెందిన వ్యక్తిని రిజిస్ట్రార్‌గా పెట్టారు’ అని మండిపడ్డారు.

తెలంగాణ

జూన్‌లో లోటు వర్షపాతమే!

- తాజా పరిస్థితుల మేరకు ఐఎండీ అంచనా
- ప్రస్తుతానికి సాధారణం కంటే 9% ఎక్కువగానే నమోదు
- నెలాఖరులో భారీ వర్షాలు కురుస్తాయంటున్న వాతావరణ శాఖ
- అయినా చాలాచోట్ల లోటు ఉంటుందంటున్న ఐఎండీ

సాక్షి, హైదరాబాద్: నైరుతి రుతుపవనాల గమనం మందగించింది. జూన్ నెల మొదటి వారంలో రాష్ట్రంలోకి ప్రవేశించిన నైరుతి ఆ తర్వాత అత్యంత చురుకుగా కదిలి ఈనెల 14వ తేదీ నాటికి రాష్ట్రవ్యాప్తంగా విస్తరించాయి. కానీ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ముఖ్యంగా ఉత్తర ప్రాంత జిల్లాల్లో మాత్రం ప్రస్తుతం రుతుపవనాల కదలికలు మందగమనంలోనే ఉన్నాయి. దీంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. మరోవైపు గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే అధికంగా నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో నైరుతి రుతుపవనాల సీజన్‌లో జూన్ నెలకు సంబంధించిన అంచనాలను ఐఎండీ తాజాగా విడుదల చేసింది. ఈ నెలలో రాష్ట్రంలోని చాలాచోట్ల లోటు వర్షపాతం నమోదయ్యే పరిస్థితులే కనిపిస్తున్నట్లు తెలిపింది. నెలాఖరులో వర్షాలు కురుస్తాయని, సాధారణ వర్షపాతానికి దగ్గరగా గణాంకాలు ఉంటాయని వాతావరణ శాఖ చెబుతునప్పటికీ మొత్తం మీదా చాలాచోట్ల లోటు ఉంటుందని ప్రకటించింది.

8 జిల్లాల్లో సాధారణం..11 జిల్లాల్లో లోటు

జూన్ నెలలో ఇప్పటివరకు 7.85 సెంటీమీటర్ల సాధారణ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా.. బుధవారం ఉదయానికి 8.53 సెంటీమీటర్ల వర్షం కురిసింది. సాధారణ వర్షపాతం కంటే 9 శాతం అధికంగా నమోదైనట్లు వాతావరణ శాఖ గణాంకాలు చెబుతున్నాయి. ఈనెల చివరి వారంలో రాష్ట్రంలో భారీ నుంచి అతి భారీ, అత్యంత భారీ వర్షాలు నమోదు కావొచ్చని వాతావరణ శాఖ అంచనా వేస్తున్నప్పటికీ, తూర్పు ప్రాంత జిల్లాల్లోనే ఇందుకు ఎక్కువగా అవకాశం ఉన్న ట్లు నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలోని 8 జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదు కాగా, 7 జిల్లాల్లో అధిక వర్షపాతం, 6 జిల్లాల్లో అత్యధిక వర్షపాతం నమోదైంది. ఇక 11 జిల్లాల్లో లోటు వర్షపాతమే ఉన్నట్లు వాతావరణ శాఖ వివరించింది. మంచిర్యాలలో లోటు ఎక్కువగా నమోదైంది.

జూన్‌లో సాధారణ వర్షపాతం : 12.94 సెంటీమీటర్లు
బుధవారం నాటికి కురవాల్సిన వర్షం : 7.85 సెంటీమీటర్లు
నమోదైన వర్షపాతం : 8.53 సెంటీమీటర్లు
సాధారణం కంటే 9 శాతం అధికంగా నమోదు

రానున్న రెండ్రోజుల్లో వర్షసూచన

ప్రస్తుతం కోస్తాంధ్రను ఆనుకుని తెలంగాణ, రాయలసీమ మీదుగా ఉపరితల ఆవర్తనం కొనసాగుతున్నట్లు వాతావరణ శాఖ వివరించింది. ఇది సముద్రమట్టం నుంచి 5.8 కిలోమీటర్ల ఎత్తు వరకు ఉందని, దీని ప్రభావంతో రానున్న రెండ్రోజులు రాష్ట్రంలో అక్కడక్కడా ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని తెలిపింది

జూన్‌లో ఇప్పటివరకు జిల్లాల వారీగా వర్షపాతం..

- **తీవ్ర లోటు (–60% నుంచి –99%):** మంచిర్యాల
- **లోటు(–20% నుంచి –59%):** ఆదిలాబాద్, కుమ్రుంభీం ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, రాజన్న సిరిసిల్ల, కామారెడ్డి
- **సాధారణం(+19% నుంచి –19%):** వరంగల్, హనుమకొండ, కరీంనగర్, మెదక్, సిద్దిపేట, జనగామ, రంగారెడ్డి, ఖమ్మం
- **అధికం(+20% నుంచి +59%):** మహబూబాబాద్, యాదాద్రి భువనగిరి, మేడ్చ ల్ మల్కాజిగిరి, వికారాబాద్, మహబూబ్‌నగర్, సూర్యాపేట, నారాయణపేట
- **అత్యధికం(+60% పైబడి):** హైదరాబాద్, జోగుళాంబ గద్వాల, నాగర్‌కర్నూల్, నల్లగొండ

అమెజాన్ పార్శిల్‌లో పాము!

బెంగళూరులో టెక్కీ జంటకు భయానక అనుభవం



బనశంకరి: ఉద్యోగంలో అలసిపోయిన బెంగళూరులోని ఓ టెక్కీ దంపతులు... సరదాగా ఇంట్లో వీడియో గేమ్స్ ఆడుకుందామనుకున్నారు. ఇందుకోసం అమెజాన్‌లో ఎక్స్‌బాక్స్ కంట్రోలర్‌ను బుక్ చేశారు. పార్శిల్ ఇంటికి వచ్చింది. ఆనందంగా దాన్ని తెరిచే సరికి అవాక్కుతోపాటు... బెంబేలెత్తిపోయారు. ఇంతకూ ఏం జరిగిందంటే... బెంగళూరు నగర పరిధిలోని సర్జాపురకు చెందిన టెక్కీ దంపతులు ఇంట్లో వీడియో గేమ్స్ ఆడుకుందామనుకున్నారు. ఇందుకోసం వారంక్రితం అమెజాన్‌లో ఎక్స్‌బాక్స్ కంట్రోలర్ ఆర్డర్ చేశారు. పార్శిల్ ఇంటికి చేరుకుంది. దాన్ని తెరవగానే అందులో కంట్రోలర్ బదులుగా నాగుపాము పడగ ఎత్తింది. అదృష్టవశాత్తు ఎవరికీ ఏమీ కాలేదు. బాక్సును మూసేసి దూరంగా ఉంచారు. ఈ భయానక అనుభవాన్ని వీడియో తీసి బుధవారం సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. కొన్ని గంటల్లోనే వైరల్ అయ్యింది. ప్యాకేజింగ్ టేప్‌కు చిక్కుకున్న నాగుపాము తప్పించుకోవడానికి ప్రయత్నిస్తున్నట్లు వీడియోలో ఉంది. ఈ ఘటన తరువాత ఆ దంపతులకు అమెజాన్ సిబ్బంది ఎక్స్‌బాక్స్ కంట్రోలర్‌తో పాటు నగదును కూడా వెనక్కు ఇచ్చేశారు. కానీ పాము ఎలా డెలివరీ అయ్యిందో వివరణ ఇవ్వలేదు. ప్యాకేజింగ్ గోదాములో పాము చేరిందా, లేక ఎవరైనా కావాలనే పామును ఉంచారా? అనేది కూడా సస్పెన్స్‌గా ఉంది. పోస్ట్‌పై నెటిజన్లు ఇవే సందేహాలను వ్యక్తం చేశారు.

రేపు 60 బొగ్గు బ్లాకుల వేలం

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ సహా వివిధ రాష్ట్రాల్లోని 60 బొగ్గు బ్లాకుల కోసం 10వ రౌండ్ కమర్షియల్ బొగ్గు గనుల వేలాన్ని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి ప్రారంభించనున్నారు. తెలంగాణలోని ఒక బొగ్గు గని, ఒడిశాలోని 16, ఛత్తీస్‌గఢ్ 15, మధ్యప్రదేశ్ 15, జార్ఖండ్ 6, పశ్చిమబెంగాల్ 3, బిహార్‌లోని 3, మహారాష్ట్రలోని ఒక బొగ్గు గనికి కేంద్ర ప్రభుత్వం వేలం నిర్వహించనుంది.

చేప పిల్లలు సిద్ధం

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 20 కోట్ల సీడ్ పెంపకం

- 45.69 ఎకరాల్లో చేప పిల్లల పెంపకం
- జలాశయాలకు ఉచితంగా సరఫరా



బాదంపూడిలో చేప పిల్లల ప్యాకింగ్ (ఫైల్)

కైకలూరు: రుతుపవనాల రాకతో వర్షాలు కురుస్తుండడంతో జలాశయాల్లో నీరు చేరుతోంది. మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఈ జలాశయాల్లో చేప పిల్లల్ని వదిలేందుకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల్లో మూడు నెలల వ్యవధిలో 20 కోట్ల చేప సీడ్‌ను సిద్ధం చేస్తున్నారు. ఇరు జిల్లాల్లో ప్రభుత్వ చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాలలో మూడు దశల్లో వీటిని పెంచి జలాశయాలకు ఉచితంగా సరఫరా చేస్తారు. ఈ ఏడాది కొత్త చేప వంగడాలను సైతం మత్స్యకారులు కోరుతున్నారు.

చేపలు పట్టుకుని జీవనోపాధి పొందడానికి మత్స్యశాఖ ఉచితంగా చేప పిల్లలను జలాశయాల్లో విడుదల చేస్తుంది. ఏలూరు జిల్లాలో బాదంపూడి, ఏలూరు, కొవ్వలి, పశ్చిమగోదావరి జిల్లాలో నరసాపురం, భీమవరం, తణుకులో ప్రభుత్వ చేప పిల్లల తయారీ కేంద్రాలు ఉన్నాయి. రెండు జిల్లాల్లో కలుపుకుని 45.69 ఎకరాల్లో అధికారులు చెరువుల ద్వారా వీటిని సాగు చేస్తున్నారు. ముఖ్యంగా కట్లా, రోహు, మోసు, గడ్డి చేప రకాలు పెంచుతున్నారు. మత్స్యకారులు, రైతులు ఈ ఏడాది హైబ్రిడ్ రకాలైన జయంతి రోహు, తిలాపియా, నీలకంఠ రొయ్య అందించాలని కోరుతున్నారు.

జలాశయాలకు సరఫరా ఇలా

మత్స్యశాఖ 2024–2025 సంవత్సరంలో జలాశయాల్లో చేప పిల్లల విడుదలకు ప్రణాళిక రూపొందించింది. ఉమ్మడి జిల్లాలో గోదావరితో పాటు పోగండ, జల్లేరు, తమ్మిలేరు జలాశయాలు ఉన్నాయి. వీటికి చేప పిల్లలు సరఫరా చేయడానికి ప్రధానంగా బాదంపూడి తయారీ కేంద్రం కీలకంగా ఉంది. మత్స్యశాఖ ప్రణాళిక ప్రకారం బాదంపూడి కేంద్రం నుంచి 22 లక్షలు, ఏలూరు కేంద్రం నుంచి లక్షా 10 వేల చేప పిల్లలను గోదావరి తీరంలో ధవళేశ్వరం, పట్టిసీమ ప్రాంతాల్లో విడుదల చేస్తారు. కొవ్వలి కేంద్రం నుంచి తమ్మిలేరుకు లక్షా 35 వేలు, పోగండ జలాశయానికి లక్షా 25 వేలు, జల్లేరుకు 50 వేలు చేప పిల్లలను అందజేస్తారు.

గుడ్డు దశ నుంచి ఎంతో కీలకం

సీడ్ తయారీకి మత్స్యశాఖ అధికారులు అత్యంత జాగ్రత్తలు తీసుకుంటారు. ముందుగా తల్లి చేప బ్రూడర్ నుంచి గుడ్లు సేకరిస్తారు. మూడు రోజుల వయసు కలిగిన చేప పిల్లలను స్పాన్ అంటారు. ముప్పాతిక సైజు వరకు ఉన్న చేపను ఫ్రై అంటారు. అంగుళం నుంచి మూడు అంగుళాల వరకు ఫింగర్‌లింగ్స్ అంటారు. జలాశయాల్లో 80 – 100 ఎంఎం సైజు సీడ్‌ను జలాశయాల్లో విడుదల చేయడానికి ప్రాధాన్యత ఇస్తారు. మత్స్య క్షేత్రాల్లో 3 నుంచి 4 నెలలు వీటిని పెంచి సరఫరాకు సిద్ధం చేస్తారు. ఇప్పటికే మత్స్యశాఖ అధికారులు బ్రూడర్ల నుంచి గుడ్లను సేకరించారు. త్వరలో అన్ని కేంద్రాల్లో సాగు చేపట్టనున్నారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act)
RNI No:TNTEL/2008/25943

క్లుప్తంగా

21 నుంచి క్రికెట్ పోటీలు

బళ్లారిటౌన్: ఆర్యవైశ్య యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 21 నుంచి మూడు రోజుల పాటు బాక్స్ క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు విశేష్ తెలిపారు. బుధవారం పత్రికా భవనంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాబడారు. ఈ పోటీల్లో ఆర్యవైశ్య సమాజానికి చెందిన 10 బృందాలు పాల్గొంటాయని తెలిపారు. తొలి రోజున సాయంత్రం 5 గంటలకు ప్రారంభం కానున్న పోటీలను సిటీ ఎమ్మెల్యే నారాభరత్ రెడ్డి, కార్పొరేటర్ ఎం.ప్రభంజన్‌కుమార్ ప్రారంభిస్తారన్నారు. ఇక చివరి రోజు 23న సాయంత్రం ముగింపు కార్యక్రమంలో బీజేపీ నాయకురాలు గాలి లక్ష్మీ అరుణ చేతుల మీదుగా విజేతలకు ట్రోఫీలు అందజేస్తున్నట్లు తెలిపారు. అసోసియేషన్ నేతలు రాహుల్, రామ్‌కిరణ్, శ్రీధర్, సంకేత్, విష్ణు, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

అనాథలకు అన్నదానం



కేక్ వృద్ధులకు తినిపిస్తున్న తుకారాం

బళ్లారిఅర్బన్: రాహుల్ గాంధీ 54వ పుట్టిన రోజును పురస్కరించుకుని బళ్లారి లోక్‌సభ సభ్యుడు ఈ.తుకారాం బుధవారం రాహుల్ గాంధీ యువబ్రిగేడ్ సంస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు అఖిల్ అహ్మద్ సారథ్యంలో కంటోన్మెంట్ ప్రాంతంలోని మదర్ థెరిస్సా అనాథాశ్రమంలోని దివ్యాంగులు, వృద్ధులకు, పిల్లలకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం అన్నదానం చేశారు. తుకారాం, అఖిల్ అహ్మద్ మాట్లాడుతూ రాహుల్ గాంధీ నిండు నూరేళ్లు వర్ధిల్లి దేశ ప్రజలకు మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు. బుడా అధ్యక్షుడు ఆంజనేయులు, పార్టీ ప్రముఖులు కాంద్ర సతీష్, కేఎస్ఎల్ స్వామి, కణేకల్ మాబుసాబ్, గుడ్లు రవి, సంతోష్, రఘు పాల్గొన్నారు.

కన్నడ బోధించాలని డిమాండ్

రాయచూరు రూరల్: కర్ణాటక విద్యుత్ మండలి(కేపీసీఎల్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డీఏవీ పాఠశాలలో కన్నడ భాషను కూడా బోధించాలని జిల్లా కన్నడ క్రియా సమితి డిమాండ్ చేసింది. బుధవారం పాఠశాల వద్ద చేపట్టిన ఆందోళనను ద్దేశించి అధ్యక్షుడు మల్లికార్జున మాట్లాడారు. వెంటనే అన్ని తరగతుల్లో కన్నడ భాష బోధనకు ఆదేశించాలన్నారు. మ్యాదర్, భరమరెడ్డి, వెంకనగౌడ, మహేష్, రామన్న, రఫీక్ అహ్మద్, సిద్రామప్ప, శ్రీకాంత్, బషీర్ అహ్మద్‌లున్నారు.

ధరలు తగ్గించాలని ధర్నా



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శివరాజ్ పాటిల్

రాయచూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలని ఎస్‌యూసీఐ నేతలు ఆందోళన చేపట్టారు. బుధవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళనను ద్దేశించి అధ్యక్షుడు అణ్ణప్ప మాట్లాడారు. నాడు ప్రతిపక్షంలో కూర్చొని మాట్లాడిన నేతలు నేడు మౌనం వహించి లోక్‌సభ ఎన్నికలు ముగిసిన వెంటనే ధరలు పెంచడం తగదన్నారు. ఒక వైపు పన్నులు పెంచుతూ మరో వైపు పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలని కోరుతు స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

గ్యారంటీల కోసం పన్నుల పెంపా?

రాయచూరు రూరల్: రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కార్ పంచ గ్యారంటీలకు ఖర్చు చేయడానికి పన్నులు పెంచడం తగదని బీజేపీ జిల్లాధ్యక్షుడు, నగర శాసన సభ్యుడు శివరాజ్ పాటిల్ ఆరోపించారు. బుధవారం విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఉన్నఫళంగా పెట్రోల్, డీజిల్ ధరలు పెంచడాన్ని ఖండించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్, స్టాంప్ డ్యూటీ, బస్ చార్జీలు, ఎరువులు, విత్తనాలు, క్రిమి సంహారక మందుల ధరలు పెంచడం సరికాదన్నారు. రాష్ట్రంలో గత ఏడాది వర్షాలు కురువక కరువు నెలకొన్న తరుణంలో ధరలు పెంచకుండా వాటిని ధరలు తగ్గించాలని కోరారు.

పండిత్ తారానాథ్‌కు శ్రద్ధాంజలి



శ్రద్ధాంజలి ఘటించిన దృశ్యం

రాయచూరు రూరల్: రాష్ట్రంలో సంగీత మాంత్రికుడుగా పేరొందిన పండిత్ రాజీవ్ తారానాథ్ మృతికి సంతాప సభను ఏర్పాటు చేశారు. బుధవారం నగరంలోని ఎల్‌వీడీ కళాశాలలో పండిత్ రాజీవ్ తారానాథ్ చిత్రపటానికి పాత విద్యార్థుల సంఘం అధ్యక్షుడు ఆంజనేయ శ్రద్ధాంజలి ఘటించి మాట్లాడారు. శాస్త్రీయ సంగీతానికి తారానాథ్ చేసిన సేవలు మరువరానివన్నారు. సాహిత్యం, సరోద్ వాదనలో దిట్టన్నారు. పద్మశ్రీ, సంగీత విద్వాన్, కేంద్ర నాటక అకాడమి, కెంపేగౌడ, రాష్ట్ర స్థాయి సంగీత రత్న అవార్డులు అందుకున్న మహానుభావుడని తారానాథ్‌ను అభివర్ణించారు. సంతాప సభలో కవిత, లక్ష్మి, విజయ్ భాస్కర్, బండేష్, రజాక్, సిద్దప్ప, రామస్వామి, వెంకటేష్, మల్లికార్జున, నాగనగౌడ, చెన్న మల్లికార్జున, శరణేగౌడ, అరుణలున్నారు

అనుమానాస్పద వ్యక్తి అరెస్ట్

హుబ్లీ: టిప్పునగర్‌లోని ఓ కాలేజ్ వద్ద తాను ఉన్నట్లుగా నమ్మించడానికి అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఆనంద్‌నగర నివాసి అభిషేక్ వాల్మీకి అనే ఓ వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడిపై పాత హుబ్లీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

లక్ష్యాన్ని మించి ఉపాధి పనులు

- రాష్ట్రంలోనే బళ్లారి జిల్లాకు అగ్రస్థానం
- రెండో స్థానంలో నిలిచిన గదగ్ జిల్లా



ఉపాధి హామీ పనుల్లో చురుకుగా పాల్గొన్న కూలీలు



పరికరాలతో పనులకు వెళుతున్న మహిళా కూలీలు

సాక్షి బళ్లారి: గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న వ్యవసాయ కూలీలకు ఉపాధి హామీ పనులు పెద్ద దిక్కుగా మారాయి. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఉపాధి హామి పథకం పనుల ద్వారా వ్యవసాయ కూలీలకు కడుపు నిండడంతో పాటు పలు గ్రామాల్లో అభివృద్ధి పనులు జరగడానికి కూడా దోహద పడుతోంది. కర్ణాటక రాష్ట్రంలో 31 జిల్లాల్లో బళ్లారి జిల్లా ఉపాధి హామీ పనులు ఎక్కువగా చేయించిన జిల్లాల్లో మొదటి స్థానంలో నిలిచిందంటే జిల్లాలో ఏ మేరకు వ్యవసాయ కూలీలు ఉపాధి హామి పనుల ద్వారా లబ్ధి పొందారో అర్థం చేసుకోవచ్చు. జిల్లా వ్యాప్తంగా ఐదు తాలూకాలకు గాను 100 గ్రామ పంచాయతీల్లో 1,80,000 ఉపాధి హామీ జాబ్‌కార్డుల ద్వారా దాదాపు 5 లక్షల మంది ఉపాధి హామీ పనులు చేయడానికి నమోదు చేయించుకున్నారు. వీరిలో వ్యవసాయ కూలీలతో పాటు సన్న, చిన్నకారు, మోతుబరి రైతులు కూడా ఉపాధి హామీ పనుల్లో పాల్గొని ఉపాధి పొందుతున్నారు.

చురుగ్గా పాల్గొంటున్న రైతు కూలీలు

ఉదయం లేస్తూనే రైతు కుటుంబాలు వ్యవసాయ పొలాలకు ఎలా వెళ్తారో అంతకన్నా పదింతలు ఎక్కువగా గ్రామీణ ప్రాంతాల్లో జాతర తరహాలో పలుగు, పార, గడార పట్టుకొని ఉపాధి హామీ పనుల్లో చురుకుగా పాల్గొంటున్నారు. ఈఏడాది జిల్లా వ్యాప్తంగా 60 లక్షల పనిదినాలు కల్పిస్తే ఇప్పటికే దాదాపు 38 లక్షల పనిదినాలు పూర్తి కావడంతో లక్ష్యానికి మించి దాదాపు 63 శాతం ఉపాధి హామీ పనులు సాధించినట్లు అధికారుల గణాంకాలు తెలియజేస్తున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 31 జిల్లాల్లో 13 కోట్ల మానవ పని దినాలు నిర్దేశించగా జిల్లాకు 62 లక్షల పనిదినాలు కల్పిస్తే రాష్ట్రంలో బళ్లారి జిల్లా ప్రథమ స్థానం, గదగ్ జిల్లా రెండో స్థానం, బెంగళూరు చివరి స్థానంలో నిలిచింది. రాయచూరు మూడో స్థానం, విజయనగర జిల్లా నాలుగో స్థానం, కొప్పళ ఐదో స్థానం, ఉడిపి ఆరో స్థానం, కలబుర్గి ఏడో స్థానం, బీదర్ ఎనిమిదో స్థానం, శివమొగ్గ తొమ్మిదో స్థానం, హావేరి పదో స్థానంలో నిలిచినట్లు తెలిసింది.

గ్రామాల్లో అభివృద్ధికి ఊతం

ఉపాధి హామీ పనుల ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా వ్యవసాయ ఫారంపాండ్, చెరువులు, తుంగభద్ర ఆయకట్టు పరిధిలోని కాలువల్లో పూడికతీత, చెక్ డ్యాంలు, బోరుబావుల నిర్మాణం, గ్రామాల్లో మట్టి రోడ్లు తదితర పనులు చేయడం ద్వారా ఇటు గ్రామాల్లో అభివృద్ధి పనులతో పాటు ఉపాధి హామీ కల్పిస్తూ వ్యవసాయ కూలీలకు అండగా నిలుస్తుండటంతో రాష్ట్రంలోనే బళ్లారి జిల్లా వాసులు ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకొన్నారు. గత ఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితులతో పంటలను నష్టపోయిన రైతులకు ఉపాధి హామీ పనులు కూడా ఆసరాగా నిలిచాయి. రైతాంగంతో పాటు కూలీలకు ప్రతి రోజు ఈ పనుల ద్వారా ఒక్కొక్కరికి రూ.300లకు పైగా కూలీ అందుతుండటంతో నెలకు రూ.7 వేల నుంచి రూ.8 వేల వరకు ఆదాయం పొందుతున్నారు. రైతులు వ్యవసాయ కూలీలతో పాటు డిగ్రీ చదివిన నిరుద్యోగులు సైతం ఉపాధి హామీ పనుల్లో పాల్గొని ఉపాధిని పొందుతుండటం గమనార్హం.



ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు

రేపు సీఎం అధ్యక్షతన జిల్లా ప్రగతిపై సమీక్ష



మాట్లాడుతున్న జిల్లాధికారి దివాకర్

హొసపేటె: విజయనగర జిల్లా పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి ఈ నెల 21న విజయనగర జిల్లా స్థాయి అధికారులతో చేపట్టే కేడీపీ సమావేశంలో వివిధ శాఖల పురోగతిని పరిశీలిస్తారని జిల్లాధికారి ఎంఎస్ దివాకర్ పేర్కొన్నారు. ఆయన బుధవారం తన కార్యాలయ భవనంలోని ఆడిటోరియం హాలులో వివిధ శాఖల అధికారులతో మరో దఫా సమావేశం నిర్వహించారు. శాఖల వారీగా ప్రగతి సమీక్ష సమావేశం కావడంతో అన్ని ముఖ్యమైన శాఖల అధికారులు తగిన సమాచారంతో సమావేశానికి హాజరు కావాలన్నారు. శాఖల పురోగతికి అనుగుణంగా ముఖ్యమంత్రి కోరిన సమాచారం వెంటనే ఇవ్వాలని ఆయన ఆదేశించారు. అధికారులు కార్యాలయంలోని ఇతర అధికారులను నియమించకుండా వ్యక్తిగతంగా సమావేశానికి హాజరు కావాలన్నారు. సమయానికి అడిగే ప్రశ్నలకు అనవసర వివరణలు లేకుండా నేరుగా సమాధానాలు చెప్పాలన్నారు. ఎలాంటి గందరగోళానికి తావు లేకుండా ఆబ్జెక్టివ్ సమాచారం అందించాలని అధికారులను ఆదేశించారు. ప్రజాప్రతినిధులు, నామినేటెడ్ సభ్యులు, అధికారులు, జర్నలిస్టులకు వేర్వేరుగా సీట్లు ఏర్పాటు చేయాలన్నారు. గుర్తింపు పొందిన మీడియా ప్రతినిధులకు మాత్రమే ప్రవేశం కల్పించాలని ఆయన సూచించారు. సమావేశంలో జడ్పీ సీఈఓ సదాశివ ప్రభు, జిల్లా ఎస్పీ శ్రీహరిబాబు, అదనపు జిల్లాధికారిణి అనురాధ, ముఖ్య ప్రణాళిక అధికారి అన్నదానేశ్వర స్వామి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పెట్రో ధరల పెంపుపై జేడీఎస్ నిరసన



ఎడ్లబండ్లపై నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న జేడీఎస్ నేతలు, కార్యకర్తలు

బళ్లారిటౌన్: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల లీటర్ పెట్రోల్‌పై రూ.3, డీజిల్‌పై రూ.3.50 చొప్పున పెంచడాన్ని ఖండిస్తూ జేడీఎస్ ఆధ్వర్యంలో బుధవారం ఎడ్లబండ్లపై వినూత్న రీతిలో నిరసన ర్యాలీ నిర్వహించారు. రాయల్ సర్కిల్‌లో రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేక నినాదాలు చేశారు. అనంతరం జిల్లాధికారి కార్యాలయానికి చేరుకొని వినతిపత్రాన్ని సమర్పించారు. జేడీఎస్ జిల్లాధ్యక్షుడు మీనళ్లి తాయణ్ణ, సండూరు తాలూకా అధ్యక్షుడు సోమప్ప మాట్లాడుతూ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నఫళంగా పెట్రోల్, డీజిల్ ధరలు పెంచడం సామాన్య, పేద వర్గాలకు పెనుభారంగా మారిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గ్యారెంటీ పథకాలకు నిధులు సమకూర్చుకునేందుకు పెట్రోల్, డీజిల్ ధరలను పెంచిందని ధ్వజమెత్తారు. పెంచిన ధరలను వెంటనే తగ్గించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి గ్రామంలోను ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళన చేపట్టాలని హైకమాండ్ నిర్ణయించినట్లు వారు తెలిపారు.

నిజాయితీ చాటిన ఆర్టీసీ అధికారులు



సొంతదారుకు నగదును అందిస్తున్న అధికారులు

రాయచూరు రూరల్: ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న ఓ ప్రయాణికుడు పోగొట్టుకున్న నగదును అధికారులు మానవత్వంతో ప్రయాణికుడికి అందించిన ఉదంతం రాయచూరులో చోటు చేసుకుంది. వివరాలు.. మంగళవారం హుబ్లీ నుంచి హైదరాబాద్ వెళ్లే మాన్వి నుంచి రాయచూరుకు వచ్చిన సోమశేఖర్ పాటిల్ అనే వ్యక్తి హడావుడిలో నగదు బ్యాగ్‌ను మరిచి పోయి బస్టాండ్‌లో బస్సు దిగి వెళ్లిపోయాడు. ప్రయాణికులందరూ బస్సు దిగిన తర్వాత గమనించిన డ్రైవర్, కండక్టర్ నిజాయితీగా రూ.2 లక్షల నగదు ఉన్న బ్యాగ్‌ను అధికారులకు అప్పగించారు. అనంతరం బస్సు నేరుగా హైదరాబాద్‌కు వెళ్లి పోయింది. బ్యాగ్‌లో లభించిన ఆధార్ కార్డు ఆధారంగా బాధితుడికి ఫోన్ చేసి నిర్ధారించుకున్న అనంతరం బుధవారం ఆర్టీసీ అధికారి శీలప్ప, కండక్టర్ మంజునాథ్ తదితరుల చేతుల మీదుగా నగదును అందజేసి మానవత్వం చాటుకున్నారు.

కళ్యాణ కర్ణాటకలో అంగన్‌వాడీల మూత



మూతపడిన అంగన్‌వాడీ కేంద్రం



ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

రాయచూరు రూరల్: ఎల్‌కేజీ, యూకేజీ తరగతులను కేటాయించాలని డిమాండ్ చేస్తూ కళ్యాణ కర్ణాటకలో అంగన్‌వాడీ కేంద్రాలను మూసివేసి నిరవధిక ఆందోళనకు శ్రీకారం చుట్టారు. రాష్ట్రంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో ఎల్‌కేజీ, యూకేజీలను కొనసాగించకుండా సర్కార్ విద్యా శాఖకు కేటాయించడాన్ని ఉపసంహరించుకోవాలని కర్ణాటక అంగన్‌వాడీ కార్యకర్తల సంఘం అధ్యక్షురాలు పద్మ డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని వాల్మీకి సర్కిల్ వద్ద చేపట్టిన ఆందోళనలో ఆమె మాట్లాడారు. చిన్న నీటిపారుదల శాఖా మంత్రి ఎన్.ఎస్.బోసురాజు నివాసం ముందు కార్యకర్తలు నిరసన వ్యక్తం చేయడంపై పోలీసులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో సర్కిల్‌లో రాస్తారోకో చేపట్టారు. అంగన్‌వాడీ కేంద్రంలో విధులు నిర్వహించే కార్యకర్తలకు ఎల్‌కేజీ, యూకేజీల బోధనకు సంబంధించి శిక్షణ ఇచ్చారన్నారు. అంగన్‌వాడీలకు కేటాయించిన పనులను, పథకాలను విద్యాశాఖకు అప్పగిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని మొదటి సారిగా కళ్యాణ కర్ణాటకలో ప్రయోగాత్మకంగా అమలు చేసిన ఆదేశాలను ఉపసంహరించుకోవాలని కోరుతూ నిరవధిక ఆందోళనకు పూనుకున్నట్లు తెలిపారు.

కొనసాగుతున్న నిరవధిక సమ్మె



నినాదాలు చేస్తున్న సంఘం నేతలు, కార్యకర్తలు

బళ్లారిఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రాథమిక పాఠశాలల్లో ఎల్‌కేజీ, యూకేజీ పూర్వ ప్రాథమిక విద్యను అందిస్తామంటూ ప్రభుత్వం పేర్కొనడాన్ని ఖండిస్తూ ఇలా చేస్తే అత్యధిక అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులు రాకుండా సదరు కేంద్రాలు పూర్తిగా మూసి వేసే అవకాశాలు ఉన్నాయని సీఐటీయూ నేతలు పేర్కొన్నారు. డీసీ కార్యాలయం ఎదుట సీఐటీయూ జిల్లా శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె రెండో రోజు మంగళవారం కొనసాగింది. జిల్లాధ్యక్షుడు సత్యబాబు, సంస్థ జిల్లా సంయుక్త కార్యదర్శి తిప్పేస్వామి, ప్రముఖులు చంద్రకుమారి, ఎర్రిస్వామి, మల్లమ్మ, గీతమ్మ, ఈరమ్మ, రాణి ఎలిజిబెత్, మహంతమ్మ, కే.విమల, రుద్రమ్మ తదితరులతో పాటు తాలూకా కమిటీ పదాధికారులు, వందలాదిగా అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు పాల్గొన్నారు.

ఇద్దరికి ఆన్‌లైన్ వంచన

హుబ్లీ: నగరంలో ఇద్దరికి వేర్వేరు కేసుల్లో ఆన్‌లైన్ కేటుగాళ్లు సుమారు రూ.32 లక్షల మేర వంచించారు. తమదైన ట్రేడింగ్ అప్లికేషన్ ప్రారంభించిన వంచకులు ఇందులో షేర్లు కొనుగోలు చేస్తే ఎక్కువ డబ్బులు గడించవచ్చని ఓ వ్యక్తి ద్వారా రూ.30.79 లక్షలను తమ ఖాతాలోకి బదలాయించుకొని రూ.32 లక్షలకు పైగా వంచించారు. అక్షయ కాలనీకి చెందిన హెచ్‌ఆర్ దర్శన్ మోసపోయిన వ్యక్తి. ఇన్‌స్టాలో లాభదాయక పెట్టుబడికి సంబంధించిన లింక్‌పై క్లిక్ చేసి మొబైల్ నెంబర్ నమోదు చేశాడు. అనంతరం వ్యాట్సాప్‌కు సందేశం వచ్చింది. మాస్టర్ సిద్దార్థ్ కుమార్ అనే వ్యక్తి సహాయకురాలినని హహిషా సింగానియా పరిచయం చేసుకొని వ్యాట్సాప్ గ్రూప్‌లో చేర్పించి పెట్టుబడి పెట్టాక ప్రారంభంలో లాభాలు ఇచ్చినట్లుగా మభ్య పెట్టారు. బాధితుడి వివిధ బ్యాంక్ ఖాతాల నుంచి రూ.32,79,437లను బదలాయించుకొని వంచించినట్లు సైబర్ క్రైం పోలీసులు తెలిపారు. మరో ఘటనలో పాత హుబ్లీ గోవిందరావ్ కులకర్ణి తన మొబైల్‌ను పోగొట్టుకున్నారు. మొబైల్‌ను చేజిక్కించుకున్న గుర్తు తెలియని వ్యక్తులు అతని బ్యాంక్ ఖాతా నుంచి రూ.1.54 లక్షలను బదలాయించుకోవడంపై సైబర్ క్రైం పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

రేపట్నుంచి ముంగారు ఉత్సవాలు షురూ



ఎద్దులకు రాతి దూలం లాగే పోటీలు (ఫైల్)



నృత్యం చేస్తున్న కళాకారులు(ఫైల్)

- మూడు రోజుల పాటు ఎద్దుల పండుగ
- కర్ణాటకాంధ్ర, తెలంగాణ ఎడ్లకు పోటీలు



మాజీ ఎమ్మెల్యే పాపారెడ్డి(ఫైల్)

రాయచూరు రూరల్: రెండున్నర దశాబ్దాల నుంచి నగరంలో మున్నూరు కాపు సమాజం ఆధ్వర్యంలో ముంగారు ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. శుక్రవారం నుంచి నగరంలోని ఏపీఎంసీ మైదానంలో మూడు రోజుల పాటు ఎద్దుల పండుగ జరుగనుంది. మాజీ శాసన సభ్యుడు, మున్నూరు కాపు సమాజం అధ్యక్షుడు పాపారెడ్డి ఆధ్వర్యంలో కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ తదితర ప్రాంతాల నుంచి ఎద్దులు రానున్నాయి. ఏరువాక పున్నమి సందర్భంగా ఏపీఎంసీ ఆవరణలో రాతి దూలం లాగే పోటీలు, పురుష, మహిళా పహిల్వాన్లకు కుస్తీ పోటీలు, కళాకారులతో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, రాతి గుండు ఎత్తే పోటీలు భావితరాలకు గుర్తుండేలా ఈ పోటీలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సమాజం ఆధ్వర్యంలో సీబీఎస్ఈ పాఠశాల, ఆస్పత్రి, కళాశాలల నిర్మాణానికి సిద్ధమైనట్లు తెలిపారు. భవిష్యత్తులో పిల్లలకు గ్రామీణ కళలు మననం చేసుకోవడానికి ఈ ఉత్సవాలు ఎంతగానో దోహదపడతాయని ఆయన అన్నారు.



పహిల్వాన్ల కుస్తీ పోటీలు(ఫైల్)

స్మారకాల ప్రాముఖ్యతపై ప్రచారం అవసరం



పారంపర్య నడకలో పాల్గొన్న అధికారులు, పాత్రికేయులు

హొసపేటె: స్మారక చిహ్నాల పరిరక్షణ, వాటి ప్రాముఖ్యతను భావి తరాలకు తెలిపి వాస్తవ చరిత్రను చాటాలని విజయనగర జిల్లాధికారి ఎంఎస్ దివాకర్ అన్నారు. విజయనగర జిల్లా వర్కింగ్ జర్నలిస్ట్స్ అసోసియేషన్, ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా సహకారంతో పత్రికా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన సంప్రదాయ పాదయాత్రను ఆయన ప్రారంభించి మాట్లాడారు. హంపీలోని రాణిస్నాన ఘట్టం దగ్గర కార్యక్రమంను ఆయన ప్రారంభించి మాట్లాడుతూ ఈ ప్రాంతంలోని చారిత్రకతను రేపటి తరానికి తెలియజేసేలా కృషి చేయాల్సి ఉందన్నారు. విజయనగర జిల్లా ఎస్పీ శ్రీహరిబాబు మాట్లాడుతూ జర్నలిస్టులు హెరిటేజ్ వాక్ చేయడం శుభపరిణామమని, ఈ ప్రాంత స్మారక చిహ్నంపై అవగాహన కల్పించేందుకు దోహదపడుతుందన్నారు. రాణి స్నాన మందిరం నుంచి ప్రారంభమైన హెరిటేజ్ వాక్ మహానవమి దిబ్బ, పాన్ సుపారీ బజార్, పట్టణ ఎల్లమ్మ దేవాలయం, గజశాల, లోటస్ మహల్ మీదుగా హజారరామ ఆలయం వద్ద ముగిసింది. కార్యక్రమంలో కాణిపాక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు వెంకోబానాయక పూజారు, జిల్లా అధ్యక్షుడు పీ.సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి కే.లక్ష్మణ, కోశాధికారి వెంకటేష్, పురావస్తు శాఖ సూపరింటెండెంట్ నిహిల్ దాస్, పర్యాటక శాఖ డీడీ ప్రభులింగ తలకేరి, పాత్రికేయులు అనంతజోషి, భీమానాయక్, బసాపుర బసవరాజ్, కే.సురేష్ చౌహాన్ పాల్గొన్నారు.

బైక్‌ను కారు ఢీకొని ఇద్దరు మృతి



ఘటన స్థలంలో ఉన్న కారు



మృతి చెందిన యువకుడు

హొసపేటె: తాలూకాలోని కమలాపుర హంపీ కన్నడ యూనివర్శిటీ బీ గేట్ దగ్గర అతివేగంగా వస్తున్న కారు బైక్‌ను ఢీకొనడంతో బైక్ చోదకుడితో పాటు వెనుక కూర్చొన్న వ్యక్తి స్థలంలోనే మృతి చెందిన ఘటన మంగళవారం రాత్రి జరిగింది. ఈ ఘటనలో కొప్పళ జిల్లా గంగావతి తాలూకా మల్లాపుర గ్రామానికి చెందిన ఆంజనేయ(53) హనుమేష్ (18) అనే ఇద్దరు మృతి చెందారు. బైక్ రైడర్లు కమలాపుర నుంచి పాపినాయకనహళ్లి గ్రామానికి వెళ్తున్నారు. హొసపేటె వైపునకు వేగంగా వెళుతున్న కారు ఎదురుగా వచ్చిన బైక్‌ను ఢీకొనడంతో ఇద్దరు మృత్యువాత పడ్డారు. సమాచారం అందిన వెంటనే కమలాపుర పోలీసులు సంఘటన స్థలాన్ని సందర్శించి పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

యువతికి బెదిరింపులపై కేసు

హుబ్లీ: ఇక్కడి శ్రేయనగర్‌లో ఓ యువతి బెడ్ రూంలోకి వెళ్లి బెదిరించిన ఘటనపై కేసు నమోదైంది. ఉణకల్ నివాసి శివకుమార్ తోరగల్ అనే వ్యక్తి ఇంట్లోకి చొరబడి అల్మారా తాళం చెవి ఇవ్వాలని బలవంతం చేసినట్లు బాధితురాలు గోకుల్ రోడ్డు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నేడు, రేపు సీఎం పర్యటన

సాక్షి,బళ్లారి/బళ్లారిఅర్బన్: రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధరామయ్య గురు, శుక్రవారాల్లో రెండు రోజుల పాటు ఉమ్మడి బళ్లారి జిల్లాలో పర్యటించనున్నారు. గురువారం సాయంత్రం ఆయన బెంగళూరు హెచ్ఏఎల్ విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో తోరణగల్లు విమానాశ్రయానికి చేరుకుని, అదే రోజు రాత్రికి జేఎస్‌డబ్ల్యూ ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా రత్న కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం అక్కడే బస చేసి, 21న ప్రపంచ యోగా దినోత్సవంలో భాగంగా తోరణగల్లులోని జిందాల్ ఫ్యాక్టరీ విద్యానగరలో నిర్వహించే యోగా కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం అక్కడ నుంచి విజయనగర జిల్లాలో వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటున్నట్లు అధికారులు తెలిపారు.

రైలులో నగదు, ఆభరణాలు చోరీ

హుబ్లీ: రైలులో మహిళా ప్రయాణికురాలి నగదు, ఆభరణాలు చోరీకి గురైన ఘటన జరిగింది. వివరాలు.. అరక్కోణం నుంచి హుబ్లీకి రావడానికి చెన్నై-హుబ్లీ ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణిస్తున్న స్థానిక కేశ్వాపురకు చెందిన కనకవల్లి వాసుదేవన్ అనే మహిళ వ్యానిటీ బ్యాగ్‌లో ఉన్న రూ.2 వేల నగదుతో పాటు ఉన్న మొత్తం 3.17 లక్షల విలువ చేసే బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు బాధితురాలు హుబ్లీ రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశారు.

యువతితో ప్రేమ.. యువకుడిపై దాడి

హుబ్లీ: యువతితో ప్రేమ విషయంలో ఆమె కుటుంబ సభ్యులు యువకుడిపై తీవ్రంగా దాడి చేసిన ఘటన హుబ్లీ తాలూకా సుళ్ళ గ్రామంలో చోటు చేసుకుంది. ఆ గ్రామ నివాసి దమ్మనగౌరి దాడికి గురైన యువకుడు. అదే గ్రామానికి చెందిన శాంతినాథ్ తిక్కనవర, విద్యాధర, పార్శనాథ, కల్మేష, దర్శన్ అనే వ్యక్తులు దాడి చేసినట్లు బాధితుడు హుబ్లీ గ్రామీణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

వైద్యుల నియామకాల్లో అన్యాయం



మాట్లాడుతున్న రాజు పట్టి

రాయచూరు రూరల్: రాయచూరు వైద్య విజ్ఞాన సంస్థ(రిమ్స్) ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యుల నియామకాల్లో అన్యాయం జరిగిందని దళిత సేన అధ్యక్షుడు రాజు పట్టి ఆరోపించారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రిమ్స్ ఆస్పత్రిలో అవినీతి, అక్రమాలు జరుగుతున్నా ప్రజా ప్రతినిధులు, మంత్రులు మౌనం వహించడం తగదన్నారు.

పోలీస్ అధికారినంటూ మోసం

హుబ్లీ: పోలీస్ అధికారినంటూ ఫోన్ చేసిన గుర్తు తెలియని వ్యక్తులు ధార్వాడ నాగరాజ జావుర అనే వ్యక్తిని బెదిరించి రూ.50 వేలను తమ ఖాతాలోకి బదలాయించుకొని వంచించారు. పోలీస్ అధికారి పేరుతో ఫోన్ చేసిన ఆ వ్యక్తులు మీ ఖాతా నుంచి చట్టవ్యతిరేకంగా వ్యవహారాలు జరుగుతున్నాయంటూ బెదిరించారు. దీనికి బాధితుడు లేదు అని సమాధానం ఇచ్చినా ఫోన్‌లో అతడిని వేధించి నీ పేరున చట్ట వ్యతిరేకంగా 24 ఖాతాలు ఉన్నాయంటూ నమ్మబలికారు. లేదు, నాకున్నవి నాలుగే ఖాతాలని బాధితుడు తెలపగా, అవి చట్టబద్ధంగా ఉన్నాయో లేవో అన్నది పరిశీలించాలంటూ బెదిరించి బ్యాంక్ వివరాలు తీసుకొని రూ.50 వేల మేరకు తమ ఖాతాలోకి బదలాయించుకున్నట్లు బాధితుడు సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అభివృద్ధిపై దృష్టికి పిలుపు



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే గవియప్ప

హొసపేటె: తాలూకా స్థాయి త్రైమాసిక కేడీపీ ప్రగతి పరిశీలన సమావేశాన్ని బుధవారం నగరంలో పునీత్ ఇండోర్ స్టేడియంలో విజయనగర నియోజకవర్గ ఎమ్మెల్యే హెచ్‌ఆర్ గవియప్ప అధ్యక్షతన నిర్వహించారు. తాలూకా వ్యాప్తంగా సుమారు 41 శాఖలకు చెందిన తాలూకా అధికారులు ఈ సమావేశంలో పాల్గొని అభివృద్ధిపై చర్చించారు. తమ తమ శాఖల్లో ఉన్న సమస్యలపై ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఎమ్మెల్యే గవియప్ప మాట్లాడుతూ సంబంధిత అధికారులు అభివృద్ధిపై దృష్టి పెట్టాలని కోరారు. తహసీల్దార్ విశ్వజిత్ మెహత, టీపీ ఈఓ హరీష్, వివిధ శాఖల తాలూకా స్థాయి అధికారులు పాల్గొన్నారు.